www.prajapaksham.in

ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

పంజాబ్ గ్రామాలలో బిజెపికి 'నో ఎంట్రీ' 3 లో

శుక్రవారం | 17-05-2024 | హైదరాబాద్ | సంపుటి 26, సంచిక: 327 | Published from: **Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar** | పేజీలు: 12 | ఖమ్మం : 8+8 | కరీంనగర్ : 8+8 | మహబూబ్‌నగర్ : 12 | వెల రూ. 5.00

అకాల వర్షం...

భాగ్యనగరం తడిసిముద్ద

- గంటకుపైగా కుండపోత
- వాగులను తలపించిన రోడ్లు
- గంటల తరబడి ట్రాఫిక్‌జామ్
- నగరాన్ని కమ్మేసిన మేఘాలు
- రాష్ట్రంలో పలు జిల్లాల్లోనూ భారీ వర్షాలు
- పిడుగుపాటుకు ముగ్గురు మృతి

ప్రజాపక్షం/హైదరాబాద్

ఉపరితల ఆవర్తన ప్రభావంతో వాతావరణం ఒక్కసారిగా మారడంతో పలు జిల్లాల్లో భారీగా వర్షాలు కురిసాయి. ఈదురు గాలులతో కూడిన అకాల వర్షం కురిసింది. పలుచోట్ల కొనుగోలు కేంద్రాల్లోని, కల్లాల్లోని ధాన్యం తడిసిపోయింది. ధాన్యాన్ని రక్షించుకోవడానికి రైతులు ఇబ్బందులు పడ్డారు. సిద్దిపేట జిల్లా దుబ్బాకలో ఈదురు గాలులతో కూడిన అకాల వర్షం కురిసింది. దీంతో కొనుగోలు కేంద్రాల్లో కల్లాల్లోని ధాన్యం తడిసిపోయింది. అకాల వర్షాలతో రోడ్లపై నీరు చేరి వాహనదారుల ప్రయాణాలకు అంతరాయం కలిగించింది. హైదరాబాద్‌లో వర్షం బీభత్సం సృష్టించింది. మెదక్ జిల్లా నర్సాపూర్ పాపన్నపేటలో ఈదురు గాలులతో కూడిన వర్షం పడింది. సంగారెడ్డి పట్టణంలో దాదాపు అరగంట పాటు ఏకధాటిగా వర్షం కురవడంతో డ్రైనేజీలు పొంగి నీరు రోడ్లపై నిలిచింది. కోహీర్ మండలంలో ఉరుములు, మెరుపులతో భారీ వర్షం పడింది. మండలంలోని కోహీర్, బిలాల్ పూర్, మనియార్ పల్లి, సజ్జాపూర్, బడంపేట్ గ్రామాల్లో వాన దంచి కొట్టింది. ఈదురుగాలులతో కురిసిన వర్షానికి మామిడి, అరటి, బొప్పాయి తోటలకు నష్టం వాటిల్లింది. బిలాల్ పూర్‌లో కొద్దిసేపు రాళ్ల వాన కురిసింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లావ్యాప్తంగానూ భారీ వర్షాలు కురిశాయి. వేములవాడ మున్సిపాలిటీ పరిధిలోని శాత్రాజ్‌పల్లిలో పిడుగుపాటుకు ఓ వ్యక్తి మృతి చెందగా నలుగురు గాయపడ్డారు. తంగళ్లపల్లి మండలం భరత్‌నగర్‌లో పిడుగుపాటుకు రామడుగు చంద్రయ్య అనే వ్యక్తి మృతి చెందాడు. పలు చోట్ల తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలంటూ రైతులు విజ్ఞప్తి చేశారు. రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం కర్కల్‌పహాడ్ సమీపంలో పిడుగు పడి ఒకరు మృతిచెందారు. ఈ ఘటనలో మరొకరికి గాయాలయ్యాయి.

రాజధానిలో కుండపోత : హైదరాబాద్‌లో వర్షం బీభత్సం సృష్టించింది. అకాల వర్షంతో వర్ష బీభత్సానికి అతలాకుతలమైంది. అత్యవసరమైతేనే బయటకు రావాలని జిహెచ్ఎంసి అధికారులు హెచ్చరికలు తరువాయి 2లో

మూడు రోజులు భారీ వర్షాలు

రాష్ట్రంలో రానున్న మూడు రోజులు ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు ప్రకటించారు. గురువారం రాష్ట్రంలో కొన్ని జిల్లాలలో ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 40 50 కిలోమీటర్ల వేగంతో వీచే ఈదురుగాలులతో కూడిన తేలికపాటి నుండి మోస్తారు వర్షాలతో పాటు భారీ వర్షాలు కురుస్తాయన్నారు. శుక్రవారం, శనివారం ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 30 40 కిలోమీటర్ల వేగంతో వీచే ఈదురుగాలులతో కూడిన తేలికపాటి నుండి మోస్తారు వర్షాలు కరిసే అవకాశం ఉందన్నారు. వాతావరణ శాఖ అధికారులు పలు జిల్లాల అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. ఈ మేరకు ఎల్లో హెచ్చరికలను జారీ చేశారు. మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి, తరువాయి 2లో

లక్ష్యం నిర్దేశించుకుని

రాబడి సాధించాలి

రాష్ట్ర ఆదాయం పెంచేందుకు అన్ని విభాగాల అధికారులు

సమన్వయంతో పనిచేయాలి

వార్షిక లక్ష్యానికి అనుగుణంగా ముందుకెళ్లాలి

అవసరమైన సంస్కరణలు చేపట్టాలి

భూముల మార్కెట్ విలువలకు సవరణ చేయాలి

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశం

ప్రజాపక్షం / హైదరాబాద్

రాష్ట్ర ఆదాయం పెంచేందుకు అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. అవినీతి, అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని, పన్నుల ఎగవేత లేకుండా కఠిన చర్యలు చేపట్టాలని హెచ్చరించారు. వార్షిక లక్ష్యానికి అనుగుణంగా ఆదాయం పెరిగేందుకు అధికారులు పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్లాలని సూచించారు. అవసరమైన సంస్కరణలు చేపట్టాలని ఆదేశించారు. శాఖాపరమైన లొసుగులు లేకుండా కట్టుదిట్టంగా వ్యవహరించాలని ఆదేశించారు. రాష్ట్రానికి ప్రధానంగా ఆదాయం తెచ్చిపెట్టే వాణిజ్య పన్నులు, స్టాంపులు రిజిస్ట్రేషన్లు, ఎక్సైజ్, మైనింగ్ విభాగాల అధికారులతో ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, మంత్రులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, జూపల్లి కృష్ణారావు సచివాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ గత ఏడాది వచ్చిన ఆదాయం ఆశాజనకంగా లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇకపై ప్రతి నెలా ఆదాయ పెంపును సమీక్షించుకోవాలని అధికారులను అప్రమత్తం చేశారు. బడ్జెట్‌లో పొందుపరిచిన వార్షిక లక్ష్యాన్ని చేరుకోవాలంటే మంత్రీ టార్గెట్‌ను నిర్దేశించుకొని రాబడి సాధించేందుకు కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రధానంగా రాష్ట్రానికి రాబడి తెచ్చిపెట్టే జిఎస్‌టి ఎగవేత లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. జిఎస్‌టి కలెక్షన్ పెంచేందుకు పక్కాగా ఫీల్డ్ ఇన్‌స్పెక్షన్, ఆడిటింగ్ జరగాలని సూచించారు. జిఎస్‌టి ఎగవేతదారులు ఎంతటివారైనా ఉపేక్షించకుండా, నిక్కచ్చిగా పన్ను వసూలు చేయాలని ఆదేశించారు. వాణిజ్య శాఖలో ఇంతకాలం జరిగిన పొరపాట్లు పునరావృతం కావద్దని, జిఎస్‌టి రిటర్న్ పేరిట వెలుగులోకి వస్తున్న అవినీతి అక్రమాలకు తావు లేకుండా వ్యవహరించాలని అధికారులను హెచ్చరించారు. గత ఆర్థిక సంవత్సరంలో ఎన్నికల సీజన్‌లో మద్యం అమ్మకాలు, విక్రయాలు ఎక్కువగా జరిగినా లక్ష్యానికి అనుగుణంగా ఆదాయం పెరగకపోవటానికి కారణాలను సిఎం ఆరా తీశారు. అక్రమంగా మద్యం రవాణా, పన్ను ఎగవేత లేకుండా కట్టుదిట్టంగా చర్యలు చేపట్టాలని సిఎం ఆదేశించారు. హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలో అన్ని చోట్ల భూములు, స్థిరాస్తుల రేట్లు భారీగా పెరిగాయని, కానీ అదే స్థాయిలో రెవెన్యూ రాబడుల్లో రిజిస్ట్రేషన్లు, స్టాంపుల ద్వారా వచ్చే ఆదాయం పెరగలేదన్నారు. చాలా తరువాయి 2లో

ఐదేళ్లలో... ఐదుగురు ప్రధానులు

ఇదే 'ఇండియా' కూటమి ఆలోచన..

ప్రధాని మోదీ వ్యాఖ్యలు

ప్రతాప్‌గఢ్ (యుపి): ఐదేళ్లలో ఐదుగురు ప్రధానులను చేయాలని 'ఇండియా' కూటమి ఆలోచిస్తున్నదని ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. వరుసగా మూడోసారి విజయం సాధించడం సాధ్యం కాదన్న అనుమానమో లేక ప్రతిపక్ష కూటమిని ఎద్దేవా చేయాలన్న అభిప్రాయమో తెలియదుగానీ, ప్రధాని చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి. బిజెపి అభ్యర్థికి మద్దతుగా గురువారం ఇక్కడ జరిగిన ఎన్నికల ర్యాలీలో పాల్గొన్న మోదీ మాట్లాడుతూ, 'ఇండియా' కూటమి స్థిరమైన పాలన అందించలేదని, ఐదేళ్లలో ఐదుగురు ప్రధానులను చేయాలని కోరుకుంటున్నదని అన్నారు. జూన్ 4న ఓట్ల లెక్కింపు అనంతరం చాలా విషయాలు జరుగుతాయని అన్నారు. 'ఇండియా' కూటమి విచ్ఛిన్నమవుతుందని జోస్యం చెప్పారు. ఓటమి అనంతరం వారు బలిపశువు కోసం చూస్తారని అన్నారు. తమ ప్రసంగంలో కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ, సమాజ్‌వాది పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్‌పై మరోసారి విరుచుకుపడ్డారు. 'ఢిల్లీ, లక్నో షెహజాదే' (ఢిల్లీ, లక్నో యువరాజులు) అంటూ మోదీ వారిని సంబోధించారు. వాళ్లిద్దరూ వేసవి సెలవుల్లో విదేశాలకు బయలుదేరుతారని అన్నారు. మంగారు చెంచాతో పుట్టిన వాళ్లకు దేశాన్ని నడపడం సాధ్యం కాదని మోదీ ఎద్దేవా చేశారు. అమెథీ నుంచి వెళ్లిపోయిన రాహుల్ ఇక రాయ్‌బరేలీ నుంచి కూడా వెళ్లిపోతారని అన్నారు. మొత్తం మీద 'ఇండియా' కూటమిపై విమర్శలు ఎక్కుపెట్టినప్పటికీ, అధికారంలోకి వస్తుందేమోనన్న అనుమానం ప్రధానిలో మొదలైనట్టు కనిపిస్తున్నది. అందుకే, తొలిసారి 'కూటమికి అధికారం' అనే కోణంలో వ్యాఖ్యలు చేసి ఉంటారన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

సిఎఎపై కాంగ్రెస్, ఎస్‌పి అబద్ధాలు

పౌరసత్వ సవరణ చట్టం (సిఎఎ)కు వ్యతిరేకంగా కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీలు అబద్ధాలు వ్యాప్తి చేస్తున్నారని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తరువాయి 2లో

దొడ్డు వడ్లకూ బోనస్ ఇవ్వాలి

బిఆర్ఎస్ నిరసనలు

హైదరాబాద్ : సార్వత్రిక ఎన్నికలు ముగియడంతో కాంగ్రెస్ సర్కార్‌పై భారత రాష్ట్ర సమితి పోరుబావుటా ఎగరేసింది. ఇచ్చిన హామీలు అమలు చేయకుండా మోసగిస్తోందంటూ నిరసన బాట పట్టింది. కాంగ్రెస్ అవలంబిస్తున్న రైతు వ్యతిరేక విధానాలను నిరసించాలన్న కెసిఆర్ పిలుపుతో బిఆర్ఎస్ శ్రేణులు రోడ్డెక్కాయి. మాజీ మంత్రి జోగురామన్న ఆధ్వర్యంలో ఆదిలాబాద్‌లో ర్యాలీ అనంతరం రోడ్డుపై వడ్లను పోసి నిరసన తెలిపారు. సన్నాలకు మాత్రమే బోనస్ చెల్లిస్తామంటోందంటూ ఆసిఫాబాద్‌లో నల్ల జెండాలు ప్రదర్శించారు. నిర్మల్ జిల్లాలో గులాబీ శ్రేణుల రాస్తారోకో వల్ల రోడ్డుపై భారీగా వాహనాలు నిలిచిపోయాయి. నిజామాబాద్, బాల్కొండలలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా సంగారెడ్డి ఆర్డీవో కార్యాలయం ముందు బిఆర్ఎస్ శ్రేణులు ధర్నాకు దిగాయి. ఇప్పటికీ పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోళ్లు చేయడం లేదంటూ నర్సాపూర్‌లో ఎమ్మెల్యే సునీత రెడ్డి, గజ్వేల్‌లో వంటేరు ప్రతాప్ రెడ్డి ఆందోళన నిర్వహించారు. వరంగల్ జిల్లా ఖానాపూర్ మండలంలో ఐకెపి కేంద్రం వద్ద మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి నిరసన తెలిపారు. అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని ఎలాంటి తరుగు లేకుండా కొనుగోలు చేయాలంటూ మంథని, మెట్‌పల్లిలో కార్యకర్తలు ధర్నా చేశారు. రైతులకిచ్చిన హామీలను కాంగ్రెస్ సర్కార్ తుంగలో తొక్కిందని హుస్నాబాద్‌లో వొడితెల సతీశ్ కుమార్, గోదావరిఖనిలో కోరుకంటి చందర్ ఆరోపించారు. పెద్దపల్లిలో మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో రైతు నిరసన దీక్ష చేపట్టారు. కరీంనగర్‌లో రైతులకు మద్దతుగా నిరసన చేపట్టిన మాజీ మంత్రి గంగుల కమలాకర్, ప్రభుత్వం మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేయడంతోపాటు అన్ని రకాల వడ్లకు బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతుల జీవితాలతో కాంగ్రెస్ ప్రభుత్వం చెలగాటమాడుతుందని, రైతులకు తరువాయి 2లో

సమాయత్తమవ్వండి

ఖరీఫ్‌కు నిర్దిష్టమైన కార్యాచరణతో సిద్ధమవ్వాలి

రుణమాఫీ పథకం, పంటల బీమా సమగ్ర విధివిధానాల రూపొందించాలి

విత్తనాలు, ఎరువులు సరఫరాపై పూర్తి స్థాయి పర్యవేక్షణ

అధికారులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దిశానిర్దేశం

ప్రజాపక్షం/హైదరాబాద్

రానున్న ఖరీఫ్ సీజన్ –2024కు సంబంధించి నిర్దిష్టమైన పూర్తిస్థాయి కార్యాచరణతో సమాయత్తంగా ఉండాలని అధికారులను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. జూన్ నుంచి ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో గురువారం సచివాలయంలో మంత్రి తుమ్మల వ్యవసాయ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పంటలకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, సాగునీరు, పంటల బీమా, రైతు రుణమాఫీ పలు అంశాలపై అధికారులకు దీశా నిర్దేశం చేశారు. పంటల బీమా విధివిధానాలకు సంబంధించి టెండర్లలో పేర్కొనే నిబంధనలు, ముందుకు వచ్చే కంపెనీలకు ఉన్న అర్హతలు, తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించాలని, రైతులు పంట నష్టపోయిన సందర్భంలో ఈ బీమా పథకం వారిని ఆదుకునే విధంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. పంటల బీమా పథకం అమలుకు ఆదర్శ రైతులు, రైతు సంఘాల ప్రతినిధులతో ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన సమావేశాలు నిర్వహించి వారి అభిప్రాయాలను కూడా పరిగణలోనికి తీసుకోవాలని అధికారులకు మంత్రి సూచించారు. పచ్చి రొట్ట విత్తనాలను సబ్సిడీపై సరఫరాకు విధివిధానాలను రూపకల్పన చేసి వెంటనే సరఫరా ప్రారంభించాలని, సరఫరాలో ఎక్కడా ఎలాంటి లోటుపాట్లు లేకుండా పూర్తిస్థాయిలో పర్యవేక్షించాలని టిఎస్ సీడ్స్ అధికారులను అదేశించారు. మొదటి విడత పంటనష్ట పరిహారం రూ.15 కోట్లు పంపిణీ పూర్తి కావడంతో రెండోవిడత (ఏప్రిల్‌లో) మూడో విడత (మేలో) జరిగిన పంట నష్టాలకు సంబంధించి సమగ్ర నివేదిక సమర్పించాల్సిందిగా వ్యవసాయ శాఖ అధికారులకు మంత్రి సూచించారు. మట్టి నమూనా పరీక్షా కేంద్రాల సామార్థ్యానికి అనుగుణంగా వెంటనే రైతుల విజ్ఞప్తి మేరకు అవసరమున్న రైతుల తరువాయి 2లో



'టిఎస్' స్థానంలో 'టిజి' అమలు

గెజిట్ నోటిఫికేషన్ జారీచేసిన కేంద్ర ప్రభుత్వం

ప్రజాపక్షం / హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రంలో వాహనాల రిజిస్ట్రేషన్ ప్లేట్లలో రాష్ట్ర కోడ్‌గా 'టిఎస్' స్థానంలో 'టిజి' అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. కేంద్ర ప్రభుత్వ ఉపరితల రవాణా తరువాయి 2లో

ప్రత్యేక కోర్టు విచారణకు స్వీకరిస్తే..

ఇడి అరెస్టు చేయొద్దు

సుప్రీంకోర్టు కీలక తీర్పు





న్యూఢిల్లీ : మనీలాండరింగ్ కేసుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అరెస్టు ప్రక్రియకు సంబంధించి సుప్రీంకోర్టు గురువారం కీలక ఉత్తర్వులు వెలువరించింది. మనీలాండరింగ్ ఫిర్యాదుపై ప్రత్యేక కోర్టు విచారణకు స్వీకరించిన తర్వాత ఆ కేసులో నిందితుడిని ఇడి అధికారులు అరెస్టు చేయకూడదని వెల్లడించింది. ఒకవేళ సదరు నిందితుడిని కస్టడీలోకి తీసుకోవాలంటే దర్యాప్తు సంస్థ ప్రత్యేక కోర్టు అనుమతి తీసుకోవాల్సిందేనని స్పష్టం చేసింది. 'పిఎంఎల్‌పి చట్టం సెక్షన్ 44 కింద దాఖలైన మనీలాండరింగ్ ఫిర్యాదులను ప్రత్యేక కోర్టు విచారణకు స్వీకరిస్తే గనుక.. ఆ కేసుల్లో నిందితుడిగా చూపించిన వ్యక్తిని సెక్షన్ 19 కింద అరెస్టు చేసే అధికారం ఇడికి ఉండదు. ఈ కేసులో ప్రత్యేక కోర్టు జారీ చేసిన సమన్లకు నిందితుడు న్యాయస్థానం ఎదుట హాజరైతే దాన్ని కస్టడీలో ఉన్నట్లుగా పరిగణించకూడదు. ఒకవేళ తదుపరి విచారణ కోసం ఆ వ్యక్తిని ఇడి కస్టడీకి తరువాయి 8లో

5న రెండు ముక్కలుగా బిజెపి

మహారాష్ట్ర మాజీ సిఎం ఉద్ధవ్ థాక్రే సంచలన వ్యాఖ్యలు



మహారాష్ట్ర : జూన్ 5వ తేదీన బిజెపి రెండు ముక్కలు కానుందని మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, శివసన (యుబిటి) అధ్యక్షుడు ఉద్ధవ్ థాక్రే సంచలన వ్యాఖ్యలు చేశారు. నాసిక్‌లో జరిగిన ప్రచార సభలో ఆయన ప్రసంగిస్తూ నరేంద్ర మోదీ ఇకపై ప్రధాన మంత్రిగా ఉండబోరని అన్నారు. లోక్‌సభ ఎన్నికల ఫలితాలు జూన్ 4న వెల్లడైన మరుసటి రోజే జూన్ 5న బిజెపి రెండు ముక్కలు కానున్నదని చెప్పారు. కాంగ్రెస్‌లో మా పార్టీ కలుస్తుందని అంటున్నారని, తాను మాత్రం బిజెపి గురించే ఆందోళన చెందుతున్నానని తరువాయి 8లో

పచ్చిమిర్చి ధర పైపైకి..

బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.120

పెరటి సాగుపై దృష్టి ఏది ?

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం

రోజురోజుకీ కొండెక్కుతున్న కూరగాయల ధరలు సామాన్యులకు భారంగా మారుతున్నాయి. ప్రస్తుతం అన్ని రకాల కూరగాయల ధరలు కిలో రూ.60కి పైనే పలుకుతున్నాయి. పచ్చిమిర్చి ధర ఏకంగా ఎన్నడూ లేని విధంగా కిలో రూ.120కి చేరి కూర్చుంది. నెల రోజుల క్రితం తరువాయి 8లో



ప్రముఖ జర్నలిస్టు జమోరాకు జైలు నుండి విముక్తి

గ్వాటెమాల సిటీ : ప్రపంచ ప్రముఖ జర్నలిస్టు, అనేక అంతర్జాతీయ అవార్డులు పొందిన గ్వాటమాలా దేశ కలం యోధుడు జోస్ రూబెన్ జమోరా జైలు నుండి విడుదలయ్యారు. గ్వాటెమాలా దేశాధ్యక్షుడు అలెజాంద్రో గియోమత్తయ్ సారథ్యంలోని ప్రభుత్వ అవినీతిపై అలుపెరుగని పోరాటం చేస్తున్న జమోరాపై కక్షసాధింపుతో ఆయననే మనీలాండరింగ్ కేసుల్లో నిందితుడుగా ఇరికించింది. 2023 జూన్ 15న ఆయనకు ఆరేళ్ళు జైలుశిక్ష పడేట్టు చేసింది. తనను తాను రక్షించుకునేందుకు, నిజం నిరూపించేందుకు అవినీతిపై దర్యాప్తు చేయించే అవకాశం ఇవ్వకుండా తన హక్కులను కాలరాశారని, జైలు శిక్ష విధించారని జమోరా వాదించారు. ప్రభుత్వ అనీతిపై పునర్విచారణ జరపాలని ఆయన డిమాండ్ చేస్తున్నారు. ఈ దశలో ఆ దేశ ఉన్నతన్యాయస్థానం బుధవారం జమోరాను విడుదల చేసింది. ఆయన దేశం నుండి పారిపోయే అవకాశం లేదని ఉన్నతన్యాయస్థానం ధృఢంగా విశ్వసించింది. 4,800 డాలర్లు ఆయన పూచీకత్తుగా చెల్లించాలని ఆదేశించింది. ఆయనను జైల్లో ఉంచటం న్యాయసమ్మతం కాదని కోర్టు స్పష్టం చేసింది. 67ఏళ్ల వయసుగల జమోరా గ్వాటెమాలాలో మూడు పత్రికలకు అధిపతి.ఉన్నతమైన నైతిక విలువలుగల జర్నలిస్టుగా అవినీతిపై జీవితకాల పోరాటం చేస్తూ వస్తున్నారు. 2023 జులై 29న ఆయన మనీలాండరింగ్ కేసులో అరెస్ట్ చేశారు. అంతకుముందు 2003లో కూడా ఆయన కిడ్నాప్‌లను, నిర్బంధాలను ఎదుర్కొన్నారు. 2008లో వేధింపులతో జరిగిన దాడులలో ఆయన తీవ్రంగా గాయపడ్డారు. జైలునుంచి విడుదలయ్యాక ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ జీవితకాలంలో తాను ఎన్నో దాడులు ఎదుర్కొన్నానని నిరంతర పోరాటం చేస్తున్నాననీ, జర్నలిజం చేయడమే నేరంగా మారిందనీ ఆయన చెప్పారు. రాజకీయ దురుద్దేశంతోనే జమోరాను కేసులలో ఇరికించి జైల్లో పెట్టారని పత్రికా స్వేచ్ఛకోసం పోరాడే బృందాలు, మానవహక్కుల బృందాలు పేర్కొన్నాయి.

ప్రపంచవ్యాప్తంగా 14.55 కోట్లమంది నిరాశ్రయం

గాజా : ప్రపంచవ్యాప్తంగా 2023 వ సంవత్సరం నుండి ఇప్పటివరకూ ప్రకృతి వైపరీత్యాలు, యుద్ధాల కారణంగా 14.55 కోట్లమంది నిరాశ్రయులయ్యారు. వారంతా ఇళ్ళు కోల్పోయి, ఇళ్ళు వదిలి అనాథల్లా ఇతర ప్రాంతాల్లో తలదాచుకుని బతుకుతున్నారు. వీటిలో సూడాన్, డి.ఆర్.కాంగో, పాలస్తినాలలో జరుగుతున్న యుద్ధాల కారణంగా ప్రజలు ఆవాసాలు కోల్పోయి ఈ వలసలలో సరికొత్త రికార్డు సృష్టించారు. ప్రపంచ వ్యాప్తంగా గత ఏడాది ప్రకృతి వైపరీత్యాలవల్ల వివిధ దేశాల్లో అంతర్గతంగా 7.78 కోట్లమంది నిరాశ్రయులయ్యారు. యుద్ధాల కారణంగా 6.83 కోట్ల మంది నిరాశ్రయులయ్యారు. పలు దేశాలలో ప్రకృతి వైపరీత్యాలవల్ల 7.59 కోట్లమంది స్వస్థలాలు వదిలి ఇతర ప్రాంతాలకు వెళ్ళి కొత్తగా జీవితాలు ప్రారంభించారని ఇంటర్నల్ డిస్‌ప్లేస్‌మెంట్ మోనిటరింగ్ సెంటర్ (ఐడిఎంసి) ఎన్‌జిఓ నివేదికలు వెల్లడించాయి. 2014 నుండి ఇప్పటివరకూ పదేళ్ళలో ఈ గణాంకాలు రోజు రోజుకూ ఉద్ధృతం అవుతున్నాయి, వైపరీత్యాలు పెరుగుతున్నాయి, ప్రాంతీయస్థాయిల్లో యుద్ధాలు కొత్త కొత్త ప్రాంతాలలో చెలరేగుతున్నాయని ఐడిఎంసి డైరెక్టర్ అలెగ్జాండర్ బిలాక్ చెప్పారు. ప్రకృతి వైపరీత్యాలవల్ల నిరాశ్రయులైనవారు 2022 కంటే భారీగా పెరిగారని చెప్పారు. సూడాన్‌లో అంతర్యుద్ధం కారణంగా 60 లక్షలమంది నిరాశ్రయులయ్యారు. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వారు ఇతర ప్రాంతాలకు పారిపోయారు. డి.ఆర్.కాంగోలో కరువు యుద్ధ పరిస్థితులవల్ల 30.70 లక్షలమంది ఇళ్ళు వదిలేసి ఇతర ప్రాంతాలకు పారిపోయారు. పాలస్తినాలో యుద్ధం వల్ల 30.40 లక్షలమంది దేశం వదిలిపారిపోయారు. గాజాలో యుద్ధం కారణంగా 3.80 లక్షల ఇళ్ళు నేలమట్టం అయ్యాయి. 20 లక్షలమంది ప్రాణాలు దక్కించుకునేందుకు రఫా ప్రాంతానికి పారిపోయారు. అనేకవేల మంది ఈ పోరాటంలో ప్రాణాలు కోల్పోయారు.

ప్రాణాల కోసం పరుగులు

రఫాను ఖాళీ చేసిన ఆరు లక్షలమంది

రఫా : ఐక్యరాజ్యసమితి సహా యావత్ ప్రపంచం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నప్పటికీ ఇజ్రాయిల్ తన దాడులు ఆపలేదు సరి కదా రఫా ప్రాంతంలో మరింత ఉధృతం చేసింది. దీంతో గడచిన పది రోజులుగా రఫా నుండి 6,00,000 లమంది పాలస్తీనియన్లు ఖాళీ చేసి వెళ్ళిపోయారు. రోడ్డుమీద నిలబడినా కాల్పులు, దాడులు జరుగుతూ ఉండటంతో ప్రాణాలు దక్కించుకునేందుకు పాలస్తీనియన్లు లగేజీలన్నీ వదిలేసి చేతిలో చిన్న సంచీలతో పారిపపోతున్నారు. కొన్ని కుటుంబాలు ఉమ్మడిగా వాహనాలు పెట్టుకుని వెళ్ళిపోతున్నాయి. గాజాపై గత ఏడాది అక్టోబరు 31న ఇజ్రాయిల్ సైన్యం దాడి చేశాక 15 లక్షల మంది రఫాకు వెళ్ళి తలదాచుకకున్నారు. ఇప్పుడు వారికి అక్కడ కూడా రక్షణ లేకపోవడంతో అక్కడి నుండి కూడా పారిపోతున్నారు.గాజాలో ఒక ఇంటర్నెట్ సెంటర్ వద్ద గుమిగూడిన ప్రజలపై ఇజ్రాయిల్ సైన్యం దాడిచేయటంతో నలుగురు పాలస్తీనియన్‌లు మరణించారు. మరోవైపు ఆక్రమిత వెస్ట్‌బ్యాంక్‌లో జరిగిన దాడులలో ముగ్గురు మరణించారు. తుల్కారం ప్రాంతంలో సైన్యం కాల్పులు జరపటంతో ముగ్గురు పాలస్తీనియన్‌లు మరణించగా ప్రజలు ఆగ్రహంతో సమ్మె పిలుపు ఇచ్చారు.

గాజా భవితవ్యంపై వార్ క్యాబినెట్‌లో విభేదాలు

మరోవైపు ఇజ్రాయిల్ ప్రధానమంత్రి నేతన్యాహు వార్ క్యాబినెట్‌లో విబేధాలు తలెత్తాయి. యుద్ధానంతరం గాజాలో అనుసరించే వైఖరి ఏమిటి? అనే విషయంపై వార్ క్యాబినెట్‌లో రక్షణమంత్రి చర్చ లేవదీశారు. యుద్ధానంతరం అనుసరించాల్సిన ఒక ప్రణాళిక ఏది? ఇజ్రాయిల్ వద్ద లేకపోవటాన్ని ఆయన ప్రశ్నించటంతో చర్చ జరిగింది. కానీ నేతన్యాహు అందుకు తగిన సమాధానం చెప్పలేదు. యుద్ధానంతర వైఖరి లేకపోతే ప్రమాదకరపరిస్థితులు వస్తాయని రక్షణమంత్రి హెచ్చరించారు. ఇదే విషయంపై అమెరికా విదేశాంగమంత్రి ఆంటోనీ బ్లింకెన్ మాట్లాడుతూ గాజాలో యుద్ధానంతరం అనుసరించాల్సిన ఒక బృహత్తర ప్రణాళికను ముందుగా సిద్ధం చేసుకోకపోతే సాయుధ ముఠాలు దీన్ని అవకాశంగా తీసుకుని రెచ్చిపోతాయని నేరాలు విజృంభిస్తాయని హెచ్చరించారు.

ఐసిజె విచారణ ప్రారంభం

హేగ్ : ఇజ్రాయిల్ సామూహిక ఊచకోత, హింసాకాండకు వ్యతిరేకంగా దాఖలైన కేసులపై ఇంటర్నేషనల్ కోర్ట్ ఆఫ్ జస్టిస్ గురు, శుక్రవారాల్లో విచారణ జరుపుతోంది. ఈ ఐసిజె ప్యానల్‌లో 15 మంది న్యాయమూర్తులు ఉన్నారు. గాజాలో ఊచకోత వెంటనే ఆపాలని పాలస్తీనా ప్రజలకు మానవతా సహాయాన్ని పెంచాలని ఐసిజె గడచిన జనవరిలోనే ఆదేశించినప్పటికీ ఇజ్రాయిల్ పట్టించుకోలేదు. రఫాలో ఇజ్రాయిల్ పది రోజులుగా కొనసాగిస్తున్న దమనకాండపై దక్షిణ ఆఫ్రికా ఐసిజెలో ఫిర్యాదు చేయడంతో మళ్ళీ విచారణ ప్రారంభమైంది. మొదటినుండీ ఇజ్రాయిల్ దాష్టీకాలను దక్షిణాఫ్రికా అంతర్జాతీయ వేదికలపై నిలదీస్తూ ఒక హీరోగా పేరు సంపాదించుకుంది. తాజాగా ఈ యుద్ధాన్ని నిలిపివేయాలని, ఎమర్జెనీ చర్యలు తీసుకోవాలని ఐసిజెకు ఫిర్యాదు చేసింది. రఫాలో యుద్ధం ఆపాలని దక్షిణాఫ్రికా డిమాండ్ చేస్తున్నది.

ఇజ్రాయిల్ సైనికుల మధ్య ఎదురు కాల్పులు : ఐదుగురు మృతి

ఇజ్రాయిల్ సైనికులు జబాలియా క్యాంప్ వద్ద బుధవారం రాత్రి పరస్పరం కాల్పులు జరుపుకున్నారు. ఈ కాల్పుల్లో ఐదుగురు ఇజ్రాయిల్ సైనికులు మరణంచారు. ఈ కాల్పుల ఘటనకు ఇజ్రాయిల్ ఫ్రెండ్లీ ట్యాంక్ ఫైరింగ్ అని పేరు పెట్టింది. మరో ఏడుగురు సైనికులు గాయపడ్డారు. ఐడిఎఫ్ (ఇజ్రాయిల్ డిఫెన్స్ ఫోర్స్) ఈ విషయం ప్రకటించింది. ఒకే భవంతిపై ఇజ్రాయిల్ సైనికులు ట్యాంకులను గురిపెట్టి కాల్పులు జరపడంతో ఎదురుదెరుగా ఉన్న సైనికులు మరణించారు. దీంతో ఇప్పటివరకూ ఈ యుద్ధంలో మరణించిన ఇజ్రాయిల్ సైనికుల సంఖ్య 278కి పెరిగింది.

చైనా–రష్యా మధ్య ఉన్నది అవకాశవాద సంబంధం కాదు

'మై డియర్ పుతిన్...' అప్యాయంగా పిలిచిన జిన్‌పింగ్

రెండు రోజులు చైనాలో పుతిన్ పర్యటన

బీజింగ్: ప్రపంచంకోసమే చైనా–రష్యా అగ్ర రాజ్యాల మధ్య సంబంధాల స్థిరీకరణ జరుగుతుందని రెండు దేశాల నాయకులు ఉద్ఘాటించారు. రష్యా అధ్యక్షుడు వ్లదిమీర్ పుతిన్ గురు, శుక్రవారాల్లో చైనా పర్యటనలో భాగంగా మొదటిరోజు చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్‌తో సమావేశం జరిపారు. ఈ సందర్భంగా జిన్‌పింగ్ తన ప్రసంగం ప్రారంభంలో ''మై డియర్ పుతిన్....'' అని సంబోధించారు. రష్యా,చైనా మధ్య సంబంధాలకు ఎంతో మౌలికమైన ప్రాధాన్యం ఉందని ఆయన అన్నారు. ఈ రెండు దేశాలమధ్య సంబంధాలు ఒక అవకాశవాదం కాదనీ, ఎవ్వరిమీదా గురిపెట్టి కొనసాగుతున్న సంబంధాలు కాదని జిన్‌పింగ్ అన్నారు. ''మనమధ్య సహకారం ఈనాటి ప్రపంచ పరిస్థితుల్లో అంతర్జాతీయ యవనికపై ఒక స్థిరీకరణ శక్తిగా దోహదం చేస్తుంది'' అని జిన్‌పింగ్ అన్నారు. ''మేం ఉక్రేన్‌పై బహిరంగ చర్చకు సిద్ధం, కానీ ఈ విధమైన సంప్రదింపులను మాతో సహా ఈ సమస్యతో సంబంధం ఉన్న అన్ని దేశాల ప్రయోజనాల కోసమే అనే విషయాన్ని పరిగణనలోకి తీసుకోవాలి'' అని పుతిన్‌ను ఉటంకిస్తూ జిన్హువా వార్తా సంస్థ పేర్కొంది. ప్రపంచం కల్లోలంగా ఉన్న పరిస్థితుల్లో ఈ అగ్రరాజ్యాధినేతలమధ్య సమావేశం ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రపంచశాంతిని స్థిరీకరించడానికి ఈ రెండు దేశాల మధ్య సంబంధాలే ఒక అతిపెద్ద ఉదాహరణ అని నాయకకులు అభిప్రాయపడ్డారు. అదేవిధంగా ఉక్రేన్‌లో జరుగుతున్న యుద్ధంలో రష్యాకు మద్దతు ఇవ్వొద్దని జిన్‌పింగ్‌పై అమెరికా, యూరోపియన్ యూనియన్‌ల నుండి ఒత్తిడి వస్తున్న తరుణంలో ఈ సమావేశం జరిగింది. అదేవిధంగా రష్యా,చైనా మధ్య దౌత్య సంబంధాలకు 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా కూడా చైనాలో పుతిన్ పర్యటనకు ఒక ప్రాధాన్యత ఏర్పడింది. ఈ సందర్భంగా గ్రేటర్ హాల్ వద్ద పుతిన్‌కు ఘన స్వాగతం లభించింది. పుతిన్ దేశాధ్యక్షుడుగా ఇటీవల మరోసారి బాధ్యతలు చేపట్టాక తొలి విదేశీ పర్యటన ఇదే. అదేవిధంగా చైనాలో గడచిన ఆరునెలల్లో రెండోసారి ఆయన పర్యటిస్తున్నారు. తాము ఇద్దరం 45 నిమిషాలసేపు సన్నిహితంగా మాట్లాడుకున్నామని జిన్‌పింగ్ చెప్పారు. రెండు దేశాలమధ్య ద్వైపాక్షిక వ్యాపార సంబంధాల వృద్ధిపై వారి చర్చలు ప్రధానంగా జరిగాయి. గాజా, ఉక్రేన్ సహా ప్రపంచ పరిణామాలపై కూడా వారు చర్చించారు.

స్లోవాకియా ప్రధాని ఫికోపై వృద్ధ పెన్షనర్ కాల్పులు

మృత్యువుతో పోరాడుతున్న దేశనేత

బ్రాటిస్లావా: యూరప్‌దేశమైన స్లోవాకియా ప్రధానమంత్రి రోబర్ట్ ఫికో కాల్పుల్లో తీవ్రంగా గాయపడి మృత్యువుతో పోరాటం చేస్తున్నారు. ఆయన పరిస్థితి ఏ మాత్రం మెరుగుపడలేదని, అత్యంత ప్రమాదకంగా ఉందని ఆ దేశ రక్షణమంత్రి రోబెర్ట్ కలినాక్, ఆసుపత్రి డైరెక్టర్ మిరయం లపినికోవా గురువారం ప్రకటించారు. ఫికో (59) బుధవారం మధ్యాహ్నం హండ్లోవా నగరంలో జరిగిన ఒక ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొని కల్చరల్ సెంటర్ భవనం వెలుపల గుమిగూడిన ప్రజలకు అభివాదం చేస్తుండగా ఒక దుండగుడు ఆకస్మికంగా తుపాకితో ఆయనపై ఐదుసార్లు కాల్పులు జరిపాడు. ఆయన తలలోంచి, పొట్టలోంచి, ఛాతీలోంచి తూటాలు దూసుకుపోయాయి. దాతతో ఆయనను బాన్‌స్కా బైసికాలోని ఎఫ్.డి.రూజ్‌వెల్ట్ యూనివర్సిటీ ఆసుపత్రికి హెలికాప్టర్‌లలో తరలలించారు. ఐతే ఈ కాల్పులు జరిపింది 71 సంవత్సరాలు వయసుగల ఒక వృద్ధుడు కావడం విశేషం. అతడిని లెవిస్ పట్టణవాసిగా గుర్తించామనీ, అతగాడు గతంలో జరిగిన అనేక నిరసన ప్రదర్శనల్లో పాల్గొనడాన్ని పోలీసులు గుర్తించారనీ స్లోవేకియా హోంశాఖామంత్రి మాతస్ సుతజ్ ఎస్టోక్ చెప్పారు. కాగా ఈ వృద్ధుడు ఒక పెన్షనర్. తన లైసెన్స్‌డ్ తుపాకీతోనే ప్రధానమంత్రిపై కాల్పులు జరిపాడు. కాల్పులు జరపడానికి ముందుగా ప్రధామంత్రి దృష్టిని తనమీదకు మళ్ళించేందుకు ఈ వృద్ధుడు ''కమ్ హియర్ రోబో...'' అంటూ గట్టిగా అరుపులు అరిచాడు. ఆతర్వాత కాల్పులు జరిపాడు. దానికిగల కారణాలపై పోలీస్‌లు దర్యాప్తు చేస్తున్నారు. ఈ వృద్ధుణ్ణి పోలీసులు అరెస్టు చేశారు. యూరప్‌లోని అనేక దేశాల నాయకులు ఈ దుశ్చర్యను తీవ్రంగా ఖండించాయి. మరో మూడు వారాలలో యూరోపియన్ యూనియన్ పార్లమెంటు ఎన్నికలు జరుగనున్నాయి. ఫికో పార్టీ కూడా భాగస్వామ్యంగా ఉన్న కూటమికే ఎక్కువ అవకాశాలు ఉన్నాయని ఊహాగానాలు జరుగుతున్న తరుణంలో ఆయనపై ఈ కాల్పుల దాడి జరిగింది. ఫికో తన పొరుగు దేశమైన ఉక్రేన్ పాలనావిధానాలకు తీవ్రవ్యతిరేకి. ఆయన రష్యా అనుకూలుడు. రష్యాతో రాజీ పడాలని ఉక్రేన్ అధ్యక్షుడు జలెన్‌స్కీపై ఒత్తిడి చేస్తున్నారు. ఫికో ప్రధానమంత్రిగా గెలిచిన తరువాత ఉక్రేన్‌కు ఆయుధ సరఫరా నిలిపివేశారు. గడచిన అక్టోబర్‌లో ఆయన ప్రధానమంత్రి బాధ్యత స్వీకరించారు. ఇప్పుడు నాలుగోసారి ఆయన ప్రధానమంత్రి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. రాజకీయాలలో అపార అనుభవం సంపాదించిన ఫికో ఉక్రేన్‌లో జరుగుతున్న యుద్ధం విషయంలో క్రెమ్లిన్, రష్యా సాంస్కృతిక మూలాలు, వారసత్వ విధానాల ప్రాతిపదికపైనే వ్లాదిమిర్ పుతిన్‌ను సమర్థిస్తున్నారు.

ఐదుగురు ప్రధానులు (మొదటి పేజీ తరువాయి)

ఆరోపించారు. మీరేమైనా చేసుకోండి కాని సిఎఎను తొలగించలేరని చెప్పారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఆజాంఘఢ్‌లో గురువారం జరిగిన ఎన్నికల ప్రచారంలో ఆయన ప్రసంగించారు. సిఎఎ కింద హిందూ, సిక్కు, జైన్, బౌద్ధ శరణార్థులకు పౌరసత్వ సర్టిఫికెట్ ఇచ్చే ప్రక్రియ ప్రారంభమైందన్నారు. వీరు అనేక సంవత్సరాలుగా దేశంలో శరణార్థులుగా జీవిస్తున్నారని, మత ఆధారంగా జరిగిన విభజనలో వీరంతా బాధితులని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ శరణార్థులను నిర్లక్ష్యం చేసిందని, సిఎఎ పేరుతో కాంగ్రెస్, ఎస్‌పిలు అబద్ధాలు వ్యాపింపజాస్తూ, ఉత్తరప్రదేశ్, మొత్తం దేశాన్ని అల్లర్ల దిశగా నెట్టేందుకు ప్రయత్నించాయని మోదీ ఆరోపించారు. ఇండియా కూటమి అధికారంలోకి వచ్చే అవకాశం లేనప్పటికీ సిఎఎను తీసివేస్తామంటున్నారని, ఆ పని ఎవ్వరూ చేయలేరని చెప్పారు. మీరు మోసగాళ్ళు.. ఈ దేశాన్ని మతం మంటల్లో దహించేలా చేసారని ప్రతిపక్షాలను ఉద్దేశించి ఘాటు వ్యాఖ్యలు చేశారు.

రాబడి సాధించాలి (మొదటి పేజీ తరువాయి)

చోట్ల భూముల మార్కెట్ విలువకు, వాస్తవ క్రయ విక్రయాల రేట్లకు పొంతన లేకపోవటం ప్రధాన కారణమనే చర్చ జరిగింది. ''గత ప్రభుత్వం 2021లో భూముల విలువను, రిజిస్ట్రేషన్ ఛార్జీలను పెంచింది. ఇప్పటికీ చాలాచోట్ల భూముల మార్కెట్ విలువకు, క్రయ విక్రయ ధరలకు భారీ తేడా ఉంది. నిబంధనల ప్రకారం ఏడాదికోసారి భూముల మార్కెట్ విలువను సవరించాల్సి ఉంటుంది. ఈ ధరల సవరణకు చర్యలు చేపట్టాలి'' ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఎక్కడెక్కడ, ఏయే ప్రాంతాల్లో ధరలను సవరించాలి, వ్యవసాయ భూములు, ఖాళీ స్థలాలు, ప్లాట్లు, అపార్ట్‌మెంట్లు.. వేటికి ఎంత సవరించాలనేది శాస్త్రీయంగా నిర్ధారణ జరగాలని, రిజిస్ట్రేషన్ స్టాంపుల విభాగం నిబంధనలను పక్కాగా పాటించాలని సిఎం చెప్పారు. రాష్ట రాబడి పెంపుతో పాటు స్థిరాస్థి, నిర్మాణ రంగాన్ని ప్రోత్సహించేందుకు వీలుగా భూముల మార్కెట్ ధరల సవరణ జరగాలని ముఖ్యమంత్రి సూచించారు. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే స్టాంప్ డ్యూటీ ఎంత మేరకు ఉంది.. తగ్గించాలా.. పెంచాలా.. అనేది కూడా అధ్యయనం చేయాలని అధికారులకు సిఎం సూచించారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఉద్యోగుల కొరత లేకుండా సర్దుబాటు చేయాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. ఇప్పటికే చాలాచోట్ల అద్దె భవనాల్లో ఉన్నాయని, రిజిస్ట్రేషన్లకు వచ్చే వాళ్లు ఇప్పటికే చెట్ల కింద నిలబడే ఉంటున్నారని చర్చకు వచ్చిందని, పబ్లిక్ యుటిలిటీకి సేకరించిన స్థలాలను గుర్తించి కొన్నిచోట్ల అధునాతనంగా మోడల్ సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులు నిర్మించాలని, అందుకు సన్నాహాలు చేయాలని సిఎం చెప్పారు. సామాన్యులకు, చిన్న చిన్న నిర్మాణాలకు ఇసుక కొరత రాకుండా చూడాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఇసుక ద్వారా వచ్చే ఆదాయం పెరగాలంటే అక్రమ రవాణాను, లీకేజీలను ఎక్కడికక్కడ అరికట్టాలని సిఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు.

సమాయత్తమవ్వండి (మొదటి పేజీ తరువాయి)

పొలాల మట్టి నమూనాలు సేకరించి ఫలితాలు వచ్చే నెలాఖరులోగా అందజేసేవిధంగా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. వరికొయ్యలు తగలపెడితే జరిమానాలు విధించాల్సిలన్నారు. మార్క్‌ఫెడ్ ద్వారా మొక్కజొన్న, జొన్న, పొద్దుతిరుగుడు కొనుగోళ్ళను వేగవంతం చేసి ఎట్టి పరిస్థితుల్లో మే నెల చివరినాటికి పూర్తి చేయాలన్నారు. ఉద్యానశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం కేటాయించిన భూములలో ఆధునిక సాంకేతికతతో పండ్లతోటల పెంపు, నిర్వహణ బాధ్యతలు చేపట్టాలని తెలిపారు. ఆయిల్‌పామ్ కంపెనీల పనితీరు ఆధారంగా చర్యలు తీసుకోవాలని, మల్బరిసాగుకు అనుకూల ప్రాంతాలను ఎంపిక చేసి పట్టు పరిశ్రమ అభివృద్ధికి చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. కేంద్ర ప్రభుత్వ వివిధ పథకాలలో మ్యాచింగ్ గ్రాంటు బకాయి నిధుల విడుదలకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. అంతేకాకుండా అన్ని రకాల సహకారసంఘాలలో సభ్యుల గుర్తింపు, పదవీకాలం ముగిసిన సంఘాల ఎన్నికల నిర్వహణకు సత్వరమే చర్యలు చేపట్టాలని మంత్రి తుమ్మల నాగేశ్వరావు అధికారులను ఆదేశించారు.

సింగల్ స్క్రీన్ సినిమా థియేటర్లకు ప్రభుత్వం రాయితీలు ప్రకటించాలి

ఎఐవైఎఫ్ రాష్ట సమితి డిమాండ్

ప్రజాపక్షం/హైదరాబాద్: సినిమా రంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపాలని, సింగల్ స్క్రీన్ సినిమా థియేటర్లకు రాయితీలు ప్రకటించాలని, చిన్న తరహా సినిమా థియేటర్లలో పనిచేస్తున్న సిబ్బందిని ఆదుకోవాలని ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వలి ఉల్లా ఖాద్రీ, ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర రాష్ట ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సినిమా థియేటర్లలో పనిచేస్తున్న వేలాదిమంది కార్మికులు దుర్భర పరిస్థితులు ఎదుర్కొంటున్నారని, చాలీచాలని జీతాలతో సతమతమవుతున్నారన్నారు. చిన్న తరహా థియేటర్లను బతికించి కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉన్నదన్నారు. సినిమా రంగంలో ఉన్న ప్రతి ఒక్కరు ఈ సమస్యలో భాగస్వాములై సమస్య పరిష్కారంలో తమ వంతు పాత్రను పోషించాలని వారు కోరారు. వాస్తవానికి ఓటిటి, కార్పొరేట్ మల్టీ ప్లెక్స్‌లు వచ్చిన తరువాత చిన్న తరహా థియేటర్లు మోసివేతకు వచ్చాయని వారు అన్నారు. ఇప్పటికీ రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లోని థియేటర్లలో తక్కువ ధర టికెట్లు తీసుకుని సినిమాలను ప్రేక్షకులు వీక్షిస్తున్నారని, అయితే మల్టీప్లెక్స్ లు రావడం మూలంగా టికెట్ల రేట్లు అమాంతం పెరిగిపోయిందని అన్నారు. ఫలితంగా సామాన్య సినిమా ప్రేక్షకులకు వినోదం దూరమయ్యే ప్రమాదమున్నదన్నారు.

జీవన్‌రెడ్డి మాల్ అండ్ మల్టీప్లెక్స్ భవనం లీజ్ రద్దు

ప్రజాపక్షం/హైదరాబాద్ : నిజామాబాద్ జిల్లా ఆర్మూరు బస్ స్టేషన్ సమీపంలోని ఆర్‌టిసి స్థలంలో ఉన్న జీవన్‌రెడ్డి మాల్ అండ్ మల్టీప్లెక్స్ భవనాన్ని గురువారం సాయంత్రం స్వాధీనం చేసుకున్నట్లు ఆర్‌టిసి యాజమన్యం ప్రకటించింది. బకాయిలను చెల్లించకపోవడంతో హైకోర్టు ఉత్తర్వుల మేరకు వి ష్ణుజిత్ ఇన్ఫ్రా డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్ తో చేసుకున్న అద్దె ఒప్పందాన్ని రద్దు చేసుకున్నట్లు వెల్లడించింది. ఆర్‌టిసి సంస్థకు చెందిన 7059 చదరపు గజాల స్థలంలో 33 ఏళ్ల పాటు విష్ణుజిత్ ఇన్ఫ్రా డెవలపర్స్ కంపెనీ బిల్ట్ ఆపరేట్ ట్రాన్స్ఫర్(బీవోటీ) కింద 01. 06.2013న లీజుకు తీసుకుందని, ఇదే క్రమంలో 2017లో విష్ణుజిత్ ఇన్ఫ్రా దెవలప ర్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీని మాజీ ఎమ్మె ల్యే జీవన్ రెడ్డి సతీమణి రజితా రెడ్డి టేక్‌ఓవర్ చేసుకుని, షాపింగ్ మాల్‌కు జీవన్ రెడ్డి మా ల్ అండ్ మల్టీపెక్స్ గా పేరుమార్చడంతో పాటు థర్డ్ పార్టీలకు అందులోని స్టాళ్లను లీజు కు ఇచ్చారని అధికారులు తెలిపారు. అయితే ఒప్పందం ప్రకారం ఆ కంపెనీ ఆర్‌టిసికి సకాలంలో అద్దె చెల్లించకపోవడంతో గత ఏడాది అక్టోబర్ వరకు రూ.8.65 కోట్ల బకాయిలను పేరుకుపోవడంతో వెంటనే చెల్లించాల్సిందిగా సంస్థ నోటీసులు జారీ చేయగా, రూ.1.50 కోట్లను చెల్లించారన్నారు. మిగిత బకాయిలు సైతం చెల్లించాలని సదరు సంస్థకు షోకాజ్ నోటీసులు పంపించడంతో గత ఏడాది డిసెంబర్ లో విడతల వారీగా రూ.2.40 కోట్లను చెల్లించడంతో పాటు షోకాజ్ నోటీసును సవాల్ చేస్తూ వారు హైకోర్టును ఆశ్రయించారని తెలిపారు. దీంతో ఆర్‌టిసికి బకాయిలు చెల్లించాలని హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయడంతో ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరిలో విడతల వారీగా మరో రూ.2 కోట్లను చెల్లించారని వెల్లడించారు. మిగిత బకాయిలన్నీ నెల రోజుల్లో చెల్లించాలని మార్చి 27న హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయడమే కాకుండా అది ప్రజల డబ్బు అని స్పష్టం చేసిందన్నారు. నెల రోజుల్లో బకాయిలు చెల్లించకుంటే నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలని హైకోర్టు ఆదేశాల మేరకు గడువు పూరైనా బకాయి పద్ద రూ.2.51 కోట్ల అద్దెను చెల్లించలేక పోవడంతో భవనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఆర్‌టిసి యాజమన్యం ఓ ప్రకటనలో తెలిపింది.

భాగ్యనగరం తడిసిముద్ద (మొదటి పేజీ తరువాయి)

జారీ చేశారు. గురువారం మధ్యాహ్నం వరకు ఉక్కపోతతకు ఉక్కిరిబిక్కిరి అయిన హైదరాబాద్ నగరంలో ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. ఉదయం కొన్ని గంటల పాటు భానుడి తాపంతో భగభగమంటూ మండిపోయి నగరం, మధ్యాహ్నం తరువాత చల్లబడింది. మేఘాలు కమ్మేసి, నగరాన్ని చల్లార్చాయి. చిరుజల్లులతో కూడిన వర్షం కురవడం ప్రారంభమయ్యింది. ఇక చూస్తుండగానే, ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం పడింది. ఏకధాటిగా గంటకు పైగా కుండపోత వర్షం కురవడంతో నగర వ్యాప్తంగా రోడ్లన్నీ జలమయం అయ్యాయి. కొన్ని ప్రాంతాల్లో అయితే రోడ్లు నదులను తలపించాయి. చాలా ప్రాంతాల్లో ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసింది. కూకట్‌పల్లిలో మొదలై క్రమక్రమంగా సికింద్రాబాద్, అల్వాల్, బేగంపేట్, ఎల్.బి.నగర్ వరకు విస్తరించింది. నిజాంపేట్, హైదర్ నగర్, బాచుపల్లి, సికింద్రాబాద్, బోయిన్ పల్లి, మారేడుపల్లి, బేగంపేట్, ప్యారడైజ్, చిలకలగూడ, అల్వాల్, జీడిమెట్ల, సూరారం, కుత్బుల్లాపూర్ ప్రాంతాలకు విస్తరించింది. అటు హిమాయత్ నగర్, సచివాలయం, దిల్‌సుఖ్ నగర్, ఎల్.బి.నగర్, ఉప్పల్ ప్రాంతాల్లోనూ భారీ వర్షం కురిసింది. నగర వాప్తంగా వర్షం కురిసింది. ఖైరతాబాద్‌లోని చింతల్ బస్తీలో 17 చోట్ల వరద నీరు నిలిచిపోయింది. రంగంలోకి దిగిన డిఆర్ఎఫ్ సిబ్బంది మ్యాన్ హోల్స్ తెరిచి వరద నీటిని మళ్లించారు. విద్యుత్ శాఖ అధికారులు ముందు జాగ్రత్తగా పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. ఈదురుగాలులకు పలు ప్రాంతాల్లో చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. జిహెచ్ఎంసి సిబ్బంది వాటిని తొలగించేందుకు చర్యలు చేపట్టింది. సహాయక చర్యల కోసం వర్షం పడిన గంటసేపట్లోనే 70కి పైగా ఫిర్యాదులు వచ్చాయని అధికారులు తెలిపారు.

నాలాపై కూలిపోయిన స్లబ్

బంజారాహిల్స్ రోడ్ నెంబర్9లో నాలా స్లబ్ కూలిపోయింది. నాలాపై రోడ్డు కుంగడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 11లో నాలా పైకప్పు కూలింది. నాలా కూలడంతో వరద నీటిలో ద్విచక్రవాహనాలు కొట్టుకుపోయాయి. బల్కంపేటలో రైల్వే అండర్‌పాస్ కింద వరద నీటిలో కారు మునిగిపోయింది. మలక్‌పేట రైల్వే బ్రిడ్జి కింద భారీగా వరద నీరు నిలిచిపోయింది. రైల్వే అండర్‌పాస్ కిందకు నీరు చేరడంతో దిల్‌సుఖ్ నగర్ కోఠి మార్గంలో ఇరువైపుల రాకపోకలు నిలిచిపోయాయి. కోఠి, చాదర్‌ఘాట్, మలక్‌పేట, ప్రాంతాల్లో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఆర్‌టిసి క్రాస్ రోడ్‌లోని స్టీల్ బ్రిడ్జిపై వరద నీరు నిలిచిపోయింది. స్టీల్ బ్రిడ్జి భారీ ఎత్తున నీరు ప్రవహించడంతో నది ప్రవహాన్ని తలపించింది. పంజాగుట్ట, బేగంపేట వద్ద రహదారిపై భారీగా వరద నీరు నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కున్నారు. వరద నీటిని తొలగించేందుకు డిఆర్ఎఫ్ బృందాలు చర్యలు చేపట్టాయి.

ఎక్కడికక్కడ స్తంభించి ట్రాఫిక్

భారీ వర్షంతో రహదారులపైకి వరద పోటెత్తడంతో ట్రాఫిక్ ఎక్కడికక్కడ స్తంభించిపోయింది. సాయంత్రం 5 గంటలకు వర్షం తెరిపి ఇవ్వడంతో పాటు కార్యాలయాలు ముగించుకుని ఇళ్లకు బయలుదేరడంతో వాహనాలన్ని ఒక్కొక్కటిగా రహదారులపైకి వచ్చాయి. దీంతో నగరంలోని ప్రధాన రహదారులన్నీ వాహనాల రద్దీతో నిండిపోయాయి. పలు ప్రాంతాల్లో మోకాలి లోతు నీరు చేరడంతో రహదారులపై భారీగా వాహనాలు నిలిచిపోయాయి. గచ్చిబౌలి, బయో డైవర్సిటీ, ఐకియా, విప్రో జంక్షన్, జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు, రోడ్డు నంబర్ 45, బేగంపేట, పంజాగుట్ట సహా పలు చోట్ల భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. మాదాపూర్ నుంచి కెపిహెచ్‌బి వైపు వెళ్లే మార్గంలో వాహనాలు నెమ్మదిగా కదిలాయి. మాదాపూర్ నెక్టార్ గార్డెన్, శిల్పారామం సైబర్ గేట్ వే రోడ్లపై వరద నీరు నిలిచిపోయింది. జిహెచ్ఎంసి అత్యవసర బృందాలు రంగంలోకి సహాయక చర్యలు చేపట్టాయి.

సికింద్రాబాద్‌లో రికార్డులో స్థాయిలో నమోదైన వర్షపాతం

సికింద్రాబాద్‌లో అత్యధికంగా 9.6 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఇక మలక్ పేటలో 8.4, బంజారాహిల్స్ వేంకటేశ్వర కాలనీలో 8.3, బేగం బజార్‌లో 8.1, గోల్కొండలో 7.5, కృష్ణా నగర్‌లో 7.45, అస్మాన్ ఘడ్‌లో 7.3, బంజారాహిల్స్, గోల్కొండలో 7.2, యూసుఫ్‌గూడలో 51.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఖైరతాబాద్‌లో 48.0, కుత్బుల్లాపూర్‌లో ఆదర్శ నగర్‌లో 44.3, ఖైరతాబాద్‌లోని శ్రీనగర్ కాలనీలో 42.8, బాలానగర్‌లో 42.5, షేక్‌పేటలో 42.3 వర్షపాతం నమోదైనట్లు అధికారులు ప్రకటించారు.

వర్ష బీభత్సంపై సిఎం రేవంత్‌రెడ్డి సమీక్ష : యంత్రాంగాన్ని అప్రమత్తం

వర్ష బీభత్సంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. వెంటనే అత్యవసర బృందాలను రంగంలోకి దింపి, సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వర్షాలు, వర్ష ప్రభావంపై అధికారులతో సిఎం రేవంత్ రెడ్డి అధికారులతో సమాలోచనలు జరిపారు. వర్షం కురుస్తున్న ప్రాంతాల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ప్రజలు ఇబ్బంది పడకుండా వెంటనే చర్యలు చేపట్టాలని సూచించారు.

బంజారాహిల్స్ నాలాను పరిశీలించిన మేయర్

భారీ వర్షాల నేపథ్యంలో నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అప్రమత్తమయ్యారు. ఈ మేరకు మేయర్ విజయలక్ష్మి నగరంలోని జోనల్ కమిషనర్లు, ఈవిడిఎం డైరెక్టర్‌తో టెలి కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. బంజారా హిల్స్‌లో నాలా కొట్టుకుపోయిన ప్రాంతాన్ని సందర్శించారు. నీరు నిలిచే ప్రాంతాలు, నాలాల వద్ద ప్రమాద హెచ్చరికలు ఏర్పాటు చేయాలని, వరద నీరు నిలిచే ప్రాంతాల్లో పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించి ప్రజలను అప్రమత్తం చేయాలని ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల్లో వరద నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని, నేలకొరిగిన వృక్షాలను తొలగించాలని ఆదేశించారు. రాత్రి 7 గంటల వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించారు. దీంతో వాహనదారులు అప్రమత్తంగా ఉండి, ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని సూచించారు. డిఆర్ఎఫ్ బృందాల చర్యల కోసం 040 21111111 లేదా 9000113667 నెంబర్‌లలో సంప్రదించాలని సూచించారు.

అన్ని రకాల వడ్లకు బోనస్ వర్తింపచేయాలి

ప్రజాపక్షం/హైదరాబాద్: అన్ని రకాల వడ్లకు బోనస్ వర్తింపచేయాలని, తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని సిపిఐ(ఎం) రాష్ట్ర కమిటీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. సన్న బియ్యం పండించే రైతులకు మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం క్వింటాల్‌కు రు.500లు బోనస్ చెల్లించనున్నట్టు వార్తలు వస్తుండడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని, రైతుల్లో వున్న ఆందోళనను తొలగించడం కోసం ప్రభుత్వం వెంటనే స్పష్టమైన ప్రకటనను చేయాలని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

బిఆర్‌ఎస్ నిరసనలు (మొదటి పేజీ తరువాయి)

తీవ్ర అన్యాయం చేస్తుందని, రైతులు పండించిన పంటలను కొనుగోలు చేయడం లేదని మాజీ మంత్రి, మేడ్చల్ ఎంఎల్‌ఎ చామకూర మల్లారెడ్డి ఆరోపించారు. శామీర్‌పేట వ్యవసాయ సహకార సంఘం వద్ద మేడ్చల్ నియోజకవర్గ నాయకులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తా వద్ద చేపట్టిన ధర్నాలో రైతులు పండించిన వరి ధాన్యంపై క్వింటాల్ కు రూ.500ల బోనస్‌ను రైతులకు అందచేయాలని, పండించిన వరి ధాన్యంను వెంటనే కొనాలని డిమాఁడ చేశారు.

'టిజి' అమలు (మొదటి పేజీ తరువాయి)

మంత్రిత్వ శాఖ ప్రచురించిన గెజిట్ నోటిఫికేషన్ ప్రకారం ఇక నుండి తెలంగాణ రాష్ట్రంలో వాహనాల రిజిస్ట్రేషన్ నంబర్ ప్లేట్లు టిఎస్ స్థానంలో రాష్ట్ర కోడ్‌ను టిజి పేరుతో ఉండే విధంగా రిజిస్ట్రేషన్లు చేయాలని పేర్కొన్నారు. నోటిఫికేషన్ ప్రకారం, సీరియల్ నంబర్ 29ఎ, టిఎస్ కింద రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల కోసం వాహనాలపై రిజిస్ట్రేషన్ గుర్తు టిజిగా సవరించి గెజిట్ నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ ఉత్తర్వులు వెంటనే అమలులోకి వస్తాయని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది.

భారీ వర్షాలు (మొదటి పేజీ తరువాయి)

రంగారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 40 నుంచి 50 కిలో మీటర్ల వేగంతో భారీ వర్షాలు కురుస్తాయన్నారు. బుధవారం తూర్పు విదర్భ దాని పరిసర ప్రాంతాలలో కొనసాగిన ఆవర్తనం ఈ రోజు మధ్యప్రదేశ్‌లోని నైరుతి ప్రాంతాలలో సగటు సముద్ర మట్టానికి 0.9 కిలో మీటర్ల ఎత్తులో కేంద్రీకృతమై ఉన్నట్లు చెప్పారు. గురువారం రాష్ట్రంలో కింది స్థాయి గాలులు ప్రధానంగా ఆగ్నేయ దిశ నుంచి వీస్తున్నట్లు తెలిపారు. కొద్ది రోజులుగా రాష్ట్రంలో భిన్నమైన వాతావరణం కనిపిస్తుంది. ఉదయం తీవ్రమైన ఎండలు సాయంత్రం అయ్యే సరికి భారీ మేఘాలు కమ్మి ఉరుములు, మెరుపులతో కూడిన అకాల వర్షాలు పడుతున్నాయి.

18వ లోక్‌సభ ఎన్నికల సమరం 2024

పోలింగ్	ఏప్రిల్ 19	ఏప్రిల్ 26	మే 7	మే 13	మే 20	మే 25	జూన్ 1	ఓట్ల లెక్కింపు
సీట్లు	102	89	94	96	49	57	57	జూన్ 4

‘మోదీ పూజ’కు పరాకాష్ట

వ్యక్తిపూజ పెరిగితే ప్రజాస్వామ్య పునాదులు కదిలిపోతాయని రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్క ర్ చేసిన హెచ్చరికను గుర్తు చేసుకోవాల్సిన తరుణం ఇది. బిజెపి అగ్రనేతలు ఇప్పటికే ప్రధాని నరేంద్ర మోదీని ఇంద్రుడు.. చంద్రుడు అంటూ పొగడ్త లతో ముంచెత్తుతున్నారు. ఆయన దార్శనిక త భారత్‌కు ఎంతో అవసరమని, దేశం సుభిక్షం గా ఉండాలన్నా, అభివృద్ధి పథంలో దూసుకెళ్లాలన్నా మోదీ మరోసారి ప్రధాని కావాల్సిందేనని ఊదర గొడుతున్నారు.
ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఈ ప్రశంసకుల జాబితాలో ఇప్పుడు ముందుకు న్నారు.జేలమ్ నియోజకవర్గంలో బిజెపి అభ్యర్థి, కేంద్ర మంత్రి భాను ప్రతాప్ వర్మకు మద్దతుగా బుధవారం జరిగిన ర్యాలీలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ మోదీని శ్రీకృష్ణుడి తో పోల్చారు. లోక్‌సభ ఎన్నికల మహా భారత యుద్ధంలో దుర్యోధన, దుశ్శాసను ల వంటి ప్రతిపక్ష పార్టీ లను ఎదుర్కోవడానికి మోదీ శ్రీకృ ష్ణుడి పాత్ర పోషిస్తున్నారని అందలం ఎక్కించారు. సమాజ్‌వాది పార్టీ (ఎస్‌పి), బహుజన సమాజ్ పార్టీ (బిఎస్‌పి), కాంగ్రెస్ కలిసి ముందేల్‌ఖండ్ ప్రాంతాన్ని మాఫియాకు అప్పగించా యని ఆదిత్యనాథ్ ఆరోపించారు. ఈ పార్టీల నుంచి దేశంలోని 140 కోట్ల మంది ప్రజలను రక్షించే మహా వ్యక్తిగా మోదీని కీర్తించారు.
ఇప్పటి వరకూ ప్రధానిని మహానేతగా పేర్కొం టున్న బిజెపి నాయకులు ఇప్పుడు ఆయనను ఏకంగా రాముడు, కృష్ణుడు అని పేర్కోవడం వ్యక్తి పూజకు పరాకాష్ట. ఇలాంటి నేతలు ఉన్నప్పుడు, మోదీలో నిరంకుశత్వ మరింత పెరగడంలో ఆశ్చర్యం ఏముంది?

‘అయోధ్య’లో దడపుట్టిస్తున్న అరవింద్ సేన్

ఫైజాబాద్ నియోజకవర్గంలో బిజెపి, ఎస్‌పిలకు సిపిఐ సవాల్

ఫైజాబాద్ లోక్‌సభ నియోకవర్గానికి ఒక ప్రత్యేకత ఉన్నది. దేశవ్యాప్తంగా బిజెపి ఉత్థానానికి కారణ మైన రామమందిరం నెలవైన అయోధ్య పట్టణం ఈ నియోజకవర్గం పరిధిలోనే ఉంది. అందుకే ఈ నియోజకవర్గం ఫలితం ఎట్లా ఉంటుందని అందరూ ఆసక్తిగా చూస్తున్నారు. ఫైజాబాద్ నియోజకవర్గం నుండి సిపిఐ అభ్యర్థిగా పోటీ చేస్తున్న రిటైర్డ్ ఐపిఎస్ అధికారి అరవింద్ సేన్ ప్రత్యర్థులకు గట్టి పోటీ ఇస్తున్నారు. వ్యక్తిగత చరిత్ర, కుటుంబ నేపథ్యం ఆయనకు కలిసొస్తుంది. ప్రచారంలో ప్రతీచోట ఆయనకు మంచి ఆదరణ లభించడమే కాకుండా, తాము ఓట్లేస్తామని ప్రజలు చెబుతు న్నారు. ఫైజాబాద్ జిల్లాలో సిపిఐ చరిత్ర ఘనమైన ది, అయోధ్య రామమందిర ఉద్యమం ఉవ్వెత్తున లేచిన సమయంలోనే ఆ స్థానం నుండి సిపిఐ తరు పున మిత్రసేన్ యాదవ్ 1989లో ఎంపిగా ఎన్నిక య్యారు. ప్రస్తుతం కమ్యూనిస్టు పార్టీ తరుపున పోటీ చేస్తున్నది కూడా ఆయన కుమారుడు అర వింద్ సేన్. మిత్రసేన్ యాదవ్ ఆ తరువాత పార్టీ మారినప్పటికీ ఒకసారి ఎస్‌పి, మరొకసారి బిఎస్‌పి తరుపున ఫైజాబాద్ స్థానం నుండి గెలుపొందారు. ఆ తరువాత ఆయన చిన్న కుమారుడు ఆనంద్ సేన్ కూడా ఇదే నియోజకవర్గం నుండి గత ఎన్ని కల్లో ఎస్‌పి తరుపున పోటీచేసి రెండవ స్థానంలో నిలిచారు.తన తండ్రి రాజకీయాలు ప్రారంభించిన సిపిఐ నుండే ఎంపిగా పోటీ చేస్తానని, ఐపిఎస్‌గా రిటైర్ అయిన తరువాత పట్టుబట్టి మరీ ఆయన ఫైజాబాద్ నియోజకవర్గం నుండి పోటీ చేస్తు న్నారు. అరవింద్ సేన్ ప్రచారానికి మంచి ఆద రణ లభిస్తుండడంతో, ఆయనకు పడే ఓట్లు ఎవరికి నష్టం కలిగిస్తాయోనని బిజెపి, ఎస్‌పిలు భయపడుతు న్నాయి. జిల్లాలో పేద ప్రజల కోసం పోరాడిన చరిత్ర సిపిఐకి, తన తండ్రికి ఉన్నదని, ఆ పోరాట వారసత్వాన్ని ప్రజలకు గుర్తు చేస్తూ ప్రచారం చేస్తు న్నట్లు అరవింద్ సేన్ వెల్లడించారు. ధనిక, పేదల మధ్య పెరుగుతున్న అంతరా లే తన ఎజెండా అని, ప్రస్తుత ఎన్నికల్లో ఎవరి గాలి లేదని, అది తనకు కలిసొస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

పంజాబ్ గ్రామాలలో బిజెపికి ‘నో ఎంట్రీ’

పంజాబ్, హర్యానాలో బిజెపికి రైతు ఉద్యమం సెగ తగులుతోంది. ఎన్నికల ప్రచారానికి వెళ్తున్న బిజెపి అభ్యర్థులకు గ్రామాలలో ‘బిజెపికి ప్రవేశం లేదు’ అనే ప్లకార్డులు, బ్యానర్లు ఎదురవుతున్నాయి. అలాగే వారికి నల్ల జెండాల స్వాగతం లభిస్తోంది. దీంతో ఎటూ పాలుపోని బిజెపి అభ్యర్థులకు ఓటమి భయం పట్టుకుంది. కనీస మద్దతు ధర కోసం ‘చలో ఢిల్లీ’కి పిలుపునిచ్చిన రైతులను పంజాబ్‌లోని శంభూ బార్డర్ వరకే కేంద్ర ప్రభుత్వం పరిమితి చేసింది. అప్పటి నుండి కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపిపై రైతులు రగిలి పోతున్నారు. అవకాశం కోసం ఓపిగ్గా వేచి ఉన్నారు. ప్రస్తుత లోక్‌సభ సాధారణ ఎన్నికల్లో బిజెపిపై రైతులు, పంజాబ్ ప్రజలలో గూడు కట్టుకున్న ఆగ్రహం కట్టలు తెంచుకున్నది. తొలిసారిగా పంజాబ్‌లోని మొత్తం 13 స్థానాలను ఎలాంటి పొత్తులు లేకుండా ఒంటరిగా బరిలో దిగిన బిజెపి ప్రచారానికి అడుగడుగున ఆటంకాలే ఎదురవుతున్నాయి. బిజెపి అభ్యర్థులు తమ గ్రామాలలోకి రావద్దని ఊరి శివార్లలోనే రైతులు, ప్రజలు వారిని అడ్డుకుంటున్నారు.
మాల్వా, మాజా ప్రాంతాలలో ప్రచారానికి వెళ్తున్న బిజెపి అభ్యర్థు లకు నల్ల జెండాలతో స్వాగతం పలుకుతున్నారు.పంజాబ్‌లో బిజెపి అభ్యర్థులు హన్స్‌రాజ్ హన్స్(ఫరీద్‌కోట్), ప్రెణీత్ కౌర్ (పటియాలా), తేజీందర్ సింగ్ సంధు (అమృత్‌సర్), సుశీల్ కుమార్ రింకూ (జలంధర్), గుర్మీత్ సింఘ్ సోధీ (ఫెరోజ్‌పూర్), మాజీ ఎంఎల్‌ఏ దినేశ్ సింగ్ బబ్బు(గురుదాస్‌పూర్)లు రైతుల ఆగ్రహానికి గుర య్యారు. ఫరీద్‌కోట్‌లో బిజెపి జిల్లా అధ్యక్షుడు నిర్వహిస్తున్న ప్రచార సభను కీర్తి కిసాన్ సంఘ్ అడ్డుకోవడంతో, ఆ సంఘం ప్రధాన కార్య దర్శి రాజేందర్ సింగ్ దీప్ సింగ్‌వాలాను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇలా పలువురు రైతు నాయకులను అరెస్టు చేయడంతో సంయుక్త కిసాన్‌మోర్చ ఆధ్వర్యంలో పంజాబ్ వ్యాప్తం గా నిరసనలు పెల్లుబికాయి. గతవారంలో సోనిపత్ నియోజకవర్గ బిజెపి అభ్యర్థి మోహన్ లాల్ బదోలి ప్రచారసభను కోపంతో రైతులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులు రంగంలోకి దిగాల్సి వచ్చింది.
జెజెపికి కూడా తప్పడం లేదు : గత మార్చి నెల వరకు హర్యానాలో అధికార బిజెపితో అంటకాగిన జెజెపికి సైతం రైతుల నుండి తిప్పలు తప్పడం లేదు. రైతుల ఉద్యమం ఉచ్ఛస్థితిలో ఉన్నప్పుడు జెజెపి నాయకుడు, నాటి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి దుశ్యంత్ చౌతాలా బిజెపికే మద్దతినివ్వడం ఆ పార్టీని వెంటాడుతోంది. హిసార్‌లో జెజెపి అభ్యర్థి నైనా చౌతాలా ప్రచారానికి వెళ్ళినప్పుడు, ఆమె కాన్వాయ్‌పై రైతులు దాడి చేశారు. అలాగే బిజెపి అభ్యర్థులు అశోక్ తన్వర్ (సిర్సా నియోజకవర్గం), రంజిత్ చౌతాలా (హిసార్), అరవింద్ శర్మ (రోహ్‌తక్),మాజీ ముఖ్యమంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ (కర్నాల్)ల ప్రచారం సందర్భంగా రైతులు నల్ల జెండాలతో నిరసన వ్యక్తం చేశారు.
బిజెపి రైతు వ్యతిరేక విధానాలపై పెద్ద పెట్టున నినాదాలు చేశారు. కాంగ్రెస్ నుండి బిజెపిలో చేరి లూధియానా నియోజకవర్గం నుండి పోటీ చేస్తున్న రవనీత్ సింగ్ బిట్టు తన ప్రచారంలో రైతుల నిరసనలకు ఆందోళన చెంది లైవ్ స్ట్రీమింగ్ ద్వారా తాను రైతుల ఉద్యమానికి మద్దతుగా ఢిల్లీ జంతర్ మంతర్‌లో సంఘీభావం ప్రకటించానని, వారితో కలిసి పడుకున్నానని చెప్పుకొచ్చారు. అయినా బిజెపిపై రైతుల ఆగ్రహం చల్లారలేదు. శిరోమణి అకాలీదళ్‌తో బంధం తెగిపోయాక గ్రామీణ పంజాబ్‌తో సంబంధాలు ఏర్పరచుకునేందుకు బిజెపి కిందా మీదా పడుతోంది. గ్రామీణ ప్రాంతాలలో అత్యధికులు వ్యవసాయంపై ఆధారపడి ఉండడం, రైతు లను పణంగా పెట్టి పారిశ్రామిక వేత్తలకు కనీస మద్దతు ధర కోసం కొమ్ముకొస్తుందనే కోపం వారిలో ఉండడంతో ఆ పార్టీని ఆహ్వానించడం లేదు. అనేక మంది కాంగ్రెస్, శిరోమణి అకాళీదళ్ నాయకులను చేర్చుకున్నా కూడా పంజాబీల హృదయాలను, ఎన్నికలలో ఓట్లను గెలుచుకోవడం బిజెపికి కష్టసాధ్యంగా మారిందని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు.
ఇసికి బిజెపి, రైతుల పోటా పోటీ ఫిర్యాదులు : రాష్ట్రవ్యాప్తంగా ఎదురవుతున్న నిరసనలతో బిజెపికి చిర్రెత్తిపోయింది. తమను గ్రామాలలో ప్రజలు ప్రచారం చేయనీయకుండా అడ్డుకుంటున్నారని పంజాబ్ రాష్ట్ర ఎన్నికల అధికారి (సిఇఒ) సి.సిబిన్‌కు బిజెపి పంజాబ్ రాష్ట్ర అధ్యక్షులు సునీల్ జాఖడ్ ఫిర్యాదు చేశారు. ముఖ్యమంత్రి భగవంత్ సింగ్ మాన్ నేతృత్వంలోని ఆమ్ ఆద్మీ ప్రభుత్వం తమకు ప్రచారం చేసుకునే అవకాశం లేకుండా చేస్తుందని ఆరోపించారు. దీనికి ప్రతిగా రైతుల ప్రతినిధి బల్బీర్ సింగ్ రాజేవాల్ కూడా సిఇఒను కలిసి తమపై రాజకీయ నాయకులు, భద్రతా సిబ్బంది దాడులు చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. ప్రచారపర్వంలో తమను ప్రశ్నలు అడకుండా అడ్డుకుంటున్నారని తెలిపారు.

మతం కంటే కులమే ప్రధానం

రామమందిరం నెలవై ఉన్న అయోధ్య నగరం భాగంగా ఉండే ఫైజాబాద్ లోక్‌సభ నియోజకవ ర్గంలో రామ మందిర రాజకీయాల ప్రభావం ఉంటుందనుకుంటున్నారా?అది తప్పు అని నియో జకవర్గ ఎన్నికల చరిత్ర నిరూపిస్తోంది. అక్కడ మతం కంటే కులం అంశమే ఎన్నికల ఫలితాలను నిర్దేశిస్తూ వస్తున్నాయి. ఇందుకు 2024లో జరు గుతున్న ఎన్నికలు కూడా భిన్నమేమి కాదు. అయోధ్య సిట్టింగ్ బిజెపి ఎంపి లల్లు సింగ్ అయోధ్య అసెంబ్లీ నియోజకవర్గం నుండి ఐదు సార్లు ఎంఎల్‌ఏగా గెలిచారు. ఆయనపై సమాజ్ వాదీ పార్టీకి చెందిన అవదేశ్ ప్రసాద్‌ను పోటీలో నిలిపారు. అవదేశ్ తొమ్మిది సార్లు ఎంఎల్‌ఏగా, గతంలో అఖిలేశ్ యాదవ్ క్యాబినెట్‌లో మంత్రిగా పనిచేసిన సీనియర్ నేత. వృత్తి రీత్యా కాంట్రాక్టరైన లల్లు సింగ్ మూడవ సారి విజయం కోసం తాపత్రయ పడుతున్నారు.
రామమందిర నిర్మాణం, ఫలితంగా జిల్లా అభివృద్ధితో బిజెపికి వచ్చి న పేరు తనను గట్టెక్కిస్తుందని ఆయన భావిస్తు న్నారు. 2014లో సుమారు 2.8 లక్షల ఓట్ల భారీ మెజారిటీతో లల్లు గెలుపొం దగా, 2019లో మెజారిటీ భారీగా తగ్గి పోయి 65వేలకు పరిమితమైంది. ఈసారి ఆయన తీవ్రమైన ప్రజా వ్యతిరేకతతో పాటు, కాంగ్రెస్ మద్దతుతో రంగంలో ఉన్న బలమైన ఎస్‌పి అభ్యర్థిని ఎదుర్కొంటున్నారు. తమ రెండు పార్టీల ఓట్లతో అవదేశ్ ప్రసాద్ గెలుస్తారని కాంగ్రెస్, ఎస్‌పిలు భావిస్తున్నాయి. బిజెపి అభ్యర్థి లల్లు సింగ్ ఠాకూర్ కులానికి చెందిన వారు. ఆయనకు అగ్రవర్ణాల మద్దతు ఉన్నదని, దళిత వర్గానికి చెందిన ఎస్‌పి అభ్యర్థి అవదేశ్ కు దళితులలో ప్రాబల్యం ఉంటుందని పరిశీలకులు భావిస్తున్నారు.
సిపిఐ అభ్యర్థి అరవింద్ సేన్‌కు ఒబిసిలతో పాటు సిపిఐ ఓటు బ్యాంక్ కలిసొస్తుందని పత్రికలు చెబుతున్నాయి. బిఎస్‌పి తరుపున బ్రాహ్మణ వర్గానికి చెందిన సచ్చిదానంద పాండేను బరిలో నిలిపినప్పటికీ, పెద్దగా ఓటర్లను ఆకర్షించలేకపోతున్నారు. చతుర్ముఖ పోటీలో ఎవరైనా గెలవచ్చనే అంచనాలు కూడా వినవస్తున్నాయి.

టిఎస్‌టెట్ హాల్ టికెట్స్ విడుదల

ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణ ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టిఎస్ టెట్ 2024) హాల్ టికెట్ విడుదలయ్యాయి. అభ్యర్థులు తమ జర్నల్ నంబర్, పుట్టిన తేదీ, వివరాలు, ఎంటర్ చేసి హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచించారు. మే 20 నుండి జూన్ 2 వరకు దయం 9గంటల నుండి 11:30 గంటల వరకు, మధ్యాహ్నం 2గంటల నుండి సాయంత్రం 4:30 గంటల వరకు రెండు సెషన్‌లో జరగనున్నాయి. టెట్ ఫలితాలు జూన్ 12న విడుదలయ్యే అవకాశం ఉన్నది.
25 వరకు టిఎస్‌పిఇసెట్–2024 దరఖాస్తుల గడువు పెంపు
టిఎస్ పిఇ సెట్ 2024 ఆన్‌లైన్ దరఖాస్తుల గడువును ఈనెల 25 వరకు పొడిగించారు. డిగ్రీ పూర్తయిన వారు, అలాగే ఫైనల్ సెమిస్టర్ ఇంటర్ ద్వితీయ సంవత్సరం పూర్తి చేసిన వారు బి.పిఇడి, డిపిఇడిలకు దరఖాస్తు చేసుకోవచ్చని టిఎస్ పిఇసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ రాజేష్ కుమార్ తెలిపారు.
20 నుండి 25 వరకు ‘లా సెట్’ తప్పుల సవరణ
లాసెట్ దరఖాస్తుదారుల తప్పుల సవరణకు ‘టిఎస్ లాసెట్, పిజిఎల్ సెట్ 2024’అవకాశం కల్పించింది. ఈ నెల 20వ తేదీ నుండి 25వ తేదీ వరకు దరఖాస్తుదారులు తమ తప్పులను సవరించుకోవచ్చని ‘టిఎస్ లాసెట్, పిజిఎల్‌సెట్ 2024’ కన్వీనర్ ప్రొఫెసర్ బి.విజయలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు https://lawcet. tsche.ac.in/. వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు. కాగా రూ.2వేల ఆలస్య రుసుముతో ఆన్‌లైన్ దరఖాస్తుకు ఈ నెల 20వ తేదీ చివరి అవకాశం ఉన్నది.

ప్రబీర్ పురకాయస్థ అరెస్టుపై సుప్రీంకోర్టు రూలింగ్‌కు ఐజెయు హర్షం

చండీగఢ్ : సీనియర్ జర్నలిస్టు, న్యూస్ క్లిక్ ఆన్‌లైన్ పోర్టల్ వ్యవస్థాపకులు ప్రబీర్ పురకాయస్థ అరెస్టు అక్రమమని సుప్రీం కోర్టు రూలింగ్ ఇవ్వడాన్ని ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజెయు) స్వాగతించింది. ఈ మేరకు ఐజెయు అధ్యక్షులు కె.శ్రీనివాస్‌రెడ్డి, సెక్రెటరీ జనరల్ బల్వీందర్ సింగ్ జమ్మూ గురువారం ఒక ప్రతికా ప్రకటనను విడుదల చేశారు. స్వతంత్ర జర్నలిజం, అసమ్మతి పట్ల తీవ్రమైన అసహనాన్ని పెంచుకున్న , నియంతృత్వ ధోరణితో పని చేస్తున్న కేంద్ర ప్రభుత్వానికి సుప్రీం కోర్టు తీర్పు చెంపపెట్టు లాంటిదని వ్యాఖ్యానించారు. నాగరిక సమాజంలో నిరంకుశ చట్టాలకు స్థానం లేదని వారు పేర్కొన్నారు. రాజ్యాంగంలో పేర్కొన్న ప్రాథమిక హక్కుల విషయంలో చర్చకు తావులేదని, అత్యున్నత న్యాయస్థానం పదే పదే పలు సమయాలలో చెబుతున్నప్పటికీ ప్రభుత్వం దాని నుండి నేర్చుకోవడం లేదని అన్నారు. భావ ప్రకటనా స్వేచ్ఛ హక్కును పదిలపరుస్తూ రాజ్యాంగంలోని 19(1)(ఎ) అధికారణ నుండి వెలువడిన మీడియా స్వేచ్ఛను ప్రభుత్వాలు గౌరవించాలని ఐజెయు నేతలు విజ్ఞప్తి చేశారు.

మోదీకి శ్రీకాశీవిశ్వనాథుడు జ్ఞానోదయం కలిగించాడా?

టిపిసిసి సీనియర్ ఉపాధ్యక్షులు జి.నిరంజన్ సూటి ప్రశ్న

ప్రజాపక్షం /హైదరాబాద్: ‘‘ప్రధాని నరేంద్రమోడీకి వారణాసిలో శ్రీకాశీవిశ్వనాథుడు జ్ఞానోదయంకలిగించాడా? పవిత్రగంగామాతా తన పవిత్ర జలంతో ఆయనలో పరివర్తన తెచ్చిందా? లేక ఆయనే ఊసరవెల్లిలా రంగు మార్చ డా అనే అనుమానం కలుగుతుంది’’ అని టిపిసిసి సీనియర్ ఉపాధ్యక్షులు జి. నిరంజన్ అన్నారు. గాంధీభవన్‌లో గురువారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ‘ప్రధాని మోడీ ఈనెల 14వ తేదీన పవిత్రగంగానదిలో ఒక నావలో విహరిస్తూ ఒక జాతీయ చానెల్‌కు ఇంటర్వ్యూ ఇస్తూ ‘నేను హిందూ ముస్లింలనువిడదీయను, అలా చేస్తే రాజకీయాలకు అర్హుడినే కాదు. నేను ఎప్పుడూ హిందూ ముస్లింల విభజన రాజకీయంచేయ ను. ఇది నా సంకల్పం’ అని అని వ్యాఖ్యానించడం విడ్డూరంగా ఉందన్నారు. ముస్లింలు ఎక్కువ పిల్లలు కంటారనిచెప్పలేదని, పేదవారు ఎక్కువ పిల్లలను కంటారని చెప్పడం పూర్తిగా అబద్ధమన్నారు. గత నెల రోజులుగా మోడీ విద్వేషం రెచ్చగొట్టే ప్రసంగాలు విన్నప్రజలకు, ఆయన నోటి వెంట ఈ వ్యాఖ్యలు రావడం విస్మయానికి గురిచేస్తోందన్నారు.

పట్టభద్రులపై పట్టు ఎవరిదో?

27న పోలింగ్..జూన్ 5న కౌంటింగ్

ప్రజాపక్షం/హన్మకొండ ప్రతినిధి :తెలంగాణ రాష్ట్రంలో పార్లమెంట్ ఎన్నికల సందడి ముగియడంతో ఇక అందరి దృష్టి మరో ఎన్నికపై పడింది. గడచిన నెలన్నర రోజులుగా పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో తలమునకలైన పార్టీలకు విశ్రాంతి లేకుండా మరో ఎన్నిక వచ్చి పడింది. గతంలో వరంగల్, నల్గొండ, ఖమ్మం పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీగా ఎన్నికైన పల్లా రాజేశ్వర్ రెడ్డి గత అసెంబ్లీ ఎన్నికలలో జనగామ ఎమ్మెల్యేగా గెలుపొందడంతో ఆయన రాజీనామా అనివార్యమైంది. దీంతో వరంగల్, నల్గొండ, ఖమ్మం పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికను ఆరు నెలల్లోనే నిర్వహించాల్సి న పరిస్థితి ఏర్పడింది. ఈ నేపధ్యంలో వరంగల్, నల్గొండ, ఖమ్మం పట్టభద్రుల నియోజకవర్గ ఉప ఎన్నిక అనివార్యం కావడంతో ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేసింది. ఇప్పటికే పట్టభద్రుల ఎమ్మెల్సీ కోసం నామినేషన్ల ఘట్టం ముగియడంతో 52మంది బరిలో నిలిచినట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. ఈ ఉప ఎన్నికను ఈ నెల 27న నిర్వహించేందుకు ఎన్నికల షధికారులు ఏర్పాట్లు కూడా చేస్తున్నారు. ఇప్పటికే వరంగల్, నల్గొండ, ఖమ్మం ఉమ్మడి జిల్లాల పరిధిలో పట్టభద్రుల ఓటర్ల జాబితాను ఖరారుచేసిన అధికారులు ఆయా జిల్లాల కలెక్టర్లు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ కూడా నిర్వహించారు. పట్టభద్రుల ఉప ఎన్నికను ఈ నెల 27న బ్యాలెట్ పద్ధతిలో నిర్వహించి జూన్ 5న ఓట్ల లెక్కింపు కు ఏర్పాట్లు చేస్తున్నారు. వరంగల్, నల్గొండ, ఖమ్మం ఉమ్మడి జిల్లాల పరిధిలోని 12 జిల్లాల లో మొత్తం 305 పోలింగ్ కేంద్రాలను ఈ ఉప ఎన్నికల కోసం ఏర్పాటు చేశారు. మొత్తం 4.63 లక్షల మంది పట్టభద్రులు ఈ ఎన్నికలలో తమ ఓటుహక్కును వినియోగించుకోనున్నారు.
పట్టభద్రుల బరిలో 52 మంది
కాగా వరంగల్, నల్గొండ, ఖమ్మం పట్టభద్రుల నియోజకవర్గ ఉప ఎన్నిక బరిలో మొత్తం 52 మంది అభ్యర్థులు రంగంలో నిలిచారు. ఈ ఎన్నికలో ప్రధాన పార్టీలతో పాటు పెద్దఎత్తున స్వతంత్ర అభ్యర్థులు కూడా రంగంలో నిలిచారు. స్వతంత్ర అభ్యర్థులలో వివిధ విద్యా సంస్థల నిర్వాహకులు, ఉపాధ్యాయ, మేధావులు, విద్యార్థులు ఉన్నారు. కాంగ్రెస్ పార్టీ నుండి తీన్మార్ మల్లన్న, బిఆర్‌ఎస్ నుండి ఏనుగుల రాకేష్ రెడ్డి, బిజెపి నుండి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి బరిలో నిలిచారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికబరిలో 52 మంది ఉన్నప్పటికీ ఈ మూడు ప్రధాన పార్టీలు మద్దతిచ్చే అభ్యర్థుల మధ్యే పోటీ నెలకొంది. వీరిలో చింతపండు నవీన్ అలియాస్ తీన్మార్ మల్లన్న ఇప్పటికే ప్రచారాన్ని ప్రారంభించగా మిగిలిన అభ్యర్థులు ప్రచారానికి రంగం సిద్ధం చేసుకుంటున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉండడంతో పాటు విద్యా, ఉద్యోగ వర్గాలు, తీన్మార్ మల్లన్న టీం, ఇతర కలిసి వచ్చే వర్గాలతో గెలుపుకోసం ప్రయత్నిస్తున్నారు. 2021లో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికలలో తీన్మార్ మల్లన్న స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసి ద్వితీయ స్థానంలో నిలిచారు.
కాంగ్రెస్, బిఆర్‌ఎస్, బిజెపిల మధ్యే పోటీ
గతంలో స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసి స్వల్ప తేడాతో ఓడిన తీన్మార్ మల్లన్న కాంగ్రెస్ నుండి పోటీచేస్తున్నారు. బిఆర్‌ఎస్ నుండి గత అసెంబ్లీ ఎన్నికల ముందు బిజెపి నుండి బిఆర్‌ఎస్‌లో చేరిన ఏనుగుల రాకేష్ రెడ్డిని అభ్యర్థిగా ప్రకటించారు. దీంతో మొదటినుండి తెలంగాణ ఉద్యమంలో ఉన్న వారిని కాదని రాకేష్ రెడ్డికి ఇచ్చారంటూ బిఆర్‌ఎస్‌లోని ఒక వర్గం అంటీముట్టనట్లుగా అసంతృప్తితో ఉంది. పట్టభద్రుల ఎమ్మెల్సీ కోసం కెయు విద్యార్థి జెఎసి నాయకుడు, రాష్ట్ర వికలాంగుల సంస్థ మాజీ చైర్మన్ వసుదేవ రెడ్డి, విద్యాసంస్థల అధినేత, మాజీ కుడా చైర్మన్ సుందర్ రాజ్ యాదవ్ ప్రయత్నించినా బిఆర్‌ఎస్ రాకేష్ రెడ్డినే అభ్యర్థిగా ప్రకటించడంతో అంతర్గతంగా అసంతృప్తి వ్యక్తం అవుతున్నది. ఇక బిజెపి నుండి గతంలో ఎమ్మెల్సీగా పోటీచేసిన గుజ్జుల ప్రేమందర్ రెడ్డినే తిరిగి అభ్యర్థిగా ప్రకటించారు. గతంలో రెండుసార్లు గుజ్జుల ప్రేమందర్ రెడ్డి పోటీచేయగా ముచ్చటగా మూడోసారి ఆయనకే టికెట్ కేటాయించా రు. దీంతో వీరి ముగ్గురి మధ్యే ప్రధాన పోటీ నెలకొంది.

ఇక ఎంఎల్‌సీ పోరు

దృష్టి సారించిన కాంగ్రెస్, బిఆర్‌ఎస్, బిజెపి

ప్రజాపక్షం/ఖమ్మం:శాసన మండలి పట్టభద్రుల ఉప ఎన్నిక ప్రచారం మొదలైంది. నామినేషన్ల అనంతరం ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు మొత్తం 52 మంది అభ్యర్థులు రంగంలో ఉన్నారు. గత ఎన్నికల్లో నల్గొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల నియోజక వర్గం నుంచి ఎన్నికైన పల్లా రాజేశ్వరరెడ్డి గతేడాది నవంబరులో జరిగిన శాసన సభ ఎన్నికల్లో జనగాం నుంచి శాసనసభకు ఎన్నికై శాసన మండలి సభ్యత్వానికి రాజీనామా చేయడంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. గత ఎన్నికల్లో హోరాహోరీగా జరిగిన పోరులో పల్లా రాజేశ్వర రెడ్డి బిఆర్‌ఎస్ మద్దతుతో శాసన మండలికి ఎన్నికైన విషయం విదితమే. రాష్ట్రంలోని కాంగ్రెస్, బిఆర్‌ఎస్, బిజెపి పార్టీలు ఈ ఉప ఎన్నికల్లో తమ అభ్యర్థిని గెలిపించుకోవాలని పావులు కదుపుతున్నాయి. కాంగ్రెస్ నుంచి చింతపండు నవీన్‌కుమార్ అలియాస్ తీన్మార్ మల్లన్న, బిఆర్‌ఎస్ నుంచి ఏనుగు రాకేష్‌రెడ్డి, బిజెపి నుంచి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి లు పోటీలో ఉండగా వీరితో పాటు మొత్తం 52 మంది అభ్యర్థులు రంగంలో ఉన్నారు. మొత్తం 12 జిల్లాలకు విస్తరించిన ఈ పట్టభద్రుల శాసన మండలి స్థానాన్ని కైవసం చేసుకునేందుకు కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే కింది స్థాయి శ్రేణులను సమాయత్తం చేసింది. పట్టభద్రులను కలిసి తీన్మార్ మల్లన్నను గెలిపించాల్సిన ఆవశ్యకతను వివరించాలని నాయకత్వం కోరింది. తీన్మార్ మల్లన్న గత శాసన మండలి ఎన్నికల్లో ఇదే స్థానం నుంచి పోటీ చేసి అప్పటి అధికార బిఆర్‌ఎస్ పార్టీతో హోరాహోరీగా తలపడ్డారు. ప్రధాన పార్టీల అభ్యర్థులను వెనక్కి నెట్టి రెండవ స్థానంలో నిలిచారు. ఇప్పుడు మల్లన్నకు కాంగ్రెస్ పార్టీ టికెట్ కేటాయించింది. బిజెపి నుంచి కొద్ది నెలల క్రితం బిఆర్‌ఎస్‌లో చేరిన ఏనుగుల రాకేష్‌రెడ్డిని బరిలో దింపిన బిఆర్‌ఎస్ ఇప్పటికే ఈ శాసన మండలి పరిధిలోని నాయకులతో సమావేశం నిర్వహించింది. ఓటమి తర్వాత అంత హుషారు లేని నాయకత్వాన్ని సమాయత్తం చేసేందుకు కెటిఆర్ బుధవారం హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో ఒక సమావేశాన్ని నిర్వహించారు. బిజెపి నుంచి గత ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన ప్రేమేందర్‌రెడ్డి తిరిగి పోటీ చేస్తున్నారు. మొత్తం శాసన మండలి ఓటర్లుగా 4,63,839 మంది నమోదయ్యారు. అత్యధికంగా ఖమ్మంజిల్లాలో 83,879 మంది ఓటర్లు ఉండగా ఆ తర్వాత స్థానంలో సూర్యాపేట 51,497 మంది ఓటర్లు ఉన్నారు.
అత్యల్పంగా సిద్దిపేటలో 4,679 మంది ఓటర్లు ఉన్నారు. 12 జిల్లాల పరిధిలో మొత్తం 605 బూత్‌లను ఏర్పాటు చేశారు. ఈ నెల 27న పోలింగ్ జరగనుండగా జూన్ ఐదున లెక్కింపు నిర్వహించనున్నారు. ఎన్నికలకు మరో 10 రోజులు మాత్రమే సమయం ఉండడంతో అభ్యర్థులు ప్రచారం పైనా దృష్టి సారించారు. పార్లమెంటు ఎన్నికల ప్రచార బడలిక నుంచి తెరుకుని నేతలు పట్టభద్రుల ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించాల్సి ఉంది. ఎన్నికలకు సంబంధించి అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లను పూర్తి చేసింది.

బిజెపికి కెసిఆర్ ఓట్లు వేయించారు : కెకె మహేందర్ రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల్లో బిజెపికి బిఆర్‌ఎస్ నాయకులే ఓట్లు వేపించారని కాంగ్రెస్ నాయకుడు కె.కె. మహేందర్ రెడ్డి ఆరోపించారు. కల్వకుంట్ల కవితను జైలు నుండి విడిపించేందుకే బిజెపికి కెసిఆర్ ఓట్లు వేయించారన్నారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కరీంనగర్ కాంగ్రెస్ అభ్యర్థి వెలిశాల రాజేందర్‌తో కలిసి మహేందర్ రెడ్డి మాట్లాడుతూ తమ రాజకీయ భవిషత్తు కోసం మోదీ వద్ద బిఆర్‌ఎస్ మొకరిల్లిందని, మోదీ కనుసన్నల్లో నే కెసిఆర్ ఉన్నారని ఆరోపించారు.కెటిఆర్ మతి భ్రమించి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. బతుకమ్మ చీరల పేరుతో కెటిఆర్ దోపిడీ చేశారని ఆరోపించారు. వెలిశాల రాజేందర్ మాట్లాడుతూ కరీంనగర్‌లో బిఆర్‌ఎస్ రెండో స్థానానికి వస్తే తాను దేనికైనా సిద్ధమేనని,మూడో స్థానంలో ఉంటే కెటిఆర్ తన ఎంఎల్‌ఏ పదవికి రాజీనామా చేస్తారా?అని ప్రశ్నించారు. కెటిఆర్ సిరిసిల్లకు ఒక వలస పక్షి అని ఎద్దేవా చేశారు. నేతన్నల మరణానికి కెటిఆర్ కారణమని ఆరోపించారు

కెసిఆర్...విద్యుత్ సంస్థలపై అసత్యాలు మానుకో

ప్రజాపక్షం/హైదరాబాద్:24 గంటలూ నిరంతరం విద్యుత్ సరఫరా అందజేసేందుకు కృషి చేస్తున్న విద్యుత్‌శాఖను, ఉద్యోగులను బిఆర్‌ఎస్ అధినేత కెసిఆర్, ఆ పార్టీ సోషల్ మీడియా విభాగం పనిగట్టుకుని అభాసుపాలు చేసే యత్నాలు మానుకోవాలని గెజిటెడ్, నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్, రిటైర్డ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ కోరింది. ఈ ఏడాది రాష్ట్రంలో 15623 మెగావాట్ల గరిష్ట డిమాండ్‌ను అవలీలగా చేరుకొని, రాష్ట్రంలోని 1.82 కోట్లమంది విద్యుత్ వినియోగదారులకు నిరంతర విద్యుత్ సరఫరా కొరకు తమ ఉద్యోగులు రాత్రింబవళ్లు కృషి చేస్తున్నారని వెల్లడించింది. ఈ మేరకు ఫెడరేషన్ నేతలు డి.కోటేశ్వరరావు,(డిఈ),ఎ.శంకర్(డిఈ),రామకృష్ణ(రిటైర్డ్ ఎస్ఇ), కె. శంకర్ (ఎడిఈ)లు గురువారం సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడు తూ బిఆర్‌ఎస్ నేతలు పనిగట్టుకుని సరఫరా విషయంలో విద్యుత్ సంస్థలపై అసత్య ప్రచారాలు వ్యాప్తిచేస్తూ విద్యుత్ అధికారులను సిబ్బందిని మానసిక క్షోభకు గురిచేస్తున్నారన్నారు. బిఆర్‌ఎస్ హయాంలో పనిచేసిన తమ ఉద్యోగులు అప్పుడు బాగాచేసి ఇప్పుడు చేయనట్లు అసత్యాలు ప్రచారం చేయడం మానుకోవాలన్నారు. విపక్షా లు చేస్తున్న ఈ విమర్శలను పరిగణనలోకి తీసుకోకుండా విద్యుత్ ఉద్యోగులు పనిచేస్తున్నారని, ఈ విషయంలో ప్రభుత్వం కూడా తమను అభినందిస్తోందని వారు పేర్కొన్నారు. గత తొమ్మిదేండ్ల కాలంలో తీవ్ర ఆర్థిక నష్టాల్లో కూరుకుపోయిన విద్యుత్ సంస్థలకు నష్టాల నుండి గట్టెక్కించేందుకు గాను ప్రతిష్ఠాత్మక ఐఐటిల్లో ఇంజినీరింగ్ పట్టభద్రులైన ఐఎఎస్ అధికారులను సిఎండిలుగా నియమించి విద్యుత్ సంస్థల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి పెట్టిన ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డికి, విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్కకి ధన్యవాదములు తెలియజేస్తున్నామన్నారు.

ప్రజాపక్షం
శుక్రవారం, మే 17

ఎన్నికల్లో 'ఎఐ' ఎఫెక్ట్

సోషల్ మీడియాలో, కృత్రిమ మేధ (ఎఐ), 'డీప్ ఫేక్' పుణ్యమా అని ఏది నిజమో, ఏది అబద్ధమో తెలియని పరిస్థితి నెలకొంది. సార్వత్రిక ఎన్నికల వేళ, ప్రజలను మరింత గందర గోళానికి గురి చేస్తున్నది. ఎవరో వీడియోకు, ఇంకెవరి మొహాన్నో జోడించడమే డీప్ ఫేక్. ఎఐ హ్యాండిల్స్‌తోనే ఇలాంటి వీడియోలు సాధ్యం. ఫొటో మార్ఫింగ్ సమస్యకు పూర్తిగా తెరపడకముందే, డీప్ ఫేక్ సాంకేతికత ప్రమాదాలు సృష్టిస్తున్నది. జాతీయ స్థాయి నాయకుల ఎన్నికల ప్రచారం పేరుతో వస్తున్న వీడియోల్లో అసలు, నకిలీ తేడా కనుక్కోవడం ప్రజలకు అసాధ్యంగా మారింది. ప్రధాని నరేంద్ర మోదీ లేదా ప్రధాన ప్రతిపక్ష పార్టీ కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ, ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) జాతీయ కన్వీనర్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ లేదా తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి) అధినేత్రి, పశ్చిమ బెంగాల్ సిఎం మమతా బెనర్జీ.. ఇలా దేశ రాజకీయాల్లో కీలకంగా ఉన్న ఎంతో మంది నేతలు ఒకే చోట చేరడం విచిత్రం కాకపోవచ్చు. కానీ, ఒకేసారి ఒక షోలో కలిసి డాన్స్ చేయడమో లేక స్ప్రింట్ ఈవెంట్‌లో పరుగులు తీయడమో సాధ్యం కాదన్నది వాస్తవం. కానీ, అలాంటి వీడియోలు పుట్టుకొస్తున్నాయి. వీటిని ప్రజలు పెద్దగా పట్టించుకోకపోవచ్చు. కానీ, ఉపన్యాసాల వీడియో క్లిప్పింగ్స్‌కు ఇష్టానుసారంగా ఆడియోను జోడించినప్పుడు, గుర్తించడం కష్టం. క్రమంగా వేళ్లానుకుంటున్న కృత్రిమ మేధ (ఎఐ), డీప్ ఫేక్ వంటి సాంకేతిక పరిజ్ఞాన వినియోగంపై కేంద్ర ప్రభుత్వం ఇంత వరకూ స్పందించకపోవడం శోచనీయం. చాలా దేశాలు ఇప్పటికే జాగ్రత్త చర్యలు మొదలుపెట్టినప్పటికీ, మోదీ సర్కారులో కదలిక లేదు. ఎంతో మంది రాజకీయ నాయకులు గతంలో మనం ఎన్నడూ చూడని అవతారాల్లో కనిపించడం వెనుక ఎఐ సాధనాలే ఉన్నాయి. షాహిద్ షేక్ వంటి కంటెంట్ క్రియేటర్లు జాతీయ నాయకులను మనం గతంలో ఎన్నడూ చూడని రూపాల్లో చూపిస్తున్నారు. పాటలు పాడిస్తున్నారు. డాన్స్‌లు, ఫైటింగ్‌లు చేయిస్తున్నారు. ఈ టూల్స్ మరింత ఆధునికతను సంతరించుకోవడంతో, ఇప్పుడు తప్పుడు వార్తలు నిజాలుగా చలామణ అవుతున్నాయని నిపుణుల ఆందోళన. పుకార్లు ఎప్పుడూ ఎన్నికల్లో ఒక భాగమే. కానీ, ప్రస్తుత 'సోషల్ మీడియా యుగం'లో ఈ సమస్య తీవ్ర రూపం దాల్చింది. తప్పుడు సమాచారం దేశ రాజకీయాలను, ప్రజాస్వామ్య విధానాలను తీవ్రంగా ప్రభావితం చేస్తుందని భారత ఎన్నికల కమిషన్ (ఇసిఐ) మాజీ చీఫ్ ఎస్‌వై ఖురేషి హెచ్చరికను తేలిగ్గా తీసుకోవడానికి వీల్లేదు. ఇప్పటికే కొంత మంది నాయకుల విద్వేషపూరిత ప్రసంగాలతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఎఐ, డీప్ ఫేక్ సాంకేతికతతో వెల్లువెత్తుతున్న వీడియోలు దేశంలో అంతర్యుద్ధ పరిస్థితులను సృష్టించినా ఆశ్చర్యం లేదు. అయితే, ఎన్నికల్లో ఎఐ టూల్స్ వల్ల నష్టమే తప్ప లాభం లేదనుకోవడానికి వీల్లేదు. ఎంతో మంది నేతలు తమతమ ఉపన్యాసాలను ఇతర భాషల్లో అనువాదానికి ఎఐ సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడుతున్నారు. ఎన్నో సందేశాలను ఓటర్లకు చేరవేయడంలోనూ ఈ ఎఐది కీలక భూమిక. గతంలో ఓటర్లను ఉద్దేశిస్తూ చేసే ప్రసంగాల వీడియోలు చేయడానికి వారం పది రోజులు పట్టేది. ఇప్పుడు కొన్ని గంటల్లోనే వీడియోలు సిద్ధమవుతున్నాయి. అన్ని భాషల్లోకి తర్జుమా అవుతున్నాయి. బలంగా ప్రజల్లోకి వెళుతున్నాయి. సరైన పద్ధతిలో వాడుకుంటే దేశ కల్యాణానికి ఉపయోగపడే ఎఐ సాంకేతిక పరిజ్ఞానం, తప్పుడు మార్గాల్లో ఉపయోగిస్తే వినాశనాన్ని, విధ్వంసాన్ని సృష్టిస్తుంది. ప్రాణాలు నిలబెడుతున్న సాంకేతిక పరిజ్ఞానమే ఆయుధాల రూపంలో ప్రాణాలు తీస్తున్నది. రెండు అంచుల కత్తి ఎఐ పరిజ్ఞానం తప్పుతోవ పట్టకుండా, సంఘ విద్రోహుల చేతిలో పడకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. మార్గదర్శకాలను నిర్దేశించాలి. ప్రత్యేక చట్టాలు రూపొందించి, పకడ్బందీగా అమలు చేయాలి. ప్రభుత్వంలో శ్రద్ధ, చిత్తశుద్ధి లోపిస్తే, సమీప భవిష్యత్తులో పెను ప్రమాదాలు తప్పవు.

చాబహార్ పోర్టు అభివృద్ధిలో
భారత్ వ్యూహాత్మక ప్రయోజనాలు

గిరీష్ లింగన్న

పశ్చిమ ఆసియాలో ముఖ్యమైన దేశం ఇరాన్‌తో సంబంధాలు వృద్ధి చేసుకునే ఉద్దేశంతో భారతదేశం చాబహార్ ఓడరేవు అభివృద్ధి–నిర్వహణ ఒప్పందం చేసుకుంది. రెండు దేశాలమధ్య సహకారాన్ని పెంపొందించుకోవడానికి చాబహార్ ఓడరేవు అభివృద్ధికి ఇరాన్‌తో పదేళ్ళ ఒప్పందంపై సంతకాలు చేసినట్లు భారత ప్రభుత్వం మే 13వ తేదీ సోమవారంనాడు ప్రకటించింది.

ఒమన్ సముద్రతీరంలో ఉన్న ఆగ్నేయ ఇరాన్‌లో ఉన్న చాబహార్ ఓడరేవు అభివృద్ధి పనుల్లో భారత ప్రభుత్వం ఎంతో క్రియాశీలంగా భాగస్వామి అయింది. మధ్యాసియాలోని ఇరాన్, అఫ్ఘానిస్థాన్ వంటి దేశాలకు సముద్రమార్గంలో సరుకులు చేరవేయడానికి ఒక కీలకమైన రవాణా మార్గంగా ఈ చాబహార్ ఓడరేవు సేవలు అందిస్తుం ది.ఈ ఓడరేవును ఉపయోగించుకోవడంద్వా రా మనదేశం దాయాదిదేశమైన పాకిస్థాన్‌లోని కరాచీ, గదర్ వంటి ఓడరేవులకు వెళ్ళాల్సిన అవసరం లేకుండా ఈ ప్రాంతంలో చుట్టుమార్గం లేకుండా అత్యంత సులభపద్దతుల్లో వాణిజ్య అనుసంధానాలు కొనసాగించేందుకు వీలు కలుగుతుంది. ఇరాన్–ఇండియా మధ్య సులభమైన అనుసంధా నం ఒక్కటి మాత్రమే కాకుండా ఈ ఓడరేవుకు లెక్కకుమిక్కిలి ప్రాధాన్యతలు ఉన్నాయి. ముందే చెప్పినట్టు సెంట్రల్ ఆసియా దేశాలను భారత్‌తో అనుసంధానం చేయడానికి ఇది అత్యంత కీలకమైన సముద్ర మార్గం. మనదేశ నౌకాయానమంత్రి సర్బనంద సోనేవాల్ టెహ్రాన్‌లో ఈ ఒప్పందంపై సంతకాలు చేసిన తర్వాత ఈ విషయాలనే చాలా ప్రముఖంగా ముందుకు తెచ్చారు.ఈ ప్రాంతంలో సరఫరా వ్యవస్థకు ఏ మాత్రం భంగం వాటిల్లకుండా నిరంతరాయంగా రాకపోకలు కొనసాగిస్తూ, వాణిజ్య కార్యకలాపాలను పటిష్టం చేసుకోవడానికి మనదేశానికి అనేక తాజా అవకాశాలకు తెరతీసేవిధంగా ఇండియా పోర్ట్స్ గ్లోబల్ లిమిటెడ్ (ఐపిజిఎల్), పోర్ట్ అండ్ మెరైన్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇరాన్ మధ్య ఈ దీర్ఘకాలిక ఒప్పందం జరిగింది. ఇరాన్ దేశ మాజీ అధ్యక్షుడు మహ్మద్ ఖతామి 2003లో భారతదేశంలో పర్యటించినప్పుడు చాబహార్ ఓడరేవు అభివృద్ధికి రెండు దేశాలమధ్య ఈ భాగస్వామ్య ఒప్పందం జరిగినప్పటికీ, ఇరాన్‌పై అమెరికా విధించిన ఆంక్షల కారణంగా దాన్ని అమలు చేయడంలో రెండు దశాబ్దాలుగా ఈ ప్రాజెక్టు అనేక ఆటంకాలకు గురైంది. తర్వాత 2016లో ప్రధాన మంత్రి నరేంద్రమోడీ ఇరాన్‌లో పర్యటించినప్పుడు రెండు దేశాల నౌకాయాన మంత్రుల మధ్య పునరుద్ధరించిన ఒప్పందంపై టెహ్రాన్‌లో సంతకాలు జరిగాయి. ఇరాన్ రోడ్లు, పట్టణాభివృద్ధిశాఖామంత్రి మెహర్దాద్ బాజ్‌పాష్ చెప్పిన ప్రకారం, ఈ ప్రాజెక్టుకోసం ఐపిజిఎల్ నుండి సుమారుగా 120 మిలియన్ డాలర్లు పెట్టుబడులు సమకూరుతాయి. మరో 250 మిలియన్ డాలర్లు ద్రవ్య సహాయం సమకూరుతుంది. ఆ విధంగా మొత్తం 370 మిలియన్ డాలర్ల విలువైన కాంట్రాక్టు పనులు భారత్ చేపడుతున్నది. ఒప్పంద నిబంధనల ప్రకారం మొబైల్ హార్బర్ క్రేన్లు, ఓడలను లంగరు వేసేందుకు వీలుగా ఒడ్డును, సముద్ర జలాలతో అనుసంధానం చేస్తూ కంటైనర్లను నడిపించే భారీ క్రేన్లు, భారీ బరువులను మోసుకుపోయే వివిధ రకాల సంచార క్రేన్లు, రైల్ ఆధారిత క్రేన్లు, అన్‌లోడర్లు వంటి అన్ని రకాల సామాగ్రిని భారతదేశమే ఈ ఓడరేవుకు సమకూర్చాలి. ఈ ఒప్పంద ప్రయోజనాల ప్రకారం భారతదేశ ఆర్థికవృద్ధికి, అభివృద్ధికి ఈ ఓడరేవు ఎంతోబాగా ఉపయోగపడుతుంది.

ఐపిజిఎల్ 2018లో ఈ ఓడరేవును తన నియంత్రణలోకి తీసుకున్నప్పటినుండీ ఈ లావాదేవీల్లో సరుకు రవాణా 90,000 టిఇయులను, సాధారణ సరుకు రవాణా 8.4మిలియన్ టన్నుల ను దాటింది.

మానవ సహాయం, ప్రాంతీయ అనుసంధానంలో చాబహార్ పాత్ర

మానవ సహాయాన్ని చేరవేయడంలో ప్రత్యేకించి కరోనా మహమ్మారి విజృంభించినకాలంలో చాబహార్ ఓడరేవు ఎంతో కీలకమైన పాత్ర నిర్వహించింది. ఈ ఓడరేవు ద్వారా 2.5 మిలియన్ టన్నుల గోధుమలు, 2,000టన్నుల పప్పుధాన్యాలు, తృణధాన్యాలను భారత్ నుండి ఎంతో సమర్థవంతంగా అఫ్ఘానిస్థాన్‌కు రవాణా చేసింది. అదనంగా 2021లో వ్యవసాయ పంటను ఆశ్రయించి ఉండే క్రిమికీటకాదులను నిర్మూలించగల 40,000 లీటర్ల మీథేన్ పురుగుల మందులను ఇరాన్‌కు తరలించింది. భారత విదేశాంగమంత్రి ఎస్.జైశంకర్ మే 13న ముంబయిలో జరిగిన పత్రికాగోష్ఠిలో ఈ విషయాలు చెప్పారు. ఈ ఓడరేవు రాబోయేకాలంలో ఒక అంతర్జాతీయ రవాణా కారిడార్‌గా వృద్ధి చెందుతుంది. ఇరాన్–రష్యా సంయు క్త నేపథ్యంలో ఈ అభివృద్ధి ముందుకు వెళుతుంది. తద్వారా సెంట్రల్ ఆసియాతో వాణిజ్య సంబంధాలు మరింత పటిష్టం అవుతాయి. ఓమన్ సముద్ర తీరం ముఖద్వారం వద్ద లోతైన సముద్ర జలాలల్లో ఉన్న ఇరాన్‌దేశ మొట్టమొదటి ఓడరేవు ఈ చాబహార్. అంతర్జాతీయ సముద్ర వాణిజ్య మార్గంలో చాలా కీలకప్రాంతంలో ఇరాన్‌కు చెందిన సిస్టాన్–బలూచిస్థాన్ రాష్ట్రంలో ఉంది. అదేవిధంగా పాకిస్థాన్ బలూచిస్థాన్ రాష్ట్రానికి నైరుతీ దిశలో 120 కి.మీ దూరంలో ఉంది. చైనా ఏర్పాటు చేసిన గదర్ ఓడరేవు ఈ ప్రాంతంలోనే ఉంది. అందువల్ల అటు భారత్, ఇటు ఇరాన్ రెండు దేశాలకూ కూడా చాబహార్ వ్యూహాత్మకంగా ఎంతో ప్రాముఖ్యత గల ఓడరేవు. ఇరాన్‌కు సంబంధించి పాశ్చాత్యదేశాలు విధించే ఆంక్షలను తట్టుకుని నిలబడటానికి ఈ ఓడరేవు ఉపయోగపడుతుంది. అదేసమయంలో భారతదేశానికి కూడా పాకిస్థాన్ ఓడరేవులను ఆశ్రయించకుండా అఫ్ఘానిస్థాన్‌కు, సెంట్రల్ ఆసియా దేశాలకు అందుబాటులో ఉండేవిధంగా ఒక ప్రత్యామ్నాయ వాణిజ్య మార్గంగా దోహదపడుతుంది. ఈ ఓడరేవు ప్రాజెక్టులో రెండు వేరు వేరు ఓడరేవులు ఉన్నాయి. షాహిద్ బెహెస్తి, షాహిద్ కాలాంతరి టర్మినల్స్ అని ఈ రెండు ఓడరేవులను పిలుస్తారు. ఒక్కొక్క ఓడరేవులోనూ ఐదు బెర్తులు ఉన్నాయి. ఐతే భారత్ పెట్టుబడులు మాత్రం కేవలం షాహిద్ బెహస్తి ఓడరేవుకు మాత్రమే పరిమితం. తమ 'భారత్–ఇరాన్– చాబహార్' ఓడరేవు ప్రాదేశిక భౌగోళిక రాజకీయాలు' అనే పత్రంలో ఇరాన్‌లోని ఇస్ఫహాన్ యూనివర్సిటీకి చెందిన విద్యావేత్తలు ఒమిది, గౌరీ నూల్కర్‌ఓక్ ఈ విషయాలను పొందుపరిచారు.

భారత్,రష్యా,యూరప్‌లకు ప్రయోజనాలు

ఇక ఈ చాబహార్ ఓడరేవు ప్రాజెక్టు అంతర్జాతీయ ఉత్తరదక్షిణ ప్రాంత కారిడార్ (ఐఎన్‌ఎస్‌టిసి) గా విస్తారమైన రవాణా కార్యకలాపాల నిర్వహణలో భావికాలంలో ఒక మార్గదర్శకమైన పాత్ర పోషించనున్నది. 7,200 కిలోమీటర్ల పరిధిలో దీని కార్యకలాపాలు విస్తరిస్తాయి. సముద్ర మార్గంతోపాటు రష్యాలోని సెయింట్ పీటర్స్‌బర్గ్, భారత్‌లోని ముంబయి నగరాలకు రోడ్లు, రైల్వే మార్గాలు కూడా ఈ ప్రాజెక్టులో అనుసంధానమై ఉన్నాయి. ఈ ఐఎన్‌ఎస్‌టిసి పరిధిలో 13 దేశాలు సభ్యులుగా ఉన్నాయి. భారత్, ఇరాన్, రష్యా, టర్కీ, అజర్‌బైజాన్, కజఖస్థాన్, ఆర్మేనియా, బెలారస్, తజికిస్థాన్, కిర్గిస్థాన్, ఓమన్, ఉక్రేన్, సిరియా దేశాలతోపాటు అదనంగా బల్గేరియా కూడా ఈ ఐఎన్‌ఎస్‌టిసిలో ఒక పరిశీలక భాగస్వామిగా ఉన్నది. ముంబయిలో ఉన్న సరుకుల ఉత్పత్తి ప్రదేశం నుండి ఈ షాహిద్ బెహెస్తి ఓడరేవు ద్వారా ఇరాన్ సహా వివిధ లక్షిత ప్రదేశాలకు ప్రధానంగా సముద్రమార్గంలో వినియోగదారులకు తక్కువ ఛార్జీలకు సరుకు సరఫరాచేసే ఒక వ్యూహాత్మక మార్గంగా ఈ ప్రాజెక్టు దోహదపడుతుంది. ఆ విధంగా కాస్పియన్ సముద్రంలో ఇరాన్‌కు ఉన్న ఓడరేవు బాందర్‌అంజాలీ వరకూ చాబహార్ ఓడరేవు నుండి సరుకులను రహదారిమార్గంలో తరలిస్తారు. అటుపిమ్మట కాస్పియన్ సముద్రం మీదుగా రష్యా ఫెడరేషన్‌లో ఉన్న ఆస్ట్రఖాన్ ఓడరేవుకు కూడా సరుకులను సులభంగా రవాణా చేస్తారు. చిట్టచివరగా ఈ సరుకును ఆస్ట్రఖాన్ ఓడరేవు నుండి రష్యాలో ఉన్న వివిధ ప్రాంతాలకు తరలిస్తారు. అక్కడి నుండి తదుపరి రష్యా రైల్వేమార్గాలను ఉపయోగించడంద్వారా యూరప్‌లోని వివిధ ప్రాంతాలకు కూడా ఈ సరుకులను తరలిస్తారు.

ఈ అంతర్జాతీయ ఉత్తర–దక్షిణ సరుకు రవాణా నడవా (ఐఎన్‌ఎస్‌టిసి)సంపూర్ణస్థాయిలో అందుబాటులోకి వస్తే సరుకు రవాణా తరలింపు సమయం 40శాతం మేరకు తగ్గిపోతుంది. అంటే ప్రస్తుతం 45నుండి 60రోజులపాటు సరుకు రవాణాకు జరుగుతున్న సమయం ఈ చాబహార్ ప్రాజెక్టు ద్వారా తగ్గిపోయి,25 లేదా 30 రోజులకే ఉత్పత్తిస్థానం నుండి వినియోగదారులకు అందుబాటులోకి వస్తుంది. అంతేకాకుండా, విమానం ద్వారా జరిగే సరుకు రవాణా ఖర్చులు కూడా గణనీయంగా ఈ ప్రాజెక్టువల్ల తగ్గిపోతాయి. సూయిజ్ కెనాల్ మార్గం ఉపయోగించినప్పుడు జరిగే ఖర్చులతో పోల్చిచూస్తే ఈ కారిడార్ ద్వారా విమాన రవాణా ఖర్చులు 30 శాతం తగ్గిపోతాయి. *(ఐపిఎ)*

అమెరికా కడుపుమంట!

చాబహార్ ఓడరేవు అభివృద్ధికై ఇరాన్–భారత్ మధ్య కుదిరిన దశవర్ష ఒప్పందంవల్ల 'ఆంక్షల'కు గురయ్యే ప్రమాదం లేకపోలేదని అమెరికా విదేశాంగశాఖ అధికార ప్రతినిధి వ్యాఖ్యానించారు. అమెరికా 2018లో భారత్‌కు ప్రత్యేక మినహాయింపు ఇచ్చింది. ఆ రేవు రెండవదశ అభివృద్ధికై భారత్ పెట్టుబడులకు ఆ మినహాయింపు వర్తిస్తుందా అనే సందేహాలు తలెత్తాయి. భారత్‌కు మినహాయింపులకు వ్యతిరేకం గా అమెరికా నిర్ణయించినట్లయితే ఆ పెట్టుబడులు ఆంక్షల కిందకు వస్తాయి. భారత్ ఆ రేవు అభివృద్ధికి 12 కోట్ల డాలర్ల యంత్రాలు సరఫరా చేస్తుంది; 25 కోట్ల డాలర్లు రుణం ఇస్తుంది. 'ఇరాన్‌పై అమెరికా ఆంక్షలు కొనసాగుతున్నాయి. వాటి అమలును కొనసాగిస్తారు' అన్నారు ఆ ప్రతినిధి.

చాబహార్ ఓడరేవు ఈ ప్రాంతానికి ప్రయోజనకరమని అమెరికాకు నచ్చజెపుతాం అన్నారు భారత విదేశాంగమంత్రి ఎస్.జైశంకర్. అఫ్ఘానిస్థాన్‌కు సహాయం, వాణిజ్యానికి ఆ ఓడరేవు ఉపయోగకరమని లోగడ అమెరికా అంగీకరించింది. అందువల్ల అమెరికా ఇతరులు 'సంకుచిత దృక్పథం' తీసుకోరాదని జైశంకర్ కోల్‌కతాలో అన్నారు.

మాట మార్చిన అమిత్ షా!

బిజెపిలో ఎవరైనా 75 ఏళ్ల వయసు తర్వాత క్రియా శీలక రాజకీయాల నుంచి వైదొలగాల్సిందేనని ఐదేళ్ల క్రితం ప్రకటించిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా అప్పుడు మాట మార్చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ 2025 తర్వాత కూడా రాజకీయాల్లో కొనసాగుతారని ప్రకటించి, పార్టీ అనుసరిస్తున్న ద్వంద్వ ప్రవృత్తికి అద్దం పట్టారు. 2019లో ఓ జాతీయ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో, 75 సంవత్సరాలు నిండిన వారు ఎవరూ ఎన్నికల్లో పోటీ చేయరాదని పార్టీ నిర్ణయించిందని అన్నారు. ఎల్‌కె అద్వానీ, మురళీ మనోహర్ జోషి వంటి అత్యంత సీనియర్ నేతలతోసహా ఈ నిర్ణయం అందరికీ వరిస్తుందని గొప్పగా ప్రకటించారు. పార్టీ తీసుకున్న నిర్ణయంలోమార్పులు ఉండబోవని ప్రకటించారు. కానీ, ఇప్పుడు ఆయన మాట మారింది.కేంద్రంలో మరోసారి బిజెపి ప్రభుత్వం వస్తుందని ఆ పార్టీ నాయకులంతా ధీమా వ్యక్తం చేస్తున్నారు. ప్రధానిగా మోదీ 'హ్యాట్రిక్' తప్పదని అంటున్నారు. అయితే, వచ్చే సంవత్స రం 75 ఏళ్లు పూర్తికానున్న మోదీ, పార్టీ నిర్ణయం ప్రకారం రాజకీయాల నుంచి రిటైర్మెంట్ తీసుకోవాలి. అంటే, ఒకవేళ బిజెపి అధికారాన్ని నిలబెట్టుకుంటే, మోదీ రెండు సం.లు మాత్రమే పదవిలో ఉంటారు. ఆ తర్వాత, మిగతా మూడు సంవత్సరాలు ఆ పదవిని మరొకరికి అప్పగించాలి. కానీ, అద్వానీ, జోషి విషయంలో కఠినంగా ఉన్న అమిత్ షా, ఇప్పుడు మోదీ విషయంలో మాత్రం యూటర్న్ తీసుకున్నారు. 2029వరకూ ప్రధానిగా మోదీ నే ఉంటారని గ్యారంటీ ఇచ్చారు. ఈ ఐదేళ్లలో దేశం మరింత ఉన్నత స్థాయి కి చేరుతుందంటూ ఓ ట్యాగ్ కూడా జత చేశారు. క్రమశిక్షణ, మాటమీద నిలబడడం వంటి లక్షణాలు తమకు తప్ప మరెవరికీ లేవన్నట్టు గొప్పలు చెప్పుకొనే బిజెపి తీర్మానాలు, సూత్రాలు మోదీకి వర్తించవా?

సోషల్ మీడియాలో ఫేక్ వీడియో చక్కర్లు

హైదరాబాద్ పార్లమెంటు నియోజకవర్గం, బహదూర్‌పురాలో ఒక వ్యక్తి రిగ్గింగ్‌కు పాల్పడుతున్న వీడియో ఒకటి సోషల్ మీడియాలో విపరీతంగా ట్రెంట్ అవుతున్నది. ఎంఐఎం కార్యకర్త ఒకరు పోలింగ్ బూత్‌ను తన ఆధీనంలోకి తీసుకొని, ఓటు వేయడానికి వచ్చిన వారికి సిబ్బంది ఇంకుతో గుర్తువేసిన వెంటనే, వెనక్కు పంపుతూ ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్ (ఇవిఎం)లో తానే ఓటు వేస్తున్న దృశ్యాలు ఆ వీడియోలో ఉన్నాయి. భారత ఎన్నికల కమిషన్ (ఇసిఐ) దృష్టికి వెళ్లే వరకూ ఈ వీడియోను షేర్ చేయాలంటూ విజ్ఞప్తిని కూడా ట్యాగ్ చేశారు. అయితే, ఫాక్ట్ చెకింగ్‌లో పరిశీలిస్తే, ఇది 2022లో, పశ్చిమ బఎంగాల్ మున్సిపల్ ఎన్నిలకు సంబంధించిన వీడియోగా తేలింది. దండం మున్సిపాలిటీ 33వ వార్డు, 106వ బూత్‌కు సంబంధించిన ఈ వీడియో అప్పట్లో పశ్చిమ బెంగాల్‌ను కుదిపేసింది. తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి) కార్యకర్త ఈ విధంగా రిగ్గింగ్ పాల్పడ్డాడని అరోపిస్తూ కాంగ్రెస్ ఈ వీడియోను విడుదలు చేసింది. దానికీ, హైదరాబాద్ నియోజకవర్గంలో ఈనెల 13వ తేదీన జరిగిన పోలింగ్‌కు ఎలాంటి సంబంధం లేదు. దేశంలో అత్యంత సున్నితమైన నియోజకవర్గాల్లో ఒకటైన హైదరాబాద్‌లో జరిగినట్టు తప్పుడు ప్రచారం చేయడం వెనుక ఎవరి ప్రమేయం ఉందో ఊహించుకోవడం కష్టం కాదు. హైదరాబాద్ నియోజకవర్గంలో పోటీ బిజెపి, ఎంఐఎం మధ్యే ఉందనేది అందరికీ తెలిసిందే. ఎంఐఎం బూత్ క్యాప్చరింగ్‌కు పాల్పడిందన్న ఆరోపణలు చేయాల్సిన అవసరం బిజెపి తప్ప, మరే ఇతర పార్టీకీ లేదు. ఉద్దేశపూర్వకంగా జరుగుతున్న ప్రచారాలను నమ్మవద్దని అటు పోలీసులు, ఇటు అధికారులు విజ్ఞప్తి చేస్తునే ఉన్నారు. కానీ, దేశవ్యాప్తంగా సోషల్ మీడియా నియంత్రణకు ఎలాంటి చట్టాలు, నిబంధనలు లేకపోవడంతో, ఫేక్ న్యూస్, ఫేక్ వీడియోలు సోషల్ మీడియాకు సంబంధించిన అన్ని ప్లాట్‌ఫామ్స్‌లోనూ హల్‌చల్ చేస్తున్నాయి.



కమ్యూనిస్టు కార్యదీక్షకు దర్పణం
కామ్రేడ్ ఈర్ల నరసింహ

నిబద్ధత కలిగిన కమ్యూనిస్టు నాయకుడు కామ్రేడ్ ఈర్ల నరసింహ మరణించి నేటికి సంవత్సరం. వారి జ్ఞాపకాలు, పోరాటాలు, పార్టీ పట్ల వారి కార్యదీక్ష పార్టీ క్యాడర్ మదిలో నేటికీ మెదులుతున్నాయి. అతి నిరుపేద కుటుంబంలో ఈర్ల నారాయణ, లక్ష్మమ్మ దంపతులకు మొదటి సంతానంగా నరసింహ జన్మించారు. వారు విద్యార్థి దశలో చదువు లో ముందుండేవారు. వారి ప్రాథమిక విద్య ఒకటి నుంచి ఐదు వరకు వెల్గొండ గ్రామంలో, అనంత రం వాగులు, వంకలు దాటుతూ కాలినడకన దాదాపు 7 కిలోమీటర్లు బిజినపల్లికి వెళ్లి ఆరు నుంచి 10 వరకు అక్కడ చదివారు. ఇంటర్ మహబూబ్‌నగర్‌లో, డిగ్రీ జడ్చర్లలో పూర్తి చేశాడు. డిగ్రీ చేస్తున్న కాలంలో ఆర్‌ఎస్‌ఎస్, జన సంఘం తో సంబంధాలు ఏర్పడ్డాయి, కానీ డిగ్రీ పూర్తి చేసుకొని గ్రామానికి వచ్చిన తర్వాత వారి గ్రామంలో వ్యవసాయ కూలీలపై, పేద రైతాంగంపై దొరల దోపిడి వారి పెత్తనం, ఆగడాలు ప్రత్యక్షంగా చూసి చలించిపోయాడు. అప్పుడే వారు పైచదువులకు పోకుండా పక్కకి పెట్టి, రెండు ప్రభుత్వ ఉద్యోగా లు వచ్చినా వాటిని వదులుకొని గ్రామ అభివృద్ధికై పనిచేయాలని నిర్ణయించుకున్నా డు.

కామ్రేడ్ సురవరం సుధాకర రెడ్డి గారి మాటల్లో ఈర్ల నరసింహ గారి స్వగ్రామంలో కామ్రేడ్ లింగారెడ్డి గారి అక్కగారి కొడుకైన కామ్రేడ్ శ్రీనివాస్ రెడ్డి కమ్యూనిస్టు సభ పెడితే అట్టి సభకు ప్రముఖ కమ్యూనిస్టు యోధుడు కామ్రేడ్ నల్లమల గిరి ప్రసాద్ గారు ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఆ సభలో పాల్గొన్న ఈర్ల నరసింహ పార్టీపట్ల ఆకర్షితులైనారు. అనంతరం వారు పాలేరులకు శ్రమకు తగ్గ వేతనాలు ఇవ్వకుండా వాళ్ల తో వెట్టి చేయించుకుంటున్న అక్కడి కమ్మ క్రిస్టియన్ భూస్వాములుపై జీతగాళ్ల పక్షాన కన్నెరజేసి సమ్మెకు పిలుపునిచ్చి సమ్మెను విజయవంతం చేసి పాలేరుల జీతాలను పెంచిన నవయుగ కమ్యూనిస్టు నాయకుడు కామ్రేడ్ ఈర్ల నరసింహ. అక్కడి పెత్తందారులు, సమ్మెను విజయవంతం చేసి పాలేరుల జీతాలు పెంచారనే నెపంతో నరసింహ పై ఎన్నో అక్రమ కేసులు బనాయించి భౌతికంగా వారిపై దాడులు చేశారు. వారితో పాటు ఆ గ్రామ కమ్యూనిస్టు నాయకులపై కూడా నిర్బంధాలు జరిగాయి, అయినా కూడా మొక్కవోని ధైర్యంతో పార్టీ పటిష్టతకు కృషి చేశాడు, గ్రామ ప్రజల్లో కూడా వారి పట్ల విశ్వాసం పెరిగింది, గ్రామ ప్రజలందరూ వారి నాయకత్వాన్ని బలపరుస్తున్న సందర్భంలో గ్రామ పెత్తందారు రెడ్ల నుంచి కూడా ఎన్నో నిర్బంధాలు, ఆటుపోట్లు, భౌతిక దాడులు ఎదుర్కొన్నాడు కానీ వారికి లొంగకుండా అట్టి దాడులకు ఎదురొడ్డి, వారిపై పెట్టిన 40 అక్రమ క్రిమినల్ కేసులను ఎదుర్కొని, పక్క గ్రామలలో కూడ పార్టీ విస్తరణకు కృషి చేశాడు. అనంతరం వేరే మండలాలలో కూడా పార్టీ విస్తరణకు వారు కృషి చేశారు. నేను కూడా వారు నిర్వహించిన అనేక పోరాటాల్లో పాల్గొన్నాను, ప్రత్యేకించి రంగాపూర్ ఫారెస్ట్ భూపోరాటంలో ప్రత్యక్షంగా పాల్గొన్నాను. నా సూచన మేరకు నాగర్ కర్నూలులో ఉన్న జిల్లా పార్టీ ఆఫీసును మహబూబ్‌నగర్‌కు షిఫ్ట్ చేసి అక్కడ పాత భవనాన్ని ప్రజల కాంట్రిబ్యూషన్ తో కొనుక్కొని దాన్ని మరమ్మతులు చేసుకొని పార్టీ కార్యక్రమాలు అక్కడినుంచి నిర్వహించడం, ఇది వారి జిల్లా కార్యదర్శి హోదాలో పెద్ద విజయంగా భావించవచ్చు. వారు జిల్లా కేంద్రంగా చేసుకొని పార్టీ విస్తరణకు జిల్లాలో ముఖ్యమైన పాత్ర పోషించారు. వారు చాలాకాలం గ్రామ సర్పంచ్‌గా కొనసాగారు. వారి భార్య సరోజ కూడా నేటికీ ఎంపిటిసిగా ఉన్నారు. సర్పంచ్ కూడా సిపిఐ కైవసం చేసుకుంది.

17.5.2024
ప్రథమ
వర్ధంతి

కామ్రేడ్ నారాయణ రాష్ట్ర కార్యదర్శిగా ఉన్న కాలంలో నరసింహ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులుగా బాగా పనిచేశారు. జిల్లాలో పేరుందిన ప్రజానాయకుడు గా గుర్తింపు తెచ్చుకున్నారు. అనుకోకుండా గ్రామ ఉత్సవాల్లో నరసింహ పాల్గొన్న సందర్భంలో ఎద్దు తగిలి తలకు బలమైన గాయమై కోలుకోలేక 17.5.2023న మరణించడం అట్టడుగు వర్గాలకు, పార్టీకి తీవ్ర నష్టం కలిగించింది,

జిల్లా పార్టీ సెక్రటరీగా దాదాపు 17 సంవత్సరాలు పనిచేశారు, వారి హయాంలో పార్టీ ప్రజా సంఘాల విస్తరణ, నూతన కేడర్ను నమోదు, గ్రామాల్లో సైద్ధాంతిక రాజకీయ శిక్షణ కేంద్రాల ఏర్పాటు, కొత్త ప్రాంతాలకు పార్టీని విస్తరింపచేయడం వంటివి నిరంతరం జరిగాయి. పాలమూరు అంటే కరువు, ఆకలి చావులు, వలసలు. పెండింగ్ ప్రాజెక్టుల సాధనకై 1980 దశకంలో ఉమ్మడి పాలమూరు జిల్లాలో జరుగుతున్న జల దోపిడీకి వ్యతిరేకంగా, పాలమూరు జిల్లా నీటి వాటాకై ఎల్లూరు నుంచి మహబూబ్‌నగర్‌కు చలో పాదయాత్ర కార్యక్రమం చేపట్టి కలెక్టరేట్‌ను కామ్రేడ్లతో ముట్టడించారు. వైయస్ హయాంలో పాలమూరుకు వరదలు వస్తే రాష్ట్ర పార్టీ కార్యదర్శి నారాయణ గారిని తీసుకొచ్చి, జిల్లా పార్టీ యంత్రాంగాన్ని సమాయత్తం చేసి అక్కడి నిర్వాసితులను ఆదుకొని అండగా నిలిచారు. జిల్లాలో ఎన్నో భూ పోరాటాలు నిర్వహించి పేదలకు భూములు పంచిన కమ్యూనిస్టు ఘనుడు.

జిల్లా కేంద్రంలో వారి హయాంలో నేను పట్టణ కార్యదర్శి గా పనిచేస్తున్న కాలంలో రంజాన్ మాసంలో ముస్లింలకు విందు ఏర్పాటు చేస్తే అక్కడ వారు హిందీ మాట్లాడడం చూసి అందరూ ఆశ్చర్యపోయారు. గొప్ప మనుషులలో కనిపించే అన్ని మంచి లక్షణాలు కామ్రేడ్ ఈర్ల నరసింహలో కనపడతా యి, ఆయనలో నిరాడంబరత, నిస్వార్థం, నిజాయితీ, త్యాగం, సైద్ధాంతిక ఆలోచన, పార్టీ పట్ల క్రమశిక్షణ, సమయపాలన, పారదర్శకత మొదలైన వాటికన్నా గొప్పగా ఆయన వ్యక్తిత్వం రూపుదిద్దుకుంది, తన చివరి శ్వాస వరకు కమ్యూనిస్టు ఎర్ర జెండాను ముద్దాడిన విప్లవ వీర కెరటం మన ఈర్ల నరసింహ.

బి పరమేశ్ గౌడ్
సిపిఐ మాజీ జిల్లా కార్యదర్శి, మహబూబ్‌నగర్

బిపిని నిర్లక్ష్యంచేస్తే ప్రాణాంతక వ్యాధులు!

ఆరోగ్యం

ప్రపంచవ్యాప్తంగా దాదాపు 1.13 బిలియన్లకు పైగా ప్రజలు అధిక రక్త పోటు (హైపర్‌టెన్షన్ లేదా బ్లడ్ ప్రెజర్) రుగ్మతతో బాధ పడుతున్నారని గమనించిన 'వరల్డ్ హైపర్‌టెన్షన్ లీగ్' చొరవతో 2005లో ప్రారంభమై ప్రతి ఏటా 17 మే రోజున 'ప్రపంచ రక్త పోటు దినం' జరుపుకోవడం ఆనవాయితీగా వస్తున్నది. ప్రపంచ రక్త పోటు దినం 2024 వేదికగా 'రక్త పోటును కొలుచుకో, నియంత్రించు, దీర్ఘకాలం జీవించు' అనే నినాదాన్ని తీసుకొని విస్తృత ప్రచారం చేయాలి. రక్త పోటు పెరగడానికి గల కారణాలు, నియంత్రణకు మార్గాలు, రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను చర్చించడానికి ఈ వేదికలను ఉపయోగిస్తారు.

అల్పాదాయ దేశాల్లో సమస్య ఎక్కువ: విశ్వవ్యాప్తంగా మూడింట రెండు వంతుల అల్ప, మధ్యస్థ ఆదాయ దేశాల ప్రజలు రక్త పోటుతో సతమతం అవుతున్నారు. దాదాపు 10 శాతం ప్రజలు బిపీ సమస్యతో బాధ పడుతున్నారని, 2025 నాటికి 25 శాతం ప్రజలకు బిపీ తగ్గించే/నియంత్రించే ప్రయత్నాలు చేస్తున్నామని ఐరాస అంటున్నది. ప్రపంచ బిపీ దినం సందర్భంగా ఉచిత రక్త పోటు నిర్ధారణ పరీక్షలు చేస్తూ, ఈ రుగ్మత పట్ల అవగాహన కలిగించే కార్యక్రమాలు చేపట్టాలి. సాధారణంగా 140/90 వరకు బిపీ ఉన్నపుడు నియంత్రించ వచ్చు. ఆరోగ్యవంతుల బిపి 120/80 ఉండాలని మనకు తెలుసు. రక్త పోటు అధికమైనపుడు తీవ్ర గుండె సమస్యలతో కూడిన అనారోగ్యాలు కలుగుతాయి. ప్రపంచ మరణాల్లో 12.8 శాతం బిపీ సంబంధ సమస్యలతో జరిగినవే అని తేలింది.

రక్తపోటు దుష్ప్రభావాలు: ప్రపంచ రక్త పోటు దినం అవగాహన వేదికలు జనాలను భయపెట్టి, మానసిక ఒత్తిడి పెంచేవి కాదని, ఈ రోజున బిపీ సమస్యకు సంబంధించిన లోతైన విషయ పరిజ్ఞానం అందించడం జరుగుతుందని నమ్మాలి. బిపీని నిర్లక్ష్యం చేసినపుడు గుండె పోటు, కిడ్నీ సమస్యలు, హార్ట్ ఫెయుల్యూర్, చూపు మందగించడం, స్ట్రోక్‌లు లాంటి ప్రాణాపాయ స్థితులు కూడా రావచ్చని తెలుసుకోవాలి. నేడు భారతదేశంలో మూడింట ఒక వంతు ప్రజలకు బిపీ సమస్య ఉందని, పురుషుల కన్న మహిళల్లో అధికంగా ఉండడం గమనించారు. పట్టణ ప్రజల్లో 40 శాతం వరకు, గ్రామీణుల్లో 17 శాతం వరకు నిర్ధారించబడింది. 2016 గణాంకాల ప్రకారం రక్త పోటు కారణంగా 1.63 మిలియన్ల మరణాలు నమోదైనాయని తేలిం ది. 18 25 మధ్య వయస్కుల్లో కూడా 10 శాతం మందికి బిపీ సమస్య ఉండడం విచారకరం. హృదయనాళ సంబంధ రుగ్మతగా బిపీని 'సైలెంట్ కిల్లర్'గా పిలుస్తారు. వయస్సు 60 దాటిన వయోజనులకు బిపీ సమస్యలు అధికంగా కనిపిస్తున్నాయి. భారత్‌లో రక్త పోటు రుగ్మతతో 80 మిలియన్ల ప్రజలు, అనగా ప్రతి ఐదుగురిలో ఒక వయోజనుడు (19 శాతం) బిపీ రుగ్మతతో బాధ పడుతున్నాడు. వీరిలో 15 శాతం చికిత్స తీసుకోవడం, 49 శాతం నియంత్రించలేని బిపీ రోగులు ఉన్నారని తేలింది.



రక్త పోటు కారణాలు/లక్షణాలు: రక్త పోటుకు కారణాలుగా పొగాకు ఉత్పత్తుల వాడకం, మధుమేహం ఉండడం, కొలెస్టరాల్ అధికమవడం, స్థూలకాయం, లవణ అధిక వినియోగం, ఆల్కహాల్ సేవనం, అధిక మానసిక ఒత్తిడి, అనువంశిక కారణం లాంటివి చెప్పవచ్చు. అధిక బిపీకి లక్షణాలుగా తల నొప్పి, దృష్టి దోషం, శ్వాస మందగించడం, ముక్కుల నుండి రక్తం కారడం, ఫాటిగ్యు, న్యూసియా లాంటివి గమనించారు.

తీసుకోవలసిన జాగ్రత్తలు:

బిపీని నియంత్రించడం, రాక ముందే జాగ్రత్తలు తీసుకుంటూ ఆకుకూరలు, బెర్రీస్, పాలు/పెరుగు, ఓట్‌మీల్, అరటి పండ్లు, చేపలు, టమాటో, గోధుమలు, జొన్నలు, గ్రీన్ పీస్, ఉల్లి, పొప్పడి పండు, ఉసిరి, మజ్జిగ, ఓట్స్ లాంటి ఆహార పదార్థాలను అధికంగా తీసుకోవాలి. లవణం, చక్కర, జంక్ ఫుడ్, కొవ్వులను పూర్తిగా తగ్గించాలి. పొగాకు, ఆల్కహాల్, ఉప్పు వాడకాలను కూడా పూర్తిగా తగ్గించాలి. వ్యాయామం, నడక, యోగా, ధ్యానం, 6–7 గంటల నిద్ర ఉండాలి. ఇంటి భోజనాన్ని మాత్రమే తీసుకోవాలి. లిఫ్టుకు బదులు మెట్ల మార్గాన్ని ఆశ్రయించాలి.

ప్రతి ఏటా ఇండియాలో దాదాపు 10 మిలియన్ల మరణాలు బిపీ సంబంధ కారణాలతో జరుగుతున్నాయి. బిపీ అంటువ్యాధి కాదని, మన అలవాట్లతో నివారించడం, నియంత్రించడం చేయవచ్చని తెలుసుకోవాలి. బిపీ రాకుండా పరిపూర్ణమైన జీవనశైలిని పాటిస్తూ, రక్తపోటు సమస్య లేని భారతాన్ని నిర్మించుటలో మనందరం సహకరిద్దాం.

ఎన్నికలు, గ్రూప్–1లకు పటిష్ట ఏర్పాట్లు

ఎన్నికల ప్రవర్తనా నియామవళి అమలు

ఫ్లైయింగ్ స్క్వాడ్ పర్యవేక్షణ కొనసాగించాలి

సూర్యాపేట కలెక్టర్ వెంకట్రావ్

ప్రజాపక్షం/సూర్యాపేటకలెక్టరేట్ : ఈ నెల 27న జరగనున్న వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల ఎన్నికకు, జూన్ 9న జరిగే గ్రూప్ 1 పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్. వెంకట్రావ్ తెలిపారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో నోడల్ అధికారులు, తహసీల్దారు, ఆర్డీవోలు, జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో జిల్లా ఎస్పీ రాహుల్‌హెగ్డే, అదనపు కలెక్టర్ లోకల్‌బాడీ సిహెచ్ ప్రియాంకతో కలసి కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ నిర్వహణపై అధికారులకు కలెక్టర్ ఆదేశాలు జారీచేశారు. శాసనమండలి ఎన్నికలకు 52 మంది అభ్యర్థులు బరిలో ఉన్నరని, పట్టభద్రుల ఎన్నికల నిర్వహణకు 142 జంబో బ్యాలెట్ బాక్సులు శ్రీ సత్యసాయి జిల్లా నుండి తెప్పించడం జరుగుతుందని తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికలకుగాను సూర్యాపేటలో 31 పోలింగ్ కేంద్రాలు,కోదాడలో 22 పోలింగ్ కేంద్రాలు, హుజూర్‌నగర్‌లో 18 పోలింగ్ కేంద్రాలు మొత్తం 71 పోలింగ్ కేంద్రాలలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలో మొత్తం 51,947 మంది పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారని తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందని తెలిపారు. ఎఫ్ఎస్‌టి ఫ్లయింగ్ స్క్వాడ్ పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. పోలింగ్ సిబ్బందికి మాస్టర్ ట్రైనర్లచే సిబ్బందికి శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. జూన్ 9న జరిగే గ్రూప్ 1 పరీక్షలకు జిల్లాలో 40 సెంటర్‌లలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. 9744 మంది అభ్యర్థులు పరీక్షలు రాయనున్నారని కలెక్టర్ తెలిపారు. వీరికి అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లా ఎస్పీ రాహుల్‌హెగ్డే మాట్లాడుతూ జిల్లాలో జరిగే గ్రూప్ 1 పరీక్షలకు అన్ని కేంద్రాలలో బందోబస్తుకు పోలీస్ సిబ్బందిని కేటాయించినట్లు తెలిపారు. పరీక్షా కేంద్రంలోకి మొబైల్ ఫోన్స్ అనుమతిలేదని, అన్ని కేంద్రాల వద్ద సిసి కెమెరాలు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ఆర్టీసీ, విద్యుత్ శాఖ, రోడ్ల భవనాలశాఖలు తమ పూర్తి సహకారం అందించాలన్నారు. పట్టభద్రుల ఎన్నికలలో ఎఫ్ఎస్‌టిలు పనిచేస్తాయని ఈ ఎన్నికలకు జిల్లా ఫోర్స్‌ను ఏర్పాటు చేస్తున్నామని ఎస్పీ పేర్కొన్నారు. కార్యక్రమంలో మాన్‌పవర్ మేనేజ్‌మెంట్ నోడల్ అధికారి వివి అప్పారావు, బ్యాలెట్ సక్సెస్ నోడల్ అధికారి డిపివో సురేష్‌కుమార్, ట్రైనింగ్ మేనేజ్‌మెంట్ నోడల్ అధికారి శ్రీధర్‌రెడ్డి, పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి, మత్స్యశాఖ అధికారి రూపేందర్ సింగ్, వెహికల్,ట్రాన్స్‌పోర్ట్ నోడల్ అధికారి ఆర్డీవో సురేష్‌రెడ్డి, ఎంసిసి నోడల్ అధికారి డిఎఫ్‌వో సతీష్‌కుమార్, ఎక్స్పెంచర్ మానిటరింగ్ నోడల్ అధికారి ఎస్.పద్మ, ఎంసిఎంసి నోడల్ అదిఆరి డిపిఆర్‌వో ఏ.రమేష్‌కుమార్, ఎల్కక్టోరోల్స్ మోడల్ అధికారి శ్యాం సుందర్‌ప్రసాద్,అబ్జర్వేషన్ మోడల్ అధికారి లక్ష్మణనాయక్,పిడబ్ల్యూడి నోడల్ అధికారి వెంకటరమణ, మాస్టర్ ట్రైనర్స్ వి. రమేష్, వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, ఎన్నికల సూపరిండెంట్ శ్రీనివాసరాజు, వేణు, రమేష్, గ్రూప్ 1 పరీక్షల సూపరిండెంట్ పద్మారావు, కలెక్టరేట్ ఏవో మందడి సుదర్శన్‌రెడ్డి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు

తీన్మార్ మల్లన్నను గెలిపించాలి : ఎమ్మెల్యే జైవీర్

ప్రజాపక్షం/హాలియా : కాంగ్రెస్ పట్టభద్రుల ఎంఎల్‌సి అభ్యర్థిగా పోటీ చేస్తున్న తీన్మార్ మల్లన్న గెలిపించాలని సాగర్ ఎంఎల్ఏ కుందూరు జైవీర్ రెడ్డి, మాజీ సీఎల్పీ నేత కుందూరు జానారెడ్డిలు అన్నారు. గురువారం హాలియాలోని లక్ష్మీనరసింహ ఫంక్షన్ హాల్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పట్టభద్రులతో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలతో పాటు రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు చెప్పారు. అనంతరం తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ పట్టభద్రుల ఎంఎల్‌సి అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. నిరుద్యోగ యువత కోసం తనవంతు కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న వివిధ సంక్షేమ కార్యక్రమాలతో పాటు ఉద్యోగ అవకాశాలు కూడా భారీగా కల్పించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పిసిసి కార్యదర్శి కొండేటి మల్లయ్య, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కుందూరు వెంకటరెడ్డి, హాలియా మున్సిపల్ చైర్ పర్సన్ ఎడవెల్లి అనుపమ నరేందర్ రెడ్డి, మండల ఉపాధ్యక్షురాలు మాల అరుణ, జడ్పిటిసి సభ్యుడు కృష్ణారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుమ్మలపల్లి శేఖర్ రెడ్డి, ఎడవల్లి రంగసాయిరెడ్డి, హాలియా పట్టణ అధ్యక్షుడు వెంపటి శ్రీనివాస్, గౌని రాజా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పనిచేసే వాళ్లకే పట్టం కట్టండి

ప్రజాపక్షం/చందంపేట : వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నిక ఈనెల 27న జరగనున్న తరుణంలో పని చేసే వాళ్లకే పట్టం కట్టాలని పిసిసి సభ్యులు, పిఏసిఎస్ చైర్మన్ జాలే నర్సింహారెడ్డి పట్టభద్రులను కోరారు. గురువారం దేవరకొండలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారంలో లేనప్పుడు తీన్మార్ మల్లన్న ఎంతో మంది పేద ప్రజలకు విద్యార్థులకు న్యాయం చేయడం జరిగిందని, యువత పట్ల మల్లన్న చేసిన పోరాటాలు ఎనలేనివని అన్నారు. గతంలో జరిగిన ఎంఎల్‌సి ఎన్నికల్లో పల్లా రాజేశ్వర్‌రెడ్డి దొంగ ఓట్లతో గెలవడం జరిగిందని, కాంగ్రెస్ పార్టీ తరుపున తీన్మార్ మల్లన్న మరల మన ముందుకు వచ్చిన తరుణంలో పట్టభద్రులు ఈనెల 27న జరిగే పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఆయన కోరారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి

మాజీ ఎమ్మెల్యే తిప్పన

ప్రజాపక్షం/మిర్యాలగూడ: రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి అన్నారు. గురువారం బీఆర్ఎస్ అధినేత కెసిఆర్ పిలుపు మేరకు పట్టణంలోని గాంధీ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేసి గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందచేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో తిప్పన విజయసింహారెడ్డి మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలు ముగియగానే కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసే పని పెట్టుకుందన్నారు. రైతులు పండించిన ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తామని చెప్పి ఇప్పుడు కేవలం సన్న రకం ధాన్యానికే రూ.500 బోనస్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించడం దారుణమన్నారు. తెలంగాణాలో 90శాతం మంది రైతులు దొడ్డురకం ధాన్యాన్నే పండిస్తారని, ఈ విషయం తెలిసి కూడా ప్రభుత్వం ఇలాంటి ప్రకటన చేయడమేంటన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం రైతులు పండించిన అన్నిరకాల వరి ధాన్యానికి బోనస్ రూ.500 ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డిసిఎంఎస్ చైర్మన్ దుర్గంపూడి నారాయణరెడ్డి, జెడ్‌పిటిసి ఆంగోతు లలితహతీరాం, నాయకులు పెండ్యాల పద్మ, అమరావతి సైదులు, చిట్టిబాబునాయక్, యడవెల్లి శ్రీనివాస్‌రెడ్డి, మోసిన్‌అలీ, పాలుట్ల బాబయ్య, నామిరెడ్డి కరుణాకర్‌రెడ్డి, వెలిశెట్టి రామకృష్ణ, అబ్దుల్ కరీం, పునాటి లక్ష్మి నారాయణ, తలకోన శ్రీధర్‌రెడ్డి, సాధినేని శ్రీనివాస్, చాంద్‌పాషా, మన్నెం శ్రీనివాస్‌రెడ్డి, పశ్యా శ్రీనివాస్‌రెడ్డి, అంజన్‌రాజు, గుడిసె దుర్గాప్రసాద్, గంటా శ్రీనివాస్ రెడ్డి, అంజయ్య, కోదాటి రమా తదితరులు పాల్గొన్నారు.

ట్రాలీ ఆటో బోల్తా.. కూలీలకు తీవ్ర గాయాలు

ప్రజాపక్షం / అయిజ : కూలీలతో వెళ్తున్న ట్రాలీ ఆటో అదుపు తప్పి బోల్తా పడిన ఘటన అయిజ పట్టణ కేంద్రంలో చోటు చేసుకుంది వివరాల్లోకి వెళితే అయిజ పట్టణంలోని వల్లూరు పేట, మ్యాకలపేటకు చెందిన సుమారు 30 మంది కూలీలు ఎల్లస్వామి అనే రైతు పొలానికి వెంకటేష్ ట్రాలీ ఆటోలో బయలు దేరారు ఈ క్రమంలో పొలానికి సమీపంలో గద్వాల రోడ్డు కట్టకింద తిమ్మప్ప స్వామి దగ్గర అదుపు తప్పి బోల్తా పడింది ఈ ప్రమాదంలో సుమారు 8 నుండి 10 మందికి తీవ్రగాయాలు అయ్యాయి ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది వీరిని స్థానికులు సమీపంలోని బ్రహ్మారెడ్డి ఆసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్స అందించారు. తీవ్ర గాయాలు అయినటువంటి వారిని మాస్టర్ శెక్షావలి అంబులెన్స్‌ను పిలిపించి కర్నూల్ ఆసుపత్రికి తరలించారు. ఈ విషయమై కూలీలు ఎక్కువ మంది ఆటోలో ఎక్కడం ఒక కారణం మరియు ఆటో డ్రైవర్ అతివేగమే ప్రమాదానికి కారణమై పల్టీలు కొడుతూ చాలా దూరం ఈడ్చుకొని వెళ్ళిందని బోరునవిలపించారు. ఈ విషయపై పోలీసులు సంఘటన స్థలాన్ని సందర్శించారు.దీనిపై దర్యాప్తు చేపట్టారు.

గుడిసెలు తొలగింపు అన్యాయం

ప్రజాపక్షం/సూర్యాపేట : ప్రభుత్వ భూమిలో పేదలు వేసుకున్న గుడిసెలను అధికారులు తొలగించడం అన్యాయమని బాధితులు గురువారం విలేకర్లతో అన్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రం 20వ వార్డు జమ్మిగడ్డ పుల్లారెడ్డి చెరువు శిఖం భూమిలో గత కొన్ని ఏళ్లుగా ఇండ్ల కోసం పోరాటం చేస్తున్నట్లు వారు తెలిపారు. డబుల్‌బెడ్ రూం ఇండ్లు ఇస్తానని చెప్పి గత ప్రభుత్వం పట్టించుకోలేదని వారు ఆరోపించారు. ఊరికి వెళ్లింది చూసి అధికారులు గుడిసెలను తొలగించారని పేర్కొన్నారు. కూలీనాలి చేసుకుని బతుకులు గడుపుతున్న బైండ్ల కులస్తులు వేల దబ్బులతో పుల్లారెడ్డి చెరువు శిఖం భూమిలో నిర్మాణం చేసుకున్న గుడిసెలను చెప్పకుండా నేలమట్టం చేయడంతో ఆవేదన వ్యక్తం చేశారు. కిరాయి ఇండల్లో ఉండలేని పరిస్థితిలో పేదలు 15 కుటుంబాలు ఇటువంటి నిర్ణయం తీసుకుని ముందుకు వెళ్లినట్లు వారు తెలిపారు. మాజీమంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి వద్దకు వెళ్లి కూడా మొరపెట్టుకున్నట్లు వారు పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పేదలు వేసుకునే గుడిసెలకు సహకరించాలని వారు కోరారు. కార్యక్రమంలో రవి, నాగరాజు, శివ, వెంకన్న, జనార్ధన్, రాము, అఖిల్, కీర్తి, జ్యోతి, విజయలక్ష్మీ , నాగమణి, చంద్రకళ పాల్గొన్నారు.

పట్టుదలతో పనిచేస్తే విజయం మనదే

ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి

ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్ : ఉద్యోగులు, యువతను కాంగ్రెస్ ప్రభుత్వం దారుణంగా మోసం చేసిందని, మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలనే కృతనిశ్చయంతో యువత, ఉద్యోగులు ఉన్నారని మాజీ మంత్రి, సూర్యాపేట శాసనసభ్యులు గుంటకంట్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. నల్లగొండ, వరంగల్,ఖమ్మం ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి సూర్యాపేట జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన జిల్లా ముఖ్య నేతలతో గురువారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఎన్నికల ప్రచారంలో అనుసరించాల్సిన విధి విధానాలపై శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. బిఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేష్‌రెడ్డి విజయానికి కావాలసిన సానుకూల వాతావరణం నియోజక వర్గంలో ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని సిద్ధంగా ఉన్న ప్రతి ఓటరు కలవాలని సూచించారు. పార్లమెంట్ ఎన్నికల తరహాలో వారం రోజులు బిఆర్ఎస్ శ్రేణులు ప్రజాక్షేత్రంలో కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు.మన పని విధానమే మన విజయానికి నాంది అని తెలిపారు. సిట్టింగ్ స్థానాన్ని బిఆర్ఎస్ నిలబెట్టుకోవడం ఖాయమన్నారు.

పొలంలో వ్యర్థాలు తగులబెట్టొద్దు

ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి : పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా పరిధిలోని 400 కేవి విద్యుత్ లైన్ల కింద పంట మిగులును తగులబెట్టవద్దని పవర్ గ్రిడ్ కార్పోరేషన్ చీఫ్ మేనేజర్ పవన్ కుమార్ ఒక ప్రకటనలో రైతులకు సూచించారు. విద్యుత్ లైన్ల కింద పంటలు పండించే రైతులు చేనులో మిగిలిన చెత్తను కాల్చివేసే క్రమంలో మంటలు చెలరేగి ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందన్నారు. మానకొండూర్ మండలంలోని అన్నారం, చెంగర్ల, దేవంపల్లి, రంగపేట, పోచంపల్లి, లలితాపూర్, ముంజుంపల్లి, పచ్చునూరు, వేగురుపల్లి, వెల్ది గ్రామాలు, చిగురుమామిడి మండలంలోని చిగురుమామిడి, ఇందుర్తి, ముదిమాణిక్యం, ముల్కనూర్, నవాబుపేట, పీచుపల్లి, సుందరగిరి గ్రామాలు, తిమ్మాపూర్ మండలంలోని పోలంపల్లి, పోరండ్ల గ్రామాల పరిధిలో విద్యుత్ లైన్ల కింద పంట సాగు చేసే రైతులు ఎక్కువగా ఉన్నారని తెలిపారు. విద్యుత్ లైన్ల కింద మంటలు పెడితే కరెంటు సరఫరాకు అంతరాయం కలుగుతుందని, సమీపంలోని జంతువులు, మానవులకు హాని జరిగే ప్రమాదం ఉందంటున్నారు. రైతులు గమనించి ఎట్టి పరిస్థితుల్లో విద్యుత్ లైన్ల కింద మంటలు పెట్టవద్దని కోరారు.

జపాన్ పర్యటనకు అల్ఫోర్స్ విద్యార్థిని

ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి : కరీంనగర్ జిల్లా కేంద్రంలోని అల్ఫోర్స్ గ్రూప్ స్కూల్స్‌కు చెందిన ఎం. పూజశ్రీ జపాన్‌లోని సకుర పర్యటనకు అవకాశం పొందింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన సభలో అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ వి.నరేందర్ రెడ్డి హాజరై మాట్లాడారు. విద్యార్థులకు ప్రపంచ ప్రమాణాలకు ధీటుగా అపూర్వ అనుభవం కలిగిన ఉపాధ్యాయులచే చాలా అత్యుత్తమ విషయాలు బోధించడం జరుగుతుందని చెప్పారు. అందుకు అనుగుణంగా చాలా అద్భుతమైన ఫలితాలు సాధించడం జరుగుతుందని చెప్పారు. అద్భుతమైన విజయాలలో భాగంగా పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్‌లోని అల్ఫోర్స్ స్కూల్ ఆఫ్ జెన్‌నెక్స్ట్ విద్యార్థిని ఎం.పూజశ్రీ జాతీయ స్థాయి ఇన్స్పైర్ అవార్డు తను ప్రదర్శించిన వీల్ ఆక్సిల్ కెమెరా ఆకట్టుకున్నదని, సృజనాత్మకంగా తయారు చేయబడినదని న్యాయనిర్ణేతలు తెలిపారని చెప్పారు. జాతీయ స్థాయిలో అత్యుత్తమ ప్రదర్శనకు గాను జపాన్‌లోని సకురలో పాల్గొనే అవకాశం పొందిందని హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థిని రూపొందించిన నమూనా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పరిశీలించి అభినందించడం జరిగిందన్నారు. భారతదేశం తరపున మే 19 నుంచి 25వరకు సకురలో పలువురు ఖ్యాతిగాంచిన శాస్త్రవేత్తల ప్రత్యక్ష పర్యవేక్షణలో ప్రదర్శన ఇవ్వబోతున్నదని, ఇంతటి ప్రతిష్టాత్మక అవకాశాన్ని పొందిన తెలంగాణ నుంచి రెండో విద్యార్థిని అని చెప్పారు. విద్యార్థిని ఎంపిక పట్ల పెద్దపల్లి డిఇవో మాధవరి, డిఎస్‌వో రవినందర్‌రావు, పలువురు సైన్స్ ఉపాధ్యాయులు అభినందించారు. పర్యటనకు బయలుదేరే విద్యార్థినికి పుష్పగుచ్ఛాని అందజేసి విదేశాలలో సైతం ఘన విజయం సాధించాలని ఆకాంక్షించారు.

సబ్సిడీపై జీలుగ విత్తనాలు

డిఏఓ అనురాధ వెల్లడి

ప్రజాపక్షం/యాదాద్రి కలెక్టరేట్ : రైతులకు జీలుగ విత్తనాలను సబ్సిడీపై అందజేస్తున్నామని రైతులు వినియోగించుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ చెప్పారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై పచ్చి రొట్ట అందిస్తుందని తెలిపారు. తొలకరి వర్షాలు పడిన వెంటనే వరి వేసుకునే నెలలో రెండున్నర ఎకరాలకు 30 కిలోల చొప్పున ఎకరానికి 12 కిలోలు విత్తనాలను నేల లో వెదజల్లాలని, 25 నుండి 30 రోజులకు పంట పూతదశకు వస్తుందని వివరించారు.నాటు వేసుకునే ముందు ఈ పచ్చి రొట్ట పైరును భూమిలో కలియదున్నాలని, పచ్చి రొట్ట పైరు వేసుకోవడం వలన భూసారం బాగా పెరుగుతుందని, చవుడు నేలల్లో వేసినట్లయితే చౌడు తగ్గిపోతుందని, ఒక ఎకరానికి 10 టన్నుల పశువుల పెంట పోసినంత బలం భూమికి లభిస్తుందని తెలిపారు. అదేవిధంగా జీలుగ విత్తనాల 30 కిలోల సంచికి రూ.2,790 ఉంటుందని దీనిలో సబ్సిడీ రూ.1,674 పోను మిగతా రూ.1,116 రైతు చెల్లించవలసి ఉంటుందని అన్నారు. ఇక జనుము 40 కిలోల సంచి మొత్తం ధర రూ.3,620 ఉంటుందని అందులో సబ్సిడీ రూ.2,172 పోను రూ.1,448 రైతు చెల్లించి కొనుగోలు చేయాలని సూచించారు. అంతేకాకుండా పిల్లిపిసర 20 కిలోల సంచి రూ.2,710 ఉండగా సబ్సిడీ రూ.1,626 పోను మిగతా రూ.1,084 రైతు చెల్లించవలసి ఉంటుందని చెప్పారు. ఈ విత్తనాలు జిల్లాలోని అన్ని కోఆపరేటివ్ సొసైటీలలో లభిస్తాయని, రైతులందరూ పచ్చిరొట్ట విత్తనాలను తమ పొలాలలో వరి వేయి పొలంలో తప్పకుండా వేసుకోవాలని ఈసందర్భంగా రైతులకు సూచించారు.

సేంద్రీయ వ్యవసాయంపై రైతులకు అవగాహన

శాస్త్రవేత్తలు, అధికారులకు కలెక్టర్ సూచన

ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి : వ్యవసాయ రంగంలో రోజురోజుకూ వస్తున్న అధునాతన పద్ధతులపై వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. అధిక దిగుబడులు, మంచి లాభాలు సాధించేలా వారికి తర్ఫీదు ఇవ్వాలని పేర్కొన్నారు. కృషి విజ్ఞాన కేంద్రం స్వర్ణోత్సవాలను పురస్కరించుకుని ఢిల్లీలోని భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి నుంచి వచ్చిన టార్చ్‌ను గురువారం కరీంనగర్ కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా వారిని అభినందించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ కృషి విజ్ఞాన కేంద్రాలు ప్రారంభమై 50 సంవత్సరాలు గడిచిందని పేర్కొన్నారు. ఈ మేరకు స్వర్ణోత్సవాలను పురస్కరించుకుని ఢిల్లీ నుంచి వచ్చిన టార్చ్‌ను అధికారులు పరిశీలన కోసం వివిధ జిల్లాలకు తీసుకెళ్తున్నారని తెలిపారు. శాస్త్రవేత్తలు, అధికారులు సేంద్రీయ వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పిస్తూ ప్రోత్సహించాలని సూచించారు. ఈ పద్ధతి వల్ల కలిగే లాభాలను వివరించాలని పేర్కొన్నారు. రైతులకు ఎప్పటికప్పుడు పంటల సాగులో సూచనలు, సలహాలు అందించాలని తెలిపారు. వారి ఆర్థిక అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలని, రైతులకు నష్టపోకుండా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పేర్కొన్నారు. రైతులకు పంటల సాగులో ఏ ఇబ్బంది వచ్చినా వ్యవసాయ అధికారులు అందుబాటులో ఉండి వాటిని పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాస్, కెవికె ప్రధాన కార్యదర్శి విజయగోపాల్ రెడ్డి, కెవికె సీనియర్ శాస్త్రవేత్త వెంకటేశ్వర్‌రావు, ఏడిఏ రణధీర్ రెడ్డి, శాస్త్రవేత్తలు ప్రభాకర్, ప్రశాంతి, విజయ్, వేణుగోపాల్, మహేష్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులున్నారు.

రైతు వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న ప్రభుత్వం

ఎమ్మెల్యే గంగుల కమలాకర్

ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి : కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా రైతు వ్యతిరేక విధానాలు అవలంబిస్తోందని కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. గురువారం కరీంనగర్‌లోని ఆయన నివాసంలో రాష్ట్ర శాఖ పిలుపు మేరకు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కమలాకర్ మాట్లాడుతూ, డిసెంబర్ 9న రుణమాఫీ అని సీఎం రేవంత్ రెడ్డి చెప్పినప్పటికీ ఇప్పటికీ దిక్కులేదన్నారు. రైతుబంధు, రైతు భరోసా ఇచ్చే పరిస్థితి లేదన్నారు. చత్తీస్‌ఘడ్ తరహాలో ఎకరాకు 500 బోనస్ ఇస్తామని రైతులకు ఎన్నికల్లో హామీ ఇచ్చి విస్మరించారన్నారు. బోనస్ విషయంలో ప్రభుత్వం పునరాలోచించాలన్నారు. క్వింటాలు వడ్లకు రూ.2200 మద్దతు ధరతో పాటు రూ.500 బోనస్‌ను బేషరతుగా అందించాలన్నారు. ప్రభుత్వం ప్రతి రైతుకు ఓపిఎంఎస్ ద్వారా బోనస్ ఇవ్వాలన్నారు. రైతు ప్రభుత్వమని చెబుతున్న కాంగ్రెస్ పార్టీ తడిసిన ధాన్యాన్ని, మొలకెత్తిన వాటిని పూర్తిస్థాయిలో కొనుగోలు చేయాలన్నారు. బోనస్ విషయంలో ప్రభుత్వం పునరాలోచించకపోతే రైతుల పక్షాన ఉద్యమాలు తప్పవన్నారు. మేయర్ సునీల్ రావు, బిఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ తదితరులున్నారు.

ధాన్యం కొనుగోలు చేయాలని రైతుల ధర్నా

ప్రజాపక్షం/ రామన్నపేట: మండల వ్యాప్తంగా ధాన్యం కొనుగోలు పూర్తి చేసి రైతుల సమస్యలను పరిష్కరించాలని సిపిఎం, రైతుసంఘం ఆధ్వర్యంలో రైతులతో కలిసి తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అధికారులు స్పందించకపోవడంతో రోడ్లపై బైఠాయించి ఆందోళన చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్‌రెడ్డి, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జల్లెల పెంటయ్యలు మాట్లాడుతూ మండలంలో 26 కేంద్రాల్లో ధాన్యం రాశులు పోసి రెండు నెలలు గడుస్తున్నా ఇప్పటికీ పూర్తి కాకపోవడంతో రోజుల తరబడి రైతులు పడిగాపులు కాయాల్సి వస్తుందన్నారు ఇటీవల కురిసిన వర్షానికి ధాన్యం తడిసి మొలకెత్తి రంగు మారడంతో రైస్ మిల్లులు కొనడం లేదన్నారు. రామన్నపేటలో రైస్ మిల్లుల పరిమితి పూర్తికావడంతో లారీల కొరత ఏర్పడి రోజుల తరబడి ధాన్యం కుప్పల వద్ద కాపలా కాయాల్సి వస్తుందన్నారు. పట్టాల కిరాయి పెరిగి ఆర్థిక భారం మోయాల్సి వస్తుందన్నారు. యుద్ధ ప్రాతిపదికన ధాన్యం కొనుగోలు చేయాలని, లేనిపక్షంలో కలెక్టరేట్ ముందు వేలాది మందితో ధర్నా నిర్వహిస్తామన్నారు. రైతులు చేస్తున్న ధర్నా వద్దకు స్థానిక తహసీల్దార్ లాల్ బహదూర్, ఎపిఒ, పిఎసిఎస్, సిఇఒ వచ్చి సంబంధిత అధికారులతో మాట్లాడి నాలుగు రోజుల్లో కొనుగోలు పూర్తి చేస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, సింగిల్ విండో వైస్ ఛైర్మన్ అంబటి ఉపేంద్ర, రవీందర్‌రెడ్డి, రైతు సంఘం మండల అధ్యక్షుడు గన్నెబోయిన విజయభాస్కర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బ్యాంక్‌లోన్ ఇస్తామని డబ్బులు కాజేసిన చేసిన సైబర్ నేరగాళ్ళు



ప్రజాపక్షం/రాజోలి : సైబర్ మోసాలపై ఎన్నోమార్లు పోలీసు శాఖ, ప్రభుత్వం అప్రమత్తంగా ఉండాలని చెప్పిన ఏదో ఒక చోట ప్రజలు మోసపోతూనే ఉంటారు. అలస్యంగా వెలుగులోకి వచ్చిన ఓ సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. అలంపూర్ తాలూకాలోని రాజోలి మండలం మాన్‌దొడ్డి గ్రామానికి చెందిన జీవరత్నంకు కొద్ది రోజుల క్రితం బ్యాంకు నుండి మాట్లాడుతున్నామని సైబర్ నేరస్తుడు ఫోన్ చేశాడు. బ్యాంకు టెక్నికల్ బృందం మాట్లాడుతున్నాము లైన్లో ఉండండి అంటూ చెప్పడంతో బ్యాంకు వారే ఫోన్ చేస్తున్నారు అని నమ్మాడు బాంకు నుండి మీకు 4 లక్షలు లోన్ ఇస్తాము అంటూ మా ఖాతా బుక్, పాన్‌కార్డు,మీ ఫోటో,ఆధార్ కార్డు వాట్సాప్‌కి పంపండి అంటూ చెప్పడంతో మాయ మాటలు నమ్మి అన్నీ డాక్యుమెంట్లు పంపించాడు 10 రోజులుగా సుమారు 55వేల 550 రూపాయలు ఫోన్‌పే ద్వారా పంపించాడు. మరోసారి రూ.15 వేలు కావాలంటూ పలుమార్లు డిమాండ్ చేయడంతో తాను మోసపోయానని తెలుసుకున్న ఆయన ఈ నెల 14న సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ విషయమై వ్యక్తిగత వివరాలు అపరిచితులతో పంచుకోవద్దని ఫోన్‌లలో ఓటిపి, పెటియం, గూగుల్ పే, ఫోన్‌పే, ఇకెవైసి, అప్‌డేట్ చేయమని వచ్చే మెసేజ్‌లను నమ్మవద్దని సైబర్ నేరాలకు గురైనప్పుడు 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు వెంటనే డయల్ చేయాలని రాజోలి ఎస్సై జగదీశ్వర్ తెలిపారు.

SHRIRAM Finance
వాహనముల బహిరంగ వేలం ప్రకటన
సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా ఈ క్రింది వాహనములు వాయిదాలు సకాలంలో చెల్లించని కారణంగా స్వాధీన పరుచుకున్న వాహనములు ఉన్నవి ఉన్నట్లుగా వేలం ద్వారా విక్రయించుటకు నిర్ణయించనైనది.

S.No	VEHICLE NO	Customer Name	MAKE & MODEL	YEAR
1	TS25T 2024	SUDHAKAR BOTLA	TATA ACE MEGA	2017
2	AP36TA 0692	CHIRANJEEVI BOJJA	TATA ACE	2011
3	TS27F 3440	RAMESH VASAM	EICHER 380	2021
4	TS07UB 8429	SAMBARAJU BANDARI	MARUTHI DZIRE TOUR DIESEL-P	2016

VENUE : SHRIRAM AUTOMALL INDIA LTD, PUNNEL CROSS ROAD, BOLLIKUNTA, WARANGAL
గమనిక : ప్రకటన తేది నుండి బండి అమ్ముడు అయ్యే వరకు వర్తించును
SHRIRAM FINANCE LIMITED,
H.No :15-1-237, Shop No.1, 2 & 3, 2nd Floor, Warangal City Center,
Opp : L B College, Mulugu Road , Cell : 9959090723

మధుకు మంత్రి సీతక్క పరామర్శ

ప్రజాపక్షం/ములుగు జిల్లా ప్రతినిధి: ఎన్నికల విధులు నిర్వర్తిస్తూ ప్రమాదంలో గాయపడి హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో చికిత్స పొదుతున్న పోరిక మధుకుమార్‌ను మంత్రి సీతక్క, మహబూబాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరాంనాయక్‌లు గురువారం పరామర్శించి ఆయన ఆరోగ్య పరిస్థితిని డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన చికిత్స అందించాలని డాక్టర్‌ను ఆదేశించారు.

స్ట్రాంగ్ రూమ్ పరిశీలన

ప్రజాపక్షం/ వరంగల్ ప్రతినిధి: వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డులోని స్ట్రాంగ్ రూమ్‌లను గురువారం రిటర్నిం గ్ అధికారి, వరంగల్ జిల్లా కలెక్టర్ ప్రావిణ్య సందర్శించారు. వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించిన ఎన్నికల లో వినియోగించి భద్రపరిచి ఈవీఎంలు, ఎన్నికల సామాగ్రిని, స్ట్రాంగ్ రూమ్‌లకు సంబంధించిన లాగ్ బుక్, స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద ఉన్న సీసీ కె మెరాలపర్యవేక్షణకు సంబంధించినవాచ్‌రూమ్‌ను కలెక్టర్ పరిశీలించారు.

పిడుగుపాటుతో పది మేకలు మృతి

ప్రజాపక్షం/పాపన్నపేట: పిడుగు పాటుతో పది మేకలు మృతి చెందిన సంఘటన పాపన్నపేట మండల పరిధిలో అరేపల్లిలో గురువారం చోటుచేసుకుంది. బాధితుడు స్థానికుల సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. అరేపల్లి గ్రామానికి చెందిన మస్కరి హన్మంతు వ్యవసాయం తో పాటు మేకలను పోషిస్తూ జీవనం సాగిస్తున్నారు. అయితే గురువారం మేత కోసం తన వద్ద ఉన్న జీవాలను తోలుకొని వ్యవసాయ క్షేత్రం వైపు వెళ్ళాడు. గురువారం మధ్యాహ్నం ఉరుములు మెరుపులతో కూడిన అకాల వర్షం కురిసింది. చెట్టు కింద నిలుచున్న మేకల పై పిడుగు పడడంతో మేకలు మృతి చెందిగా సుమారు 1,50,000 రూపాయల నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న తహసీల్దార్ లక్ష్మణ్ బాబు, రెవెన్యూ సిబ్బంది పంపించి పంచరామ చేయించారు. పంచనామ నివేదికను పై స్థాయి అధికారులకు పంపిస్తామన్నారు.

తిరుపతిరెడ్డిని పరామర్శించిన వెంకట్రాములు

ప్రజాపక్షం/హన్మకొండ టౌన్ : సిపిఐ సీనియర్ నాయకుడు, స్వాతంత్ర సమర యోధుడు కూతురు తిరుపతిరెడ్డిని గురువారం హన్మకొండ ఇందిరా నగర్‌లోని ఆయన స్వగృహంలో సిపిఐ రాష్ట్ర నాయకుడు తాటిపాముల వెంకట్రాములు పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం తిరుపతిరెడ్డి 100 ఏళ్ల వయస్సులో వృద్ధాప్యంలో ఉన్నప్పటికీ ప్రస్తుత రాజకీయ పరిస్థితులను ఓపికతో విన్నారు. నిజాం నిరంకుశ పరిపాలనకు వ్యతిరేకంగా వెట్టిచాకిరికి వ్యతిరేకంగా దున్నేవాడికి భూమి కోసం సాగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో ఆయన ఆనాడు కరీంనగర్ జిల్లాలో భాగమైన పరకాల ప్రాంతంలో పాల్గొన్నారు. రైతుల వ్యవసాయ కార్మికుల పేద ప్రజల పక్షాన అనేక ఉద్యమాలు నిర్వహించారు. 1972లో ఆయన పరకాల నుంచి శాసనసభకు సీపీఐ అభ్యర్థిగా పోటీ చేశారు. పరకాల తాలూకా కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శిగా సుదీర్ఘ కాలం పనిచేసి మండల వ్యవస్థ ఏర్పడిన తరువాత మొగుళ్లపల్లి మండల సీపీఐ ప్రథమ కార్యదర్శిగా పనిచేశారు. ఆరోగ్యాన్ని సైతం లెక్క చేయకుండా ప్రజా సంక్షేమం కోసం కృషి చేసిన తిరుపతిరెడ్డిని ఆయురారోగ్యాలతో ఉండాలని వెంకట్రాములు మనస్ఫూర్తిగా అభినందించారు.

కిరణ్‌కుమార్‌రెడ్డి గెలుపు ఖాయం

ప్రజాపక్షం/బచ్చన్నపేట: భువనగిరి పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అత్యధిక మెజార్టీతో గెలుపొందడం ఖాయమని జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జంగిటి విద్యానాథ్ అన్నారు. గురువారం ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో అత్యధిక ఎంపీ సీట్లు కాంగ్రెస్‌పార్టీ గెలువడం ఖాయమన్నారు. కిరణ్‌కుమార్‌రెడ్డి గెలుపు కోసం నిరంతరం కష్టపడి కృషి చేసిన మండల కాంగ్రెస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, అన్ని గ్రామాల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు, నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మండలంలోని ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని, కార్యకర్తలే పార్టీకి బలమని ఆయన అన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులున్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో పెంకుటిల్లు దగ్ధం

ప్రజాపక్షం/రఘునాథపల్లి: కరెంట్ షార్ట్ సర్క్యూట్‌తో పెంకుటిల్లు దగ్ధమైన సంఘటన మండలంలో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కంచనపల్లి గ్రామానికి చెందిన జిగిరి నరసయ్య ఇంట్లో కరెంటు షార్ట్ సర్క్యూట్ కారణంగా ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో స్థానికులు వెంటనే గమనించి ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలు అదుపు చేయడం జరిగింది. అప్పటికే ఇంట్లో ఉన్న విలువైన వస్తువులైన టీవీ, ఫ్రిడ్జ్, బెడ్, బీరువా, నగదు, విలువైన డాక్యుమెంట్లతో పాటు, బట్టలు, సామాగ్రి అన్ని పూర్తిగా మంటల్లో కాలి బూడిదయ్యాయి. సుమారు రూ.1లక్ష ఆస్తినష్టం జరిగినట్లు అధికారులు అంచనా వేశారు. ప్రభుత్వం నరసయ్య కుటుంబాన్ని ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కల్తీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

ప్రజాపక్షం/ములుగు జిల్లా ప్రతినిధి: రైతులకు కల్తీ విత్తనాలు అమ్మినా, రైతులను మోసం చేసిన సహించేది లేదని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. గురువారం కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, జిల్లా వ్యవసాయాధికారి విజయ్‌చంద్ర, డిఎస్‌పి రవీందర్‌లతో కలిసి ములుగు జిల్లాలోని విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల డీలర్లకు విత్తన చట్టంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ ములుగు జిల్లాలో ప్రజలు ఎక్కువగా వ్యవసాయంపైనే ఆధారపడి జీవనం కొనసాగిస్తుంటారని అలాంటి రైతులకు కల్తీ విత్తనాలు అమ్మిన, మోసం చేసిన సహించేది లేదని జిల్లాలో వ్యవసాయ, పోలీసుశాఖ, జిల్లాలోని విత్తన డీలర్లు సమన్వయంగా పనిచేస్తూ నకిలీ, కల్తీ విత్తనాలు సరఫరా కాకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. వర్షాకాలం నాట్లు వేసే సమయంలో రైతులందరు విత్తనాల విషయంలో అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విత్తనాల విషయంలో ఏమైనా సందేహాలు ఉంటే వెంటనే వ్యవసాయాధికారులను సంప్రదించాలని, వ్యవసాయాధికారులు కూడా రైతుల సందేహాలను నివృత్తి చేస్తూ వారికి అవసరమైన సలహాలు, సూచనలు చేయాలని సూచించారు. గ్రామస్థాయిలో రైతులకు నాణ్యమైన విత్తనాల కొనుగోలుపై రైతు వేదికల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టి, ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని పేర్కొన్నారు. నిబంధనలు ఉల్లంఘించి నకిలీ విత్తనాలు విక్రయిస్తే షాపు యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. డీలర్లందరూ విత్తన చట్టానికి లోబడి వ్యాపారం నిర్వహించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ నకిలీ విత్తనాలు అమ్మరాదని సూచించారు. ఎప్పటికప్పుడు స్టాక్‌బోర్డు, స్టాక్ రిజిస్టర్ విధిగా నమోదు చేయాలన్నారు. సీడ్ డీలర్లు సైతం సీడ్ సర్టిఫికేషన్ ఉన్న విత్తనాలు మాత్రమే కొనాలని, రైతులు కొనుగోలు చేసిన ప్రతి మందులు, విత్తనాలు, పురుగుమందులకు దుకాణదారులు తప్పనిసరిగా రశీదు అందించాలని పేర్కొన్నారు. పురుగు మందుల విషయంలో కాల పరిమితి అయిపోయిన పురుగుమందులు అమ్మకాలు చేసిన, పిసిలు లైసెన్స్‌లో పొందుపరచకుండా స్టాక్ అమ్మిన, రైతులకు రసీదులు ఇవ్వకపోయిన, దుకాణదారులు రికార్డులు సక్రమగా నిర్వహించకపోయినా, లేబుల్స్ సక్రమంగా లేకుండా అమ్మిన నకిలీ మందులు అమ్మిన దుకాణదారుల యజమానులకు క్రిమి సంహారక చట్టం 1968 ప్రకారం రూ.1 నుండి రూ.50 వేల జరిమానా, 1నెల నుండి ఏడు సంవత్సరాల వరకు జైలు శిక్ష విధించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా డి కె శ్రీపాల్, ఏటూరునాగారం ఏడి ఎన్ శ్రీధర్, జిల్లాలోని వ్యవసాయ విస్తరణ అధికారులు, సీడ్ డీలర్స్, పురుగుమందుల దుకాణదారుల యజమానులు, ఇతర వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాల పనుల్లో వేగం పెంచండి

బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

ప్రజాపక్షం/ఖిలా వరంగల్: అమ్మ ఆదర్శ పాఠశాల పనుల్లో వేగం పెంచాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు. గురువారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో హన్మకొండ జిల్లా పరిధిలో గల అమ్మ ఆదర్శ పాఠశాలల చైర్‌పర్సన్లు ప్రధానోపాధ్యాయులు ఇంజనీరింగ్ అధికారులతో పాఠశాలల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై ఏర్పాటుచేసిన సమీక్షా సమావేశంలో కమిషనర్ పాల్గొని సమర్థవంతంగా నిర్వహించుటకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎఇల వారిగా పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులను సమీక్షిస్తూ పాఠశాలల్లో పెండింగ్‌లో ఉన్న (మైనర్) చిన్న పనులైన ఎలక్ట్రిఫికేషన్, మరుగుదొడ్ల మరమ్మత్తులు తదితర పనులను త్వరితంగా పూర్తి చేయాలని, ఇంకను అభివృద్ధి పనులు ప్రారంభించని పాఠశాలలు తక్షణమే పనులు ప్రారంభించాలని ఆదేశించారు. ప్రభుత్వం ఇట్టి పనులకు అత్యంత ప్రాధాన్యతను కల్పించి ప్రభుత్వ పాఠశాలల్లో మౌళిక వసతులు కల్పించాలన్న ఉద్దేశ్యంతో ముందస్తుగా 25 శాతం నిధులను అందజేసి పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఇప్పటికి మైనర్ పనులు పూర్తి చేసిన వారికి కూడా వెంటనే బిల్లులు చెల్లించేలా అధికారులను ఆదేశించడం జరిగిందని, చైర్‌పర్సన్‌లు పాఠశాలల ప్రధానోపాధ్యాయుల మధ్య సమన్వయం ఉన్నప్పుడే పనులు వేగవంతంగా పూర్తి అవుతాయని, పాఠశాలల్లో పనులను పూర్తి చేయడానికి బల్దియా తరుపున ఇంజనీరింగ్ అధికారుల సాంకేతిక సహకారం అందజేస్తారని, పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని, బాధ్యతాయుతంగా వ్యవహరించి పాఠశాలలు ప్రారంభం అయ్యేలోగా మొత్తం పనులను పూర్తి చేయాలని కమిషనర్ అన్నారు. ఈ కార్యక్రమంలో టిపిఆర్ఓ కోలా రాజేష్‌కుమార్, ఈఈలు రాజయ్య, సంజయ్‌కుమార్, డిఈలు రవికుమార్, సంతోష్‌బాబు, శివానంద్, అజ్మీరా శ్రీకాంత్, టిఎంసి రమేష్, ఏఈలు సిఓలు, తదితరులు పాల్గొన్నారు.

ఏకరూప దుస్తుల పరిశీలన

వరంగల్ జిల్లా కలెక్టర్ ప్రావిణ్య

ప్రజాపక్షం/ వరంగల్ ప్రతినిధి: జిల్లాలోని అన్ని అమ్మ ఆదర్శ పాఠశాలలలో అభివృద్ధి పనులు జూన్ 5లోగా పూర్తి చేయాలని వరంగల్ జిల్లా కలెక్టర్ పి. ప్రావిణ్య తెలిపారు. గురువారం వరంగల్ జిల్లా గీసుగొండ మండలంలోని పలు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గుర్తించబడిన ప్రభుత్వ పాఠశాలల్లో ఆహ్లాదకరమైన వాతావరణంలో పిల్లలు చదువుకోవాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ద్వారా టాయిలెట్లు, తాగునీటి సౌకర్యం, విద్యుత్, సుందరీకరణ పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. అనంతరం కోనాయిమాకుల, గీసుకొండ మండల కేంద్రంలో మండల సమాఖ్యలచే నిర్వహించబడుతున్న ఏకరూప దుస్తుల తయారీను పరిశీలించి వచ్చే జూన్ 10లోగా విద్యార్థులకు అందించే ఏకరూప దుస్తుల కుట్టడం పూర్తి కావాలని ఆదేశించారు. విద్యాశాఖ అధికారి వాసంతి, డిఆర్‌డిఏ ఏపీఎం రేణుకాదేవి, డిపిఎం భవాని, తహసీల్దార్ రియాజ్, మండల స్పెషలాధికారి పాల్గొన్నారు.

సిఎంతో టిపిసిసి సోషల్ మీడియా సమావేశం

ప్రజాపక్షం/వరంగల్ టౌన్ : హైదరాబద్ లోని మాదాపూర్ లో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి తో గురువారం కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా సమావేశం జరిగినట్లు వరంగల్ జిల్లా సోషల్ మీడియా కో ఆర్డినేటర్ సోమ లక్ష్మి తెలిపారు.ఈ సందర్భంగా పార్లమెంట్ ఎన్నికలలో కష్టపడి పనిచేసిన కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా ప్రతినిధులను సిఎం రేవంత్ రెడ్డి ప్రశంశించినట్లు తెలిపారు. కాంగ్రెస్‌పార్టీ సోషల్‌మీడియా కన్వీనర్లు, సభ్యులతో కలిసి సిఎం తేనేటి విందులో పాల్గొన్నట్లు తెలిపారు. రాష్ట్ర కాంగ్రెస్ సోషల్ మీడియా కో ఆర్డినేటర్లతో పాటు వరంగల్ తూర్పు కో ఆర్డినేటర్ మహ్మద్ హుస్సేన్, కె.భాస్క ర్ రెడ్డి, దాసరి రాజశేఖర్,బొట్ల నితి న్, మహ్మద్ మొయిన్, కె.రాజేష్ వర్మ, రొడ్డ రంజిత్, సచిన్, సంతోషిని, కీర్తితో పాటు జిల్లా కాంగ్రెస్ నాయకులు ఎ. సాంబరాజు, పీసాల రాజు, కమలాపురం పవన్,రాజు తదితరులు పాల్గొన్నట్లు సోమ లక్ష్మి తెలిపారు.

రీ ఓపనింగ్ నాటికి స్కూల్ యూనిఫామ్ పంపిణీ

జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా

ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి : పాఠశాలలు పున ప్రారంభం నాటికి విద్యార్థులకు ఏక రూప దుస్తులు పంపిణీ జరగాలని జిల్లా కలెక్టర్ భవిష్ మిశ్రా తెలిపారు. గురువారం జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండల కేంద్రంలోని మహిళ సమాఖ్య భవనంలో జీవన జ్యోతి మండల సమాఖ్య మహిళ సంఘ సభ్యులు కొడుతున్న విద్యార్థుల ఏక రూప దుస్తుల కుట్టు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థిని, విద్యార్థులకు యూనిఫామ్ లు అందించేందుకు చర్యలు చేపట్టామని అన్నారు. మండలంలోని మొత్తం 49 మండల పాఠశాలలకు గాను 901 మంది బాలురు, 988 మంది బాలికలతో కలిపి మొత్తం 1889 విద్యార్థులకు 3,878 యూనిఫామ్ లు తయారీకి జీవన జ్యోతి మండల సమాఖ్య సభ్యులకు ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఇట్టి యూనిఫాంల తయారీ జూన్ 10వ తేదీలోగా అందించాలని, జూన్ 12 నుండి పాఠశాలలు పున ప్రారంభం కానున్న నేపథ్యంలో జూన్10 వ తేదీ లోపు బాల, బాలికలకు యూనిఫామ్ లను అందించడం జరుగుతుందని కలెక్టర్ అన్నారు. శిక్షణ పొందిన సమాఖ్య మహిళ సభ్యులు విద్యార్థుల కొలతల ఆధారంగా యూనిఫాంలను కుట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఓ నరేష్, తహసిల్దార్ నాగరాజు, ఎంపిడిఓ బాబు, ఎంపిఓ ఉపేంద్రయ్య, యూనిఫామ్ కుట్టు శిక్షకురాలు వనిత, జీవన జ్యోతి మండల సమాఖ్య సభ్యులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా కాటారం మండలంలోని పోతులవాయి. బయ్యారం గ్రామాల్లో ఎంపిపియస్ పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ జూన్12 వ తేదీన పాఠశాలలు ప్రారంభం కానున్నందున పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులను పూర్తి చేయాలన్నారు. పనుల్లో నాణ్యత పాటించాలని, పనుల్లో పెండింగ్ ఉన్నట్లయితే తన దృష్టికి తీసుకురావాలని అన్నారు.

పత్తిని మద్దతు ధరకు కొనుగోలు చేయాలి

తెలంగాణ రైతు సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు సోమిడి శ్రీనివాస్,

ప్రజాపక్షం/వరంగల్ టౌన్ : తెలంగాణ రైతు సంఘం కమిటీ ఆధ్వర్యంలో రైతుల వద్ద నుంచి పత్తిని మద్దతు ధరకు కొనుగోలు చేయాలని వరంగల్ బ్రాంచ్ కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండయా లి.మేనేజర్ అర్జున్ దవేని కలిసి జిల్లా అధ్యక్షులు సోమిడి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఓదెల రాజయ్య డిమాండ్ చేశారు. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ వరంగల్ బ్రాంచ్ మేనేజర్ అర్జున్ దవే కి గురువారం వినతి పత్రం అందజేసి మాట్లాడుతూ రైతుల పండించిన పత్తిని ఎంఎస్‌పి 7020 ఉండగా ప్రైవేట్ వ్యాపారస్తులు కొద్ది రోజుల నుండి రైతులు మార్కెట్కు తీసుకొచ్చిన పత్తిని మద్దతు ధర కంటే తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. దీని వలన క్వింటాకు ఒక్కంటికి సుమారుగా 500 నుండి 1000 రూపాయల వరకు రైతులు నష్టపోతున్నారు. సిసిఐ పత్తిని కొనుగోలు చేయకపోవడం వలన రైతులకు నంష్ట వాటిల్లుతుంది. రైతులు పండించిన పంట పెట్టుబడి రాలేని పరిస్థితిలో అయోమయంలో రైతులు కొట్టుమిట్టాడుతున్నారు. ఈ పరిస్థితిలో రైతుల వద్ద నుండి మద్దతు ధరకు కొనుగోలు చేయవలసిన కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాలి. మార్కెట్లలో సెంటర్లను ప్రారంభించి మద్దతు ధరకు రైతులు తెచ్చిన పత్తిని వెంటనే కొనుగోలు చేపట్టి రైతులను ఆదుకోవాలని శ్రీనివాస్ అన్నారు. సిసిఐ మేనేజర్ స్పందించి వరంగల్ ఏను మామూల మార్కెట్లో సెంటర్ ను ప్రారంభిస్తామని హమిని ఇవ్వడం జరిగినది. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ఊరటి హంస రెడ్డి, జిల్లా కోశాధికారి సిరుల రవీందర్, రైతు సంఘ సభ్యులు జయపాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుపై సమీక్షా సమావేశం

ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి : యసంగి ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో యాసంగి ధాన్యం కొనుగోల్లపై వ్యవసాయశాఖ, సహకార శాఖ, తూనికలు కొలతలు, మార్కెటింగ్, డిఆర్డీఏ పౌర సరఫరాలు, పౌరసరఫరాల సంస్థ, రైస్ మిల్లర్లు, కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జిలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. యసంగి ధాన్యం కొనుగోలు చేసేందుకు జిల్లా వ్యాప్తంగా117 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ఇప్పటి వరకు 16 వేల 500 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని తెలిపారు. వా తావరణంలో మార్పుల వల్ల అకాల వర్షాలు కురిసే అ వకాశం ఉందని కొనుగోలు కేంద్రాలలో ధాన్యం తడిసి పాడవకుండా కొనుగోలు కేంద్రాలు నిర్వాహకులు తగు రక్షణ చర్యలు చేపట్టాలని అన్నారు. ఇప్పటివరకు 3 వేల టార్పలిన్ లు కొనుగోలు కేంద్రాలకు సరఫరా చేయడం జరిగిందని అన్నారు. రానున్న 15 రోజుల చాల కీలకమని వ్యవసాయ శాఖ అధికారుల అంచనా ప్రకారం ఇంకా సుమారు 45వేల మెట్రిక్ టన్నుల వ రకు ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రావొచ్చని అప్రమత్తంగా ఉండి కొనుగోలు చేయాలని పేర్కొన్నారు. అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయ్ భాస్కర్, డిఆర్డిఓ నరే ష్, పౌర సరఫరాల అధికారి నర్సింగరావు, జిల్లా సివిల్ సప్లై సంస్థ మేనేజర్ రాఘవేందర్, తూనికలు కొలతల శాఖ అధికారి శ్రీలత, మార్కెటింగ్ శాఖ అధికారి కనక శేఖర్, రైస్ మిల్లర్లు సంఘం సభ్యులు, కొనుగోలు కేంద్రాల ఇంచార్జిలు, వ్యవసాయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ వద్ద జాగ్రత్త

ప్రజలు, వినియోగదారులు అప్రమత్తంగా ఉండండి

ఎస్‌పిడిసిఎల్ సిఎండి ముషారఫ్ ఫరూఖి



ప్రజాపక్షం / హైదరాబాద్ : హైదరాబాద్ నగరంతో పాటు ఇతర జిల్లాల్లో భారీ వర్షాలు, భారీ గాలుల నేపథ్యంలో దక్షిణ విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ ఫరూఖి ఐఏఎస్ విద్యుత్ సరఫరా పరిస్థితిని సమీక్షించారు. ప్రస్తుతం సరఫరా సాధారణ స్థాయిలో వున్నదని తెలిపారు. భారీ గాలుల వల్ల చెట్ల కొమ్మలు, ఫ్లెక్సీ ల అవశేషాలు, ఇతర భవన నిర్మాణ సామాగ్రి, ఇతర వస్తువులు గాలి ధాటికి విద్యుత్ లైన్ల పై పడే అవకాశమున్నందున సాధారణ ప్రజలు, విద్యుత్ వినియోగదారులు వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. వర్షాలు పడేటప్పుడు సాధారణ ప్రజలు, విద్యుత్ వినియోగదారులు క్రింద సూచించిన స్వీయ జాగ్రత్తలు పాటించాలని సిఎండి కోరారు. వర్షాలు పడేటప్పుడు స్టే వైర్, విద్యుత్ లైన్ల క్రింద, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద నిలబడరాదని, వీలైనంతవరకు వాటికి దూరంగా ఉండాలన్నారు. పశువులను, పెంపుడు జంతువులను కూడా విద్యుత్ పరికరాల నుండి దూరంగా ఉంచాలని సూచించారు. ఎక్కడైనా రోడ్ మీద, నీటిలో కాని విద్యుత్ తీగ పడి వున్న యెడల ఆ తీగను తొక్కడం గాని, వాటి మీద నుండి వాహనాలు నడపడం చేయరాదని, ఒక వేళ ఎక్కడైనా తెగిపడ్డట్టు ఉంటే వెంటనే సమీప విద్యుత్ సిబ్బందికి గాని, కింద ఇవ్వబడ్డ నెంబర్ల ద్వారా సంస్థ దృష్టికి తీసుకు రావాలన్నారు. చెట్ల కొమ్మలపై, వాహనాలపై, ఇతర భవనాలపై తెగి పడ్డ తీగలు ఉన్నట్లయితే వెంటనే సంస్థ దృష్టికి తీసుకురావాలని కోరారు. భారీ గాలులు, వర్షం పడేటప్పుడు విద్యుత్ సరఫరాలో హెచ్చు తగ్గులు ఉన్నట్లయితే విద్యుత్ పరికరాలను ఆఫ్ చేసి వెంటనే కంట్రోల్ రూమ్ కి తెలియజేయగలరు. విద్యుత్ అంతరాయం ఫిర్యాదుల నమోదు కోసం కంట్రోల్ రూమ్ కు సమాచారం అందించవచ్చన్నారు. లోతట్టు ప్రాంతాల్లో, అపార్ట్‌మెంట్ సెల్లార్ లలో నీళ్ళు చేరితే వెంటనే తమకు తెలియజేయాలన్నారు. విద్యుత్ కి సంబంధించి ఎలాంటి అత్యవసర పరిస్థితి వున్నా 1912 / 100 / స్థానిక ఫ్యూజ్ ఆఫ్ కాల్ ఆఫీస్ తో పాటు క్రింద పేర్కొన్న సంబంధిత సర్కిల్ ప్రత్యేక కంట్రోల్ రూమ్ నకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చన్నారు. హైదరాబాద్ సెంట్రల్ ఫోన్ 9491629047, హైదరాబాద్ సౌత్ 9491628269, సికింద్రాబాద్ 9491629380, బంజారాహిల్స్ 9491633294, సైబర్‌సిటీ 9493193149, రాజేంద్రనగర్ 7382100322, సరూర్‌నగర్ 7901679095, హబ్సిగూడ 9491039018, మేడ్చల్ 7382618971, మెదక్ 7901677782, నల్గొండ 9440814326, యాదాద్రి 949165938, సూర్యాపేట 8985178700, మహబూబ్‌నగర్ 9440768928, వనపర్తి 7382605903, నాగర్‌కర్నూల్ 9441400014, గద్వాల్ 7901099649, సంగారెడ్డి 9440813707, సిద్దిపేట్ 7382943931, వికారాబాద్ 9493193177కు కాల్ చేసి సమాచారం అందించవచ్చన్నారు.

తల్లిని రక్షించేందుకు వెళ్లిన కొడుకు

తిరిగిరాని లోకాలకు..

ఉసిరికపల్లిలో విషాదకరమైన ఘటన..

ప్రజా పక్షం/శివ్వంపేట: ఇంట్లో ఉతికిన బట్టలు తీగపై ఆరేస్తుండగా తల్లి ప్రమాదవశాత్తు కరెంట్ షాక్ గురికావడంతో తన తల్లిని ప్రమాదం నుండి రక్షించబోయే అదే కరెంట్ ప్రమాదంలో తల్లికొడుకు మృతి చెందిన సంఘటన మెదక్ జిల్లా శివ్వంపేట మండలంలోని ఉసిరికపల్లి గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్ర కారం గ్రామానికి చెందిన నీరుడి మానెమ్మ (45) రోజుమాదిరిగానే తన ఇంట్లోని బట్టలను ఉతికి దండెంపై (ఇనుప తీగపై) ఆరేస్తుండగా ప్రమాదవశాత్తు దండెం తీగకు క రెంట్ షాక్ తగలడంతో దాన్ని పట్టుకున్న మానెమ్మ గిల, గిల కొట్టుకుంటుండగా ఆ మె కొడుకు బానుప్రసాద్ (19) ప్రమాదం నుండి తల్లిని రక్షించేందుకు వెళ్లి ఆమెను పట్టుకోవడంతో తల్లి కొడుకు ఇద్దరు ఇక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. తన తల్లీ, అన్న ఇద్దరు విద్యుత్ ప్రమాదానికి గురి కావడంతో రక్షించబోయిన మానెమ్మ కూతురు లలితకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుల్ని తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మానెమ్మ, భానుప్రసాద్ మృతి చెందినట్లు వైద్యులు తెలిపినట్లు గ్రామస్తులు తెలిపారు. అందరిలో కలుపుగోలుగా ఉండే తల్లికొడుకులిద్దరు కరెంట్ షాక్ తో మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఘటన స్థలాన్ని శివ్వంపేట పోలీసులు సందర్శించి ప్రమాద వివరాలు సేకరిస్తున్నారు.

తడిసిన జొన్నలు కొనుగోలు చేయాలి

ప్రజాపక్షం/బోథ్ :అకాల వర్షాలకు తడిసిన జొన్న పంటను వెంటనే ప్రభుత్వం కొనుగోలు చేయాలని తెలంగాణ రాష్ట్ర అధ్యాపకుల సంఘం ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన బోథ్ మార్కెట్ యార్డును సందర్శించి వర్షం కారణంగా రైతులు నష్టపోయిన జొన్నలను పరిశీలించారు. ఈ సందర్భంగా జరిగిన నష్టాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. రైతులు పండించిన జొన్న పంటను కొనుగోలు చేయించి రైతులను ఆదుకోవాలని ఆయన మార్కెట్ చైర్మన్ బొడ్డు గంగారెడ్డిని కోరారు.

ఎల్లమ్మ పట్నాలకు హాజరైన ప్రభుత్వ విప్

ప్రజాపక్షం / బుగ్గారం : జగిత్యాల జిల్లా బుగ్గారం మండలం గోపాలపూర్ గ్రామంలో గురువారం రోజున ఎల్లమ్మ ఆలయం కమిటీ వారు నిర్వహిస్తున్న పట్నాలకు ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ హాజరయ్యారు. ఎల్లమ్మ తల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ బుగ్గారం మండల అధ్యక్షుడు వేముల సుభాష్, ఉపాధ్యాక్షులు నగునూరి నర్సాగౌడ్, మండల యూత్ అధ్యక్షుడు తిరుపతి, జేఏసి అధ్యక్షులు కండ్లె మదన్, గ్రామ శాఖ అధ్యక్షులు రవీందర్ రెడ్డి, మాజీ గ్రామశాఖ అధ్యక్షులు గోవిందుల రమణ, యూత్ ప్రధాన కార్యదర్శి సిగిరి అంజిత్ కుమార్, గాజుల సత్తయ్య, గౌడ సంఘ సభ్యులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

డెంగ్యూ నివారణకు అవగాహన ర్యాలీ

ప్రజాపక్ష / ఇబ్రహీంపట్నం : జాతీయ డెంగ్యూ దినోత్సవం పురస్కరించుకుని జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో గురువారం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు హరీష్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డా. హరీష్ మాట్లాడుతూ డెంగ్యూ వ్యాధి రాకుండా ప్రతి ఒక్కరు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. దోమలు కుట్టకుండా ప్రతి ఇంటిలో దోమల తెరలు వాడాలన్నారు. అదే విధంగా రానున్న వర్షాకాలంలో ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీటి నిల్వలు ఉండకుండా చూసుకోవాలన్నారు. ప్రతి మంగళవారం, శుక్రవారం డ్రై డేను పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌వో విజయభాస్కర్, పిహెచ్ఎల్ హేమలత, ఎంపిహెచ్ ఎవో కృపాకర్, ఫార్మసిస్ట్ ఉదయ్ ప్రసాద్, స్టాఫ్ నర్సులు రాజేందర్, మౌనిక, ఎంపిహెచ్ ఎస్ సుశీల, ల్యాబ్ టెక్నీషియన్ నరేష్, హెల్త్ అసిస్టెంట్ లక్ష్మ ణ్, రఫీ, ఏఎన్ఎంలు లలిత, శారద, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాపక్షం/మెట్ పల్లి : పట్టణంలో మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో గురువారం జాతీయ డెంగ్యూ దినోత్సవాన్ని పురస్కరించుకోని, డెంగ్యూ పై అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా సబ్ యూనిట్ ఆఫీసర్ మీర్జా విలాయత్ బేగ్ మాట్లాడుతూ సమాజంలో భాగాస్వామ్యమై డెంగ్యూను నివారించాలన్నారు. దోమలను నిర్మూలించండి, దోమ కాటు నుండి రక్షించుకోండి అని పిలుపునిచ్చారు. ప్రతి మంగళవారం శక్రవారం డ్రై డే గా పాటించి నిల్వ ఉన్న నీటిని తోలగించి ఆరబెట్టి తిరిగి నీటిని నింపుకోవాలన్నారు. ప్రతి ఇంటిలోని కుండీలలో నిల్వ ఉన్న నీళ్లను, టైర్లలో నిలువ ఉన్న నీటిని కూలర్లలో నిల్వ ఉన్న నీటిని తోలగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వాణి, డాక్టర్ అంజిత రెడ్డి, గుర్రం రత్నాకర్, ముజీబ్, నిజాం, ఏఎన్ఎంలు ఆశా వర్కర్ లు, పారిశుద్ధ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్ష తప్పనిసరిగా చేసుకోవాలి

ప్రజాపక్షం/ముత్తారం : ముత్తారం మండల పరిధిలోని సీతంపేట గ్రామంలో భూసార పరీక్షకు మట్టి నమూనా సేకరించే విధానంపై అవగాహణ కార్యక్రమం నిర్వహించినట్లు కృషి విజ్ఞాన కేంద్రం రామగిరిఖిల్లా మృత్తిక శాస్త్రవేత్త డాక్టర్ కిరణ్ పిల్లి తెలిపారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త మాట్లాడుతూ ప్రతి రైతు తమ నేల యొక్క భూసారాన్ని తెలుసుకుని దానికి అనుగుణంగా ఎరువులు వాడాలి అని, తద్వారా ఎరువుల వాడకంలో అనవసర ఖర్చులు తగ్గించి భూసారాన్ని కాపాడుకుంటూ అధిక సుస్థిర దిగుబడులు పొందవచ్చని. భూసార పరీక్షలు చేయడం ద్వారా పోషకాల పరిమాణం కాకుండా భూమిలోని చౌడు, సున్నం శాతాన్ని గుర్తించవచ్చుని, రైతులు తమ పొలంలోని మట్టిని సేకరించి కృషి విజ్ఞాన కేంద్రం రామగిరిఖిల్లా కి పంపించినట్లు అయితే రైతులకు భూసార పరీక్ష చేసి భుఆరోగ్య పత్రాలు అందజేస్తామని తెలిపారు. సీతంపేట గ్రామంలో అధిక శాతం రైతులు మిరప పంట, పత్తి, వరి పంట వేయటం జరుగుతుంది. ఈ పంటల్లో అధిక రసాయన ఎరువులు వాడటం సర్వసాధారణం కావున రైతులు భూసార పరీక్షలు చేయించుకొని భూసారాన్ని బట్టి ఆయా పంటలకు ఎరువుల యాజమాన్యం కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తల ద్వారా తెలుసుకొని సుస్థిర వ్యవసాయంతో అధిక దిగుబడులు సాధించవచ్చు అని తెలిపారు. రైతులు కృషి విజ్ఞాన కేంద్రం రామగిరి ఖిల్లా నందు ఈ భూ పరీక్షలు చేయించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కే. వి.కే సిబ్బంది రుద్రా వినాయక్ (ల్యాబ్ టెక్నేషన్) గ్రామ రైతులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు ఒకరు మృతి

నలుగురికి తీవ్ర గాయాలు

ప్రజాపక్షం/వేములవాడ : వేములవాడ మున్సిపల్ విలీన గ్రామం శాత్రాజుపల్లిలో పిడుగుపాటుతో ఒకరు మృతి, నలుగురికి తీవ్ర గాయాలు సంఘటన గురువారం చోటుచేసుకుంది. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మున్సిపల్ పరిధిలోని శాత్రాజ్ పల్లిలో పిడుగుపాటుతో కంబల్ల శ్రీనివాస్ (30) అనే వ్యక్తి మృతి చెందగా, మరో నలుగురికి గాయాలు అయ్యాయి. స్థానికులు గాయాల పాలైన వారిని వేములవాడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. వారిని పాక్స్ చైర్మన్ ఏనుగు తిరుపతి రెడ్డి పరామర్శించారు. అన్నివిధాలుగా అండగావుంటామన్నారు. బిఆర్ఎస్ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి బాధితుల బాగోగులు అడిగి తెలుసుకున్నారు. పిడుగుపాటుతో కంబల్ల శ్రీనివాస్ (30) అనే వ్యక్తి మృతి చెందగా అతడి కుటుంబానికి అండగా ఉండి, ఆదుకుంటామన్నారు. ప్రభుత్వం వెంటనే వారి కుటుంబాలను ఆదుకోవాలని కోరారు.

ఆగస్టు 15లోగా రైతు రుణమాఫీ

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

ప్రజాపక్షం/చందుర్తి : కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమ కార్పోరేషన్ ఏర్పాటు చేసి ఆగస్టు 15లోగా రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేస్తుందని వేములవాడ శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ గురువారం అన్నారు. చందుర్తి మండల కేంద్రంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ గత పది సంవత్సరాలు అధికారంలో ఉన్నప్పుడు వరి వేస్తే ఉరి అంటూ రైతులను పట్టించుకోని బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారం కోల్పోయాక రైతులపై మొసలి కన్నీరు కారుస్తోందని అన్నారు. గతంలో ధాన్యం కొనుగోలులో మోసం, అధిక తూకం, నష్టపోయిన రైతులకు పంట నష్టపరిహారం ఇవ్వని బిఆర్ఎస్ నాయకులు నేడు ధాన్యం కొనుగోలను నిరసిస్తూ దీక్ష చేస్తామనడం హాస్యాస్పదం అన్నారు. స్వయాన కెటిఆర్ మంత్రిగా ఉన్న సిరిసిల్ల జిల్లాలో గత మే 15 వరకు 86వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తే ఇప్పుడు లక్ష 90 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని అవసరమైతే లెక్కలు చూసుకోవాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉందని అందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాత్రింబవళ్లు పనిచేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి నాగం కుమార్, స్థానిక కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు చేయాలంటూ రైతుల నిరసన

ప్రజాపక్షం/చందుర్తి : వరి ధాన్యం కొనుగోలులో జాప్యాన్ని నిరసిస్తూ మండలంలోని జోగాపూర్ గ్రామ రైతులు గురువారం గ్రామపంచాయతీ ఆవరణలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరి ధాన్యం కోతలు కోసి నెల రోజులు దాటుతున్న నేటికీ కొనుగోలు పూర్తి కాలేదంటూ ఆవేదన చెందారు. అకాల వర్షాల వల్ల ధాన్యం తడిసి ముద్దవుతోందని, తడిసిన ధాన్యాన్ని ఆరబోసుకోవడానికి ఇబ్బంది అవుతుందని ఆగ్రహించారు. గ్రామంలో ధాన్యం ఆరబోసుకోవడానికి స్థలం లేకపోవడంతో ఎవరి పంట పొలాల్లో వారే ధాన్యాన్ని ఆరబోసుకున్నామని, ప్రస్తుతం తదుపరి పంట వేయడానికి సిద్ధమవుతున్న దశలో ఇంకా ధాన్యం కొనుగోలు పూర్తి కాకపోవడంతో భూమి సాగు చేసుకోవడానికి ఇబ్బంది అవుతుందని అన్నారు. లారీల కొరత లేకుండా చూసి ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని చందుర్తి సింగిల్విండో చైర్మన్ తిప్పని శ్రీనివాస్, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కి విజ్ఞప్తి చేశారు.

సకాలంలో సిఎంఆర్ సరఫరా పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

ప్రజాపక్షం/నిర్మల్ ప్రతినిధి : సకాలంలో కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎంఆర్) సరఫరా పూర్తిచేయని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ మిల్లర్లను హెచ్చరించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ధాన్యం కొనుగోళ్లు, సిఎంఆర్ సరఫరాపై సంబంధిత శాఖల అధికారులు, రైస్ మిల్లర్లతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి మిల్లరు నిర్దేశించిన గడువులోగా సిఎంఆర్ సరఫరా పూర్తి చేయాలని ఆదేశించారు. నిబంధనలపై నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. రెవెన్యూ, సివిల్ సప్లయ్ అధికారులు ప్రతీ రోజు క్షేత్ర స్థాయిలో మిల్లులను తనిఖీ చేసి సిఎంఆర్ ప్రక్రియ తీరు, మిల్లలో ధాన్యం నిల్వ, సామర్థ్యం మిల్లులో నిల్వ ఉన్న ధాన్యం, అన్ లోడింగ్ తదితర అంశాలను పరిశీలించి రోజు వారి నివేదికలను అందజేయాలని సూచించారు. అలాగే ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలేత్తకుండా పర్యవేక్షించాలని అన్నారు. వారం రోజులుగా సిఎంఆర్ సరఫరా చేయని మిల్లర్లకు నోటీసులు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, డిఆర్ఓ భుజంగ్ రావు, నిర్మల్, బైంసా, ఆర్డీవోలు రత్నకళ్యాణి, కోమల్ రెడ్డి, డీఏస్‌వో నందిత, డీఎం సివిల్ సప్లయిస్ శ్రీకళ, తహసీల్దార్లు,అధికారులు,మిల్లర్లు,తదితరులు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చడంలో కాంగ్రెస్ విఫలం

ఎంఎల్ఎ కోవలక్ష్మి

ప్రజాపక్షం/ఆసిఫాబాద్ : ఎన్నికల హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ విఫలమైందని, ఆ ప్రభుత్వం రైతు వ్యతిరేక ప్రభుత్వమని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఆరోపించారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ వద్ద నల్ల బ్యాడ్జీలతో నిరసన కార్యక్రమాలు నిర్వహించి రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీ ఒకటి కూడా నెరవేర్చలేదన్నారు. రైతు బంధు 15000 ఇస్తామని చెప్పి గతంలో ఇచ్చిన 10000 కూడా పూర్తిస్థాయిలో రైతులకు ఇవ్వలేదని ఎద్దేవా చేశారు. గతంలో వంద రోజులు రుణమాఫీ చేస్తామని ప్రకటించారని, ఇప్పుడు మళ్ళీ ఆగస్టు 15 అంటున్నారని వచ్చే ఆగస్టు 15వ తేదీన లేదా 2025 సంవత్సరంలో ఆగస్టు నెల లోన అనేది చెప్పాలన్నారు. ప్రస్తుతం పండించిన యాసంగి దొడ్డు వడ్లకు 500 బోనస్ ఇవ్వాలన్నారు. రైతులకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేర్చే వరకు వారిపై ఒత్తిడి తీసుకువస్తామన్నారు. రైతులకు అండగా ఉండి నిరంతరం పోరాటం చేస్తామని తెలిపారు. బిఆర్ఎస్ నిరసన సందర్భంగా దాదాపు గంట పాటు జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ సమస్య తలెత్తింది . ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్ సింగిల్ విండో చైర్మన్ అలీ బిన్ అహ్మద్, మాజీ సర్పంచులు భీమేష్, శ్రీనివాస్, కిష్టయ్య, నాయకులు సుప్రజ, నిసార్, కుమార్, వెంకన్న పాల్గొన్నారు.

సమాజంతో మమేకమై డెంగ్యూను నివారిద్దాం

జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి ప్రమోద్ కుమార్

ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి : సమాజంతో భాగాస్వామ్యమై డెంగ్యూ వ్యాధిని నివారిచాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ప్రమోద్ కుమార్ అన్నారు. జాతీయ డెంగ్యూ వ్యాధి నిర్మూలన దినోత్సవం పురస్కరించుకుని గురువారం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె. ప్రమోద్ కుమార్ ఆధ్వర్యంలో డెంగ్యూ ర్యాలీ కార్యక్రమాన్ని పెద్దపల్లి మండలం రాఘవాపూర్ గ్రామం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు నిర్వహించారు. "సమాజంతో భాగస్వామ్యమై డెంగ్యూను నివారిద్దాం" అనే థీమ్ తో ప్రాథమిక, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వద్ద వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని, ప్రజలు పరిసరాల పరిశుభ్రతను పాటించి, దోమలను నియంత్రించాలని తద్వారా అందరూ ఆరోగ్యంగా ఉండాలని అన్నారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ప్రమోద్ కుమార్ మాట్లాడుతూ డెంగ్యూ వ్యాధి ఏడిస్ ఈజిప్టు అనే దోమ కాటు వల్ల డెంగ్యూ వ్యాధి వస్తుందని, ఇవి పగటి పూట కుడతాయని,ఈ దోమలు నీరు నిల్వ ఉన్నచోట పెరుగుతాయని తెలిపారు. పరిసరాల పరిశుభ్రత, దోమల నియంత్రణ వలన డెంగ్యూ వ్యాధిని నివారించవచ్చని ప్రజలను కోరారు.ఈ కార్యక్రమములో డా. కె.వి.సుధాకర్ రెడ్డి ప్రోగ్రామ్ అధికారి, వైద్యాధికారి డా. మమత, రాఘవాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం యంఎల్‌హెచ్ పిలు ఉమా మహేశ్వర్, రాజేషం, ఎన్.సి.డి. నోడల్ సూపర్ వైజర్, ఆరోగ్య కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

జూన్ 8న జాతీయ లోక్ అదాలత్

జిల్లా ప్రధాన న్యాయమూర్తి రమేష్

ప్రజాపక్షం/ఆసిఫాబాద్ : రాజీమార్గం ద్వారా కేసులను పరిష్కరించేందుకు జూన్ 8వ తేదీన జిల్లాలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించడం జరుగుతుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.వి.రమేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని జిల్లా కోర్టు భవన సముదాయంలో జూన్ 8వ తేదీన ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో క్రిమినల్, సివిల్, ప్రి లిటిగేషన్, బ్యాంకింగ్, విద్యుత్, భూ సమస్యలు, వివాహం, కుటుంబ సమస్యలు, మోటార్ వాహనాల ప్రమాదాల కేసులు, చిట్ ఫండ్, చెక్ బౌన్స్ ఇతర అన్ని రకాల కేసులను ఇరు పార్టీల మధ్య రాజీమార్గం ద్వారా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ కేసులను పరిష్కరించుకోవాలని తెలిపారు. జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం మొదటి బెంచ్ లో జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎం.వి. రమేష్, 2వ బెంచ్ లో సీనియర్ సివిల్ జడ్జ్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె. యువరాజ, 3వ బెంచ్ లో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ జె. అనంతలక్ష్మి న్యాయాధికారులుగా వ్యవహరిస్తారని తెలిపారు.ఈ జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమ నిర్వహణపై ఈ నెల 17వ తేదీన మధ్యాహ్నం జిల్లా కేంద్రంలోని కోర్టు భవన సముదాయంలో గల ప్రిన్సిపల్ డిస్టిక్, సెషన్స్ జడ్జ్ కోర్టు హాల్ నందు పోలీసు ఉన్నతాధికారులతో సన్నాహక సమావేశం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

రైతులకు బోనస్ చెల్లించాలి

మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్

ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి : పార్లమెంట్ ఎన్నికల అనంతరం 500 రూపాయలు బోనస్ ఇస్తానని ఇప్పుడు వంకలు పెడుతోందని, ఎన్నికలకు ఒక్క మాట ఎన్నికల తరువాత ఒక్క మాట మాట్లాడటం కాంగ్రెస్ పార్టీ కే చెల్లుబాటు అవుతుందని, అన్ని రకాల వడ్లకు మద్దతు ధరతో పాటు రూ. 500ల బొనస్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ పెద్దపల్లి జిల్లా గోదావరిఖని మున్సిపల్ జంక్షన్లో మాజీ ఎమ్మెల్యే బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు కోరుకొండ చందర్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం, రాస్తారోకో నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ పిలుపు మేరకు వరి ధాన్యానికి క్వింటాలుకు 500 రూపాయల బోనస్ చెల్లిస్తానని ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి ఇప్పుడు సన్న వడ్లకు మాత్రమే బోనస్ ఇస్తామని రాష్ట్ర రైతాంగాన్ని మరోసారి మోసం చేశారాని, రాష్ట్ర రైతాంగాన్ని మరోసారి మోసం చేసిన రాష్ట్ర ప్రభుత్వ రైతు వ్యతిరేఖ విధానాలను ప్రక్కన పెట్టి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అన్ని హామీలు అమలు అయ్యే వరకు బిఆర్ఎస్ పార్టీ ప్రజలు ,రైతులు వెంటే ఉంటదన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్‌లు, ఎంపిటిసిలు, మాజీ సర్పంచ్‌లు, బిఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులున్నారు.

స్ట్రాంగ్ రూముల వద్ద మూడంచెల భద్రత

ఎన్నికల రిటర్నింగ్ అధికారి ముజమ్మిల్ ఖాన్

ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి : ఇవిఎం యంత్రాలను భద్రపర్చిన స్ట్రాంగ్ రూమ్‌లను నిరంతరం పర్యవేక్షించాలని పెద్దపల్లి పార్లమెంటు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సంబంధిత అధికారులకు తెలిపారు. గురువారం పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ రామగిరిలోని సెంటినరీ కాలనీలో ఉన్న జేఎన్టీయూ మంథని కళాశాలను పరిశీలించి స్ట్రాంగ్ రూమ్ పర్యవేక్షణపై అధికారులకు పలు సూచనలు చేశారు. పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ, పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని ధర్మపురి, పెద్దపల్లి, రామగుండం, మంథని అసెంబ్లీ సెగ్మెంట్ల కౌంటింగ్ ప్రక్రియ జెఎన్టియు రామగిరి కళాశాలలో జరుగుతుందని, ఈ అసెంబ్లీ సెగ్మెంట్లకు సంబంధించి పోలైన ఇవిఎం యంత్రాలను స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపర్చామని అన్నారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద 3 అంచెల పటిష్ట భద్రత వ్యవస్థ ఏర్పాటు చేశామని, అనుమతి లేకుండా ఎవరు లోపలికి వచ్చే వీలు లేదని అన్నారు. స్ట్రాంగ్ రూమ్ పూర్తి కవరేజితో సిసి కేమేరాలు ఏర్పాటు చేశామని, వీటి ద్వారా స్ట్రాంగ్ రూమ్‌లను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని అన్నారు. అదే విధంగా జూన్ 4న జరగబోయే కౌంటింగ్‌కి సంబంధించి చేస్తున్న ఏర్పాట్లు, వాహనాల పార్కింగ్, కెమెరా మానిటరింగ్ వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సహాయ రిటర్నింగ్ అధికారులు వి.హనుమా నాయక్, బి.గంగయ్య, తహసిల్దారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

అన్ని రకాల వడ్లకూ రూ.500లు ఇవ్వాలి

రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య డిమాండ్



ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి : కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు పండించిన అన్ని రకాల ధాన్యానికి క్వింటాలుకు రూ. 500లు బోనస్ ఇస్తామని హామీ ఇచ్చి, ఎన్నికలు ముగియగానే సన్నవడ్లకు మాత్రమే ఇస్తామని ప్రకటించి రైతులను మరోసారి మోసగించారని బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల వడ్లకు క్వింటాలకు రూ.500లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ ఇచ్చిన పిలుపులో భాగంగా గురువారం సిరిసిల్ల తెలంగాణ భవన్‌లో బిఆర్ఎస్ శ్రేణులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి సర్కార్ మరోసారి రైతులకు దోకా ఇచ్చిందని, బోగస్ మాటలు బహిర్గతం అయ్యాయని ఆరోపించారు. రూ.500 బోనస్ ఇస్తామని రైతులకు ఎగవేశారన్నారు. అన్ని రకాల ధాన్యానికి బోనస్ ప్రకటించి ఎన్నికలు కాగానే సన్నం వడ్లకే ఇస్తామనడం మోసమని ఆరోపించారు. గిట్టుబాటు ధరతో పాటు రూ.500 బోనస్ ఇచ్చే వరకు పోరాటం సాగిస్తామని, రైతులకు అండగా ఉంటామని హెచ్చరించారు. సిఎం ఇచ్చిన బోనస్ రూ. 500 అన్ని రకాల వడ్లకు ఇస్తూ మాట నిలబెట్టుకోవాలని, ప్రభుత్వ హామీలను అమలు చేయాలని, బోనస్ తోపాటు ఏటా ఎకరానికి రూ.17,000 ఇచ్చే వరకు పోరాటం సాగుతుందన్నారు. బిఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్ మాట్లాడుతూ అన్ని రకాల వడ్లకు బోనస్ ఇచ్చే వరకు అలుపెరుగని పోరాటం చేయాలని, పార్టీ శ్రేణులు నిరుత్సాహంగా ఉండరాదని పిలుపునిచ్చారు. ఆరు గ్యారెంటీలు, 420 హామీలు అమలు కాలేదన్నారు. ఆరు నెలల్లోనే కాంగ్రెస్ సర్కార్ తెలంగాణలో పంటలను నాశనం చేసిందని, ప్రాజెక్టులు ఎండిపోయాయని, భూగర్భ జలాలు అడుగంటాయని, పంటల దిగుబడి కూడా తగ్గిందని, పోలింగ్ ముగిసిన వెంటనే సన్న వడ్లకే బోనస్ ఇస్తామని మోసం చేశారని ప్రవీణ్ ఆరోపించారు.

సన్నవడ్లకే బోనస్ ఇస్తామని సిఎం చెప్పలేదు

తప్పుడు ప్రచారం అంటూ ఖండించిన కాంగ్రెస్ నేతలు మీడియా సమావేశంలో పార్లమెంట్ కో కన్వీనర్ చక్రధర్ రెడ్డి

ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి : సన్న వడ్లు మాత్రమే కొంటామని సిఎం రేవంత్‌రెడ్డి ప్రకటించినట్టుగా తప్పుడు ప్రచారంతో ఆయన మాటలను వక్రీకరించి బిఆర్ఎస్ నేతలు తమ ఉనికిని కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ కో కన్వీనర్ కనమేని చక్రధర్ రెడ్డి ఆరోపించారు. బిఆర్ఎస్ నేతలు చేస్తున్నది విష ప్రచారమని ఆరోపిస్తూ గురువారం సిరిసిల్ల ప్రెస్ క్లబ్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో ఈ ప్రచారాన్ని ఖండించారు. ఈ సందర్భంగా చక్రధర్ రెడ్డి మాట్లాడుతూ బిఆర్ఎస్ నేతలు తమ పార్టీ ఉనికి, తమ ఉనికి కోల్పోతున్నామని, సిఎం రేవంత్‌రెడ్డికి మంచి పేరు వస్తున్నదని ఉద్దేశంతో తమ ఉనికిని కాపాడుకోవడానికి సిఎం వ్యాఖ్యలను వక్రీకరించి తప్పుడు ప్రచారానికి పూనుకున్నారని ఆరోపించారు. ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో పది స్థానాలలో బీఆర్ఎస్ డిపాజిట్లు కోల్పోతున్నదని, కనీసం ఒక్క సీటు కూడా వచ్చే పరిస్థితి లేదన్నారు. లేని పోని కల్లబొల్లి మాటలతో విష ప్రచారం చేస్తున్నారని అన్నారు. అన్ని రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యంను ప్రజలకు పంపిణీ చేస్తామని చెప్పిన మాటలను వక్రీకరించి జిల్లా కేంద్రాలలో ధర్నాకు పూనుకోవడం వారి అవివేకానికి నిదర్శనం అన్నారు. ఇప్పటికే లక్ష మెట్రిక్ టన్నుల వడ్లను కాంగ్రెస్ ప్రభుత్వం కొన్నదని, ఎక్కడ కూడా బార్దాను, కాంటాలు, మంచినీరు, రవాణా సౌకర్యాలకు కొరత లేకుండా ధాన్యం సేకరణ జరిగిందన్నారు 95 శాతం ధాన్యం సేకరణ జరిగిందని, నాలుగు రోజులలోనే వారికి డబ్బులు అందడంతో రైతులు సంతోషంతో ఉన్నారని, ఇప్పటికే రూ. 700 కోట్లు ప్రజల ఖాతాల్లో పడ్డాయి అన్నారు. బీఆర్ఎస్ పాలనలో ఎప్పుడు కూడా పెట్టుబడి సాయం అందలేదని, సరైన సమయానికి జీతాలు ఇవ్వలేదని, నెలాఖరుకు పెన్షన్లు వేశారని కానీ రేవంత్ రెడ్డి ప్రభుత్వం మొదటి వారంలోనే వీటిని లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తున్నదన్నారు. దీనిని కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావులు చూసి తట్టుకోలేక విష ప్రచారానికి పూనుకున్నారన్నారని ఆరోపించారు.

కొనుగోలు కేంద్రాల పరిశీలన

ప్రజాపక్షం/దిల్వార్పూర్ : మండలంలోని బన్సపల్లి,దిలావర్పూర్,గ్రామాల్లో వరి కొనుగోలు కేంద్రాలను గురువారం ఆర్డిఓ రత్నకళ్యాణి పరిశీలించారు.అకాల వర్షాలు కురవడంతో రైతులు నష్టం జరిగే పరిస్థితులు ఉన్నాయని,వెంటవెంటనే రైతుల నుండి కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని,కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే గోడౌన్కు తరిలించాలని సూచించారు.కొనుగోలు కేంద్రాల వద్ద తగిన వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు.ఆమె తో తాహసిల్దార్ స్వాతి,వ్యవసాయ అధికారి స్రవంతి,ఆర్ఎస్ఐ సంతోష్ తదితరులు ఉన్నారు.

అప్పుల బాధతో యువరైతు ఆత్మహత్య

ప్రజాపక్షం/నిజాంపేట్: నిజాంపేట్ మండల కేంద్రానికి చెందిన గెరిగంటి ఎల్లయ్య, వయస్సు 45 సంవత్సరాలు అను వ్యక్తి వ్యవసాయ పెట్టుబడుల గురించి తెలిసిన వారి వద్ద సుమారు 4 లక్షల రూపాయలు అప్పుచేసి వ్యవసాయం చేస్తున్నాడు. వరి పంట సరిగా పండక పోవడంతో అప్పు తీర్చే మార్గం లేక మనస్తాపంతో జీవితంపై విరక్తి చెంది బుధవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో తన ఇంటి ముందర గల వేప చెట్టుకు ఉరి వేసుకుని మరణించాడం జరిగింది. ఈ విషయంపై అతని భార్య అగు వరలక్ష్మి గురువారం రోజున స్థానిక పోలీసులకు ఫిర్యాదు ఇవ్వగా నిజాంపేట్ పియస్ ఎస్‌హెచ్‌ఓ కేసు దర్యాప్తు ప్రారంభించారు.

పిడుగుపాటుకు రైతు మృతి

ప్రజాపక్షం/తంగళ్ళపల్లి : రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి మండలం ఇందిరా నగర్ గ్రామంలోని, భరత్ నగర్‌కు చెందిన ఓ రైతు వ్యవసాయ పొలంలో పనులు చేస్తుండగా పిడుగు పడి మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. గురువారం సాయంత్రం ఐదు గంటల సమయంలో స్థానికులు వెల్లడించిన ప్రకారం భరత్ నగర్ కు చెందిన రుద్రారపు చంద్రయ్య అనే రైతు పొలం వద్ద పొలం పనులు చేస్తుండగా ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో, కూడిన వర్షం పడడంతో అక్కడే పొలంలో పనులు చేస్తున్న చంద్రయ్య అనే రైతుపై పిడుగు పడటంతో అక్కడికక్కడే మృతి చెందడం జరిగిందని తెలిపారు. వెంటనే స్థానికులు మృతదేహాన్ని అతని ఇంటి వద్దకు తీసుకువచ్చారు. మృతుడికి భార్య కళావతి, నలుగురు కుమార్తెలు, ఒక కొడుకు ఉన్నాడు. ఈ సంఘటనకు సంబంధించిన పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

జైనూర్‌లో కొనసాగుతున్న 144 సెక్షన్

ప్రజాపక్షం/ జైనూర్ : కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలంలో ఇరువర్గాల మధ్య చోటు చేసుకున్న ఘర్షణల నేపథ్యంలో పోలీసులు విధించిన 144 సెక్షన్ గురువారం మూడో రోజుకు చేరుకుంది. జైనూర్ మండల కేంద్రంలో శాంతిభద్రతల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ఠ బందోబస్తు చేపడుతున్నారు. వ్యాపారులు మూడో రోజు సైతం సంపూర్ణ బంద్ నిర్వహించి శాంతి భద్రతలకు సహకరిస్తున్నారు.

బియ్యం డెలివరీ వేగవంతం

ప్రజాపక్షం/మెదక్ ప్రతినిధి: మెదక్ జిల్లాలో 2022/23 సీజన్ బియ్యం డెలివరీ, రబీకి సంబంధించి టెండర్ అయిన ధాన్యం అప్పగింతలు త్వరగా చేయాలని రైస్ మిల్ యజమానులకు మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ హెచ్చరించారు. నర్సాపూర్ మండలం రెడ్డిపల్లి గ్రామంలో ఉన్న వేంకటేశ్వర రైస్ మిల్ ను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ జిల్లా లో ఉన్న మిల్లర్లు బియ్యం డెలివరీ వేగవంతం చేసి త్వరగ వానాకాలం ధాన్యం బియ్యం అప్పగించాలని, టెండర్ పూర్తి అయిన యాసంగి రభి 2022/23 ధాన్యం వెనువెంటనే అప్పగించేలా చర్యలు తీసుకోవాలని మిల్లర్లకు సూచించారు. బియ్యం డెలివరీలో జిల్లాలను ముందు వరుసలో నిలపాలని, రోజు వారి బియ్యం పంపిణీపై సమీక్ష చేసి రోజు వారి నివేదికలు అందజేయాలని అధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులు జిల్లా మేనేజర్ హరికృష్ణ ,సివిల్ సప్లై కార్పొరేషన్ సిబ్బంది ఉన్నారు.

భూ సేకరణ పనులు వేగవంతం

ప్రజాపక్షం/రాజన్నసిరిసిల్ల ప్రతినిధి: కొత్తపల్లి మనోహరాబాద్ రైల్వే లైన్ నిర్మాణానికి భూ సేకరణ పనులు వేగంగా పూర్తి చేయాలనికలెక్టర్అనురాగ్ జయంతి ఆదేశించారు. భూ సేకరణ పనులు, ఇతర అంశాలపై వివిధ శాఖల ఉన్నతాధికారులతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని తన ఛాంబర్ లో కలెక్టర్ అనురాగ్ జయంతి గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. కొత్తపల్లి మనోహరాబాద్ రైల్వే లైన్ నిర్మాణానికి జిల్లాలోని వేములవాడ నియోజకవర్గం పరిధిలోని వేములవాడ, అనుపురం, కొడుముంజ, నాంపల్లిలో ఇంకా భూ సేకరణ చేయాల్సి ఉందని వివరించారు. అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, డీఎఫ్ఓ బాలామణి, రైల్వే శాఖ సీఈ, సిరిసిల్ల ఆర్డీవో రమేష్, ఏడీ సర్వే శ్రీనివాస్, ఆర్ అండ్ బీ, ఉద్యానవన ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

'పట్టభద్రుల' ఉప ఎన్నికకు ఏర్పాట్లు సిద్ధం



ప్రజాపక్షం/ వరంగల్ ప్రతినిధి: వరంగల్ ఖమ్మం నల్గొండ శాసన మండలి పట్టభద్రుల ఉప ఎన్నిక నిర్వాహణకు అన్ని ఏర్పాట్లను సిద్ధం చేస్తున్నట్లు వరంగల్ జిల్లా కలెక్టర్ ప్రావిణ్య తెలిపారు. బుధవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం హైదరాబాద్ నుండి వరంగల్‌ఖమ్మంనల్గొండ శాసనమండలి నియోజకవర్గ ఉప ఎన్నిక పోలింగ్ నిర్వహణ ప్రక్రియపై వరంగల్, ఖమ్మం, నల్గొండ ఉమ్మడి జిల్లాల కలెక్టర్‌లతో వీడియో కాన్ఫరెన్స్ గురువారం నిర్వహించారు. అదనపు సీఈఓ లోకేష్‌కుమార్, జాయింట్ సీఈఓ సర్ఫరాజ్ అహ్మద్ మాట్లాడుతూ ఈనెల 27న జరుగనున్న వరంగల్ ఖమ్మం నల్గొండపట్టభద్రుల శాసనమండలి ఉప ఎన్నికకు జంబో బ్యాలెట్ బాక్స్‌లు, అదను బాలెట్ బాక్స్‌లు సిద్ధం చేయాలని తెలిపారు. బాలెట్ బాక్స్‌లకు యూనిక్ నెంబర్లు వేయాలన్నారు.వరంగల్ జిల్లా కలెక్టర్ ప్రావిణ్య మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు జిల్లాలోని 59 పోలింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. 65 జంబో బాక్స్‌లు, 48 పెద్ద బాక్స్‌లు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు.

నాగార్జునసాగర్ ప్రాజెక్టు పరిశీలన



ప్రజాపక్షం/నందికొండ: ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జునసాగర్‌ను గురువారం రాష్ట్ర నీటిపారుదల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రాహుల్ బొజ్జ నాగార్జునసాగర్ ను సందర్శించారు. ఆయనకు నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఎస్ ఈ నాగేశ్వరరావు పుష్పగుచ్చం అందజేసి స్వాగతం పలికారు. ఆ తర్వాత ప్రాజెక్ట్ అధికారులు వీరికి నాగార్జునసాగర్ మోడల్ డ్యామ్ కు సంబంధించిన విశేషాలను,నాగార్జున సాగర్ ప్రాజెక్టు యొక్క విశిష్టతను, దాని పని తీరును తెలియజేశారు. అదేవిధంగా ప్రాజెక్టుకు సంబంధించి తెలంగాణా సంబసరిహద్దు వివరాలను,ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థం, ప్రాజెక్టు క్రస్ట్ గేట్లు పని చేసే విధానాన్ని, విద్యుత్ ఉత్పత్తి గురించి వివరించారు. వీరితో పాటు ప్రాజెక్టు ఎస్ ఈ నాగేశ్వరరావు,ఎస్ పి ఎఫ్ ఆర్ ఐ భాస్కర్ రెడ్డి,ఏఈ లు కృష్ణయ్య, సత్యనారాయణ, బిక్షపతి లు ఉన్నారు.

శ్రీచైతన్యపై స్పందించరేమి?

అనుమతి లేని పాఠశాలను సీజ్ చేయాలి

విద్యాశాఖ అండతోనే ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న ప్రైవేట్ పాఠశాలలు

ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి

ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధిః కరీంనగర్ నగరంలో అనుమతి రాకముందే కార్పొరేట్ శ్రీ చైతన్య పాఠశాల వారు ముందస్తు అడ్మిషన్లు, ప్రచారం నిర్వహిస్తున్న జిల్లా విద్యాశాఖ అధికారులు పట్టించుకోకుండా వారికి వత్తాసు పలుకుతున్నారని, అనుమతి లేదని చెబుతున్నా అధికారులు వచ్చి ఎందుకు సీజ్ చేయకుండా శ్రీ చైతన్య పాఠశాల వారివత్తాసు పలుకుతున్నారని, కరీంనగర్ జిల్లాలో డీఈవో అండదండలతోనే ప్రైవేట్ పాఠశాల వారు విద్యా వ్యాపారం చేస్తున్నారని జిల్లా డీఈవోను సస్పెండ్ చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి డిమాండ్ చేశారు. కరీంనగర్ లోని జ్యోతిరావుపూలే గ్రౌండ్ వెనుక అనుమతి లేకుండానే అడ్మిషన్లు, ప్రచారం నిర్వహిస్తున్న శ్రీ చైతన్య పాఠశాల వద్ద ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనుమతి లేని పాఠశాలను సీజ్ చేయాలని డీఈఓ, ఎంఈవోలకు సమాచారం ఇచ్చినప్పటికీ రాలేదని, చివరకు ఏఐఎస్ఎఫ్ నాయకులే పాఠశాల సిబ్బందిని బయటకి సిబ్బందితో పంపించి గేట్ కు తాళం వేయడం జరిగిందన్నారు. మణికంఠరెడ్డి మాట్లాడుతూ శ్రీచైతన్య పాఠశాల వారు అనుమతులు రాకముందే ప్రచారం ,అడ్మిషన్లు నిర్వహిస్తూ ఆ భవనంలోనే కార్యకలాపాలు కొనసాగిస్తున్న విద్యాశాల అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారన్నారు. గురువారం అక్కడ ధర్నా చేస్తున్నామని, సీజ్ చేయాలని చెప్పిన రాకుండా వారికి వత్తాసు పలికారన్నారు. శ్రీ చైతన్య పాఠశాలల వారు నగరంలో , నగర పాఠశాలలు నిర్వహిస్తున్నారని, కరీంనగర్ జిల్లాలలో , నగరంలో ప్రైవేట్ పాఠశాలలు వారు విద్యా వ్యాపారం చేస్తూ అక్షరాలలతో లక్షల రూపాయల దోపిడీ చేస్తున్నారన్నారు. కరీంనగర్ జిల్లాలో బిటెక్ ఫీజుల కంటే ఎల్‌కేజీ ఫీజులే ఎక్కువగా ఉన్నాయన్నారు. అడ్మిషన్ ఫీజు పేరుతో అయిదు వేల నుంచి రూ.20వేలవరకువసూలు చేస్తున్నారన్నారు. నిబంధనలకు విరుద్ధంగా టెక్నో, ఈటెక్నో, ఒలంపియాడ్,వరల్డ్ అని హోర్డింగ్స్ ద్వారా విస్తృత ప్రచారం చేస్తున్నా ఎందుకు అధికారులు చర్యలు తీసుకోవడం లేదని , ఇప్పటికే అనేక పాఠశాలల ఆవరణలోనే వచ్చే విద్యాసంవత్సరం పాఠ్యాపుస్తకాలు, యూనిఫామ్స్ అమ్ముతున్నారని, ఫీజుల నియంత్రణ లేదని మౌలిక వసతుల కల్పనలేదని, ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న ప్రైవేట్ పాఠశాలలకు జిల్లా విద్యాశాఖ అధికారులే వత్తాసు పలుకుతూ వారికి అండగా నిలుస్తున్నా కరీంనగర్ జిల్లా డీఈవోను సస్పెండ్ చేయాలని , వెంటనే కరీంనగర్ నగరంలోనిబంధన విరుద్ధంగా అనుమతులు లేకుండా నిర్వహణలో ఉన్న, ఇష్టానుసారంగా ఫీజుల దోపిడీ చేస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనుమతి లేని పాఠశాలల పేర్లు బహిర్గతం చేయాలని, లేని పక్షంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో డీఈవో చాంబర్ ముట్టడిస్తామని మణికంఠరెడ్డి హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శి రామారపు వెంకటేష్, మచ్చ రమేష్, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి మామిడిపల్లి హేమంత్, జిల్లా ఉపాధ్యక్షుడు కనకం సాగర్, నగర వర్కింగ్ ప్రెసిడెంట్ నునావత్ శ్రీనివాస్ నాయక్, నగర నాయకులు సందీప్ రెడ్డి, వినయ్ రెడ్డి, శ్రావణ్ తదితరులున్నారు.

బిజెపి ప్రభుత్వం చేసిందేమీలేదు

సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్నా చంద్రశేఖర్

ప్రజాపక్షం/హుజూర్‌నగర్‌: దేశంలోని పేద,మధ్యతరగతి ప్రజలకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చేసిందేమీలేదని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్నా చంద్రశేఖర్ అన్నారు.గురువారం సిపిఐ కార్యాలయంలో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశ ప్రజలు ఎవరి పైసలతో వారే బ్యాంకు అకౌంట్ తెరిస్తే దాని పేరు జన్‌ధన్ అని, ఎవరి ఇల్లు వారే ఊడ్చుకుంటే స్వచ్ఛభారత్ అని, ఎవరి పిల్లలను వారే పెంచుకుంటే బేటీ బచావో బేటీ పడావో అని పిల్లల కోసం అకౌంట్లో పైసలు దాస్తే సుకన్య సమృద్ధి యోజన అని ఈ పథకాల్లో కేంద్ర ప్రభుత్వం ప్రజలకు ఏం చేసిందని ప్రశ్నించారు. యువతను నష్టపరిచేలా దేశంలో ఐదుకోట్ల ఉద్యోగాలు పోయాయని విమర్శించారు. బిజెపి ప్రభుత్వం కేంద్రంలోని అన్ని సంస్థలను వశపర్చుకుని ప్రతిపక్ష పార్టీలను ఇబ్బందుల పాలు చేస్తుందన్నారు. బిజెపి పాలకులు దేశం సెక్యూలర్ దేశమన్న విషయాన్ని మర్చిపోయారన్నారు. రాబోవు కాలంలో ప్రజలు మతాన్ని పక్కన పెట్టి అభివృద్ధిపై దృష్టి పెట్టే నాయకులను ఎన్నుకోబోతున్నారన్నారు. బిజెపికి గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు.

సిపిఐ నాయకుల పరామర్శ

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ రాష్ట్ర కౌలు రైతు సంఘం కార్యదర్శి కొప్పోజు సూర్యనారాయణను సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్నా చంద్రశేఖర్, సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కంబాల శ్రీనివాస్, దేవరం మల్లీశ్వరీ, పోకల వెంకటేశ్వర్లు, సిపిఐ పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు, నంద్యాల రాంరెడ్డిలు పరామర్శించారు.

'యార్లగడ్డ' విగ్రహాన్ని ఆవిష్కరించిన కూనంనేని

ప్రజాపక్షం/ దమ్మపేట: భారత కమ్యూనిస్టు జిల్లా కార్యవర్గ సభ్యులు, వ్యవసాయ కార్మికసంఘం నాయకులు యార్లగడ్డ భాస్కర్‌రావు మృతి ప్రజా ఉద్యమాలకు, కమ్యూనిస్టు పార్టీకి తీరని లోటని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు తెలిపారు. అనేక ప్రజా ఉద్యమాలకు దమ్మపేటలో యార్లగడ్డ నేతృత్వం వహించారన్నారు. ఇటీవల మృతి చెందిన యార్లగడ్డ భాస్కర్‌రావు విగ్రహాన్ని కూనంనేని ఆవిష్కరించగా స్మారక స్తూపాన్ని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బాగం హేమంతరావు ఆవిష్కరించారు.కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారానికి భాస్కర్‌కృషిచేశారన్నారు.మారుతున్నసామాజిక,ఆర్థిక, రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో తుదిశ్వాస వరకు కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తగా,నాయకునిగా పనిచేసిన భాస్కర్‌రావు ధన్యజీవి అన్నారు. రాజకీయాలలో ఆర్థిక వ్యవహారాలుపెచ్చుమీరిన నేటి రోజుల్లో ఎర్ర జెండా నీడన పని చేయడం గొప్ప విషయమన్నారు. సమాజంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ప్రజాఉద్యమాలతీరు మారాలని పిలుపునిచ్చారు.కేంద్రంలోఫాసిస్టు సర్కార్‌కు వ్యతిరేకంగాగ్రామస్థాయిలో ప్రజా ఉద్యమాలు నిర్మించబడాలన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు బాగం హేమంతరావు, ఖమ్మం జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, భద్రా ద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా, నాయకులు ముత్యాల విశ్వనాథం, నరాటి ప్రసాద్, సయ్యద్ సలీం, రేసు ఎల్లయ్య, సుబ్బారెడ్డి, సిపిఐ, టిడిపి, కాంగ్రెస్, సిపిఎం, సిపిఐ (ఎంఎల్) నాయకులు పాల్గొన్నారు.

అశ్రునయనాల మధ్య రాయల అంత్యక్రియలు

ప్రజాపక్షం/ తల్లాడ : అశ్రునయనాల మధ్య దివంగత బిఆర్‌ఎస్ నేత, మాజీ ఎంపిపి,డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ రాయల వెంకట శేషగిరిరావు అంత్యక్రియలు గురువారం ఆయన స్వగ్రామంలో జరిగాయి. హైదరాబాద్‌లో బుధవారం మరణించిన శేషగిరి పార్థీవ దేహాన్ని తల్లాడ మండలం మిట్టపల్లికి తరలించారు.వేలాది మంది అభిమానులు,బిఆర్‌ఎస్ కార్యకర్తలు, జిల్లా లోనిప్రముఖులు, వివిధ రంగాలకు చెందిన వారు నివాళులర్పించారు. రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, ఖమ్మం ఎంపి నామ నాగేశ్వరరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు, సిపిఐ సీనియర్ నాయకులు, మాజీ శాసనసభ, శాసన మండలి సభ్యులు పువ్వాడ నాగేశ్వరరావు,శాసనమండలిసభ్యులు తాతా మధుసూదన్, మాజీ శాసనసభ్యులు కొండబాల కోటేశ్వరరావు, సండ్ర వెంకట వీరయ్య, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాగం హేమంతరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి పోటుప్రసాద్, కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్, పువ్వాళ్ల దుర్గాప్రసాద్, వివిధ పార్టీల నాయకులు జక్కంపూడి కృష్ణమూర్తి, ఎంపిపి దొడ్డా శ్రీనివాస్, దుగ్గి దేవర వెంకట్‌లాల్, రెడ్డెం వీరమోహన్‌రెడ్డి, దివ్వెల కృష్ణయ్య, సుధాకర్, రామలింగేశ్వరరావు, రాయల రాము, బిజెపి నాయకులు తాండ్ర వినోద్‌రావు నివాళులర్పించారు. రాయల శేషగిరి విద్యావంతుడిగా, బాహుబాషా కోవిధునిగా పేరొందారు. కాంగ్రెస్‌తో ప్రారంభమైన ఆయన రాజకీయ జీవితం ఎన్నో మలుపులు తిరిగింది. 46 ఏళ్ల రాజకీయ జీవితంలో ఎంపిపిగా, సొసైటీ ఛైర్మన్‌గా,డిసిఎంఎస్ అధ్యక్షునిగా పని చేశారు. 1982లో ఎన్‌టిఆర్ పిలుపు మేరకు టిడిపిలో చేరిన ఆయన తల్లాడ మండల అధ్యక్షునిగా పనిచేశారు. 1987 ఎన్నికల్లో తల్లాడ మండల పరిషత్ అధ్యక్షునిగా ఎన్నికయ్యారు. 1995 నుంచి పలు మార్లు గంగదేవి పాడు సొసైటీ ఛైర్మన్‌గా ఎన్నికై డిసిసిబి డైరెక్టర్‌గా పనిచేశారు. 2018 లో టిడిపి నుంచి బిఆర్‌ఎస్‌లో చేరారు. ఇంగ్లీష్ అనర్గళంగా మాట్లాడే రాయల శేషగిరి ఎన్‌టి రామారావు, చంద్రబాబు నాయుడు, కేసిఆర్, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో సన్నిహిత సంబంధాలు ఉండేవి. సమస్యల పరిష్కారానికి కృషి చేసేవారు. గవర్నర్లుగా పనిచేసిన పలువురితోను పరిచయాలు ఉండేవి. రాయల మృతితో తల్లాడ మండలం ఒక అనుభవం కలిగిన రాజకీయ నాయకున్ని కోల్పోయింది.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

అధికారులకు జనగామ కలెక్టర్ రిజ్వాన్ భాష షేక్ దిశానిర్దేశనం

ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి: ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాష షేక్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో ధాన్యం కొనుగోళ్లపై సమీక్ష నిర్వయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆకాల వర్షాలు కురుస్తున్నందున కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని త్వరగా కాంటాలు వేసి పంపించాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని సైతం అక్కడే నిల్వ ఉండకుండా వెంట వెంటనే తరలించాలని, కొనుగోలు కేంద్రాల వద్ద ఎవైనా ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తేవాలన్నారు. ఓపిఎంఎస్‌లో ఎప్పటికి అప్పుడు రైతుల ధాన్యం వివరాలు నమోదు చేయాలని, ఎటువంటి అలసత్వం వహించకుండా కొనుగోళ్లు జరపాలన్నారు. టార్పాలిన్లు అందుబాటులో ఉంచడంతో పాటు రైతులకు కావల్సిన సహాయ, సదుపాయాలు కల్పించాలన్నారు. వెనువెంటనే కొనుగోలు చేయడం వలన రైతులు సైతులు కొనుగోలు కేంద్రానికి రావడం తగ్గుతుందన్నారు. డిసిఎస్ఓ రోజారాణి,డిఎంసిఎస్‌ప్రసాద్ పాల్గొన్నారు.

25 నాటికి అమ్మ ఆదర్శపాఠశాల పనులు పూర్తి చేయాలి

ఈ నెల 25 నాటికి అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాష షేక్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో స్థానిక అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్‌తో కలిసి అమ్మ ఆదర్శ పాఠశాలలపై సమీక్ష నిర్వయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆదర్శ పాఠశాలల పనులు, ఈజీఎస్, అంగన్‌వాడీ కేంద్రాల విద్యార్థులక యూనిఫాం పనులు పూర్తి చేయాలనిన్నారు. జిల్లాలో 263 పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు ద్వారా పనులు గుర్తించినట్లు తెలిపారు. ఈ మేరకు గుర్తించిన పనులను వేగం పూర్తి చేయాల్సిన అవసరం ఉందనానరు. పెండింగ్‌లో ఉన్న పనుల్ని పూర్తి చేస్తే ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉంటుందన్నారు. టాయిలెట్స్, తాగునీరు, విద్యుత్, గేట్లు, ప్రహరీ గోడ నిర్మాణం తదితర మౌలిక వసతులు పూర్తి చేయాలని ఆదేశించారు.పనులపై మండల స్థాయిలో యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని ఎంపిడిఓలను ఆదేశించారు. విద్యార్థుల యూన్‌ఫాం కుట్టు పనులు జూన్ 5లోపు పూర్తిచేయాలన్నారు. ఉపాధి పనుల్ని వేగవంతం చేయాలని, పని ధినాలు 200 రోజులకు పెంచాలని ఇందులో స్పెషల్ అధికారులు కీలక పాత్ర పోషించాలన్నారు. అంగన్వాడీల్లో పోషకాహారంపై నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, ప్రతి బుధవారం పంచాయితీ కార్యదర్శులు అంగన్‌వాడీ కేంద్రాన్ని పర్యవేక్షించాలన్నారు. మండల స్పెషల్ అధికారులు, జడ్‌పి సిఈఓ అనిల్‌కుమార్, డిఈఓ రాముల, డిఏఓ వినోద్‌కుమార్, బిసి వెల్ఫేర్ అధికారి రవీందర్,ఉద్యానవన శాఖ అధికారి కేఆర్ లత, డిఎంఓ నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కొత్తగూడెంలో సిపిఐలో చేరికల పరంపర

ప్రజాపక్షం/కొత్తగూడెం: సిపిఐ జిల్లా కార్యాలయంలో గురువారం రామాంజనేయ కాలనీ నుండి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం శాసనసభ్యులు ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సమక్షంలో సిపిఐలో కొందరు చేరారు. భాషీర్, యాకూబ్, జహేద్, యాకూబ్ కాన్, మాగ్బుల్, షరీఫ్, వారితో పాటు 20 కుటుంబాలు చేరారు. కొత్తగూడెం నియోజవర్గ అభివృద్ధి కోసం శాసన సభ్యులు చేస్తున్న కృషికి ఆయనకు తోడుగా నిలవాలనే ఉద్దేశ్యంతో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్‌పాషా సారధ్యంలో చేరారు.ఈ సందర్భంగా వారిని సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు వాసిరెడ్డి మురళి,భూక్యా ధస్రు, సిపిఐ వార్డు కౌన్సిలర్ యూసుఫ్,లింగేశ్ తదితరులు ఉన్నారు

పచ్చిమిర్చి ధర పైపైకి..

(మొదటి పేజీ తరువాయి)

రూ.50 నుండి రూ.60 వరకు పలికిన కిలో మిర్చి ధర ప్రస్తుతం రెట్టింపుకు చేరింది. దీంతో పచ్చిమిర్చి కొనేందుకు వినియోగదారులు జంకుతున్నారు. పచ్చిమర్చి పంట సరిగా పండక పోవడంతో ధరలు భగ్గుమంటున్నాయి. నిత్యావసర సరుకుల ధరలు అధికమై జనం బెంబేలెత్తుతున్న తరుణంలో కూరగాయల ధరలు మరింత ఇబ్బంది పెడుతున్నాయి. ఇదిలా ఉండగా టమాట ధర కిలో రూ.140 వరకు పలుకుతోంది. ఈ ధర గత నెలకంటే రెండు రెట్లు అధికంగా ఉంది. దీంతో పాటు ఉల్లిపాయల ధరలు, మునగకాయలు, ఆకు కూరల ధరలు రోజురోజుకూ స్వల్పంగా పెరుగుతున్నాయే తప్ప తగ్గే పరిస్థితి లేదు. అనుకున్న రీతిలో మిర్చి దిగుబడి రాకపోవడంతో పచ్చిమిర్చి ధర పిరమైంది. దీంతో రైతులతో పాటు వినియోగ దారులు ఆందోళన చెందుతున్నారు. సాగునీరు అందక పోవడంతో పాటు అకాల వర్షాలు కురియటంతో దిగుబడిపై ప్రభావం పడింది. ఆశించిన స్థాయిలో దిగుబడి లేక డిమాండ్ పెరిగి ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. మరో ప్రక్క పెళ్లిళ్ల సీజన కావడంతో టమాట, పచ్చిమిర్చితో పాటు అన్ని రకాల కూరగాయలు ధరలు పెరిగిపోయాయి. పెరిగిన యాంత్రిక జీవనంతో జీవన విధానం కూడా మారిపోయింది. ఇంటి పెరటిలో పండించుకునే చిన్న చిన్న పంటలను కూడా బహిరంగ మార్కెట్లో కొనుగోలు చేస్తున్నారు. దీంతో ఉత్పత్తి కంటే డిమాండ్ అధికంగా ఉంది. తద్వారా రేట్లు మండిపోతున్నాయి. గతంలో పల్లెల్లో పచ్చిమర్చి, టమాట,బెండ, వంకాయ, దొండ కాయ వంటివి పెరళ్లలో పండించే వారు. ఇప్పుడు అంతా పల్లెలను వదిలి పట్టణాలకు బతుకు దెరువు కోసం పరుగులు తీస్తున్న క్రమంలో పల్లె పెరళ్లు బోసిపోతున్నాయి. ఇదిలా ఉండగా పట్టణాల్లో ఉండే మిద్దెల్లో సైతం కుండీలు, తొట్లలో రసాయన రహిత కూరగాయలు, ఆకు కూరలు పండించుకునే పరిస్థితి ఉన్నా ఆదిశగా ఎవరూ అడుగులు వేయడం లేదు. ఇప్పటికైనా ఉద్యానవన శాఖ ఆ దిశగా ప్రయత్నాలు సాగించాలని, పల్లెల్లో పెరళ్ల అందుబాటులు ఉన్న వారికి ఉచితంగా మిర్చి, టమాట,కూరగాయల విత్తనాలు అందజేసి ప్రోత్సహించాలని పలువురు కోరుతున్నారు.

5న రెండు ముక్కలుగా బిజెపి

(మొదటి పేజీ తరువాయి)

అన్నారు. బిజెపితో 30 ఏళ్ళు కలిసి ప్రయాణం చేసినప్పటికీ, ఆ పార్టీలో తాము విలీనం కాలేదని గుర్తు చేశారు. జూన్ 5వ తేదీన నువ్వు మాజీ ప్రధానివి అవుతావని దేశంలోని ఓటర్లు నిర్ణయించుకున్నారని థాక్రే అన్నారు. జూన్ 5న నీ పార్టీకి ఏమవుతుందంటే, అది చీలిపోతుందన్నారు. 75 ఏళ్ళు పూర్తయిన తరువాత రాజకీయాల్లో కొనసాగుతారో లేదో అనే విషయాన్ని మోదీ ప్రకటించాలని ఉద్ధవ్ సవాలు విసిరారు.

మోదీ పేరుతో ఓట్లు అడిగినందుకు సారీ

2014, 2019 ఎన్నికలలో మోదీ పేరుతో ఓట్లు అడిగినందుకు ఉద్ధవ్ థాక్రే క్షమాపణ చెప్పారు. మహారాష్ట్రకు బిజెపి, మోదీ వెన్నుపోటు పొడిచారని విమర్శించారు. ఈ రాష్ట్రం వారికి 40కి పైగా ఎంపిలను ఇచ్చినప్పటికీ, గుజరాత్‌లోనే పరిశ్రమలు ఏర్పాటు చేస్తున్నారని, మహారాష్ట్ర, గుజరాత్ రైతుల మధ్య వివక్ష ప్రదర్శిస్తున్నారని మండిపడ్డారు. ఉల్లిగడ్డలను ఎగుమతి చేసుందుకు గుజరాత్‌లో అనుమతించి, మహారాష్ట్రలో అనుమతించలేదన్నారు.

ఇడి అరెస్టు చేయొద్దు

(మొదటి పేజీ తరువాయి)

తీసుకోవాలనుకుంటే.. అప్పుడు దర్యాప్తు సంస్థ ప్రత్యేక కోర్టులో దరఖాస్తు చేసుకోవాలి. దీనిపై న్యాయస్థానం విచారణ జరుపుతుంది. ఇడి కారణాలతో కోర్టు సంతృప్తి చెందితేనే కస్టోడియల్ విచారణకు అనుమతినిస్తుంది' అని సుప్రీంకోర్టు ధర్మాసనం వెల్లడించింది. మనీలాండరింగ్ కేసుల్లో ఇడి స్వాధీనం చేసుకున్న మెటీరియల్ ఆధారంగా ఓ వ్యక్తి నేరానికి పాల్పడ్డాడని దర్యాప్తు సంస్థ విశ్వసిస్తే అప్పుడు సెక్షన్ 19 కింద నిందితుడిని అరెస్టు చేసే అధికారం ఉంటుంది. అయితే, అరెస్టుకు గల కారణాలను ఇడి సదరు వ్యక్తికి వీలైంతన త్వరగా తెలియజేయాల్సి ఉంటుంది.

117 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు

జయశంకర్ జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా

ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి : యసంగి ధాన్యం కొనుగోళ్ళను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో యాసంగి ధాన్యం కొనుగోళ్ల పై వ్యవసాయ శాఖ, సహకార శాఖ, తూనికలు కొలతలు, మార్కెటింగ్, డీఆర్డీఏ పౌర సరఫరాలు, పౌర సరఫరాల సంస్థ, రైస్ మిల్లర్లు, కొనుగోలు కేంద్రాల ఇంచార్జిలతో సమీక్షా సమావేశం నిర్వహించారు.కలెక్టర్ మాట్లాడుతూ, యసంగి ధాన్యం కొనుగోలు చేసేందుకు జిల్లా వ్యాప్తంగా117 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ఇప్పటి వరకు 16 వేల 500 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని తెలిపారు.వాతావరణంలో మార్పుల వల్ల అకాల వర్షాలు కురిసే అవకాశం ఉందని, ఇప్పటివరకు 3వేల టార్పలిన్ లు కొనుగోలు కేంద్రాలకు అందజేశామన్నారు. అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా వ్యవసాయ అధికారి విజయ్ భాస్కర్, డిఆర్డిఓ నరేష్, పౌర సరఫరాల అధికారి నర్సింగరావు, జిల్లా సివిల్ సప్లై సంస్థ మేనేజర్ రాఘవేందర్, తూనికలు కొలతల శాఖ అధికారి శ్రీలత,మార్కెటింగ్అధికారి కనక శేఖర్, అధికారులు, సిబ్బంది తదితరులున్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad - 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com

ప్రజాపక్షం
మహానగరి
హైదరాబాద్ — రంగారెడ్డి
హైదరాబాద్ | శుక్రవారం | 17 మే, 2024 | 9

'అక్రమ నిర్మాణాలను ఉపేక్షించను'

ప్రజాపక్షం/నార్సింగి: గండిపేట మండల పరిధిలో అక్రమ నిర్మాణాలను గురువారం కూల్చివేశారు. గండిపేట మండల తాహాసిల్దార్ శ్రీనివాసరెడ్డి ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు హిమాయత్ సాగర్ విలేజ్ లో నాలుగు అక్రమ నీటి సంపులను గంధంగూడా గ్రామంలోని సర్వేనెంబర్ 62లో మూడు అక్రమ నిర్మాణాలను,అక్రమ నీటి సంపులను, కూల్చివేశమన్నారు. నేక్నంపూర్ ప్రాంతాలలో అక్రమ నిర్మాణాలను కూల్చివేశమని పేర్కొన్నారు. తాహాసిల్దార్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాల్లో అక్రమ నిర్మాణాలను నిర్మిస్తే ఎంతటి వారినైనా సరే ఉపేక్షించేది లేదని స్పష్టంచేశారు. ఆర్ఐ విక్రమ్‌రెడ్డి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇరిగేషన్ అధికారులపై మండిపాటు

ప్రజాపక్షం/వనస్థలిపురం: అధికారుల నిర్లక్ష్యంతో నూతనంగా నిర్మిస్తున్న వాటర్ స్ట్రోమ్ డ్రైన్ పనుల్లో నాణ్యత లేకపోవడంతోనే రోడ్డు కుంగిపోయిందని, దీనికి ఇరిగేషన్ అధికారులు బాధ్యత వహించాలని బిఎన్‌రెడ్డి నగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి మండిపడ్డారు. గురువారం డివిజన్‌లోని పాపిరెడ్డి కాలనీ ఆర్చ్, క్రిస్టల్ ఎవెన్యూ వద్ద నిర్మించిన స్ట్రోమ్ వాటర్ డ్రైన్ పనులను పరిశీలించారు. లచ్చిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న పనులను, అధికారుల నిర్లక్ష్యంతో పనులను పరివేక్షణ లేకపోవడంతోనే కాంట్రాక్టర్ ఇష్టారాజ్యం వహిస్తున్నారనిఆరోపించారు. రోడ్డుపై కుంగిపోయిన స్ట్రోమ్ వాటర్ పైప్ లైనును పునరుద్ధరణ చేసి, ప్రయాణికులకు విముక్తి కలిగించాలన్నారు. రోడ్డుపై మట్టి పోసి రోలింగ్ చేయించాలని సంబంధిత ఇరిగేషన్ అధికారులకు కార్పొరేటర్ సూచించారు.

రోడ్డు ప్రమాదంలో వృద్దుడి మృతి

ప్రజాపక్షం/యాచారం : రోడ్డు ప్రమాదంలో వృద్దుడు మృతి చెందిన సంఘటన యాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని మాల్ గ్రామంలో గురువారం ఉదయం జరిగింది. ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మాల్ కేంద్రంలో మాహ సిమేంటు (మైవోమ్) కంపెనీ చెందిన లారీని డ్రైవర్ అజాగ్రత్తగా నడుపడంతో మర్రిగూడ మండలం కుదాస్‌పల్లి గ్రామానికి చెందిన సిరిపంగి అంతయ్యను ఢికొట్టింది దింతో అంతయ్యను అనుపత్రికి తీసుకెళ్ళగా అక్కడే మృతి చెందాడు. కంపెనీకి చెందిన లారీ డ్రైవర్లు గతంలో పలు ప్రమాదాలకు కారణమైనారు. ఇటి కంపెనీపై చర్యలు తీసుకొని మృతుడి కుంటుబానికి నష్టపరిహారం చెల్లించాలని పలు పార్టీల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు యాచారం సిఐ శంకర్‌కుమార్ తెలిపారు.

ఘనంగా పూర్వవిద్యార్థుల సమ్మేళనం

ప్రజాపక్షం/యాచారం: మండల పరిధిలోని చింతపట్ల గ్రామంలోని జిల్లా పరిషత్త్ ఉన్నత పాఠశాలలో2008/09 బ్యాచ్‌కు చెందిన పూర్వవిద్యార్థుల సమ్మేళనం తక్కళ్ళపల్లి గేటు సమీపంలో ఉన్న నిరీచ్‌మౌండ్ హోటల్ లో ఘనంగా జరిగింది. పూర్వవిద్యార్థులందరు ఒక చోట చేరి అత్మియంగా చిన్నప్పటి జ్ఞాపకాలను పంచుకున్నారు. తమకు చదువు చెప్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థులు ఒకరికి ఒకరు వారి యోగ క్షేమాలను తెలుసుకున్నారు. అను భూతులను పంచుకున్నారు. ఉపాధ్యాయులతో కలిసి ఆడిపాడారు. చిన్నప్పటి రోజులు మళ్ళి వస్తే ఎంత బాగుండు అని నేమరు వేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సత్తయ్య, యాదయ్య, మధుమోహన్, రాజు, అంజప్ప, పూర్వ విధ్యార్థులు మేకం ఐలేశ్,పత్తిరాజు, శ్రీలత, మాధవి, పరమేశ్ తదితరులు పాల్గోన్నారు.

పిహెచ్‌డి సాధించిన మోటే శ్రీనుకు ఘన సన్మానం

ప్రజాపక్షం/యాచారం: మండల పరిధిలోని మేడిపల్లి గ్రామానికి చెందిన మోటే శ్రీను పిహెచ్‌డికి అర్హత సాధించడంతో గ్రామానికి చెందిన ఎవిజి పౌండేషన్ చైర్మేన్ అడాల గణేశ్ శాలువా కప్పి ఘనంగా సన్మానించాలరు ఈ సంధర్భంగా అయన మాట్లాడుతూ మోటే శ్రీను పిహెచ్‌డికి అర్హత సాధించడం ఎంతో హర్షించదగ్గ విషయమని అన్నారు. పట్టుదలతో చదివి శ్రీను మరింతగా ఉన్నత శిఖరాలను చేరుకొవాలని అన్నారు.గ్రామానికి చెందిన యువత గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని అన్నారు. పేద విద్యార్థులకు అండగా తమ పౌండేషన్ కృషి చేస్తుందని అన్నారు. చదువ కొవాలనే పట్టుదల ఉన్న యువతకు తగిన ప్రోత్సాహం అందిచేందుకు కృషి చేస్తామని అన్నారు.

సమస్యలు గాలికి వదిలేసి నిరసనలేలా?

ప్రజాపక్షం/షాద్‌నగర్: మున్సిపాలిటిలో నెలకొన్న సమస్యలను గాలికి వదిలేసి చైర్మెన్ నరేందర్, వైస్ చైర్మెన్ నటరాజన్ నిరసన కార్యక్రమాలు చేయడం ఏమిటని టిఎంఆర్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింగపాగ జంగయ్య ప్రశ్నించారు. పదవీ బాధ్యతలు చేపట్టి నాలుగు ఏళ్లు గడుస్తున్నా షాద్‌నగర్ మున్సిపాలిటిలో ఉన్న సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. సోలీపూర్ గ్రామంలో ఉన్న చెత్త డంపింగ్ యార్డు, డ్రైనేజీ, మంచినీటి సమస్యలు ఎక్కువగా ఉన్నాయని వివరించారు. వీటి గురించి మున్సిపల్ చైర్మెన్ నరేందర్, వైస్ చైర్మెన్ నటరాజన్‌కు అనేక మార్లు ఫిర్యాదులు చేసినా ఫలితం లేకుండా పోయిందని వాపోయారు. సమస్యలతో మున్సిపల్ ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటుంటే ప్రజా ప్రతినిధులు ధర్నాలు, రాస్తారోకోలు చేయడం విడ్డూరంగా ఉందని అన్నారు. సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని వాగ్దానాలు చేసిన నేతలు నేటి వరకు పరిష్కారం చూపించకపోవడంలో అంతర్యమేమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. సోలీపూర్ గ్రామ సమీపంలో ఉన్న వెంచర్‌లోని నీటి గుంతలో పడి చిన్నారులు మృతి చెందారని, ఈ విషయంలో మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు నీటి వరకు గుంత ముయించలేరని వివరించారు. ధర్నాలు, రాస్తారోకోలు చేయడం మాని ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలని కోరారు.

స్ట్రాంగ్ రూమ్‌ల పరిశీలన

ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి:చేవెళ్ల మండలం గొల్లపల్లి గ్రామంలోని బండారి శ్రీనివాస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో పోల్డ్ ఇవిఎంలను భద్రపర్చిన స్ట్రాంగ్ రూంలను వెబ్ క్యాస్టింగ్ స్క్రీనింగ్ ద్వారా గురువారం జిల్లా కలెక్టర్ కె.శశాంక పరిశీలించారు. చేవెళ్ళ పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలో పోలింగ్ ముగిసిన అనంతరం మహేశ్వరం,రాజేందర్ నగర్, చేవెళ్ల, శేరిలింగంపల్లి, పరిగి, వికారాబాద్, తాండూర్ అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఓటింగ్ యంత్రాలను బండారి శ్రీనివాస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో భద్రపర్చగా,ఆవరణలో ఏర్పాటు చేసిన సిసి కెమెరాల ద్వారా రిటర్నింగ్ అధికారి,జిల్లా కలెక్టర్ ఒక్కో స్ట్రాంగ్ రూంను వెబ్ క్యాస్టింగ్ స్క్రీనింగ్ ద్వారా వాటికి వేసిన సీల్ లను పరిశీలించారు. స్ట్రాంగ్ రూం లు,వాటి పరిసరాలలో చేపట్టిన భద్రతా ఏర్పాట్లను గమనించారు.నిరంతరం నిఘా కోసం అమర్చిన క్లోజ్డ్ సర్క్యూట్ కెమెరాల పనితీరు,వాటి ద్వారా కొనసాగిస్తున్న పర్యవేక్షణను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో రిటర్నింగ్ అధికారి కలెక్టర్ వెంట చేవెళ్ల ఆర్‌డిఒ,ఎఆర్ఓ సాయిరామ్,కందుకూర్ ఆర్‌డిఒ అండ్ మహేశ్వరం ఎఆర్ఓ సూరజ్ కుమార్,సంబంధిత అధికారులు, సిబ్బంది తదితరులు వున్నారు.



నగరంలో భారీ వర్షం.. అవస్థలెన్నో..

హైదరాబాద్‌లో గురువారం సాయంత్రం భారీ వర్షం కురవడంతో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఈదురుగాలులతో వర్షం కురుస్తోంది. కూకట్‌పల్లి, మియాపూర్, గచ్చిబౌలి, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, హైటెక్ సిటీ, నాంపల్లి, సెక్రటేరియట్, ఆర్‌టిసి క్రాస్‌రోడ్డు, మల్కాజ్‌గిరి, మౌలాలి, షేక్‌పేట, గాజులరామారం, కోఠి, దిల్‌సుక్‌నగర్, వనస్థలిపురం, ఉప్పల్, నాగోల్ తదితర ప్రాంతాల్లో వర్షం కురవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.



బదిలీలు, ప్రమోషన్లపై సిఎంతో చర్చలు

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసిన ఉపాధ్యాయ సంఘాల నాయకులు

ప్రజాపక్షం/వనస్థలిపురం: తెలంగాణ రాష్ట్రంలో బదిలీలు, ప్రమోషన్స్, ఇప్పటికే బదిలలైన ఉపాధ్యాయుల రిలీవ్ చేయడం ఆంశాలపై ఉపాధ్యాయ ఎంఎల్‌సి నర్సిరెడ్డి ఆధ్వర్యంలో ఉపాధ్యాయ సంఘాల రాష్ట్ర నాయకులు గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పలు సమస్యలు ముఖ్యమంత్రిని వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందిస్తూ సంబంధిత అధికారి, విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ బుర్ర వెంకటేశంకు ఫోన్ చేసి విద్యారంగ సమస్యల పరిష్కార మార్గాలను సాధ్యసాధ్యాలను పరిశీలించి నివేదిక అందచేయాలని ముఖ్యమంత్రిఆదేశించారు. ఈదే విధంగా ట్రైబల్ టీచర్స్ అసోసియేషన్ తరపున తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హరికిషన్ చౌహన్ 2000, 2001, 2003 తదితర డీఎస్సీలకు సంబంధించిన అన్ ట్రైన్డ్ టీచర్ల సర్వీస్‌కు సంబంధించిన అంశాలనికి ముఖ్యమంత్రితో చర్చించారు. దీనిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విద్యా శాఖ కార్యదర్శికి ఫోన్ చేసి అన్ ట్రైన్డ్ టీచర్ల ససమ్యలను పరిష్కారించవలసిందిగా ఆదేశించడం జరిగిందని ప్రిన్సిపల్ సెక్రటేరియట్‌లో బుర్ర వెంకటేశంతో అన్ ట్రైన్డ్ టీచర్ల సమస్యను వివరించడం జరిగిందని తెలిపారు. దీనికి ప్రిన్సిపల్ సెక్రెటరీ సానుకూలంగా స్పందించి మీ వద్ద ఉన్నటువంటి సమాచారాన్ని డీఎస్సీ నోటిఫికేషన్, కోర్టు ఆర్డర్ కాపీను ఇవ్వవలసిందిగా వారు తెలిపారు. ఉపాధ్యాయ సమస్యలపై స్పందించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, విద్యా శాఖ ప్రిన్సిపల్‌కు ఉపాధ్యాయ సంఘాల నాయకులు కుతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన రాష్ట్రం కోసం కృషి

రంగారెడ్డి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి ఎం.వెంకటేశ్వర్‌రావు

ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి: క్రమశిక్షణ కలిగిన ఆరోగ్య కార్యకర్తలు..డెంగ్యూ వ్యాధి నివారణలో సైనికులుగా పని చేస్తూ తెలంగాణ రాష్ట్రాన్ని ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దాలని రంగారెడ్డి జిల్లా వైద్య,ఆరోగ్యశాఖ అధికారి ఎం.వెంకటేశ్వర్ రావు తెలిపారు.
గురువారం రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుండి ర్యాలీని ప్రారంభించి ఎండిఒ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు.అనంతరం అక్కడ ఆరోగ్య కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎం అండ్ హెచ్ఒ ఎం.వెంకటేశ్వర్ రావు మాట్లాడుతూ డెంగ్యూ నివారణకు తీసుకోవల్సిన చర్యలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలను గుర్చి వివరించారు.జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవం కరపత్రాలను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి విడుదల చేశారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంఎన్ హెచ్ఓ డాక్టర్ దామోదర్, డిఐఓ డాక్టర్ స్వర్ణ కుమారి,మలేరియా ఆఫీసర్ డాక్టర్ రాకేష్, మొయినాబాద్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్లు ఎం. వాణి,వైద్యాధికారిరఘుబాబు,ఆలూరు పిఎసి వైద్యాధికారి వరలక్ష్మి,చందనవల్లి వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాసరావు,ఆర్.బి ఎస్ కె, ఆయుష్ వైద్యులు, డివిజన్ పరిధిలోని సూపర్వైజర్లు, సిహెచ్ వో,పి హెచ్ఎంలు, ఆశా, మలేరియా,కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలందరకీ పని కల్పించాలి

డిఆర్‌డిఒ ప్రాజెక్ట్ అధికారి సరిత

ప్రజాపక్షం/యాచారం : పనిఅడిగిన ప్రతి కూలీకి పని కల్పించాల్సిన బాధ్యత మనపై ఉందని డిఆర్‌డిఒ జిల్లా ప్రాజెక్ట్ అధికారి సరిత అన్నారు. గురువారం మండల పరిధిలోని చింతపట్ల, మొండిగౌరెల్లిలో ఉపాధి పనులను ఆమే పరిశీలించారు. నర్సరీని చూసి ఆనందం వ్యక్తం చేశారు. ఆమే మాట్లాడుతూ ఉపాధి కూలీలకు నిబంధనల ప్రకారం పనులుచూయించాలన్నారు.పని చేస్తున్న కూలీలందరు ప్రభుత్వం నిర్ధేశించిన కొలతల ప్రకారం పనులు చేయాలని అన్నారు. వేసవి కాలం కావడం వల్ల ఉదయంవేళల్లో పనులు చేయాలన్నారు. శ్రమకు తగ్గ కూలీ వచ్చే విధంగా కృషి చేస్తామన్నారు. కూలీలకు వారం వారం పేమెంట్ ఇవ్వాలన్నారు. గ్రామాల్లో ఫిల్డ్ అసిస్టేంట్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే వారికి కటిన చర్యలు తీసుకుంటామని అన్నారు. కూలీల మస్టరును తప్పులు లేకుండా చూడాలని అన్నారు. ఎపిఒ సక్రియా,ఎంపిడిఒ నరేంధర్‌రెడ్డి, ఎపిఒ లింగయ్య, అయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు ఉపాధి సిబ్బంది తదితరులు పాల్గోన్నారు.

వర్షం బీభత్సం.. నేలకొరిగిన ఇనుప కంచెలు

ప్రజాపక్షం/షాబాద్ : అకాల వర్షంతో అన్నదాతలకు అనేక ఇబ్బందులు చేతికి వచ్చిన వరి పంటలు గాలి వానకు నెలమట్టం అవుతున్నాయని బిక్కుబిక్కు మంటున్నారు. షాబాద్ మండల పరిధిలోని బొనగిరిపల్లి శివారులో రియల్ ఎస్టేట్ వ్యాపారులు భూమి రక్షణగా చుట్టు ఇనుప రేకులతో వేసుకున కంచలు సైతం గాలివాన తాకిడికి నేలపై చెల్లాచదురుగా పడిపోయి లక్షల రూపాయలు నష్టం వాటిలిన్నట్లు ఆవేధన వ్యక్తం చేస్తున్నారు. మామిడి రైతులు ప్రతి సంవత్సరం కొంత మెరకు లాభాలు వచ్చేవి ఈ సారి మామిడి పండ్లు కాకముందే అకాల వర్షాల కారణంగా మామిడి కాయలు నేలపై రాలిపోయి పూర్తి నష్టం మిగిలిందని వాపోతున్నారు. రైతుల బాధలు ప్రభుత్వంకు వినిపించాలంటే మా బాధలు పట్టించుకోకుండ ఎన్నికల పై దృష్టి పెట్టిందని మండల రైతులు ఆవేధన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన ప్రభుత్వం స్పందించి మండలంలో అకాల వర్షానికి నష్టపోయిన వారికి ప్రభుత్వం సహాయం చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

త్వరలోనే రైతులకు తీపికబురు

టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్‌గౌడ్

ప్రజాపక్షం/హైదరాబాద్: రైతులకు సిఎం రేవంత్ రెడ్డి త్వరలోనే తీపి కబురును వినిపిస్తారని టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. బిఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఖమ్మం మిర్చి రైతులకు బేడీలు వేసి కొట్టుకుంటూ తీసుకెళ్లినవారే, వరిదాన్యం కొనుగోలు అంశంలో ధర్నాలు చేయడంసిగ్గుచేటన్నారు. హైదరాబాద్‌గాంధీ భవన్‌లో గురువారం మీడియా సమావేశం లో కాంగ్రెస్ నాయకులు బొంతు రామ్మోహన్, భవానిరెడ్డి, సంగిశెట్టి జగదీశ్వర్, కత్తి వెంకటస్వామితో కలిసి మహేష్‌కుమార్‌గౌడ్ మాట్లాడారు. కెటిఆర్ కనుసన్నల్లో జరుగుతున్న ఇసుక మాఫియాను అడ్డుకునేందుకు యత్నించిన నేరెళ్ళ రైతులపై దాడులు చేశారని గుర్తు చేశారు. పంట నష్టపోతే రైతులను ఏనాడూ బిఆర్ఎస్ నేతలు పరామర్శించలేదన్నారు. తాము ధర్నా చేస్తే రైతులు ఆదరిస్తారని బిఆర్ఎస్ బావిస్తుందని ఎద్దేవా చేశారు. ఆచరణకు సాధ్యం కానీ హామీలను కాంగ్రెస్ ఇవ్వలేదని, కెసిఆర్ తమకు అప్పుల చిప్ప చేతికి ఇచ్చినప్పటికీ, ప్రభుత్వం మాత్రం ఇచ్చిన హామీలనుఅమలు చేస్తున్నామన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బిఆర్ఎస్ తుడుచుకువెళ్తుందని, అందుకే ఉనికి కోసం యత్నిస్తోందన్నారు. కెసిఆర్ హయాంలోనే రైతు ఆత్మహత్యల్లో తెలంగాణరాష్ట్రం దేశంలోనే రెండోస్థానంలో ఉన్న దని, కెసిఆర్‌జిమ్మిక్కులు నమ్మవద్దన్నారు. పదేళ్లలో బిజెపిప్రజలకు ఏం చేసిందో ఆ పార్టీ నాయకులు ఆలోచించాలన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు అత్యధిక స్థానాలు వస్తాయన్నారు.సిఎం రేవంత్ రెడ్డి చేయని వ్యాఖ్యలను అన్నట్టుగా అబద్ధాలను ప్రచా రం చేస్తున్నారని మండిపడ్డారు. గత ప్రభుత్వంలో 6 నుంచి పది కిలోల తరుగు తీశారని, మిల్లర్లకు లబ్ధి చేకూర్చి కమీషన్లు తిన్నారన్నారు. టిపిసిసి అధ్యక్ష పదవి అడిగే హక్కు ప్రతి కార్యకర్తకు ఉన్నదని, తాను సీనియర్ కార్యకర్తనని, తానూప్రయత్నిస్తున్నానని మహేష్ కుమార్ గౌడ్ అన్నారు.

డెంగీ లక్షణాలుంటే వైద్యులను సంప్రదించండి

ప్రజాపక్షం/షాద్‌నగర్: డెంగ్యూ వ్యాధి లక్షణాలు ఉంటే సంబందిత వైద్యులను తక్షణమే సంప్రదించేందుకు చర్యలు తీసుకోవాలని షాద్‌నగర్ హెల్త్ ఎడ్యుకేటర్ డాక్టర్ జె.శ్రీనివాసులు సూచించారు.గురువారంజాతీయ డెంగ్యూ వ్యాధి దినోత్సవాన్ని పురస్కరించుకొని ర్యాలీ నిర్వహించారు.శ్రీనివాసులు మాట్లాడుతూ డెంగ్యూ వ్యాధి ఎడిస్ ఈజిప్ట్ దోమ కాటు వలన వస్తుందని, డెంగ్యూ లక్షణాలు ఉంటే ఆకస్మాత్తుగాజ్వరం రావడం, తీవ్రమైన తలనొప్పి, కల్లా వెనుక భాగంలో తీవ్రమైన నొప్పి కండరాల నొప్పులు, కీళ్ళ నొప్పులు, ఆకలి మందగించడం, శరీరం మీద దద్దుర్లు రావడం, వికారం, వాం తులు కావడం, చికెన్ గున్యాలు, జాయింట్ పెయిట్స్ ఎక్కువగా ఉంటాయని వివరించారు. డెంగ్యూ జ్వరము లక్షణాలు తీవ్రమైన కడుపునొప్పి, మనిషి ఒక్కసారిగా చల్లబడిపోవడం, పాలి పోయినట్లు ఉండటం, వాంతులు, నిద్రలేమి, ఆధిక దాహం, నాడి బల హీనంగా ఉండటం, శ్వాస కష్టంగా ఉండటం వంటి లక్షణాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు. ప్రజలు ఈ లక్షణాలు కలిగి ఉన్నప్పుడు వెంటనే సమీపంలో ఉన్న ఆసుపత్రిని సంప్రదించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. వైద్యులు జగదీష్, సంధ్య, ప్రవీణ, ఆప్తాల్మిక్ ఆఫీసర్ శ్రీహరి,హెల్త్ సూపర్‌వైజర్లు చంద్రకళ, అమృత, ఫార్మిసిస్టు, ఉదయ్‌కుమార్, చించోడు ఏఎన్ఎంలు. ఆశ వర్కర్లులు పాల్గొన్నారు.

ధాన్యానికి బోనస్‌గా రూ.500 చెల్లించాలి

మార్కెట్ యార్డు ముందు బిఆర్ఎస్ నేతలు ధర్నా

ప్రజాపక్షం/షాద్‌నగర్: వరిధాన్యంకు గిట్టుబాటు ధర కల్పించడంతోపాటు రూ.500బోనస్ చెల్లించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్మెన్ కొందూటి నరేందర్ డిమాండ్ చేశారు. గురువారం షాద్‌నగర్ వ్యవసాయ మార్కెట్ యార్డు ముందు తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ ఆదేశాల మేరకు బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఎంఎస్ నటరాజన్, మండల అధ్యక్షుడు లక్ష్మణ్‌నాయక్‌ల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శాసన సభ ఎన్నికలకు ముందు వరిధాన్యం పండించిన అన్నదాతలకు గిట్టుబాటు ధర కల్పించడంతోపాటు రూ.500బోనస్ కల్పిస్తామని చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట మార్చడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. గత ఏడాది రబీ సీజన్‌లో క్వింటాల్ వరిధాన్యంకు రూ.3300 పలికిన వడ్ల ధరకు ఈ సారి కాంగ్రెస్ ప్రభుత్వం క్వింటాల్ వరిధాన్యంకు రూ.1700 నుండి 1800వరకు మాత్రమే కొనుగోలు చేస్తున్నారని వివరించారు. అన్నదాతలకు నష్టం లేకుండా వరిధాన్యం కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని మార్కెట్ యార్డు అధికారులకు వివరించడం జరిగిందని గుర్తు చేశారు. అధికారంలోకి రాకముందు కాంగ్రెస్ నేతలు ఒక విధంగా అధికారం రాగానే మరో విధంగా వ్యవహరించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. రైతుకు బోనస్ చెల్లించే వరకు పోరాటాలు కొనసాగించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మెన్ బక్కన్న యాదవ్, రైతు సమన్వయ సమితి కోఆర్డినేటర్ తాండ్ర వెంకట్‌రెడ్డి, నేతలు మన్నె నారాయణ యాదవ్, రాయికల్ వెంకట్‌రెడ్డి, పల్లె శ్రీనివాస్‌రెడ్డి, భీష్వ రామకృష్ణ, శ్రీశైలం యాదవ్,గోపాల్ యాదవ్, చందునాయక్, కిరణ్, శ్రీనివాస్ గౌడ్, పిల్లి శేఖర్, జూపల్లి శంకర్, రేటికల్ నందీశ్వర్, చిపిరి రమేష్ యాదవ్, బొమ్మ రంగయ్య గౌడ్, బుగ్గ కృష్ణ, రాఘవేందర్, కాట వీరేష్‌లు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి : 2024–25 విద్యా సంవత్సరంకై గిరిజన వ్యవహారాల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ఎస్టి అభ్యర్థులనుంచి నేషనల్ ఓవర్సీస్ స్కాలర్‌షిప్ స్కీమ్‌కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా గిరిజన అభివృద్ధిఅధికారి పి.కమలాకర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో కోరారు. 2024–25 విద్యా సంవత్సరం నేషనల్ ఓవర్సీస్ స్కాలర్‌షిప్ స్కీమ్‌క్రింద స్కాలర్‌షిప్ పొందాలనుకునే విద్యార్థులను ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. tribal.gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన ఎస్టి అభ్యర్థులనుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు.

యువత స్వయంశక్తితో ఎదగాలి

ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లి : యువత స్వయంశక్తితోఎదిగి, ఆర్థికంగా అభివృద్ధిచెందాలని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బిఆర్‌ఎస్‌పార్టీ ఎంపి అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. పెద్దకొత్తపల్లి మండలం చిన్నకొత్తపల్లి గ్రామ బిఆర్‌ఎస్‌పార్టీ అధ్యక్షులు విష్ణువర్దన్‌యాదవ్ నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రంలో నూతనంగా ఏర్పాటుచేసిన టైవాస్‌వాటర్‌ప్లాంట్‌ను ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, అచ్చంపేట మాజీ ఎంఎల్‌ఎ గువ్వలబాల్‌రాజు ప్రారంభించారు. అనంతరం మాజీ ఎంఎల్‌ఎ గువ్వలబాల్‌రాజు, ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ విష్ణువర్దన్‌యాదవ్‌ను అభినందించారు.

ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పన

ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లి : రత్నగిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొల్లాపూర్ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలకు మౌలిక వసతులు ఏర్పాటు చేస్తున్నట్లు రత్నగిరిఫౌండేషన్ నిర్వాహకులు కేతూరిధర్మతేజ అన్నారు. కొల్లాపూర్ నియోజకవర్గంలోని పెద్దదగూడ, పెద్దమార్, కొండూరు, సింగోటం గ్రామాల ప్రభుత్వ పాఠశాలలను ఫౌండేషన్ నిర్వాహకులు కేతూరిధర్మతేజ అతనిబృందం ఆయా పాఠశాలలప్రధానోపాధ్యాయులతో కలిసి గురువారం సందర్శించారు. ఈసందర్భంగా కేతూరిధర్మతేజ మాట్లాడుతూ తెలంగాణరాష్ట్ర ఎక్సైజ్ టూరిజం, సాంస్కృతికశాఖమంత్రి జూపల్లికృష్ణారావు ఆదేశాలమేరకు రత్నగిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొల్లాపూర్ నియోజకవర్గంలో ముందుగా కొన్ని గ్రామాల ప్రభుత్వ పాఠశాలలలో ఆధునికరణతోపాటు మౌలిక వసతులు ఏర్పాటుచేయడం జరుగుతుందని తెలిపారు.

కంప్యూటర్ శిక్షణా తరగతులు

ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లి : మండలంలోని మేజర్ గ్రామపంచాయతైన కల్వకోల్ గ్రామంలో శ్రీసత్యసాయివిద్యామందిర్ సమితి ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంత విద్యార్థిని విద్యార్థులకు వేసవి సెలవులలో ఉచితంగా స్పోకెన్ ఇంగ్లీష్, కంప్యూటర్ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. ఈశిక్షణ తరగతులను ఏప్రిల్ 25నుంచి జూన్ 1వతేదీవరకు నిర్వహిస్తామని ఈశిక్షణ తరగతులకు 80మంది విద్యార్థులు హాజరవుతున్నారని సత్యసాయిసేవా సమితి నిర్వాహకులు పుల్లయ్యశెట్టి, లక్ష్మి ప్రసాద్ తెలిపారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఉచితంగా స్పోకెన్ ఇంగ్లీష్, కంప్యూటర్ శిక్షణ ఇవ్వడంతో విద్యార్థులకు, యువత సామర్థ్యాలను పెంపొందించి ఉన్నతమైన చదువులకు ఉపయోగపడుతుందని గ్రామపెద్దలు ప్రజలు హర్షం వ్యక్తంచేశారు.

మల్లురవికి భారీ మెజారిటీ ఖాయం

కాంగ్రెస్ సీనియర్ నాయకులు నరసింహులు

ప్రజాపక్షం/మల్దకల్ : పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నాగర్ కర్నూల్ అభ్యర్థి డా.మల్లురవి భారీ మెజార్టీతో గెలుస్తారని మల్దకల్ మండలం శేషంపల్లి గ్రామం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నరసిం హులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాపక్షంతో మాట్లాడుతూ గద్వాల కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి సరిత తిరుపతయ్య ఆదేశాల మేరకు అసెంబ్లీ ఎన్నికలలో ఇచ్చిన హామీ ప్రకారం ఆరు గ్యారెంటీలను కాంగ్రెస్ పార్టీ రేవంత్ రెడ్డి పూర్తిగా అమలు చేశారని ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఆదరించి రాష్ట్రంలో అధికారంలో తెచ్చారని రాహుల్ గాంధీ ప్రధాని చేయడమే లక్ష్యంగా ప్రతి ఒక్క కార్యకర్త గ్రామంలో నాగర్‌కర్నూల్ పార్లమెంటు అభ్యర్థి డా.మల్లురవి గెలుపుకు పనిచేశారని వారి అందరికి ధన్యవాదాలు తెలియజేశారు. లక్ష పైగా మెజార్టీతో డా.మల్లు రవి గెలుపొందడం ఖాయమని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

పార్టీలకు అతీతంగా ఓట్లు సాధించాం

ప్రజాపక్షం / వనపర్తి టౌన్ : నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఎన్నికలలో పార్టీలకు అతీతంగా అన్ని వర్గాలు ఏకతాటిపైకి వచ్చి బీజేపీ అభ్యర్థి భరత్ ప్రసాద్‌కు భారీగా ఓట్లు వేయడం ఎంతో శుభ పరిణామమని, ఎన్నికల్లో భరత్ ప్రసాద్ ఖచ్చితంగా గెలిచి తీరుతారని బీజేపీ వనపర్తి పట్టణ అధ్యక్షుడు బచ్చు రాము స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్యకర్తలు మద్దతుదారులు, అభిమానులు మోడీ నాయకత్వాన్ని బలపర్చారని, దేశాన్ని సమర్థవంతంగా పాలించే సత్తా మోడికి ఉందని ప్రజలు విశ్వశించడం వల్లనే ఇది సాధ్యమైందని అన్నారు. కర్షకులు, కార్మికులు, రైతులు, మహిళలు విద్యార్థులు యువత అన్ని వర్గాలు మోడీ నాయకత్వాన్ని బలపర్చారని అన్నారు. ముఖ్యంగా ఆ శ్రీరాముడి చల్లని ఆశీస్సులతోనే భరత్ ప్రసాద్ గెలుపు ఖాయమైందన్నారు. దాదాపు లక్ష మెజార్టీతో గెలుపొందుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. 400 ఎంపీ సీట్ల పిలుపుతో భారత ప్రధాని మోడీ ఇచ్చిన పిలుపుకు తెలంగాణలో భారీ స్పందన లభించిందని అన్నారు. ఇది సమిష్టి కృషి అని కార్యకర్తలు రాత్రిం బవళ్లు కష్టపడి పని చేశారని బచ్చు రాము అన్నారు.

పాఠశాలల్లో ప్రగతి పనులు

నెలాఖరులోపు పూర్తి చేయాలి

నారాయణపేట జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

ప్రజాపక్షం/నర్వ : జిల్లాలోని అన్ని ప్రభుత్వ ప్రాథమిక, మాధ్యమిక, ఉన్నత పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో చేపట్టిన మౌలిక వసతుల నిర్మాణ పనులను నెలాఖరులోపు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. గురువారం జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్సు హాల్‌లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలకు సంబంధించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 30 లోపు పాఠశాలలో వివిధ నిర్మాణ, అవసరమైన మరమ్మత్తు పనులను పూర్తి చేస్తే జూన్ మొదటి వారంలో పాఠశాలలకు రంగులు వేయించాల్సి ఉంటుందని తెలిపారు. జిల్లాలోని మండలాల వారిగా అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా ఎన్ని నిర్మాణ పనులు మంజూర య్యాయి? ఎన్ని ప్రారంభించారు? ఇంకా ఎన్ని ప్రారంభించాల్సి ఉందని కలెక్టర్ పంచాయితీ రాజ్ ఏఈలను అడిగి తెలుసుకున్నారు. ఇంకా ప్రారంభించాల్సి ఉన్న పనులను రెండు రోజుల్లో మొదలుపెట్టి నెలాఖరు నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా మరికల్ మండల కేంద్రంలోని పాఠశాలలను పరిశీలించి, పాఠశాలలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ఎస్టిమేట్ తయారు చేసి ఇవ్వాలని, వెంటనే ఆయా పాఠశాలల్లో నిర్మాణ పనులను పూర్తి చేయాలని పీఆర్ డిఈఈ ని ఆదేశించారు. అలాగే మద్దూరు,కోస్గి మండలాల్లోనూ అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ద్వారా చేపట్టిన నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయించాలన్నారు. కెజిబివి పాఠశాలల ప్రహరీల పనులకు ఎస్టిమేట్ తయారు చేసి పనులు ప్రారంభింపజేయాలని చెప్పారు. ఊట్కూర్‌మండలంలోని కొల్లూరు, పెద్ద పొర్ల, మొగ్దుంపూర్ పాఠశాలల్లో ప్రతిపాదించిన నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలన్నారు. మాగనూరు మండలంలోని వడ్వాట్ గ్రామ పాఠశాలలో ఎందుకు పనులు నిలిచి పోయాయని ఏఈ ని ప్రశ్నించారు. ఎలాంటి సమస్యలు వచ్చినా సమన్వయం చేసుకుని పనులు పూర్తి చేసేందుకు అధికారులు కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ మయాంక్ మిత్తల్, డిఆర్‌డిఓ రాజేశ్వరి, సిపిఓ జీవరత్నం, అడిషనల్ డిఆర్డిఓ అంజయ్య, విద్యా శాఖ అధికారులు శ్రీనివాస్, అన్ని మండలాల పంచాయితీరాజ్ ఏఇలు పాల్గొన్నారు.

రైతుపై బిఆర్ఎస్ మొసలి కన్నీరు

గత ప్రభుత్వం పంటలు నీట మునిగితే పైసా కూడా ఇవ్వలేదు : వండ్ల దేవన్న నాయుడు

ప్రజాపక్షం/వనపర్తి టౌన్ : కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన ఐదు నెలల్లోనే ఇంత అన్యాయం అంటూ రైతుపై మొసలి కన్నీరు మొదలెట్టేశారని మండ్ల దేవన్న నాయుడు అన్నారు. కేసిఆర్, హరీష్ రావు, నిరంజన్ రెడ్డి, గత ప్రభుత్వం హయంలోనే రైతులందరికి పూర్తి స్థాయిలో రుణమాఫీ చేస్తానని చెయ్యకుండా 2023 జూలైలో బ్యాంకర్లు 20 లక్షల మంది రైతులను డిఫార్దర్లు జాబితాలో చేర్చిన ఘనత బీఆర్ఎస్ కే దక్కింది. రైతుపై మొసలి కన్నీళ్లు కారుస్తూ గురువారం వనపర్తి జిల్లాల్లో అంబేద్కర్ చౌరస్తాలో ధర్నాలంటున్నారని, మలిదశ ఉద్యమకారుడు కాంగ్రెస్ నాయకులు మండ్ల దేవన్న నాయుడు విలేకరులకు తెలిపారు. రైతుల సంక్షేమం కోసం పని చేస్తున్న ఏకైక ప్రభుత్వం తమదేనని గత బీఆర్ఎస్ పార్టీ లీడర్లు అనేక వేదికలపై చెప్పారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రిగా ఉన్నప్పుడు రైతు బంధుఉ లాంటి విప్లవాత్మక పథకం తీసుకొచ్చామని, అలాంటిపథకం దేశంలో ఎక్కడా లేదని ఇప్పటికి చెబుతున్నారు. అయితే అసలు విషయం ఏమిటంటే ఒక్క రైతు బంధు మినహా వ్యవసాయానికి సంబంధించి మిగిలిన అన్ని పథకాలు, సబ్సిడీలను ప్రభుత్వం అనధికారికంగా ఆపేసింది. వనపర్తి పట్టణంలో 2021లో నల్ల చెరువు ఈదుల చెరువు కింద ఉన్న పంట నష్టం పైసా కూడా ఇవ్వలేదు. రైతులు పంట నష్టపోతే సర్కారు వానాకాలం లక్షల ఎకరాల్లో పంటలు నీటమునిగితే పైసా కూడా తయారు చేయడం లేదు. ఒక్క రైతు బంధు మాత్రమే ఇచ్చి తమది రైతు ప్రభుత్వం మాత్రమే ఇచ్చి తమది రైతు ప్రభుత్వం అనడం సమంజసం కాదు. గత వానాకాలంలో కాగా 2021 అక్టోబర్, నవంబరు నెలల్లో కురిసిన వర్షాలకు పంటలు భారీగా దెబ్బతిన్నాయన్నారు. పంట ఎందుకు పనికిరాకుండా పోయిన ప్రభుత్వంపై పాసా పరిహారం ఇవ్వలేదన్నారని వివరించారు.

కార్మికుల వేతన చెల్లింపులపై ప్రత్యేక అధికారిని నియమించాలి

ప్రజాపక్షం / వనపర్తి టౌన్ : తెలంగాణ రాష్ట్రంలో అసంఘటిత రంగంలో లక్షలాది మంది కార్మికుల వేతనాల చెల్లింపులో యాజమాన్యాలు తీవ్రమైన శ్రమ దోపిడికి గురి చేస్తున్నాయని వీటిని నియంత్రించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల వేతనాల చెల్లింపుల్లో పరిశీలనకై స్పెషల్ ఐఏఎస్ అధికారిని నియమించి కార్మికుల సంక్షేమానికి పాటుపడాలని తెలంగాణ మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సురేష్ డిమాండ్ చేశారు. గురువారం తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఈ మధ్య కాలంలో వనపర్తి ఆసుపత్రి కార్మిక యూనియన్ ఏఐటియూసి నేత గంధం బాలరాజు ఆకాల మృతిలో భాగంగా వనపర్తి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ప్రాంగణంలో బాలరాజు సంతాప సభలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరంవనపర్తి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో పని చేస్తున్న శానిటేషన్ పేషెంట్ కేర్ సెక్యూరిటి సూపర్వైజర్ కార్మికుల రెండు నెలల బకాయి వేతనాలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఏఐటియూసి నేతృత్వంలో కార్మికులు ఆసుపత్రి ఎదుట బేఠాయించి ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. రంగారావుకి వినతి పత్రాన్ని అందజేశారు. ఏజెన్సీ అక్రమాలపై జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకొని విచారణ జరుగుతుందని దీనికి కార్మికులకు న్యాయం జరిగే వరకు అధికారులకు, కార్మికులకు పూర్తిగా సహకరిస్తామని, విచారణ పేరుతో కార్మికుల వేతనాలు పెండింగ్ ఉంచడం చేత కార్మికుల తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి బ్రాంచ్ ఏఐటియూసి యూనియన్ నాయకులు గంధం శ్రీను, నర్సింహా, మహేష్, షాబాజ్, ఉదయ్, మణికంఠ, ఆనంద్, శ్రీకాంత్, ఆశోక్, కళావతి, ఇందిరా, శకుంతల, గోవిందమ్మ, భాగ్యమ్మ, పద్మ, కాలేశ్వరమ్మ, రాములమ్మ ,మ ంజుల , కవిత , జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

బోధన, పరిపాలన అనుభవం ఉన్నవారినే వైస్ ఛాన్స్‌లర్లుగా నియమించాలి

ఎఐఎస్ఎఫ్ డిమాండ్

ప్రజాపక్షం / హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలోని ఉస్మానియా, కాకతీయ, జెఎన్‌టియు, అంబేద్కర్ విశ్వవిద్యాలయాలలోని కొంతమంది ప్రొఫెసర్లు అర్హత లేకపోయినా అక్రమాలకు పాల్పడి సీనియర్ ప్రొఫెసర్లుగా పదోన్నతులు పొందారని, వారెవరిని కూడా వైస్ ఛాన్సలర్లుగా నియమించకూడదని, బోధన, పాలన అనుభవం ఉన్న వారిని వైస్ ఛాన్సలర్లుగా నియమించాలని ఎఐఎస్ఎఫ్ ఉస్మానియా యూనివర్సిటీ (ఓయు) సమితి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఓయు పొలిటికల్ సైన్స్ విభాగంలో గురువారం జరిగిన మీడియా సమావేశంలో ఎఐఎస్ఎఫ్ ఓయు శాఖ అధ్యక్షులు లెనిన్, కార్యదర్శి నెల్లి సత్య మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వం విశ్వవిద్యాలయాలకు వైస్ ఛాన్సలర్‌లను నియమించడంలో పూర్తిగా జాప్యం చేసిందని విమర్శించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వైస్ ఛాన్సలర్ల పదవీ కాలం ముగికముందే నోటిఫికేషన్ ఇచ్చి సెర్చ్ కమిటీలు ఏర్పాటు చేసి వైస్ ఛాన్సలర్ల నియామక ప్రక్రియ చేపట్టడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. అదేవిధంగా బోధన, పాలన అనుభవం ఉన్నవారినే వైస్ ఛాన్సలర్లులుగా నియమించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. యుజిసి నిబంధనల ప్రకారం అర్హతలు లేని వారికి వైస్ ఛాన్సలర్ల నియామకాలలో అవకాశం ఇవ్వకూడదని, పదోన్నతుల ద్వారా ఆర్జించిన జీతాన్ని ఆ యూనివర్సిటీ రికవర్ చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయాలపై ప్రభుత్వం స్పందించనట్లయితే భవిష్యత్తులో ఆందోళన కూడా చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎఐఎస్ఎఫ్ ఓయు శాఖ సహాయ కార్యదర్శి భగత్, నాయకులు శేఖర్ అశ్విన్ పాల్గొన్నారు .

ఎన్నికల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ పనితీరు భేష్ : కమలాసన్ రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల్లో నాన్ డ్యూటీ పెయిడ్ మద్యం స్వాధీనం చేసుకోవడంలో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రికార్డ్ బ్రేక్ చేసింది.మద్యం అక్రమ రవాణను అరికట్టడంలో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కీలకపాత్ర పోషించిందని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టర్ వి.బి. కమలాసన్‌రెడ్డి తెలిపారు. లోక్‌సభ ఎన్నికల్లో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం పని తీరు ప్రశంసనీయమన్నారు. ఆయన గురువారం ''ప్రజాపక్షం''తో మాట్లాడారు. ఎన్నికలకు పది రోజుల ముందు నుంచి జరిపిన దాడుల్లో దాదాపు రూ. 3 కోట్ల విలువ చేసే నాన్ డ్యూటి పెయిడ్ లిక్కరును పట్టుకొని సంచలనాలు సృష్టించారు. ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ గతంలో ఎన్నడు లేని విధంగా దాడులు నిర్వహించి, ఊహించని ఫలితాలను రాబట్టింది. ఈ ఎన్నికల్లో ఏరులై పారే నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్‌ను, ఎన్నికలే అదనుగా అక్రమ రవాణకు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వి.బి కమలాసన్ రెడ్డి బ్రేక్ వేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఎన్నికల్లో మద్యం పంపిణి చేసేందుకు గోవా నుంచి, ఎపిలోని విశాఖ పట్నానికి వాహనంలో తరలిస్తున్న మద్యాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు పక్కా సమాచారంతో బాలనగర్ వద్ద రూ.2,07 కోట్ల విలువ చేసే 17,280 లీటర్ల మద్యాన్ని పట్టుకున్నారు. అలాగే వికారాబాద్, అసిఫాబాద్, మహబూబ్‌నగర్, మెదక్, నల్లగొండ,భద్రచలం ప్రాంతాల్లో నాన్ డ్యూటీ పెయిడ్ మద్యాన్ని పెద్ద మొత్తంలో పట్టుకున్నారు. రంగారెడ్డి జిల్లా దూలపల్లి శివారులో జగదాంబ కెమికల్స్ పేరుతో నిర్వహిస్తున్న కంపెనీలో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు రూ. 2.31 కోట్ల విలువ చేసే 21000 లీటర్ల రెక్టిఫైట్ స్పిరిట్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఘట్‌కేసర్ ప్రాంతం లో ఒరిస్సా నుంచి హైదరాబాద్‌కు కారులో అక్రమంగా తరలిస్తున్న గంజాయిని పట్టుకున్నారు. ఖమ్మంలో పలు మార్లు గంజాయిని పట్టుకున్నారు. ఎన్నికల నేపథ్యంలో పక్షం రోజులు భారీగా జరిపిన దాడుల్లో పెద్దమొత్తంలో గంజాయి, మత్తు మందులు, న్యాన్డ్యూటిపెయిడ్ మద్యం, నాటుసారాను పట్టుకున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ యంత్రాంగాన్ని కమలాసన్ రెడ్డి అభినంధించారు.

ఎపిలో అల్లర్లపై ఇసి సీరియస్

ఇద్దరు ఎస్‌పిలు సస్పెన్షన్, మరో కలెక్టర్, ఎస్‌పి బదిలీ

న్యూఢిల్లీ : ఆంధ్రప్రదేశ్‌లో పోలింగ్ రోజు, ఆ తర్వాత చెలరేగిన హింసపై కేంద్ర ఎన్నికల సంఘం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. సిఎస్ జవహర్ రెడ్డి, డిజిపితో భేటీ తర్వాత అసహనం వ్యక్తం చేస్తూ కొందరు ఉన్నతాధికారులపై వేటు వేసింది. పల్నాడు, అనంతపురం జిల్లా ఎస్‌పిలపై సస్పెన్షన్ వేటు వేసింది. ఇద్దరినీ వెంటనే విధుల్లోంచి తప్పించి శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని పేర్కొంది. పల్నాడు జిల్లా కలెక్టర్, తిరుపతి ఎస్‌పిలను బదిలీ చేయడంతో పాటు శాఖాపరమైన చర్యలకు ఆదేశించింది. పోలింగ్ జరిగిన మే 13న పల్నాడు, తిరుపతి, అనంతపురం జిల్లాల్లో ఎక్కువగా హింస చెలరేగిందని, దీన్ని నియంత్రించడంలో అధికారులు పూర్తిగా విఫలమైనట్లు భావించినట్లు ఇసి తెలిపింది. సిఎస్, డిజిపితో భేటీ అనంతరం కేంద్ర ఎన్నికల సంఘంలోని ముగ్గురు కమిషనర్లు సమావేశమై, ఎపిలో జరిగిన హింసాత్మక ఘటనలపై తీవ్రస్థాయిలో అసహనం వ్యక్తం చేశారు. రాష్ట్ర యంత్రాంగం పూర్తిగా విఫలమైందనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. అధికారులపై చర్యలు చేపట్టాలని సిఎస్, డిజిపిలకు ఆదేశాలు జారీ చేశారు. ఇకపై ఎలాంటి హింస చెలరేగకుండా చర్యలు చేపట్టాలని ఇసి స్పష్టమైన ఆదేశాలు జారీచేసింది. మళ్లీ ఇలాంటి ఘటనలు పునరావృతమైతే మరింత కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించింది.

సన్న వడ్లకు మాత్రమే బోనస్ విడ్డూరం

ప్రజాపక్షం / మహబూబ్‌నగర్ ప్రతినిధి : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారంలోకి రాక ముందు ఒక మాట ... వచ్చినా తర్వాత ఒక మాట మాట్లాడుతున్నారని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. ఈ సందర్భంగా వారు కాంగ్రెస్ ప్రభుత్వ రైతాంగ వ్యతిరేక చర్యలకు నిరసనగా తెలంగాణ కూడలిలో భారత రాష్ట్ర సమితి నాయకులు ఆందోళన నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ రూ. 2 లక్షళ రుణమాఫీ చేస్తామని ప్రభుత్వం మాట తప్పిందని , ఎన్నికల ముందు ప్రతి క్వింటాల్ కి. రూ. 500 బోనస్ ఇస్తామని చెప్పి ఇప్పుడు సన్న వడ్లకు మాత్రమే ఇస్తామని చెప్పడం రైతులని మోససం చేయడమేనని అన్నారు. రైతులకి కరెంటు సరిగ్గా ఇవ్వక, సాగునీరు లేక పంటలు ఎండినయన్నారు. అంతో ఇంతో చేతికి వచ్చిన పంట కూడా కొనుగోలు చేయడం లేదన్నారు. గతంలో కల్లాల వద్దకి పోయి పంట కొనుగోలు చేసే వాళ్లం .. ఇవ్వాళ్ల రైతులు మార్కెట్ కి ధాన్యం తీసుకువచ్చినా కొనుగోలు చేయడం లేదన్నారు. పండించిన పంట కొనుగోలు చేయనందుకు వర్షానికి పంట తడిసి మొలకలు వస్తున్నాయన్నారు. ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చినా హామీని నిలబెట్టుకోవాలన్నారు. రైతులకి న్యాయం చేసే వరకు రైతుల పక్షాన పోరాటం చేస్తామన్నారు.

దొడ్డు రకం వడ్లకూ ఇవ్వాలి

ప్రజాపక్షం / పెబ్బేరు : బీఆర్ఎస్ పార్టీ వ్యవస్థాపక అభ్యక్షులు తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ఆదేశాల మేరకు పెబ్బేరు పట్టణంలో రైతులకు క్వింటల్ వడ్లకు రూ. 500 బోనస్ ఇస్తానని తుంగలో తొక్కినందుకు కాంగ్రెస్ ప్రభుత్వానికి నిరసనగా గురువారం రోజు పెబ్బేరు పట్టణంలో వ్యవసాయ శాఖ మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఆదేశానుసారం పెబ్బేరు పట్టణ అధ్యక్షులు దిలీప్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో రైతులకు మద్దతుగా నిరసన కార్యక్రమం చేశారు. ఈ కార్యక్రమంలో పెబ్బేరు పట్టణ మున్సిపల్ కరుణ శ్రీ సాయినాథ్ , కరస్వామి, చైర్ పర్సన్ , వైస్ చైర్మన్ , బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు , నాయకులు , కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

డెంగీ నివారణకు కృషి చేయాలి

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి జయచంద్రమోహన్

ప్రజాపక్షం / వనపర్తి ప్రతినిధి : డెంగ్యూ వ్యాధి నివారణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి జయచంద్రమోహన్ అన్నారు. గురువారం జాతీయ డెంగ్యూ నివారణ దినం సందర్భంగా జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశాల మేరకు వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో పాలిటెక్నిక్ కళాశాల ఆవరణ నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు అవగాహన ర్యాలీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ఓ శ్రీనివాసులు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, ఆశ కార్యకర్తలు, నర్సింగ్ కళాశాల విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ డెంగీ నివారణ దినోత్సవ ర్యాలీ

ప్రజాపక్షం/పెబ్బేరు : పెబ్బేరు మున్సిపల్ పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో పెబ్బేరు పట్టణంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుండి ఆర్టీసీ బస్టాండ్ వరకు వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలచే జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవ ర్యాలీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ డా. సుధారాణి, డా. ఝాన్సీరాణి, హోమియోపతి వైద్యాధికారి డా. భారతి, హెల్త్ సూపర్వైజర్స్ సూర్య నారాయణ, స్వరూపరాణి, హెల్త్ అసిస్టెంట్‌లు రాజశేఖర్ , తిరుపతయ్య, ఏఎన్ఎంలు వెంకటమ్మ, శారద, జయశ్రీ, మౌనిక, నర్సింహ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

వీపనగండ్ల...

డెంగ్యూ వ్యాధి ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలంటూ స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డా. శబరి, డా. లక్ష్మీ నారాయణ, ల్యాబ్ టెక్నిషియన్ వెంకటేష్ , ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

కవిత బెయిలుపై మీ వైఖరి చెప్పండి

సిబిఐని కోరిన ఢిల్లీ హైకోర్టు

న్యూఢిల్లీ : ఢిల్లీ మద్యం అవినీతి కేసులో తెలంగాణ ఉద్యమ నాయకుడు కె.చంద్రశేఖరరావు కుమార్తె కె.కవితకు బెయిలు మంజూరు చేసే విషయంపై సిబిఐ అభిప్రాయం ఏమిటో చెప్పాలని సుప్రీంకోర్టు కోరింది. కవితకు బెయిలు ఇచ్చే విషయంలో మీ వైఖరి ఏమిటో చెప్పండి అని ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ స్వర్ణకాంత శర్మ సిబిఐని కోరారు. ఈ మేరకు సిబిఐకి నోటీసు జారీ చేశారు. దాంతోపాటే బెయిలు కోరుతూ కవిత దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను కూడా తదుపరి ఈనెల 24వ తేదీకి వాయిదా వేశారు. తనను కస్టడీలోకి తీసుకుని విచారణ జరపడానికి అనుమతి ఇస్తూ ట్రయల్ కోర్టు తీసుకున్ననిర్ణయాన్ని సవాలు చేస్తూ దాఖలు చేసిన పిటిషన్‌పై కూడా హైకోర్టు సిబిఐకి మరో నోటీసు జారీ చేసింది. సిబిఐ, ఇడి రెండు దర్యాప్తు సంస్థలూ ఒకదారి తర్వాత మరొకటి కవితను అరెస్టు చేసి విచారణ జరిపాయి. ఢిల్లీ మద్యం అవినీతి కేసులో కవిత ప్రస్తుతం జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారు. ఆమె తరపున సీనియర్ న్యాయవాది విక్రమ్ చౌధరి, న్యాయవాది నితేశ్ రాణాలు న్యాయమూర్తి ఎదుట హాజరయ్యారు. ఆమె బెయిలు పిటిషన్ ప్రస్తుతం హైకోర్టులో పెండింగ్‌లో ఉంది. ఎందుకంటే ఇడిని కోర్టు వివరణ అడిగింది. అవినీతి కేసులో, అదేవిధంగా హవాలా కేసులో బెయిలు పిటిషన్‌లను కొట్టివేస్తూ మే 6న ట్రయల్ కోర్టు ఇచ్చిన ఆదేశాలను కవిత సవాలు చేశారు. సౌత్ గ్రూపు తరపున రూ 100 కోట్లు లంచం ఆప్ పెద్దలకు ఇవ్వడంతో కవిత కీలక పాత్ర వహించారన్నది దర్యాప్తు సంస్థల ప్రధాన ఆరోపణ. మార్చి 15వ తేదీన ఇడి అధికారులు హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో కవిత నివాసం నుండి ఆమెను అరెస్టు చేసి ఢిల్లీకి తరలించారు. అప్పటినుండీ ఆమె జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారు. తర్వాత తీహార్ జైలులో సిబిఐ ఆమెను మళ్ళీ అరెస్టు చేసి విచారణ జరిపింది. ఐతే ఈ కేసులో తనకు ఎలాంటి సంబంధం లేదని కవిత వాదిస్తున్నారు.

ఆరోదశ ఎన్నికల అభ్యర్థుల్లో

338 మంది కోటీశ్వరులే : ఎడిఆర్

న్యూఢిల్లీ : లోక్‌సభకు ఈనెల 25న జరిగే ఆరవ దశ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల్లో 338 మంది కోటీశ్వరులే ఉన్నారు. ఆరోదశ ఎన్నికల్లో 57 నియోజకవర్గాల నుండి మొత్తం 866 మంది అభ్యర్థులు పోటీ చేస్తుండగా, వీరిలో 338 మంది అభ్యర్థులు (39శాతం) కోటీశ్వరులేననీ, సగటున వారి ఆస్తి విలువ రూ.6.21 కోట్లు ఉంటుందనీ ఎన్నికల సంస్కరణలకోసం పోరాటం చేస్తున్న స్వచ్ఛంధ సేవాసంస్థ ఎడిఆర్ (అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫామ్స్) గురువారం తన నివేదికలో పేర్కొంది. ఈ అభ్యర్థులలోకురుక్షేత్ర నియోజకవర్గం నుండి పోటీ చేస్తున్న బిజెపి అభ్యర్థి నవీన్ జిందాల్‌కు అందరికంటే ఎక్కువగా రూ.1,241 కోట్ల ఆస్తులు ఉన్నాయని ఎడిఆర్ పేర్కొంది. ఆయన తర్వాత రెండోస్థానంలో సంతృప్త్ మిశ్రాకు రూ.482 కోట్లు, మూడోస్థానంలో సుశీల్ గుప్తాకు రూ.169 కోట్లు ఆస్తులు ఉన్నాయని నివేదిక తెలియజేసింది. కాగా ప్రధాన పార్టీలలో బిజెడి నుండి నలుగురు అభ్యర్థులు, ఆర్‌జెడి, జెడి(యు) నుండి ఒక్కొక్కరు కోటి రూపాయలకంటే ఎక్కువ ఆస్తులు ఉన్నవారే. బిజెపిలో ఉన్న 51 మంది అభ్యర్థులలో 48 మంది అభ్యర్థులు, సమాజ్‌పార్టీలో 12 మంది అభ్యర్థులకుగాను 11 మంది అభ్యర్థులు, కాంగ్రెస్‌పార్టీలో 25 మంది అభ్యర్థులకుగాను ఇరవైమంది అభ్యర్థులు, ఆప్ పార్టీ నుండి ఐదుగురు అభ్యర్థులకుగాను నలుగురు అభ్యర్థులు, ఎఐటిసి పార్టీలో తొమ్మిదిమంది అభ్యర్థులకుగాను ఏడుగురు అభ్యర్థులు, తమ తమ ఆస్తులు కోటి రూపాయల కంటే ఎక్కువగానే ఉన్నాయని నామినేషన్లు దాఖలు చేసిన సమయంలో ప్రకటించారు. కాగా తక్కువ ఆస్తులు ఉన్న అభ్యర్థులలో రోహతక్ నియోజకవర్గం నుండి పోటీ చేస్తున్న స్వతంత్ర అభ్యర్థి రణధీర్ సింగ్‌కు రూ.2లు, ప్రతాప్‌ఘర్ నుండి పోటీ చేస్తున్న ఎస్‌యుసిఐ (సి) అభ్యర్థి రామ్ కుమార్ యాదవ్‌కు రూ.1,686లు ఆస్తులు ఉన్నట్లు ప్రకటించారు. కాగా 411 మంది అభ్యర్థులు తమకు అప్పులు ఉన్నాయని వారి వారి అఫిడవిట్‌లలో ప్రకటించారు.

ప్రజాపక్షం
మహానగరి
మేడ్చల్ మల్కాజ్‌గిరి — వికారాబాద్
హైదరాబాద్ | శుక్రవారం | 17 మే 2024 | 11

మల్కాజిగిరిలో భారీ వర్షం

ప్రజాపక్షం/మల్కాజిగిరి: గురువారం సాయంత్రం గంటన్నరకు పైగా కురిసిన భారీ వర్షం మల్కాజిగిరి నియోజకవర్గంలో బెంబేలెత్తించింది. కాసేపు తగ్గినట్లే తగ్గి ఐదు నిమిషాల వ్యవధిలోనే ఏ మాత్రం ఆగకుండా కురిసిన వర్షంతో పలు ప్రాంతాలు, ప్రధాన రహదారులతో పాటు లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచి చెరువులను తలపించింది. పలు చోట్ల రోడ్లపై నీళ్లు మోకాళ్ల లోతు వరకు వర్షపు నీరు చేరి వాన తగ్గిన రెండు గంటల వరకు సాధారణ పరిస్థితులు నెలకొనలేదు. విద్యా సంస్థలు ముగిసి ఇంటికి చేరుకొనే సమయంలోనే ఈ వర్షం ప్రారంభమై గంటకు పైగా నిరాటంకంగా కురవటం వల్ల తమ పిల్లలను ఇంటికి తీసుకొని వెళ్లేందుకు పాఠశాలలకు ద్విచక్ర వాహనాలపై వెళ్లిన తల్లిదండ్రులు నానా ఇబ్బందులను ఎదుర్కొన్నారు. ప్రధాన రహదార్లతో పాటు అన్ని మార్గాల్లో ఎక్కడ గుంతలు ఉన్నాయో తెలియక వాహనాలపై వెళ్లే వారు భయభ్రాంతలకు గురయ్యారు.

ఎమ్మెల్యే మర్రి సిఎం రిలీఫ్ ఫండ్ అందజేత

ప్రజాపక్షం/మల్కాజిగిరి: గత కొద్ది కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న వినాయకనగర్ డివిజన్‌లోని కాకతీయనగర్ ప్రాంతానికి చెందిన సంజయ్‌కి మంజూరైన సిఎం రిలీఫ్ ఫండ్ కింద లక్షన్నర రూపాయల అనుమతి పత్రాలను మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డి పార్టీ నేతలు బద్దం పరశురాం రెడ్డి, చంద్రమౌళి, ఫరీద్, శేఖర్‌గౌడ్, అరుణ్, ఉమేష్ తదితరులతో కల్సి గురువారం అందించారు. ఆయన మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులతో సతమవుతూ చికిత్సలకు నోచుకోలేని వారికి అవసరమైన సందర్భంలో ఆర్థికంగా ఆదుకొనేందుకు సిఎం రిలీఫ్ ఫండ్ కింద చికిత్సల కోసం ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకొంటుందని, అవసరమైన వారు తనను సంప్రదించవచ్చని ఆయన అన్నారు.

ఐటిఐలో దరఖాస్తులకు ఆహ్వానం

ప్రజాపక్షం/శామీర్‌పేట : శామీర్‌పేటలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ(ఐటిఐ) కళాశాలలో 20242025 విద్యా సంవత్సరానికి మొదటి విడత ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని కళాశాల ప్రిన్సిపల్ లలిత గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎలక్ట్రిషియన్, ఫిట్టర్, కోపా, కంప్యూటర్ ఆపరేటింగ్ ఆండ్ ప్రోగ్రామింగ్, అసిస్టెంట్ ట్రేడ్‌లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. పదవతరగతి ఉత్తీర్ణత ఉండి ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల మే 16/05/2024 తేది నుంచి జూన్ 10/06/2024 వరకు www.iti.telangana.gov.in వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

పాత్రికేయుల సేవలు ఎనలేనివి

తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర కార్యదర్శి కె.రవీందర్‌గౌడ్

ప్రజాపక్షం / కొడంగల్ : సమాజం అభివృద్ధి, చైతన్యం కోసం కృషి చేయడంలో నాల్గో స్తంభమైన పత్రికారంగంలో పనిచేసే పాత్రికేయుల సేవలు ఎనలేనివని తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర కార్యదర్శి కె.రవీందర్ గౌడ్ అన్నారు. హనుమంతరావునికి గురైన ఈనాడు దినపత్రిక పాత్రికేయులు ఉప్పరి వెంకటయ్య కుటుంబాన్ని తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర, జిల్లా నాయకులు గురువారం పరామర్శించారు. పాత్రికేయ రంగంలో గత 30 సంవత్సరాలుగా అందించిన సేవలను ఆయాన కోనియాడారు. తెలంగాణ మలిదశ ఉద్యమంలో తనవంతుగా పత్రిక చైతన్యాన్ని అందించడం అభినందనీయమన్నారు. విద్యశాఖ పరంగా తెలంగాణ ఉద్యమ పరంగా ఆయన అందించిన పత్రిక సేవలు మరవలేనివన్నారు. భార్య ఇద్దరు కూతుర్లకు తన వంతు సహకారం అందిస్తాన్నారు. వారిని ఓదార్చి మనోధైర్యాన్ని కల్పించారు. రూపాయలు నగదు ప్రోత్సహం అందించారు. టీవీవీ నాయకులు బాకారం చంద్రశేఖర్, గౌరారం గోపాల్, విజయలక్ష్మి, మర్పల్లి రవీందర్, అనిల్‌కుమార్, శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు రాంచంద్రారెడ్డి, టీయూ డబ్ల్యూ జే నాయకులు నర్సిములు, అంజిలయ్య, అంజిలప్ప, నరేష్‌లతో పాటు తదితరులున్నారు.

డెంగీని అరికట్టడం మన బాధ్యత

జిల్లా వైద్యశాఖ అధికారి పాల్వన్‌కుమార్

ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి : వికారాబాద్ జిల్లా లో డెంగ్యూ ను అరికట్టడం మనందరి భాధ్యత అని జిల్లా వైద్ అధికారి పాల్వన్‌కుమార్ అన్నారు. గురువారం జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సంను పురస్కరించుకొని మలేరియా అధికారి డాక్టర్ రామ్‌కుమార్ ,డిఎంఎచ్ఓ కార్యాలయంలో అవగాహన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగ ఆయన మాట్లాడుతూ మే 16న జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవం జరుపుకుంటామని అన్నారు. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో డెంగ్యూ అవగాహన ర్యాలీలు నిర్వహించడం జరిగింది అన్నారు. 2030వరకు దోమల ద్వారావ్యాపించే వ్యాదులను నిర్ములించడమే ద్వేయంగా ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. గ్రామల్లో పట్టణల్లో పారిశుద్య కార్యక్రమాలు మెరుగు పడడం వలన డెంగ్యూ కేసుల సంఖ్య గణనీయంగా తగ్గిదని తెలిపారు. ఈ సంవత్సరంలో కేవలం 5కేసులు మత్రమే అని అన్నారు. జీవ రాజ్ రవీంద్రయాదవ్ , సాయిబాబా కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మారోజు వీరన్నకు ఘన నివాళి

ప్రజాపక్షం/మల్కాజిగిరి: వర్గ కుల నిర్మూలన లక్ష్యంగా కొనసాగుతున్న అనేక పోరాటాల రూపకర్తగా, దళిత బహుజన శ్రామిక ఉద్యమాలను కమ్యూనిస్టు ఎజండాకు ఎక్కించి ములవాసుల సిద్దాంతాన్ని పరిచయం చేసిన మారోజు వీరన్నకు బిసి కులాల ఐక్యవేదిక ఘనంగా నివాళులర్పించింది. గురువారం ఓల్డ్ సఫిల్‌గూడలోని బిసి భవన్‌లో మారోజు వీరన్న 25వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి బిసి కులాల ఐక్యవేదిక అధ్యక్షులు కామల ఐలన్న, పూలమాలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక బిసి కులాలను చైతన్య పరచటంలో ఆయన విశేష కృషి చేసారన్నారు. బిసి కులాలన్ని సంఘటితమై నిజమైన రాజ్యాధికారం వైపు పయనించే యత్నాలు చేయటమే వీరన్నకు ఇచ్చే నిజమైన నివాళి అని అన్నారు. బిసి కులాల ఐక్యవేదిక ప్రధాన కార్యదర్శి రోయ్యల కృష్ణమూర్తి, కోశాధికారి అప్పాల శ్రీనివాస్, ఉపాధ్యక్షులు చంద్రశేఖర్ రావు, కరణంగోపి , రమేష్ గౌడ్, కార్యదర్శి చేకూరి రామ్ మోహన్, నాగరాజు, మల్కాజిగిరి డివిజన్ అధ్యక్షుడు కాసర్ల నాగరాజు, వినాయకనగర్ అధ్యక్షుడు ఉడుత నవీన్, మౌలాలి డివిజన్ అధ్యక్షుడు వంశీ ముదిరాజ్, మల్కాజిగిరి మండల ముదిరాజ్ సంఘ అధ్యక్షుడు సాంబరాజు, ప్రచార కార్యదర్శి పేపర్ శ్రీనివాస్, లక్ష్మణ్ రజక్, జోగు శ్రీనివాస్, గడ్డం యాదగిరి. సంపత్ ముదిరాజ్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

రైతులు పండించే అన్ని వడ్లకు విధిగా బోనస్ చెల్లించాల్సిందే :మాజీ ఎమ్మెల్యే

ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి : వికారాబాద్ జిల్లా వ్యప్తంగా రాష్ట్రప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా బిఆర్ఎస్ మాజీ ముఖ్య మంత్రి అదేశాలమేరకు పరిగిలో మాజీ ఎమ్మెల్యే మహేష్‌రెడ్డి అధ్వర్యంలో ,బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే అనంద్ ధారుర్ మండలం గట్టెపల్లి గ్రామంలో వరి కోసుగోలు కేంద్రలను సందర్శించి ప్రభుత్వ వ్యతిరేక విధానాలకు రైతులు బిఆర్ఎస్ పార్టీ శ్రేణులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్లమెంటు ఎన్నికలు ముగిసిన తెల్లారే వరి ధాన్యాన్నికి క్వింటాలుకు 500 రూపాయల భోనస్ చెల్లిస్తానని గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ ప్రకటించిదని ఎన్నికలు అయిపోయిన మరుసాటి రోజే కేవలం సన్న వడ్డకు మాత్రమే బోనస్ ఇస్తామంటూ మాటా మార్చి రాష్ట్ర రైతాంగాన్ని మరోసారి మోసం చేసిందన్నారు. బిఆర్ఎస్ రైతుల పక్షాన నిలబడి రైతుల హక్కులను కాపాడేందుకు ఎల్లప్పుడు పోరాటానికి సిద్దం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ రైతు బందు అధ్యక్షులు రామ్‌రెడ్డి వేణుగోపాల్‌రెడ్డి , మండల పార్టీ అధ్యక్షులుశ్రీకాంత్‌రెడ్డి , సంతోష్ , రాములు, వెంకట్‌రెడ్డి ,విజయ్‌నాయక్ , పురుషోత్తంరెడ్డి , దేవేందర్ .సుధాకర్‌గౌడ్, మాజీ సర్పంచు చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

కళ్లెదుటే ప్రభుత్వ స్థలాలు, చెరువులు కబ్జా

జెడ్‌పిసి సమావేశంలో ప్రతిపక్ష సభ్యుల మండిపాటు
గ్రామ ప్రత్యేక అధికారులు పట్టించుకోవటం లేదు

ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి: ప్రభుత్వ స్థలాలే కాకుండా చెరువులు, కుంటలు, నాలాలు కళ్లెదుటే కబ్జాలకు గురై నిర్మాణాలు కొనసాగిస్తున్నా సంబంధిత అధికారులు ఎందుకు పట్టించుకోవటం లేదని జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో ప్రతిపక్ష సభ్యులు నిలదీసారు. కబ్జాల గురించి ప్రజావాణితో సహా అనేక సార్లు ఫిర్యాదులు చేసినా తూతూ మంత్రంగా చర్యలు తీసుకొంటున్నారే తప్ప సరైన విధంగా స్పందించక పోవటం కబ్జాదారుల వెనుక అధికారులు వెన్నంటి ఉంటున్నారన్న అనుమానాలకు తావిస్తోందంటూ కాంగ్రెస్‌కు చెందిన జడ్‌పిటిసి హరివర్ధన్‌రెడ్డి, బిజెపికి చెందిన ఎంపిపి ఏనుగు సుదర్శనరెడ్డిలు మండిపడ్డారు. జడ్‌పి చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి అధ్యక్షతన గురువారం జడ్పీ హాలులో జరిగిన సమావేశం వాడివేడిగా కొనసాగింది. ఏనుగు సుదర్శనరెడ్డి మాట్లాడుతూ అక్రమ లేఅవుట్‌లలో పెద్ద ఎత్తున అక్రమ నిర్మాణాలు జరుగుతున్న విషయాలపై జిల్లా కలెక్టర్‌తో సహా సంబంధిత అధికారులకు ఎన్ని సార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవటం లేదన్నారు. జిల్లాలో వడ్ల కొనుగులు పరిస్థితి అధ్వాన్నంగా ఉందని, దీని వల్ల రైతాంగం తీవ్రంగా నష్ట పోతూ ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేస్తుందని చెబుతున్నా జిల్లాలో ఎక్కడా కనపడటం లేదని, ధాన్యం ఆరబోసి నెల రోజులు కావస్తున్నా కొనటం లేదని, తూకం వేసిన ధాన్యాన్ని సైతం మిల్లులకు తరలించటం లేదని ఆయన మండి పడ్డారు. ఇప్పటి వరకు గత ఏడాది కంటె జిల్లాలో ధాన్యాన్ని ఎక్కువే కొనుగోలు చేసిందని, వ్యవసాయదారులు పండించిన ప్రతి గింజా కొనుగోలు చేస్తామని దీనిపై జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మేరి రేఖ జవాబిచ్చారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని ప్రభుత్వం ప్రకటిస్తున్నా క్షేత్ర స్థాయిలో జరుగటం లేదన్నారు. సర్పంచుల స్థానంలో గ్రామాలకు నియమించిన ప్రత్యేక అధికారులు వారికి కేటాయించిన గ్రామాలను ఏ మాత్రం పట్టించుకోక పోగా అసలు గ్రామాల్లోకి రావటం లేదన్నారు. దీని వల్ల గ్రామాల్లో అభివృద్ధి కుంటు పడుతోందని జడ్‌పిటిసీ సభ్యుడు హరివర్ధన్‌రెడ్డి ఆరోపించారు. గ్రామాల్లో పారిశుద్య పనులు, పన్నుల వసూళ్లు, ఇతర సమస్యలు పేరుకొని పోతున్నాయని, పారిశుద్య కార్మికులకు గత ఆరు మాసాల నుండి వేతనాలు సైతం చెల్లించటం లేదన్నారు. దీనిపై స్పందించిన డిపిఓ మాట్లాడుతూ ఇటీవల జరిగిన ఎన్నికల్లో సిబ్బంది ఎన్నికల విధుల్లో పాల్గొనటం వల్ల ఆలస్యం జరిగిన విషయం వాస్తవమేనని, ఇక పై గ్రామాల అభివృద్ధిపై ఎలాంటి జాప్యం జరుగదన్నారు. సమావేశంలో జడ్‌పి చైర్మన్ శరత్ చంద్రారెడ్డి మాట్లాడుతూ జిల్లాను మరింతగా వేగంగా అభివృద్ధి చేసేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు సహకరించాలని, సమన్వయంతో పని చేయాలంటూ కోరారు. జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి మాట్లాడుతూ రాబోయే విద్యా సంవత్సరంలో విద్యార్థులకు యూనిఫారాలు, పాఠ్య పుస్తకాలు సమయానికి పంపిణీ చేస్తామన్నారు. ఈ ఏడాది ప్రభుత్వ ఆదేశాల మేరకు విద్యార్థుల యూనిఫారాలను కుట్టే పనులను మహిళా స్వయం సహాయక బృందాలకు అప్పు చెబుతున్నామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో కావల్సిన మౌలిక సదుపాయాలను కల్గ చేస్తున్నామని, అవసరమైన చోట మరమ్మతు పనులను చేయిస్తామని సభ్యులకు తెలిపారు. జిల్లా పరిశ్రమల శాఖాధికారి మాట్లాడుతూ ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు వివిధ శాకల నుండి 11192 అనుమతులు మంజూరు చేసామన్నారు. జిల్లా గ్రామీణాధికారి మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లాలో 145945 పెన్షన్లకు గాను ప్రతి నెలా రూ. 34.73 కోట్లు పంపిణీ చేస్తున్నామన్నారు.

జిల్లాలో దివ్యాంగులకు సదరం స ర్టిఫికెట్లను అంద చేస్తున్నామన్నారు. జడ్‌పి సిఈ ఓ దిలీప్‌కుమార్ పాల్గొన్న ఈ సమావేశంలో జడ్పీ వైస్ చైర్మన్ బెస్త వెంకటేష్, జడ్‌పిటీసిలు అనిత, లాలయ్య, హరివర్ధన్‌రెడ్డి, ఎంపిపిలు సుదర్శనరెడ్డి, దాసరి ఎల్లుబాయి. హారిక, రజిత, డిసిఎంఎస్ చైర్మన్ మధుసుధన్‌రెడ్డి, కోఅప్షన్ సభ్యులు, వివిధ జిల్లా ప్రభుత్వ విభాగ అధికారులు పాల్గొన్నారు

రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం సేకరించాలి

జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

ప్రజాపక్షం / కొడంగల్ : రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వరి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని సంబందిత శాఖ అధికారులకు జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అన్నారు. గురువారం పరిగి మండలంలోని సూల్తాన్‌పూర్, బోంరాస్‌పేట మండల కేంద్రాలలో పర్యటించి రైతులు పండించిన వరి ధాన్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు వర్ష కాలంను దృష్టిలో పెట్టుకుని వరి కొనుగోలు కేంద్రాలలో అన్ని మౌళిక సదుపాయాలు కల్పించాలని వర్షాలకు తడవకుండా టార్పాలిన్‌లు సిద్దంగా ఉంచుకోవాలని సూచించారు. వరి ధాన్యాన్ని పూర్తిగా ఎండబెట్టిన తరువాత కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చే విధంగా రైతులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఎవ్వరు కూడా అదైర్యపడవద్దని తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తామని హామి ఇచ్చారు. కేంద్రాలలో కొనుగోలు చేసిన ధాన్యాలను లారీల ద్వారా మీల్లులకు చేరే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. వీరితో పాటు జిల్లా పౌర సరఫరాల అధికారి రాజేశ్వర్, మెనెజర్ సుగుణబాయిలతో పాటు తదితరులున్నారు.

రైతుల జీవితాలతో కాంగ్రెస్ ప్రభుత్వం చెలగాటం

వ్యక్తం చేసిన మాజీ మంత్రి మల్లారెడ్డి

ప్రజాపక్షం/శామీర్‌పేట : రైతుల జీవితాలతో కాంగ్రెస్ ప్రభుత్వం చెలగాట మాడుతుందని, రైతులకు తీవ్ర అన్యాయం చేస్తుందని, రైతులు పండించిన పంటలను కొనుగోలు చేయడం లేదని మాజీ మంత్రి, మేడ్చల్ ఎంఎల్ఎ చామకూర మల్లారెడ్డి ఆరోపించారు. గురువారం మాజీ సిఎం కెసిఆర్ బిఆర్ఎస్ పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు శామీర్‌పేట వ్యవసాయ సహకార సంఘం వద్ద మేడ్చల్ నియోజకవర్గ నాయకులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు పండించిన పంటలను కొనుగోలు చేయడం లేదని వాపోయారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు పడిగాపులు కాస్తున్నారని, కొనుగోలు చేసిన ధాన్యానికి రైతుల ఖాతాల్లో డబ్బులు వేయడం లేదని ఆరోపించారు. బిఆర్ఎస్ పార్టీ రైతుల పక్షాన పోరాటాలు చేస్తుందని హామీలన్ని అమలయ్యేదాక నిరసనలు దర్నాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిసిఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్‌రెడ్డి, ఎంపిపి ఎల్లుబాయిబాబు, జడ్‌పిటిసి అనితలాలి, మున్సిపల్ చైర్మన్ రాజేశ్వర్‌రావు, గ్రంధాలయ మాజి చైర్మన్ భాస్కర్‌యాదవ్, సోసైటి వైస్ చైర్మన్ ఐలయ్య, డైరక్టర్‌లు, మాజి సర్పంచ్‌లు విష్ణువర్ధన్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, కృపాకర్‌రెడ్డి, జవహర్‌నగర్ మాజి మేయర్ కావ్య, నాయకులు అనిల్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, అంజనేయులు, జగదీష్‌గౌడ్, బాబు, వెంకట్‌రెడ్డి, ఆది రమేష్, మద్దుల శ్రీనివాస్‌రెడ్డి, నందుగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలి

ప్రజాపక్షం/శామీర్‌పేట: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు హామీ ఇచ్చిన విధంగా సిపిఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని మాజీ ఎంఎల్సీ కాటెపల్లి జనార్దన్‌రెడ్డి అన్నారు. గురువారం పిఆర్‌సి చైర్మన్ శివ శంకర్‌కు నగరంలోని బిఆర్‌కే భవనంలో ఉపాధ్యాయ సమస్యలపై పిఆర్‌టియు యూనియన్ తరపున వినతి పత్రం అందజేశారు. అనంతరం కాటెపల్లి జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ పిఆర్‌సిలో అమలు చేయాల్సిన విషయాలపై పూర్తి నివేదికను అందజేశామని చెప్పారు. మాస్టర్ స్కేలు 34,200 292 800గా నిర్ణయించాలని, ఫిట్‌మెంట్ 45 శాతంగా నిర్ణయిస్తూ డిఏ 01/07/2023 33.67 శాతంగా ఫిట్‌మెంట్‌ను మెర్జ్ చేయాలన్నారు. హెచ్ఆర్ఏ పరిధిని జిహెచ్ఎంసి నుంచి ప్రస్తుతం ఉన్న 8 కిలోమీటర్ల నుంచి 15 కిలో మీటర్లు వరకు పెంచాలన్నారు. 398 మానవేతనంపై పనిచేసిన స్పెషల్ టీచర సర్వీస్‌కి నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరుకు సిఫారసు చేయాలన్నారు. వెకేషన్ డిపార్ట్‌మెంట్ వారికి సంపాదిత సెలవులు సంవత్సరానికి 12 రోజులు ఇస్తూ 360 రోజులుగా నిర్ణయించాలన్నారు. ఉద్యోగ విరమణ వయస్సు 61 సంవత్సరానికి పెంచినందున స్టాగ్నెషన్ ఆఫ్ ఇంక్రిమెంట్ 5 నుంచి 8 పెంచుటకు ప్రభుత్వానికి సిఫారసు సమర్పించుటకు విజ్ఞప్తి చేయాలన్నారు. 50 సంవత్సరాల వయస్సు పూర్తైన వారికి అప్రయత్న పదోన్నతి స్కేలు పొందుటకు డిపార్ట్‌మెంటల్ పరీక్ష నుంచి మినాహాయింపు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో పిఆర్‌టియు రాష్ట్ర అధ్యక్షులు చెన్నయ్య, ప్రధాన కార్యదర్శి ఎస్ బిక్షంగౌడ్, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు శ్రీధర్, ప్రధాన కార్యదర్శి రామిడి వెంకట్రామ్‌రెడ్డి, మల్కాజ్‌గిరి అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు, శామీర్‌పేట అధ్యక్షుడు వెంకటేషం, తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం

ప్రజాపక్షం/శామీర్‌పేట : మూడుచింతలపల్లి మండలం కేశవరంలోని శ్రీ బాలాజి వేంకటేశ్వర స్వామి కల్యాణ, రథోత్సవ, బ్రహ్మోత్సవాలను నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఆలయ నిర్వహకులు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 18 నుంచి 22 వరకు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించబడునని తెలిపారు. ఈ నెల 19న శ్రీబాలాజి వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం కన్నుల పండవగా నిర్వహిస్తామని తెలిపారు. కల్యాణం అనంతరం మరుసటి రోజున సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహిస్తామని చెప్పారు. 21వ తేది నాడు స్వామి వారికి పొన్నసేవా, గరుడ సేవా, హోమములు, మహాపూర్ణాహుతి మొక్కు సేవలు, 22న రథోత్సవం జరుపబడునని తెలిపారు. 23న చక్ర స్నానంతో కార్యక్రమం ముగింపు ఉంటుందని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

'ఓక్రిడ్జ్ బాచుపల్లి' అద్భుత ఫలితాలు

ప్రజాపక్షం / హైదరాబాద్ : ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ బాచుపల్లి 20 24 విద్యా సంవత్సరానికి సిబిఎస్ఈ పరీక్షలలో అద్భుత ఫలితాలు సాధించింది. సమగ్ర విద్యా విధానం, అంకితభావంతో విద్యా సాధనలో ముందుంది. ఓక్రిడ్జ్ బాచుపల్లిలోని గ్రేడ్ 12 కో హోర్ట్ మొత్తం 77.2 శాతం సగటు స్కోర్ సాధించింది. ఇందులో 67 శాతం మంది విద్యార్థులు డిస్టింక్షిన్ సాధించారు. కామర్స్ స్ట్రీమ్లో యువ గణేష్ నార్నే అసాధారణంగా 95.4 శాతం స్కోర్‌తో టాప్ పెర్ఫార్మర్‌గా నిలిచారు. నేహా గిరీష్ కలగుడి 90.4 శాతం సాధించారు. సైన్స్ స్ట్రీమ్ లో ఆదిత్య రామారావు 93 శాతంతో అగ్రస్థానంలో నిలిచారు. సామ౧ల కేదార్ రెడ్డి 92 శాతంతో ఉన్నారు. 12వ తరగతి టాపర్‌యువ గణేష్ నార్నే మాట్లాడుతూ ముందుకు నడిపించిన ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ బాచుపల్లి ప్రిన్సిపల్ బబ్లీత్ ఒబెరాయ్ మాట్లాడుతూ మా విద్యార్థులు సాధించిన అద్భుతమైన విజయాలు ఎనలేని గౌరవాన్ని తెచ్చాయన్నారు. ఈ సందర్భంగా ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ బాచుపల్లిలోని సిబిఎస్ఈ హెడ్ షాలినీ సింఘాల్ మాట్లాడుతూ అసాధారణమైన ఫలితాలతో పూర్తి సామర్థ్యాన్ని చేరుకోవడం అభినందనీయం అన్నారు.

శిథిలావస్థలో వాటర్ ట్యాంక్

ప్రమాదకరంగా మారినా పట్టించుకోని వైనం



ప్రజాపక్షం/శామీర్‌పేట : తూంకుంట మున్సిపాలిటి ఎదురుగా ఉన్న వాటర్ ట్యాంక్ శిథిలావస్థకు చేరుకుంది. తూంకుంట పట్టణ వాసులకు మంచి నీటి సరఫరా చేయడానికి మున్సిపల్ అధికారులు ఈ వాటర్ ట్యాంక్‌ను బోర్ మోటార్‌లతో నింపి మంచినీటిని సరఫరా చేస్తున్నారు. కాగా వాటర్ ట్యాంక్ శిధిలావస్థకు చేరుకుని ప్రమాదకరంగా మారిన ఆ ట్యాంకుకు మరమ్మత్తులు కూడ చేయించకుండా వాడుతుండటంతో ఎప్పుడు ఏమి ప్రమాదం ముంచుకోస్తుందోనని పట్టణ ప్రజలు తీవ్ర భయాందోళనకు గురైతున్నారు. ప్రజలు నివసించే ఇండ్ల మద్యలో వాటర్ ట్యాంక్ ఉండటంతో చుట్టు పక్కల ఇండ్లలోని ప్రజలు బిక్కుబిక్కుమంటూ తమ ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని పూటపూట దినగండలా బతుకుతున్నారు. వాటర్ ట్యాంక్‌కు చుట్టు పగుళ్లు ఉండటంతో నీళ్లు కారుతూ పాచి పట్టి అపరిశుభ్రంగా ఉండటంతో ఆ నీటినే పట్టణ ప్రజలకు సరఫరా చేస్తుండటంతో రోగాల భారిన పడుతున్నామని ప్రజలు వాపోతున్నారు. మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు కండ్ల ముందే ట్యాంక్ ప్రమాదకరంగా మారిన మాకేమి పట్టనట్లు వ్యవహరించడంతో ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. ప్రజల ప్రాణాల పట్ల పట్టింపులేని నాయకులు, అధికారులు ఉన్నారని ఎన్నికల వేళ అన్ని చేస్తామని హామీలు ఇచ్చి అనంతరం కనబడకుండా పోయి తమ పదవులు కాపాడుకోవడానికి వి హారయాత్రలు చేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇలాంటి నాయకుల ను ఎన్నుకుని తప్పు చేశామని ప్రజలు చెంపలేసుకుంటున్నారు. ఇప్పటికైన జిల్లా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి ట్యాంకుకు మరమ్మత్తులు చేయించాలని కోరుతున్నారు.

కిడ్నాపా.. అరెస్టా..

మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్ కుమార్‌ను కారులో తీసుకొని వెళ్లిన ఆగంతకులు

ప్రజాపక్షం/మల్కాజిగిరి: బిజెపికి చెందిన మల్కాజిగిరి డివిజన్ కార్పొరేటర్ ఊరవె ల్లి శ్రవణ్ కుమార్‌ను గురువారం సాయంత్రం గుర్తు తెలియని ఆగంతకులు రెండు కార్లలో వచ్చి తీసుకొని వెళ్లారు. తన కార్యాలయంలో కొంత మందితో కల్సి కూర్చొని మాట్లాడుతున్న సమయంలో కార్లలో ఆకస్మికంగా వచ్చి ఆయనను దౌర్జన్యంగా తీసుకొని వెళ్లిన విషయం సిసి కెమెరాల్లో నమోదైంది. అయితే కార్పొరేటర్‌ను తీసుకొని వెళ్లింది ఆయన ప్రత్యర్థులే లేక పోలీసులు ఏదైనా కేసు సంబంధించి తీసుకొని వెళ్లారా అన్న విషయం సందిగ్ధంలో ఉంది. శ్రవణ్ కుమార్ కుటుంబీకులు, సహచరులు ఈ ఉదంతం విషయమై తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మల్కాజిగిరి భవానినగర్ ప్రాంతంలో నివసించే శ్రవణ్‌కుమార్ కార్పొరేటర్‌గా గెలుపొందాక ఆర్‌కెనగర్‌లో ప్రాంతంలో ఏర్పాటు చేసుకొన్న డివిజన్ కార్పొరేటర్ కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకొని ప్రతి రోజు ఉదయం, సాయంత్రం సమయాల్లో ప్రజలకు అందుబాటులో ఉండే ఏర్పాటు చేసుకొన్నాడు. ఎప్పటిలాగే గురువారం సాయంత్రం ఆయన మరి కొంత మందితో కల్సి కార్యాలయం

క్రీడ

ఉప్పల్ మ్యాచ్ వర్షార్పణం..

ప్లేఆఫ్స్‌కు చేరిన హైదరాబాద్

హైదరాబాద్ : పిఎల్ 17వ సీజన్‌లో లీగ్ దశలో ఇంకా ఒక మ్యాచ్ మిగిలుండగానే సన్‌రైజర్స్ హైదరాబాద్ ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించింది. ఉప్పల్ స్టేడియం వేదికగా గుజరాత్ టైటాన్స్‌తో జరగాల్సిన మ్యాచ్ వర్షం కారణంగా రద్దయింది. దీంతో ఇరు జట్లకు చెరో పాయింట్ కేటాయించారు. ఫలితంగా హైదరాబాద్ 15 పాయింట్లతో ప్లేఆఫ్స్‌కు చేరింది. మధ్యాహ్నం నుంచే నగరంలో చాలా ప్రాంతాల్లో వాన దంచికొట్టింది. ఉప్పల్‌లోనూ భారీ వర్షం కురిసింది. దీంతో టాస్ కూడా వేయలేదు. మధ్యలో వరుణుడు కాస్త శాంతించడంతో మ్యాచ్‌ను నిర్వహించేందుకు వీలుగా మైదానాన్ని గ్రౌండ్ స్టాఫ్ శరవేగంగా సిద్ధం చేశారు. రాత్రి 8 గంటలకు టాస్ వేయాలనుకున్నారు. ఈ క్రమంలోనే మరోసారి వరుణుడు ఆటంకం కలిగించాడు. మ్యాచ్ ప్రారంభమయ్యే పరిస్థితి లేకపోవడంతో రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు.

ఇలా జరిగితే రెండో స్థానానికి సన్‌రైజర్స్

ఆరెంజ్ ఆర్మీ తమ చివరి మ్యాచ్‌లో పంజాబ్‌తో తలపడనుంది. ఈ మ్యాచ్‌లో హైదరాబాద్ గెలిస్తే పాయింట్ల పట్టికలో రెండో స్థానంలో నిలవడానికి ఛాన్స్ ఉంటుంది. అలా జరగాలంటే కోల్‌కతాతో జరిగే తమ చివరి మ్యాచ్‌లో రాజస్థాన్ ఓడిపోవాలి. అప్పుడు రాజస్థాన్ 16 పాయింట్లతో కిందికి వస్తుంది. హైదరాబాద్ 17 పాయింట్లతో సెకండ్ ప్లేస్‌కు వెళ్తుంది.

చివరి బెర్తు ఎవరిదో?

గుజరాత్‌తో మ్యాచ్ రద్దవడంతో హైదరాబాద్ ప్లేఆఫ్స్‌కు చేరింది. ఇప్పటికే కోల్‌కతా, రాజస్థాన్ ప్లేఆఫ్స్ బెర్తులను ఖరారు చేసుకున్న సంగతి తెలిసిందే. దీంతో చివరి బెర్తును ఎవరు దక్కించుకుంటారా? అనేది ఆసక్తికరంగా మారింది. శుక్రవారం ముంబయిపై లక్నో తమ చివరి లీగ్ మ్యాచ్‌లో భారీ తేడాతో గెలిస్తే 14 పాయింట్లతో ప్లేఆఫ్స్ రేసులో ఉంటుంది. శనివారం ఆర్సీబీ, చెన్నై మ్యాచ్ జరగనుంది. దీంట్లో నెగ్గితే సిఎస్‌కె నేరుగా ప్లేఆఫ్స్‌కు వెళ్తుంది. ఇతర జట్లు ఇంటి ముఖం పడతాయి. ఈ మ్యాచ్‌కు కూడా వర్షం ముప్పు పొంచి ఉంది. మ్యాచ్ రద్దయితే చెన్నై 15 పాయింట్లతో ముందంజ వేస్తుంది. మ్యాచ్ జరిగి బెంగళూరు విజయం సాధిస్తే ఆర్‌సిబి, చెన్నై, ఢిల్లీ, లక్నో* 14 పాయింట్లతో ఉంటాయి. అప్పుడు మెరుగైన రన్‌రేట్ ఉన్న జట్టు ప్లేఆఫ్స్‌కు అర్హత సాధిస్తుంది. అయితే, ఢిల్లీ, లక్నో మైనస్ నెట్‌రన్‌రేట్‌తో ఉండటంతో చెన్నై, బెంగళూరులలో ఏదో ఒక జట్టు ప్లేఆఫ్స్‌కు చేరే అవకాశం ఉంది.

క్రికెట్ నా రక్తంలోనే ఉంది : బోల్ట్

న్యూఢిల్లీ : దాదాపుగా మరో రెండు వారాల తర్వాత ఐసిసి టి20 వరల్ కప్ మొదలు కానుంది. మెగా టోర్నీ ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో టి20 వరల్డ్ కప్ 2024కు బ్రాండ్ అంబాసిడర్‌గా ఎంపికైన 8 ఒలింపిక్ గోల్ మెడల్స్ విజేత, ఉసేన్ బోల్ట్ భారత క్రికెట్ స్టార్ విరాట్ కోహ్లీపై ప్రశంసల వర్షం కురిపించాడు. ఇంకా క్రికెట్ గురించి మరికొన్ని ఆసక్తికర విషయాలను షేర్ చేసుకున్నాడు. 'మా నాన్న క్రికెట్‌కు వీరాభిమాని. జమైకాకి చెందిన నా రక్తంలోనే క్రికెట్ ఉంది. ఇప్పుడు క్రికెట్‌కు అంబాసిడర్‌గా ఉండటం అద్భుతం. నాకు టి20 ఫార్మాట్ అంటే ఇష్టం. వరల్డ్ కప్ ద్వారా యుఎస్‌లో క్రికెట్‌ను ప్రోత్సహించడం సంతోషంగా ఉంది' అని బోల్ట్ పేర్కొన్నాడు. కోహ్లీ ఎంతో ప్రత్యేకం 'ఇప్పుడు చాలా మంది ప్రపంచ స్థాయి ఆటగాళ్లు ఉన్నప్పటికీ కోహ్లీ అందరికంటే ప్రత్యేకం. అతడు గ్లోబల్ పాపులారిటీ, ఇన్‌ఫ్లూయెన్స్ ఎంతో గొప్పవి. అతని కోసమే అభిమానులను స్టేడియంకు తరలి వస్తారు. ప్రపంచకప్ మ్యాచ్‌లకు యూఎస్‌ఏ, వెస్టిండీస్‌లోని స్టేడియాలకు ఫ్యాన్స్ భారీగా వస్తుంటే, అందుకు సగం కారణం విరాట్ కోహ్లీనే' అని బోల్ట్ చెప్పాడు. కాగా, టోర్నమెంట్ తర్వాత టి20 నుంచి కోహ్లీ, రోహిత్ శర్మ రిటైర్ అవుతారని నివేదికలు వస్తున్నాయి. కోహ్లీకి రాబోయే ఈ టి20 ప్రపంచ కప్ ఎంతో కీలకం. సీనియర్ ఆటగాడిగా ఐసిసి ట్రోఫీని కైవసం చేసుకోవాలనే లక్ష్యంతో అతడు పోరాడబోతున్నాడు. ఈ కారణాలు కూడా టి20 వరల్ కప్‌పై మరింత ఆసక్తిని పెంచాయి.

అంతర్జాతీయ కెరీర్‌కు సునీల్ ఛెత్రి వీడ్కోలు..

న్యూఢిల్లీ : టీమ్‌ఇండియా స్టార్ ఫుట్‌బాల్ ఆటగాడు సునీల్ ఛెత్రి అంతర్జాతీయ కెరీర్‌కు వీడ్కోలు పలికాడు. దాదాపు రెండు దశాబ్దాలపాటు భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించిన ఛెత్రి చివరిసారిగా జూన్ 6న కువైట్‌తో మ్యాచ్ ఆడనున్నాడు. తన నిర్ణయంపై ఓ వీడియో పోస్టు చేసిన కెప్టెన్ ఛెత్రి కాస్త భావోద్వేగానికి గురయ్యాడు. రిటైర్‌మెంట్ గురించి తన తల్లి, భార్యకు చెప్పినప్పుడు కన్నీరు పెట్టుకున్నారని గుర్తు చేసుకున్నాడు. 'గత 19 ఏళ్ల నా కెరీర్‌లో గొప్ప జ్ఞాపకాలు చాలా ఉన్నాయి. బాధ్యతలు, ఒత్తిడి, అమితమైన ఆనందం.. ఇలా ఎన్నింటినో అనుభవించా. వ్యక్తిగతంగా నేను ఇన్నేళ్లపాటు భారత జట్టుకు ఆడతానని అనుకోలేదు. మంచిచెడులు ఉన్నాయి. గత ఒకటిన్నర నెల నుంచి కొత్తగా అనిపిస్తోంది. నేను చివరి మ్యాచ్ ఆడేందుకు సమయం ఆసన్నమైందని అనుకుంటున్నా. జాతీయ జట్టు కోసం ప్రతి క్షణం కష్టపడ్డా. కువైట్‌తో మ్యాచ్ మాకు చాలా అవసరం. తదుపరి రౌండ్‌కు అర్హత సాధించాలంటే మూడు పాయింట్లు కీలకం. జట్టు పరంగా ఎంత ముఖ్యమో.. వ్యక్తిగతంగా నాకూ గుర్తుండిపోయే మ్యాచ్ అవుతుందని భావిస్తున్నా. నేను ఈ నిర్ణయం గురించి ఇంట్లో చెప్పినప్పుడు ప్రతి ఒక్కరూ బాధపడ్డారు. మా అమ్మ, నాన్న, నా భార్య రియాక్షన్‌ను మాటల్లో చెప్పలేను. మా నాన్న కాస్త అర్థం చేసుకున్నాడు. కానీ, అమ్మతోపాటు నా భార్య ఒక్కసారిగా ఏడవడం ప్రారంభించారు. నాకది చాలా కొత్తగా అనిపించింది. నేను ఆట ఆడేటప్పుడు వారు చాలా ఒత్తిడికి గురయ్యేవారు. ఇదే విషయం చెప్పా. ఇక దేశం తరపున ఆడటంలేదనే విషయంతో వారు కన్నీళ్లు ఎందుకు పెట్టుకున్నారో వారు చెప్పలేకపోయినా నాకర్థమైంది. నాలోని చిన్నపిల్లాడు మాత్రం ఫుట్‌బాల్‌ను ఆడటం ఆపవద్దని చెబుతున్నాడు. ఎప్పుడు జాతీయ జట్టు కోసం ఆడేందుకు అవకాశం వచ్చినా వదిలిపెట్టవద్దంటాడు. జీవితంలో నేనెంతో అదృష్టవంతుడిని. కలను నిజం చేసుకోవడంలో విజయవంతమయ్యా'' అని ఛెత్రి వెల్లడించాడు. భారత్ తరపున 2005లో జాతీయ జట్టులోకి అడుగు పెట్టిన ఛెత్రి ఇప్పటి వరకు అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో 94 గోల్స్ కొట్టాడు. అంతర్జాతీయంగా ఇప్పుడున్న యాక్టివ్ ప్లేయర్లలో ఎక్కువ గోల్స్ చేసిన మూడో ఆటగాడు. అతడి కంటే ముందు క్రిస్టియానో రొనాల్డో (128), లియోనిల్ మెస్సి (106) ఉన్నారు. భారత్ తరపున ఛెత్రినే టాప్ స్కోరర్.

రీల్

గేమ్ ఛేంజర్‌పై ఇంట్రెస్టింగ్ అప్డేట్

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ ప్రధాన పాత్రలో, కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ శంకర్ దర్శకత్వం లో తెరకెక్కుతున్న పొలిటికల్ యాక్షన్ ఎంటర్టైనర్ గేమ్ ఛేంజర్. తెలుగు చిత్రసీమలో అత్యంత ఆసక్తిగా ఎదురు చూస్తున్న చిత్రాలలో ఒకటి. ఈ చిత్రం ఇంకా చాలా పార్ట్ షూటింగ్ ను పూర్తి చేయాల్సి ఉంది. నిన్న సాయంత్రం మరో ఇంట్రెస్టింగ్ షెడ్యూల్ పూర్తి అయ్యింది. నటుడు సునీల్ పై డైరెక్టర్ శంకర్ సన్నివేశాలను చిత్రీకరించారు. తదుపరి షెడ్యూల్ ఈ నెలాఖరులో షురూ కానుంది. రామ్ చరణ్ పాల్గొనని ఈ షూటింగ్ ను చిత్రీకరించడానికి సెకండ్ యూనిట్ ను నియమించాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. కియారా అద్వానీ హీరోయిన్ గా నటిస్తున్న ఈ చిత్రంలో అంజలి, నరేష్, ప్రియదర్శి, చైతన్య కృష్ణ, ఎస్. జే. సూర్య, జయంరవి, శ్రీకాంత్, సముద్రఖని, నాజర్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. దిల్ రాజు నిర్మాతగా వ్యవహరిస్తున్న ఈ సినిమా విడుదల తేదీని ఇంకా లాక్ చేయలేదు. మ్యూజికల్ సెన్సేషన్ థమన్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రం పై ప్రేక్షకుల్లో, అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.

'వార్ 2'లో మరో బాలీవుడ్ బ్యూటీ

ఎన్టీఆర్ హృతిక్ రోషన్ కలయికలో రాబోతున్న మోస్ట్ వాంటెడ్ పాన్ ఇండియా మల్టీస్టారర్ 'వార్ 2'. ఈ మూవీ అప్డేట్స్ కోసం ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఐతే, ఈ సినిమాలోని స్పెషల్ సాంగ్ కోసం భారీ సెట్ వేస్తున్నారు. పైగా కత్రినా కైఫ్ తో ఈ సాంగ్ ను చేయించాలని మేకర్స్ డిసైడ్ అయ్యారని టాక్. మరి ఈ వార్తలో ఎలాంటి వాస్తవం ఉందో చూడాలి. కాగా, మోస్ట్ వాంటెడ్ పాన్ ఇండియా మల్టీస్టారర్స్ లో 'వార్ 2' ఫస్ట్ ప్లేస్ లో ఉంటుంది. పైగా ఎన్టీఆర్ హృతిక్ రోషన్ కలయిక అనగానే ఆడియన్స్ లో కూడా భారీగా అంచనాలు పెరిగిపోయాయి. ఈ సినిమాలో ఎన్టీఆర్ పాత్ర పై ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురు చూస్తున్న సంగతి తెలిసిందే. అన్నట్టు 'వార్ 2' కథ విషయానికి వస్తే.. హృతిక్ రోషన్ పాత్రకు దీటుగా ఎన్టీఆర్ పాత్ర ఉంటుందట. పైగా 'వార్ 2' అనేది యాక్షన్ ఫిల్మ్. మరి యాక్షన్ ఫిల్మ్ లో ఎన్టీఆర్ ఏ రేంజ్ నటనతో ఆకట్టుకుంటాడో చూడాలి. నిర్మాత ఆదిత్య చోప్రా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

వరుణ్ 'నింద' టీజర్ను రిలీజ్ చేసిన నవీన్ చంద్ర

వరుణ్ సందేశ్ మళ్ళీ వరుస చిత్రాలు చేస్తూ బిజీగా ఉన్నారు. ఈటీవీ విన్లో ఇటీవల ఓటిటి చిత్రం అయిన చిత్రం చూడరాలో కనిపించిన తరువాత, తన రాబోయే చిత్రం నిందతో ప్రేక్షకులను ఆకర్షించడానికి సిద్ధంగా ఉన్నాడు. ది ఫెర్వెంట్ ఇండీ ప్రొడక్షన్స్ బ్యానర్పై రాజేష్ జగన్నాధం దర్శకత్వం వహించి ఈ చిత్రంను నిర్మించారు. కాండ్రకోట మిస్టరీని ఆవిష్కరించే నింద, ఇటీవలే దాని ఫస్ట్ లుక్ను విడుదల చేసింది. దీనికి అభిమానుల నుండి మంచి ఆదరణ లభించింది. దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు విజేత, నటుడు నవీన్ చంద్ర విడుదల చేసిన టీజర్ ఆకట్టుకుంటుంది. టీజర్ నైతిక సందిగ్ధతలతో నిండిన కథకు వేదికగా, తనికెళ్ల భరణి డైలాగ్తో ప్రారంభమవుతుంది. వరుణ్ సందేశ్ పాత్ర బాగుంది. ఇది నిజం మరియు మోసానికి సంబంధించిన కథను వాగ్దానం చేస్తుంది. అనిల్ కుమార్ చేసిన నైపుణ్యంతో కూడిన ఎడిటింగ్తో, నింద టీజర్ చాలా ఎక్కువ బహిర్గతం చేయకుండా అంచనాలను పెంచింది. వీక్షకులను ఆకర్షించి, మరిన్నింటి కోసం ఆసక్తిని కలిగిస్తుంది.

ముంబై ఇండస్ట్రీను సింగిల్‌గా చేంజ్ చేశాడు ఆర్జీవీ

తెలుగులో ఎన్నో సంచలనాత్మక చిత్రాలకి కేరాఫ్ అడ్రస్ గా మారిపోయారు రామ్ గోపాల్ వర్మ. కెరీర్ తొలి రోజుల్లో సూపర్ హిట్ చిత్రాలను తెలుగు సినీ పరిశ్రమ కి అందించారు. అయితే టాలీవుడ్ ను వదిలి కొద్ది సంవత్సరాలు బాలీవుడ్ కి వెళ్ళిన సంగతి అందరికీ తెలిసిందే. అక్కడ వర్మ బాలీవుడ్ తల రాతను మార్చే ఎన్నో కల్ట్ చిత్రాలను అందించారు. అయితే తాజాగా బాలీవుడ్ నటుడు మనోజ్ బాజ్పాయ్ ఆర్జీవీ పై పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ముంబై ఇండస్ట్రీ ను ఒక నార్త్ ఇండియన్ లేదా, లోకల్ గా ఉన్న వాళ్ళు ఎవరు మార్చలేదు. హైదరాబాద్ నుండి వచ్చిన రామ్ గోపాల్ వర్మ అనే ఒక వ్యక్తి బాలీవుడ్ ను సింగిల్ హ్యాండ్ తో చేంజ్ చేశాడు అంటూ చెప్పుకొచ్చారు. అతను ఎవ్వరికీ భయపడడు, ఇప్పటికీ అని అన్నారు. మనోజ్ బాజ్ పాయ్ కి బీకు మాత్రే లాంటి ఎవర్ గ్రీన్ పాత్రను ఇచ్చింది ఆర్జీవీ నే. ఈ నటుడు బాలీవుడ్ లో వరుస సినిమాలతో బిజీగా ఉన్నారు. మరొక పక్క ఎంతో ఫేమస్ అయిన ది ఫ్యామిలీ మ్యాన్ తదుపరి సీజన్ లో కనిపించనున్నారు.

కేజ్రీవాల్ వ్యక్తిగత సహాయకుడికి మహిళా కమిషన్ సమన్లు

న్యూఢిల్లీ : ఢిల్లీ సిఎం అరవింద్ కేజ్రీవాల్ అధికారిక నివాసంలో ఆప్ రాజ్యసభ ఎంపి స్వాతి మలివాల్‌పై దాడి ఘటన తీవ్ర కలకలం రేపిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో స్వాతి మలివాల్‌పై వేధింపులకు పాల్పడిన కేజ్రీవాల్ పిఎస్ బిభవ్ కుమార్‌కు జాతీయ మహిళా కమిషన్ తాజాగా సమన్లు పంపింది. శుక్రవారం ఉదయం 11 గంటలకు మహిళా కమిషన్ కార్యాలయంలో విచారణకు హాజరు కావాలని నోటీసుల్లో పేర్కొంది. లోక్‌సభ ఎన్నికల వేళ ఢిల్లీ సిఎం కేజ్రీవాల్ అధికారిక నివాసంలో ఆప్ రాజ్యసభ ఎంపి స్వాతి మలివాల్‌కు ఎదురైన చేదు అనుభవం ఆ పార్టీని తీవ్రంగా కుదిపేసిన విషయం తెలిసిందే. స్వాతి మలివాల్ పట్ల కేజ్రీవాల్ పిఎస్ బిభవ్ కుమార్ అనుచితంగా ప్రవర్తించి, దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనపై ఆప్ తీవ్రంగా స్పందించింది. ఈ దుశ్చర్యను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపింది. ఈ మేరకు బిభవ్ కుమార్‌పై కఠిన చర్య తీసుకుంటామని ఆప్ నేత సంజయ్ సింగ్ ప్రకటించారు. 'స్వాతి మలివాల్ సోమవారం సిఎం కేజ్రీవాల్‌ను కలుసుకునేందుకు ఆయన అధికారిక నివాసానికి వెళ్లారు. డ్రాయింగ్ గదిలో సిఎం కోసం ఎదురుచూస్తుండగా, ఆమెతో పిఎస్ బిభవ్‌కుమార్ అనుచితంగా ప్రవర్తించాడు. ఈ విషయం కేజ్రీవాల్‌కు తెలిసింది. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోనున్నారు' అని ఆయన తెలిపారు.

లోక్‌సభ ఎన్నికల్లో భారీగా పోలింగ్

మొదటి 4 దశల్లో 67% ఓటింగ్ నమోదు

న్యూఢిల్లీ : లోక్ సభ ఎన్నికల తొలి నాలుగు దశల్లో 66.95 శాతం పోలింగ్ నమోదైందని కేంద్ర ఎన్నికల సంఘం గురువారం ప్రకటించింది. దేశవ్యాప్తంగా ఉన్న 97 కోట్ల మంది ఓటర్లలో ఈ నాలుగు విడతల్లో 45.10 కోట్ల మంది ఓటు హక్కు వినియోగించుకున్నారని తెలిపింది. రానున్న దశల పోలింగ్‌లో ఓటర్లు బయటకు వచ్చి పెద్ద సంఖ్యలో ఓటు వేయాలని విజ్ఞప్తి చేసింది. మే 13న జరిగిన నాలుగో దశ పోలింగ్‌లో 69.16 శాతం నమోదైంది. 2019 పార్లమెంట్ ఎన్నికలతో పోలిస్తే ఈసారి 3.65 శాతం ఎక్కువ ఓటింగ్ నమోదైంది. మే 7న జరిగిన మూడో దశ పోలింగ్‌లో 65.68 శాతం మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 2019 సార్వత్రిక ఎన్నికల మూడో దశలో 68.4 శాతం ఓటు వేశారు. ఏప్రిల్ 26న జరిగిన రెండో విడత పోలింగ్‌లో 66.71 శాతం మంది ఓటేశారు. 2019 లోక్ సభ ఎన్నికల రెండో విడతలో 69.64శాతం ఓటింగ్ నమోదైంది. ఏప్రిల్ 19న జరిగిన తొలి దశ ఎన్నికల్లో 66.14 శాతం పోలింగ్ నమోదైంది. 2019 సార్వత్రిక ఎన్నికల తొలి దశలో 69.43 శాతం ఓటింగ్ జరిగింది.

ఓటింగ్ ఇంకా పెరగాలి!

మిగతా మూడు దశల్లో ఓటింగ్‌ను పెంచేందుకు ఓటర్లలో అవగాహనను పెంచాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్లకు సూచించామని సిఇసి తెలిపింది. 'ఓటరును అవగాహన కార్యక్రమంలో భాగస్వామ్యం చేయాలి. ఎన్నికల సంఘం అభ్యర్థన మేరకు పలు సంస్థలు, సినీ నటులు, ప్రముఖులు ఓటు హక్కు గురించి ఓటరుకు అవగాహన కల్పించడం సంతోషదాయకం. అధిక శాతం ఓటింగ్ నమోదవ్వడం భారత ప్రజాస్వామ్యం బలం గురించి ప్రపంచానికి ఓటరు ఇచ్చిన సందేశం. ప్రజాస్వామ్య పండుగలో అందరూ పాల్గొనాలి. ఓటింగ్ రోజు సెలవు దినం కాదు. ఓటర్లు గర్వించదగ్గ రోజు. మిగతా మూడు విడతల పోలింగ్‌లో ఓటర్లు అధిక సంఖ్యలో ఓటు వేయాలి' అని కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ రాజీవ్ కుమార్ తెలిపారు. కాగా, బ్యాంకులు, పోస్టాఫీసులు, ప్రైవేట్ సంస్థలు, టెలికాం ప్లాట్‌ఫామ్‌లు తమ పబ్లిక్ ఇంటర్‌ఫేస్‌ను ఉపయోగించి నమోదిత ఓటర్లను పోలింగ్‌లో పాల్గొనేలా కృషి చేస్తున్నాయి. ఇప్పటివరకు దేశవ్యాప్తంగా నాలుగు దశల్లో 379 లోక్ సభ స్థానాలకు ఎన్నికలు జరిగాయి. మే 20న ఐదో దశ, మే 25న ఆరోదశ, జూన్ 1న ఏడో దశ పోలింగ్ జరగనుంది. ఏప్రిల్ 1న మొదలైన సార్వత్రిక ఎన్నికల పోరు జూన్ 1తో ముగియనుంది. జూన్ 4న ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయి.

సాక్ష్యాలున్నాయ్, కేజ్రీవాల్‌పై చార్జిషీటు పెడతాం

సుప్రీంకోర్టుకు చెప్పిన ఇడి

న్యూఢిల్లీ : మద్యం అవినీతి కేసులో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ పై త్వరలో ఛార్జిషీటు దాఖలు చేస్తామని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) గురువారంనాడు సుప్రీంకోర్టుకు తెలియజేసింది. కేంద్రంలో ప్రభుత్వం మారితే తాను తిరిగి జైలుకు వెళ్ళాల్సిన అవసరం లేదని ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ చేసిన ఎన్నికల ప్రచార ప్రసంగంపై ఫిర్యాదు చేస్తూ ఇ డి పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఈ కేసు గురించి ఎన్నికల ప్రచార సభల్లో మాట్లాడకూడదని తాము కేజ్రీవాల్‌కు ఆదేశాలు ఇవ్వలేదని ధర్మాసనం స్పష్టం చేసింది. దాంతో కేజ్రీవాల్‌పైన, ఆ పార్టీపైనా త్వరలో ఛార్జిషీటు దాఖలు చేస్తామని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ తరపున అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్.వి.రాజు సుప్రీంకోర్టుకు తెలియజేశారు. దీంతో కేజ్రీవాల్‌కు, ఆమ్ ఆద్మీపార్టీకి మరిన్ని సమస్యలు, చిక్కులు త్వరలో ఎదురు కానున్నాయి. ''కేజ్రీవాల్‌కు, ఆమ్ ఆద్మీపార్టీకి వ్యతిరేకంగా త్వరలో ఛార్జిషీటు దాఖలు చేస్తాం, ఆ ప్రక్రియ కొనసాగుతోంది'' అని జస్టిస్ సంజీవ్‌ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాలతో కూడిన ధర్మాసనానికి అదనపు సొలిసిటర్ జనరల్ తెలియజేశారు. ఇడి వద్ద తగినన్ని సాక్ష్యాధారాలు ఉన్నాయనీ, అందువల్ల ఛార్జిషీటు దాఖలు చేస్తామనీ, ఆయన రూ.100 కోట్లు లంచం మద్యం వ్యాపారుల నుండి అడిగినట్లు, ఆ ధనాన్ని గోవా ఎన్నికల్లో ఖర్చు చేసినట్లు తమ వద్ద తగినన్ని ఆధారాలు ఉన్నాయని ఎస్.వి.రాజు సుప్రీంకోర్టుకు వివరణ ఇచ్చారు. ''మా వద్ద తగినన్ని ప్రత్యక్ష సాక్ష్యాలున్నాయి, కేజ్రీవాల్ ఒక సెవెన్ స్టార్ హోటల్‌లో బసచేశారు, అందుకు సంబంధించి ఈ కేసులో భాగస్వామిగా ఉన్న ఒక నిందితుడు చెల్లింపులు చేసిన బిల్లులు మా వద్ద ఉన్నాయి'' అని ఎస్.వి.రాజు అన్నారు. కేజ్రీవాత్ రద్దుచేసిన మద్యం విధానాన్ని తొలుత రూపొందించడంలో ఆయన కీలక పాత్ర వహించారనీ, ఆయన ఒక ముఖ్యమంత్రిగా, ఈ కేసుకు సంబంధించిన మంత్రిత్వ శాఖలు నిర్వహించకపోయినప్పటికీ, ఆప్ పార్టీ జాతీయ కన్వీనర్‌గా ముఖ్యమంత్రిగా ఆయన ఈ అవినీతి కేసులో కీలక బాధ్యుడుగా ఉన్నారనీ అదనపు సొలిసిటర్ జనరల్ సుప్రీంకోర్టుకు చెప్పారు. సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కూడా ఈ సందర్భంగా ధర్మాసనం ఎదుట హాజరయ్యారు. కాగా తొలుత కేజ్రీవాల్ బెయిలు రద్దు చేసి తక్షణం జైలుకు తీసుకురావాలని కోరుతూ ఇడి దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు ధర్మాసనం తోసిపుచ్చింది. కేజ్రీవాల్‌కు బెయిలు మంజూరు చేసే సమయంలో సుప్రీంకోర్టు విధించిన షరతులను ఉల్లంఘించి, ఎన్నికల ప్రచార సభల్లో, 'కేంద్రంలో ప్రభుత్వం మారితే తాను తిరిగి జైలుకు రావాల్సిన అవసరం లేదు' అంటూ ప్రసంగాలు చేస్తున్నారని ఇడి ఫిర్యాదు చేసింది. దీనిపై జస్టిస్ సంజీవ్‌ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాలతో కూడిన ధర్మాసనం స్పందిస్తూ, తాము కేజ్రీవాల్‌కు బెయిలు విషయంలో ఎలాంటి మినహాయింపులూ ఇవ్వలేదని, ఎన్నికల ప్రచారం అనంతరం తిరిగి జూన్ 2న జైలుకు రావాలని ఆదేశించామని, ఇది సుప్రీంకోర్టు ఇచ్చిన ఉత్తర్వు అనీ, ఆ ఉత్తర్వునే తాము సమర్థిస్తామని పేర్కొంది. తాము ఇంతకుముందు కేజ్రీవాల్‌కు చాలా స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినందువల్ల ఈ విషయంలో చట్టబద్ధమైన విధానాలనే సుప్రీంకోర్టు అనుసరిస్తుందనీ స్పష్టం చేసింది. ఈ కేసు గురించి ఎన్నికల ప్రచార సభల్లో మాట్లాడకూడదని తాము కేజ్రీవాల్‌కు ఆదేశాలు ఇవ్వలేదని ధర్మాసనం స్పష్టం చేసింది. కేజ్రీవాల్‌కు బెయిలు మంజూరు చేసిన విధానంపై హోంమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలను సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వి ప్రస్తావించారు. కోర్టు కేజ్రీవాల్‌కు స్పెషల్ ట్రీట్‌మెంట్ ఇచ్చిందని చాలా మంది అనుకుంటున్నారనీ, ఇది తన మాట కాదనీ అమిత్ షా చెప్పిన విషయాన్ని సింఘ్వి కోర్టుకు తెలియజేశారు. దాంతో ధర్మాసనం ఈ విషయాల్లోకి తాము వెళ్ళదలచుకోలేదని చెప్పింది. ప్రచార సభల్లో కేజ్రీవాల్ కోర్టును ఉల్లంఘించే ప్రకటనలేమీ చేయలేదని సింఘ్వి వాదించారు.

14 కోట్ల మంది ఉచిత రేషన్ కోల్పోయారు : కాంగ్రెస్

జనాభా లెక్కలు నిర్వహించకపోవడంతో

న్యూఢిల్లీ : ఇండియా కూటమి అధికారంలోకి రాగానే కర్నాటకలో అమలవుతున్న అన్నభాగ్య తరహాలో రేషన్ ద్వారా పది కిలోల ఉచిత బియ్యం అందిస్తామని ఎఐసిసి ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ 'ఎక్స్'లో పోస్ట్ చేవారు. ప్రధాని, బిజెపిలు రేషన్‌పై అబద్ధాలు వ్యాప్తి చేస్తున్నారని ఆయన ఆరోపించారు. మన్మోహన్‌సింగ్ ప్రభుత్వంలో జాతీయ ఆహార భద్రత చట్టం 2013 సెప్టెంబర్‌లో ఆమోదం పొందిందని, అది 80 కోట్ల మందికి(2011 జనాభా లెక్కల ఆధారంగా) ఆహారధాన్యాలు అందిస్తున్నదని తెలిపారు. నాడు ఒకే ఒక ముఖ్యమంత్రి దానిని వ్యతిరేకించారని, ఆయనే నాటి గుజరాత్ సిఎం, ప్రస్తుత ప్రధాని నరేంద్ర మోదీ అని అన్నారు. జాతీయ ఆహార భద్రత చట్టాన్ని అమలు చేసేందుకు ప్రధాని నరేంద్ర మోదీ ఏమీ చేయలేదని, కొవిడ్ సందర్భంగా ఆయనకు అకస్మాత్తుగా సామాజిక సంక్షేమ వ్యవస్థలు ప్రధాన్యత గుర్తుకొచ్చిందన్నారు. నాటవి జాతీయ ఆహార భద్రత చట్టం 2013నే, ప్రధాన మంత్రి గరీబ్ అన్న యోజనాగా రీబ్రాండ్ చేసి, ఫ్రీ రేషన్‌గా పథకంగా మార్కెటింగ్ చేసుకున్నారని జైరామ్ రమేశ్ పేర్కొన్నారు. 2021లో జనాభా లెక్కలు నిర్వహించని కారణంగా కనీసం 14 కోట్ల మంది ఈ పథకం లబ్ది పొందలేకపోయారని తెలిపారు.

ప్రజావిశ్వాసాన్ని కోల్పోయిన మోదీ

ప్రజలు రాజకీయ మార్పు కోరుకుంటున్నారు: శరద్ పవార్

నాశిక్ : ప్రధాని మోదీని లక్ష్యంగా చేసుకుని ఎన్‌సిపి (ఎస్‌పి) చీఫ్ శరద్‌పవార్ తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. ఆయన ప్రజావిశ్వాసాన్ని కోల్పోయారని, ఈసారి ప్రజలు రాజకీయ మార్పును కోరుకుంటున్నారన్నారు. అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్‌సిపి నాయకుడు ప్రఫుల్ పటేల్ ప్రధాని మోదీ తలపై ఛత్రపతి శివాజీ మహారాజ్ ధరించే 'జిరేటాప్'ను ఉంచారని, ఇది మాజీ కేంద్ర మంత్రి 'లాచారి' (బానిస వైఖరి)ని చూపుతుందని ఆయన విమర్శించారు. గురువారం శరద్ పవార్ మీడియాతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా పవార్ మాట్లాడుతూ ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల సమయంలో ప్రచారం కోసం తాను చాలా ప్రాంతాలకు వెళ్లానని, ప్రజల ఆలోచన ఇప్పుడు (రాజకీయ) మార్పు వైపు ఉందని, అందువల్ల మోదీ ప్రజా విశ్వాసాన్ని కోల్పోయారన్నారు. ఇదే సమయంలో రాష్ట్రంలో మహా వికాస్ అఘాడి (ఎంవిఎ)కి అనుకూల పవనాలు వీస్తున్నాయన్నారు. బుధవారం ముంబయిలోని ఘట్కోపర్ ప్రాంతంలో ప్రధాని మోదీ రోడ్‌షో నిర్వహించడాన్ని ఆయన తప్పుబట్టారు. 'గుజరాతీల ప్రాబల్యం ఉన్న ప్రాంతంలో మోదీ రోడ్‌షో నిర్వహించారు. మీరు దేశాన్ని నడిపిస్తున్నప్పుడు కులం, మతం గురించి ఆలోచించడం సరికాదు. ముంబయి వంటి నగరంలో రోడ్‌షో నిర్వహించడం సరికాదు. ప్రజలు గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చింది. దీంతో వారు అసౌకర్యానికి గురయ్యారు...అలాంటి ఫిర్యాదులు అందాయి'' అని కేంద్ర మాజీ మంత్రి తెలిపారు. రోడ్‌షోకు ముందు, భద్రతా కారణాల దృష్ట్యా జాగృతి నగర్, ఘట్కోపర్ స్టేషన్ల మధ్య ముంబయి మెట్రో రైలు సేవలను నిలిపివేశారని, ప్రక్కనే ఉన్న రోడ్లను పోలీసులు మూసివేశారని, ట్రాఫిక్‌ను మళ్లించారని మండిపడ్డారు. 'జిరె టాప్' వివాదంపై మాట్లాడుతూ 'జిరేటాప్‌కు మహారాష్ట్రలో ఓ చరిత్ర ఉందన్నారు. 'లాచారి'కి పరిమితి ఉంది కానీ, భవిష్యత్తులో వారు జాగ్రత్త ఉండాలని చెప్పడం మంచిదన్నారు. వారణాసిలో ప్రధాని మోదీ నామినేషన్ దాఖలు చేసే ముందు పటేల్ తలపై జిరేటాప్ పెట్టడంపై వివాదం చెలరేగింది. ఈ చర్య విపక్షాల నుంచి పలు విమర్శలకు దారితీసింది. శివసేన (యుబిటి)ని 'నకిలీ శివసేన' అని పిఎం మోదీ పిలవడంపై, పవార్ 'నక్లి' (నకిలీ) శివసేన అంటే ఏమిటి? నిజమైన శివసైనికులు ఉద్ధవ్ థాక్రేతో ఉన్నారు' అని అన్నారు. ముంబయిలో ప్రధాని మోదీ రోడ్‌షోతో సహా అధికార మహా యుతి కూటమి ఎన్నికల సంబంధిత కార్య క్రమాలకు ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ గైర్హాజరు కావడంపై శరద్ పవార్ స్పందిస్తూ 'అజిత్ పవార్ నిజంగా అనారోగ్యంతో ఉన్నారు' అని అన్నారు.

సంక్షోభ సమయంలో మోదీకి సాయం చేశా..

రైతుల కష్టాలను ఉద్దేశిస్తూ ప్రధాని నరేంద్ర మోదీ, ఎన్‌సిపినేత శరద్ పవార్‌పై విమర్శలు గుప్పించగా, శరద్ పవార్ ప్రధాని మోదీని ఉద్దేశించి కీలక వ్యాఖ్యలు చేశారు. తాను 2004–2014 మధ్య కేంద్రమంత్రిగా ఉన్న సమయంలో అప్పటి గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న నరేంద్రమోదీకి సాయం చేశానని అన్నారు. ఆ సమయంలో గుజరాత్‌లో వ్యవసాయం తీవ్రసంక్షోభంలో ఉందన్నారు. ఒకానొక సమయంలో గుజరాత్ ముఖ్యమంత్రి తనకు ఫోన్ చేసి ఇజ్రాయిల్‌లో విశిష్టమైన వ్యవసాయ పద్ధతులను అధ్యయనం చేసేందుకు అక్కడికి వెళ్లాలనుకుంటున్నట్లు చెప్పాడని శరద్ పవార్ అన్నారు. వ్యవసాయ రంగంలోని సమస్యలపై తన వద్దకు వచ్చేవాడని, తనను గుజరాత్ తీసుకెళ్లారని, ఒకసారి ఇజ్రాయిల్‌ని సందర్శించాలని అనుకున్నప్పుడు తనను నా వెంట తీసుకెళ్లానని, ఇప్పుడు నరేంద్ర మోదీ ఏం చెప్పినా తాను పట్టించుకోనని శరద్ పవార్ అన్నారు. అంతకుముందు ప్రధాని మాట్లాడుతూ.. రైతుల కోసం శరద్ పవార్ ఏం చేయలేదని వ్యాఖ్యానించారు.

ఫైనాన్స్ సంస్థలపై ఆదాయపు పన్ను శాఖ దాడులు

రూ. 170 కోట్ల నగదు, నగలు స్వాధీనం

ముంబయి : ఫైనాన్స్ సంస్థల కార్యాలయాలపై ఆదాయపు పన్ను శాఖ (ఐటి) అధికారులు దాడులు చేశారు. మూడు రోజుల పాటు సోదాలు నిర్వహించారు. రూ.170 కోట్ల విలువైన నగదు, నగలు, ఆస్తులను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. మహారాష్ట్రలోని నాందేడ్‌లో ఈ సంఘటన జరిగింది. సోదరులైన వినయ్ భండారి, సంజయ్ భండారి, ఆశిష్ భండారీ, సంతోష్ భండారీ, మహావీర్ భండారీ, పదం భండారీకి నాందేడ్‌లో పెద్ద ఫైనాన్స్ సంస్థలున్నాయి. కాగా, ఆ సోదరులకు చెందిన ఫైనాన్స్ సంస్థలు భారీగా పన్నులు ఎగవేసినట్లు ఆదాయపు పన్ను శాఖ (ఆదాయపు పన్ను శాఖ) అధికారులు గుర్తించారు. దీంతో పుణె, నాసిక్, నాగ్‌పూర్, పర్భానీ, ఛత్రపతి శంభాజీనగర్, నాందేడ్‌కు చెందిన వందల మంది ఐటి అధికారులు 25 ప్రైవేట్ కార్లలో నాందేడ్ చేరుకున్నారు. మే 10 నుంచి 12 వరకు మూడు రోజుల పాటు పలు చోట్ల రైడ్ చేశారు. అలీ భాయ్ టవర్‌లోని భండారీ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్ కార్యాలయం, కొఠారీ కాంప్లెక్స్‌లోని కార్యాలయం, కోకాటే కాంప్లెక్స్‌లోని మూడు కార్యాలయాలు, ఆదినాథ్ అర్బన్ మల్టీస్టేట్ కోఆపరేటివ్ బ్యాంక్‌లో సోదాలు నిర్వహించారు. అలాగే పరాస్ నగర్, మహావీర్ సొసైటీ, ఫరాండే నగర్, కాబ్రా నగర్ లోని వారి ప్రైవేట్ నివాసాలపై కూడా దాడులు చేశారు. మరోవైపు మూడు రోజుల పాటు ఐటి అధికారులు నిర్వహించిన సోదాల్లో భారీగా నగదు, నగలు బయటపడ్డాయి. సుమారు 14 గంటలపాటు వాటిని లెక్కించారు. రూ.14 కోట్ల నగదు, 8 కిలోల బంగారంతో సహా రూ.170 కోట్ల విలువైన లెక్కల్లో చూపని ఆస్తులను సీజ్ చేశారు. కాగా, నాందేడ్‌లో ఇంత పెద్ద ఎత్తున ఐటి దాడులు జరుగడం ఇదే తొలిసారి.